

'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 319

గురువారం 1-8-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



గురి కుదిరితే మరో పతకం

50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్ ఫైనల్లో భారత షూటర్ స్వప్నిల్ - 12లో



నాలుగోరోజూ లాభాలే

సెన్సెక్స్ లాభం 286 పాయింట్లు.. 24,950 ఎగువకు నిఫ్టీ - 13లో



హమాస్ చీఫ్ హత్య

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియేను ఆయన ఇంట్లోనే ఇజ్రాయెల్ హత్య చేసింది.

వివరాలు 6లో ▸



ఖేడ్కర్ అభ్యర్థిత్వం రద్దు

వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ అధికారి పూజా మనోరమ దిలీప్ ఖేడ్కర్‌పై యూపీఎస్సీ శాశ్వత వేటు వేసింది.

వివరాలు 6లో ▸



ప్రధానిపై సభాహక్కుల తీర్మానం

రికార్డుల్లో నుంచి తొలగించిన వ్యాఖ్యలను మోదీ షేర్ చేయడం సభాహక్కుల ఉల్లంఘనే అంటూ కాంగ్రెస్ ఎంపీ చన్నీ నోటీసు ఇచ్చారు.

వివరాలు 6లో ▸



డెలిగేట్లంతా కమల వైపే..

అమెరికా అధ్యక్ష పదవికి డెమొక్రటిక్ అభ్యర్థిత్వాన్ని ఖాయం చేసుకునేందుకు కమల నామినేషన్‌కు 99% డెలిగేట్లు మద్దతిచ్చారు.

వివరాలు 6లో ▸

ఇదెక్కడి రోగం?

ఆరోగ్యశ్రీ పథకాన్ని కనుమరుగు చేయడమే చంద్రబాబు లక్ష్యం

ఆస్పత్రులకు బకాయిలు చెల్లించకుండా వైఎస్ జగన్ ప్రభుత్వంపై దుష్ప్రచారం

- జనవరి వరకూ బిల్లులు క్రమం తప్పకుండా చెల్లించిన జగన్ సర్కార్
- జనవరి, ఫిబ్రవరి బిల్లులు ప్రాసెస్ చేసి, సీఎఫ్ఎంఎస్ కోడ్ వచ్చేలోపే ఎన్నికల కోడ్
- నాడు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి బిల్లులేవీ చెల్లించకుండా అడ్డుకుంది బాబే
- ఏప్రిల్, మే, జూన్, బకాయిల ఊసెత్తని బాబు సర్కార్
- ఆరోగ్యశ్రీనే కాదు.. మందుల కొరత, కొత్త వైద్య కళాశాలలపైనా తీవ్ర నిర్లక్ష్యం
- ప్రజలకు తాముంటున్న ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు, ఆరోగ్య సురక్ష అందకుండా నిలుపుదల
- మొత్తంగా ఆరోగ్య రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు చంద్రబాబు కుట్ర



సాక్షి, అమరావతి: ఏదైనా ఓ వ్యవస్థను నిర్వీర్యం చేయాలనుకుంటే సీఎం చంద్రబాబు తొలుత పథకం ప్రకారం దానిపై దుష్ప్రచారం ప్రారంభిస్తారు. తాను అనుకున్నది సాధించడం కోసం ప్రజల మెదడును ట్యూన్ చేసేలా పార్టీలోనే కొందరు నాయకులతో ప్రకటనలు చేయిస్తారు. అనుకూల మీడియాలో ఈమేరకు కథనాలతోపాటు టీవీ చానళ్లలోనూ తన మనుషుల ద్వారా చర్చలు నిర్వహిస్తారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ విషయంలోనూ అదే పంథాను కొనసాగిస్తున్నారు. మేనిఫెస్టోలో ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెడతానని హామీ ఇచ్చి చివరకు ప్రజల ఆరోగ్యానికి పొగ బెట్టారు. ఇన్నాళ్లూ ఆరోగ్యశ్రీ పథకం ట్రస్టు పర్యవేక్షణలో పకడ్బందీగా కొనసాగుతుండగా అధికారంలోకి వచ్చీ రాగానే ఆ స్థానంలో బీమా ప్రవేశపెట్టడానికి సిద్ధం కావాలంటూ వైద్య శాఖకు హుకుం జారీ చేశారు. మరోవైపు "ఆరోగ్యశ్రీకి డబ్బులు లేవు. ఆస్పత్రులకు బిల్లులు

మిగతా 2వ పేజీలో ▶



చంద్రబాబు రాజకీయ మాయా జూదం

శకుని రాజకీయాలకు మరోసారి తెరతీసిన చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుల కొనుగోలుకు కుట్ర

- ఒక్కొక్కరికి రూ. 40 కోట్ల నుంచి రూ.70 కోట్ల వరకు ఆఫర్.. అక్రమంగా సంపాదించిన సొమ్ముతో ప్రలోభాలు
- రాజీనామా చేస్తే వెంటనే ఉప ఎన్నికల్లో టికెట్ ఇస్తామని ఎర
- ఎమ్మెల్యేల బలం ఉన్నందున మళ్లీ గెలిపిస్తామని నమ్మించే యత్నం
- 2014–19లో ముగ్గురు ఎంపీలు, 23 మంది ఎమ్మెల్యేల కొనుగోలు
- 2015లో తెలంగాణలో 'ఓటుకు కోట్లు' కేసులో దొరికిన వైనం
- ఎన్టీ రామారావుకు వెన్నుపోటుతో అడ్డదారిలో అధికారంలోకి
- వైస్రాయ్ కుట్రలో సహకరించిన వారికి పొగబెట్టిన 'నారా'
- ప్రస్తుతం రాజకీయ ప్రలోభాల కుట్రకు మరింత పదును పెడుతున్న చంద్రబాబు

3లో

న్యూస్‌రీల్

యూపీఎస్సీ చైర్‌పర్సన్‌గా ప్రీతీ సూదన్



ఆంధ్రప్రదేశ్ కేడర్ సీనియర్ మాజీ ఐఏఎస్ అధికారి ప్రీతీ సూదన్ బుధవారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు నూతన చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు.

వివరాలు 6లో ▸

నేడు హంద్రీ–నీవాకు నీటి విడుదల



టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ నిర్లక్ష్యానికి, కూటమి సర్కారు నిర్వాకాలకు రాయలసీమలో దాదాపు 6.02 లక్షల ఎకరాలు బీడుగా మారే ప్రమాదం నెలకొన్న నేపథ్యంలో 'సాక్షి' ప్రచురించిన కథనంపై అధికార యంత్రాంగం స్పందించింది.

వివరాలు 10లో ▸

సెప్టెంబర్ 1 నుంచి పశుగణన



దేశంలో రైతుల ఆదాయం రెట్టింపు చేసేలా పశు సంవర్ధక శాఖలో ప్రణాళికాబద్ధమైన మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కేంద్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ వి.పి.సింగ్ తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా పశుగణన ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

వివరాలు 5లో ▸


'హామీ' ఇవ్వలేం!



సూపర్ సిక్స్, ఇతర హామీలను అటకెక్కించడమే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆర్డినెన్స్ జారీ చేసింది. పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టకుండా అసెంబ్లీ సమావేశాలను మంగళవారం ప్రొరోగ్ చేసి.. బుధవారం నాలుగు నెలల కాలానికి ఆర్డినెన్స్ తీసుకువచ్చింది.

వివరాలు 10లో ▸

100 రోజుల్లో 5 పారిశ్రామిక పాలసీలు



- రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు అనువైన వాతావరణం కల్పించేలా ఐదు నూతన పారిశ్రామిక విధానాలను 100 రోజుల్లోగా అందుబాటులోకి తేవాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. పారిశ్రామిక విధానంతో పాటు ఎంఎస్ఎంఈ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ, ఎలక్ట్రానిక్, ఐటీ అండ్ క్లౌడ్ పాలసీ, టెక్స్‌టైల్ పాలసీలు తేవాలని సూచించారు.

5లో



విధుల్లేకుండా.. జీతాలివ్వకుండా

వలంటీర్లపై కూటమి సర్కారు కక్షసాధింపు

- జూలై 1న చెల్లించాల్సిన వేతనాలు ఇవ్వలేదు
- ఆగస్టు 1న వేతనాలు ఇస్తారో, లేదో తెలియదు
- రూ.10 వేలకు పెంచుతామన్న హామీకి అతీగతి లేదు
- అగమ్యగోచరంగా వలంటీర్ల పరిస్థితి

10లో

ఎటు చూసినా వినాశనమే

158 మృతుల సంఖ్య

200 గాయపడినవారు



- 191 మందికిపైగా జనం జాడ గల్లంతు
- బురద, శిథిలాల నుంచి బయటపడుతున్న మృతదేహాలు
- కోలుకోని వయనాడ్ జిల్లాలోని కుగ్రామాలు
- విపత్తుపై ముందుగానే హెచ్చరించాం: అమిత్ షా
- పంపింది ఆరెంజ్ అలెర్ట్.. అదీ 29న: కేరళ సీఎం విజయన్

6లో

దురాశ తెచ్చిన దుఃఖమిది!

వయనాడ్‌లో పర్యావరణ విధ్వంసం

యథేచ్ఛగా తవ్వకాలు, హోటళ్లు, రిసార్టులు

కాస్త వానకూ వణుకుతున్న కొండ ప్రాంతం

- వివరాలు 6లో

ఇదం జగత్



బంగారం ధరలు దిగొచ్చాయి. గత ఐదేళ్లుగా జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తూ రెట్టింపైన ధరలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. ఈ స్థాయిలో ధరలు తగ్గడం చరిత్రలో ఇదే తొలిసారి. దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే దీనికి కారణం. దీంతో బంగారం దుకాణాలు కొనుగోలుదార్లతో కిటకిటలాడుతున్నాయి. 'శ్రావణం' పెళ్లిళ్ల సీజన్ కావడంతో కొనుగోళ్లు మరింత ఊపందుకున్నాయి.



'గోల్డెన్' డేస్!

భారీగా తగ్గిన బంగారం ధరలు

కేంద్రం దిగుమతి సుంకాన్ని తగ్గించడమే దీనికి కారణం

దీంతో 10 గ్రాములపై రూ.5,800 దాకా తగ్గుదల

ధర తగ్గడం, పెళ్లిళ్ల సీజన్ కావడంతో రద్దీగా బంగారు దుకాణాలు.. పెట్టుబడిగా పుత్తడిని కొంటున్న ప్రజలు

2లో

రాష్ట్రవ్యాప్తంగా బంగారం విక్రయాలు ఇలా.. (కేజీల్లో)

రోజుకు	నెలకు	ఏడాదికి
107	3,210	38,520

ఇసుక ధర పెంపు.. కొనుగోలుదారుల నిరసన

భీమిలిలో టన్నుకు రూ.758 నుంచి రూ.1,076కి పెంపు

ఒకేసారి రూ.318 పెరగడంతో కొనుగోలుదారుల ఆగ్రహం

ఓ వైపు ఉచితమంటూ ఇంతేసి వసూళ్లా అంటూ నిరసన



భీమిలి ఇసుక ర్యాంపు వద్ద నిరసన తెలుపుతున్న కొనుగోలుదారులు

భీమునిపట్నం/అగనంపూడి (విశాఖ): ఒక పక్క ప్రభుత్వం ఇసుక ఉచితమని ప్రకటనలు గుప్పిస్తూ.. మరోవైపు భారీ మొత్తంలో వసూలు చేస్తుండటంపై ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. అయినా రేటు రోజురోజుకు పెంచేస్తున్నారు. బుధవారం భీమిలి ర్యాంపు వద్ద ఒక్కసారిగా టన్నుకు రూ.318 పెంచడంతో వినియోగదారులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఒకటే ధర ఉండాలని

మిగతా 14వ పేజీలో ▶

ఇసుక ఉచితమే.. అయినా డబ్బు చెల్లించాలి

- తవ్వకం, సీనరేజ్, రవాణా చార్జీలు ప్రజలే చెల్లించాలన్నది మా విధానం
- రీచ్ నుంచి నేరుగా వినియోగదారుడికి ఇసుక సరఫరా
- గనుల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

14లో

క్లుప్తంగా...

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కృష్ణబాబు తదితరులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గురువారం నుంచి ఈ నెల 7 వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నామని వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు తెలిపారు. ఇందులో భాగంగా బ్రెస్ట్ ఫీడింగ్‌పై రూపొందించిన పోస్టర్లను బుధవారం సచివాలయంలో ఆయన ఆవిష్కరించారు. కృష్ణబాబు మాట్లాడుతూ.. 'అంతరాలు లేకుండా అందరికీ తల్లిపాల మద్దతు' అనే నినాదంతో ఈ ఏడాది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిడ్డకు తల్లి పాలివ్వడం ద్వారా కలిగే ప్రయోజనాలను బాలింతలకు వివరించాలని చెప్పారు. బిడ్డకు రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించడంతో పాటు సురక్షితమైన పోషకాహారాన్ని పరిచయం చేయడంపై ప్రచార కార్యక్రమాలను రూపొందించామన్నారు.

మంత్రి లోకేశ్ ఓఎస్డీగా బద్వేల్ ఆర్డీవో

సాక్షి, అమరావతి: రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఓఎస్డీగా ఆకుల వెంకటరమణను ప్రభుత్వం నియమించింది. ఈమేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (పొలిటికల్) ఎస్.సురేష్ కుమార్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. వెంకట రమణ ప్రస్తుతం వైఎస్సార్ జిల్లా బద్వేల్ ఆర్డీవోగా పనిచేస్తున్నారు.

జలవనరుల శాఖ ఈఎన్‌సీగా వెంకటేశ్వరరావు

సాక్షి, అమరావతి: జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావును ఇంజినీర్–ఇన్–చీఫ్(ఈఎన్‌సీ)గా నియమిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుత ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి రిటైర్డ్ అవడంతో ఆ బాధ్యతలను వెంకటేశ్వరరావుకు అప్పగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వెంకటేశ్వరరావు గతంలో ఈఎన్‌సీగా పనిచేసి..2019, డిసెంబర్ 31న పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత ఆయనను జలవనరుల శాఖ సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. జూన్ 12న ఏర్పాటైన టీడీపీ కూటమి ప్రభుత్వం కూడా ఆయనను జలవనరుల శాఖ సలహాదారుగా నియమించింది.

నారాయణరెడ్డి పదవీ విరమణ

జలవనరుల శాఖ ఇంజినీర్–ఇన్–చీఫ్ (ఈఎన్‌సీ) సి.నారాయణరెడ్డి బుధవారం పదవీ విరమణ చేశారు. 2020, జనవరి 1న ఈఎన్‌సీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన నాలుగేళ్ల ఏడు నెలల పాటు ఆ పదవిలో విధులు నిర్వహించారు. అనంతపురంలోని జేఎన్‌టీయూలో బీటెక్ చదివిన నారాయణరెడ్డి.. ఖరగ్‌పూర్ ఐఐటీలో ఎంటెక్ చేసి అందులో గోల్డ్‌మెడల్ సాధించారు. ఆ తర్వాత ఏపీపీఎస్సీ–1986 నోటిఫికేషన్ ద్వారా ఏఈఈగా జలవనరుల శాఖలో నియమితులై 38 ఏళ్లపాటు సేవలు అందించారు.

గ్రామ స్థాయిలోనే టీబీ నిర్ధారణకు నమూనాలు సేకరించాలి

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ హరికిరణ్


సమీక్ష నిర్వహిస్తున్న హరికిరణ్

సాక్షి, అమరావతి: ఉప ఆరోగ్య కేంద్రాల ద్వారా గ్రామ స్థాయిలోనే టీబీ నిర్ధారణ పరీక్షలకు నమూనాలను సేకరించాలని అధికారులను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ హరికిరణ్ ఆదేశించారు. పెద్దలకు టీబీ బీసీజీ టీకా పంపిణీ లక్ష్యాన్ని వీలైనంత త్వరగా చేరుకోవాలన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని వైద్య శాఖ కార్యాలయంలో బుధవారం జాతీయ టీబీ నిర్మూలన కార్యక్రమంపై హరికిరణ్ సమీక్షించారు. 50 లక్షల మందికి టీకా పంపిణీ లక్ష్యం కాగా 17.78 లక్షల మందికి ఇప్పటివరకూ వేసినట్లు చెప్పారు. బీసీజీ టీకాలు వేసే సమయంలోనే ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఆభా) కార్డులను సంబంధిత వ్యక్తులకు ఏఎన్ఎంలు జారీ చేయాలన్నారు. టీబీ బాధితులకు అదనపు పోషకాహారాన్ని పంపిణీ చేసేందుకు పారిశ్రామిక వేత్తల్ని సంప్రదించాలన్నారు. టీబీ పరీక్షలు నిర్వహించేందుకు కొత్త ల్యాబ్‌ల ఏర్పాటుతో పాటు, ఈ విభాగంలో ఖాళీలను భర్తీ చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలో టీబీ నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. 2025 నాటికి టీబీ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు.

కేబినెట్ భేటీ వాయిదా

సాక్షి, అమరావతి: ఆగస్టు 2న జరగాల్సిన ఏపీ కేబినెట్ సమావేశాన్ని ఈ నెల 7కి వాయిదా వేస్తూ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన 7న ఉదయం 11 గంటలకు సచివాలయంలో కేబినెట్ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశానికి తీసుకువెళ్లాల్సిన ప్రతిపాదనలను ఈ నెల 5న మధ్యాహ్నం 2 గంటల్లోగా సాధారణ పరిపాలన శాఖ (కేబినెట్ విభాగం)కు పంపాల్సిందిగా అన్ని శాఖలను ఆదేశించారు.

'గోల్డెన్' డేస్!

భారీగా తగ్గిన బంగారం ధరలు




కర్నూలులో ఓ నగల దుకాణంలో బంగారాన్ని కొనుగోలు చేస్తున్న మహిళలు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: బంగారం ధరలు ఇటీవల వేగంగా పెరిగాయి. 2000 సంవత్సరంలో 10 గ్రాముల బంగారం ధర రూ.5 వేలుంటే.. 2019 నాటికి రూ.35 వేలకు చేరింది. గత ఐదేళ్లలో ఏకంగా రెట్టింపై.. రూ.70 వేల మార్క్‌ను దాటింది. 24 క్యారెట్ల ధర అత్యధికంగా రూ.75,050కు చేరితే, 22 క్యారెట్ రూ.68,800 వరకూ ట్రేడ్ అయింది. బంగారం, వెండి, ప్లాటినంతో పాటు విలువైన లోహాలపై 10 శాతం బీసీడీ(బేసిక్ కస్టమ్ డ్యూటీ) ఉండేది. దీనికి అదనంగా ఏఐడీసీ(అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ సెస్) 5% ఉండేది. కేంద్రం బీసీడీని 5శాతం, ఏఐడీసీని 4% తగ్గించింది. దీంతో కస్టమ్స్ సుంకాన్ని కేవలం 6 శాతానికే పరిమితం చేసింది. జీఎస్టీలో మాత్రం మార్పుల్లేవు.. 3 శాతంగానే ఉంది. దీంతో మొత్తంగా జీఎస్టీతో కలిపి బంగారు, వెండిపై 18 శాతం ఉన్న సుంకం 9 శాతానికి తగ్గింది. దీంతో బంగారు, వెండి ధరలు భారీగా తగ్గాయి. ఈ వారం రోజుల్లో 10 గ్రాముల బంగారంపై రూ.6 వేల దాకా తగ్గింది. రూ.63 వేల వరకూ తగ్గిన బంగారం తిరిగి కాస్త పెరిగి రూ.63,850 చేరింది.

ధరలు మరింత తగ్గే అవకాశం

22 క్యారెట్ల ధర రూ.68,800 నుంచి రూ.63 వేలకు తగ్గింది. అంటే 5,800 తగ్గిందన్నమాట. కొన్ని ప్రాంతాల్లోని మార్కెట్లలో రూ.6 వేలకు పైగా తగ్గింది. అయితే మరింతగా ధరలు తగ్గే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ నెల 5వ తేదీ నుంచి శ్రావణమాసం మొదలవుతుంది. పెళ్లిళ్ల సీజన్ కావడంతో బంగారు కొనుగోలుకు డిమాండ్ పెరిగింది. వివాహాల కోసం అన్ని వర్గాలు అనివార్యంగా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ఈ కారణంగానే ప్రస్తుతం ధరలు స్థిరంగా ఉన్నాయని, శ్రావణం తర్వాత 10 గ్రాములపై మరో రూ.2 వేలు లేదా 3 వేల వరకూ ధరలు తగ్గే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాల అంచనా.

కొనుగోలుదారులతో కిటకిట

శ్రావణమాసం, పైగా ధరలు భారీగా తగ్గడంతో బంగారం దుకాణాలు రద్దీగా మారాయి. నగదు దాచుకున్న వారు వడ్డీలకు డబ్బులివ్వడం కంటే బంగారంపై పెట్టుబడి పెట్టడం మేలని భారీగా కొనుగోలు చేస్తున్నారు. మూడు నెలల తర్వాత బంగారం ధర తిరిగి పుంజుకుంటుందని.. 24 క్యారెట్ల ధర రూ.80 వేల వరకూ చేరొచ్చని వ్యాపారులు చెబుతున్నారు. మరి కొద్దిరోజుల్లో శ్రావణ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో బంగారం రేటు ఇంకా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

ఏడాదికి రూ.28.89 వేల కోట్లు

మలబార్, ఖజానా, జోయ్ అలూక్కాస్, లలిత లాంటి ప్రముఖ కార్పొరేట్ కంపెనీలు 10 వరకూ ఉన్నాయి. దాదాపు ప్రతి ఉమ్మడి జిల్లాలో వీటి బ్రాంచ్‌లున్నాయి. వీటిలో ప్రముఖమైన నాలుగు సంస్థల్లో రోజూ 1–1.5 కిలోల బంగారం విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. తక్కిన వాటిలో అరకిలో వరకూ విక్రయం అవుతోంది. వీటితో పాటు స్వర్ణకారుల దుకాణాల్లో విక్రయాలున్నాయి. ఇలా కార్పొరేట్ కంపెనీలు, స్వర్ణకారుల దుకాణాల్లో 13 ఉమ్మడి జిల్లాల్లో రోజూ సగటున 107 కిలోల బంగారం విక్రయం అవుతోందని తెలుస్తోంది. అంటే రాష్ట్రంలో నెలకు 3,210 కిలోలు విక్రయం జరుగుతోంది. రోజువారి బంగారం ధరలతో పాటు.. దానికి తరుగు, జీఎస్టీ కలిపితే సగటున ఒక కిలో రూ.75 లక్షల వరకూ పలుకుతోంది. ఈ లెక్కన నెలకు రూ.2,407 కోట్ల చొప్పున.. ఏడాదికి రూ.28.89 వేల కోట్ల విక్రయాలు జరుగుతున్నాయి. దీన్నిబట్టే బంగారం వ్యాపారం ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

స్మగ్లింగ్ నివారణకే సుంకం తగ్గింపు..

బంగారు విక్రయాలు 'భారత్'లో ఎక్కువ. దీంతో కేంద్రం దీనిపై మొన్నటి వరకూ జీఎస్టీతో కలిపి 18 శాతం సుంకం వసూలు చేసేది. దుబాయి, సౌదీ, కువైట్‌తో పాటు పలు గల్ఫ్ దేశాల్లో భారత్‌తో పోల్చితే సుంకం సగాని కంటే తక్కువగా ఉంది. దీంతో గల్ఫ్‌కు, భారత్‌కు 10 గ్రాములపై రూ.7 వేల వరకూ ధరల్లో వ్యత్యాసం ఉంది. అందువల్లే గల్ఫ్ నుంచి వచ్చేవారు అక్రమంగా బంగారాన్ని తెచ్చేవారు. చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, వైజాగ్, విజయవాడ విమానాశ్రయాల్లో నిత్యం 'గోల్డ్ స్మగ్లింగ్' వెలుగు చూసేది. పట్టుబడకుండా దేశంలోకి పోర్టులు, ఎయిర్‌పోర్ట్‌ల ద్వారా భారీగా చేరుతోందని కేంద్రం గ్రహించింది. స్మగ్లింగ్‌కు గల కారణాలపై ఆరా తీస్తే ధరల్లో వ్యత్యాసమేనని స్పష్టమైంది. అక్రమంగా వచ్చిన బంగారాన్ని కొనుగోలు చేసి నగలు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. దీంతో మన ఖజానాకు గండిపడుతోంది. ధరల్లో వ్యత్యాసాన్ని తగ్గించగలిగితే స్మగ్లింగ్ తగ్గుతుందని, అప్పుడు కొనుగోళ్లు దేశీయంగానే జరుగుతాయి కాబట్టి ఖజానాకు లాభం చేకూరుతుందని భావించిన కేంద్రం సుంకాన్ని తగ్గించింది. దీంతో పాటు బంగారాన్ని పెట్టుబడిగా భావించి కొనుగోలు చేసే వారి సంఖ్య ఎక్కువ. ధరలు తగ్గిస్తే నగదును దాచుకున్న వారు బంగారాన్ని కొనే అవకాశం ఉంది. దీంతో మార్కెట్‌లో నగదు చెలామణి పెరిగి.. దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని భావించి సుంకాన్ని తగ్గించారు.

ధరలు తగ్గడం సంతోషకరం



మొన్నటి దాకా బంగారం కొనాలంటే ధరలు షాక్ కొట్టేవి. 10గ్రాములు కొనాలంటే తరుగుతో కలిపి రూ.80 వేలు అయ్యేది. వారం కిందట ధరలు భారీగా తగ్గాయని తెలిసింది. మా అమ్మ నగలు కొందాం, మళ్లీ పెరుగుతాయంట అని చెప్పడంతో కొనుగోలు చేసేందుకు వచ్చాం. ధరలు తగ్గడంతో తులంపై రూ.5 వేల నుంచి 6 వేల దాకా ఆదా అవుతోంది.
– అఖిల, కర్నూలు

ధరలు తగ్గాయని కొనేందుకు వచ్చా..



బంగారం ధర తగ్గడమన్నది శుభవార్తే. పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్య, మధ్య తరగతి వారికి వెసులు బాటు లభించినట్టే. ధరలు తగ్గాయని తెలియగానే మళ్లీ పెరుగుతాయేమోనన్న ఆందోళనతోనే కొనేందుకు వచ్చాం. మా నాన్న గిఫ్ట్‌గా గోల్డ్ ఇప్పిస్తున్నారు. అయితే ధరలు ఇంకా తగ్గాలి. సామాన్యులకు మరింత అందుబాటులోకి రావాలి.
– డాక్టర్ దివ్య, పీజీ విద్యార్థి, విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్

ఆరోగ్యశ్రీ పట్ల మీ విధానం తేల్చండి

ఆ పథకానికి తూట్లు పొడుస్తూ నిర్వీర్యం చేస్తున్నారు

- మాజీ మంత్రి విడదల రజిని మండిపాటు
- కేంద్ర మంత్రి పెమ్మసాని మాటలే ఇందుకు నిదర్శనం
- ఆయుష్మాన్ కింద ఇచ్చేది రూ.5 లక్షలే.. అదీ 60 లక్షల మందికే
- వైఎస్ జగన్ హయాంలో 1,059 ఉన్న ప్రొసీజర్స్ 3,257 వరకు పెంపు
- ఆరోగ్యశ్రీ కింద 1.42 కోట్ల మందికి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం
- చికిత్స పొందాక తిరిగి కోలుకునే వరకు ఆరోగ్య ఆసరాతో భరోసా
- ఆయుష్మాన్ భారత్‌లో లేని మిగిలిన వారి పరిస్థితి ఏంటి?



పట్నంబజారు: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రజల ఆరోగ్య భద్రతకు తూట్లు పొడుస్తోందని మాజీ మంత్రి విడదల రజని మండిపడ్డారు. ఈ పథకం పట్ల రాష్ట్ర ప్రభుత్వ విధానం ఏంటో తేల్చాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ పథకానికి డబ్బుల్లేవని, నెట్‌వర్క్ ఆస్పత్రులకు డబ్బులు ఇవ్వలేం కాబట్టి అందరూ ఆయుష్మాన్ భారత్ కార్డులు తీసుకోవాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చెప్పడమే ఇందుకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసే ప్రయత్నం చేస్తున్నారేమోనన్న అనుమానం కలుగుతోందన్నారు. బుధవారం ఆమె గుంటూరులో విలేకరులతో మాట్లాడారు. గతంలో కేవలం రూ.5 లక్షల వరకు మాత్రమే ఉన్న ఆరోగ్యశ్రీ పరిధిని వైఎస్ జగన్ ఏకంగా రూ.25 లక్షల వరకు పెంచి అమలు చేశారని చెప్పారు. ఇవాళ ఆయుష్మాన్ భారత్ పరిధి కేవలం రూ.5 లక్షల వరకే ఉందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆయుష్మాన్ భారత్ బడ్జెట్ ఏడాదికి కేవలం రూ.300 కోట్లు కాగా, ఆరోగ్యశ్రీలో ఏటా దాదాపు రూ.4,100 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డు ఏపీలో 60 లక్షల మందికి వర్తిస్తుండగా.. ఆరోగ్యశ్రీ కార్డు 1.42 లక్షల కుటుంబాలకు అంటే ఏపీలో 90 శాతం మంది ప్రజలకు వర్తిస్తుందని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు ప్రభుత్వ హయాంలో చెల్లించాల్సిన రూ.632 కోట్లను ఏమాత్రం సాకులు చెప్పకుండా వైఎస్ జగన్ ప్రభుత్వం చెల్లించిందన్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ వల్ల పెండింగ్‌లో ఉన్న బిల్లులను కూటమి ప్రభుత్వం క్లియర్ చేయడంతో పాటు అంతరాయం లేకుండా పేదలకు వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందని తేల్చి చెప్పారు. 2019 నుంచి 2024 వరకు వైఎస్ జగన్ నాయకత్వంలో ఆనాడు అందరికీ సమగ్రంగా నాణ్యమైన ఉచిత వైద్య సేవలను ఇంటి వద్దకే అందించాలన్న ఆలోచనతో అమలు చేశామని ఆమె వివరించారు. చంద్రబాబు హయాంలో ఆరోగ్యశ్రీలో ఉన్న 1,059 ప్రొసీజర్స్‌ను వైఎస్ జగన్ హయాంలో 3,257 వరకు పెంచి అమలు చేశామన్నారు.

ఆరోగ్య ఆసరా పరిస్థితి ఏమిటి?

టీడీపీ హయాంలో ఏడాదికి రూ.1,000 కోట్లు ఖర్చు చేస్తే, వైఎస్ జగన్ హయాంలో ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరాకు కలిపి సుమారు రూ.4,100 కోట్లు ఖర్చు చేశామని రజని తెలిపారు. ఆరోగ్యశ్రీలో మరో బృహత్తర పథకం ఆరోగ్య ఆసరా అని, ఆరోగ్యశ్రీ కింద చికిత్స తీసుకున్న తర్వాత వారు కోలుకుని తిరిగి పనులు చేసుకునే వరకు రోజుకు రూ.225 చొప్పున నెలకు రూ.5 వేల వరకు అందించామని చెప్పారు. ఏటా దీని కోసం రూ.300 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. ఈ పథకం ఆరోగ్యశ్రీ ఉంటేనే వర్తిస్తుందని, ఇది లేకపోతే ఆరోగ్య ఆసరా పథకాన్ని ఏం చేద్దామనుకుంటున్నారో చెప్పాలని నిలదీశారు. ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల, వైద్య రంగంలో నాడు–నేడుపై ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

ఇదెక్కడి రోగం?

▶ మొదటి పేజీ తరువాయి

"ఆరోగ్యశ్రీకి డబ్బులు లేవు. ఆస్పత్రులకు బిల్లులు రావడం లేదు. రోగులకు చికిత్సలు అందడం లేదు. ప్రజలు వైద్యం కోసం కేంద్రం అమలు చేసే ఆయుష్మాన్ భారత్ కార్డును వెంటబెట్టుకుని ఆస్పత్రులకు వెళ్లాలి.." అని టీడీపీకి చెందిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉచిత సలహా ఇచ్చారు. ఇక టీడీపీ సోషల్ మీడియాలోనూ ఆరోగ్యశ్రీ పథకంపై పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేస్తున్నారు. మాజీ సీఎంలు వైఎస్సార్, వైఎస్ జగన్‌ల ముద్రను చెరిపేయాలనే దురుద్దేశంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరుగారుస్తూ రాష్ట్రంలోని కోట్ల మంది నిరుపేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. 2014–19 మధ్య పథకాన్ని పూర్తిగా అటకెక్కించడంలో విఫలం అయిన చంద్రబాబు ఈ దఫా తన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారంలోకి వచ్చీ రావడంతోనే పథకం స్థానంలో బీమా ప్రవేశపెట్టే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. మరోవైపు ఆరోగ్యశ్రీ బిల్లుల బకాయిలు చెల్లించకుండా, ప్రజలకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందకుండా చేస్తున్నారు.

అడ్డుకుని అభాండాలు

2019–24 మధ్య ఐదేళ్లలో ఆరోగ్యశ్రీ పథకాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలతో బలోపేతం చేసింది. అంతకుముందు టీడీపీ హయాంలో బిల్లుల చెల్లింపుల్లో జరిగిన తీవ్ర జాప్యానికి చెక్ పెట్టారు. ప్రజలకు వైద్య సేవలపై ఏ మాత్రం ప్రభావం పడకుండా ఎప్పటికప్పుడు ఆస్పత్రులకు బిల్లులను చెల్లిస్తూ వచ్చారు. ఈ ఏడాది జనవరి వరకూ పెండింగ్ లేకుండా బిల్లులు చెల్లించారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి వైద్య సేవల క్లెయిమ్‌లను ట్రస్ట్ పరిశీలించి, ఆమోదించడం.. అనంతరం బిల్లులను ట్రస్ట్ ప్రాసెస్ చేసి ఆర్థిక శాఖకు పంపి అక్కడ సీఎఫ్ఎంఎస్ ఐడీలు రావడానికి రెండు నెలల సమయం పట్టింది. సాధారణంగా ప్రతి నెలా ఇదే పద్ధతిలో బిల్లులను ప్రాసెస్ చేస్తారు. ఈ ప్రక్రియలో మార్చిలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో బిల్లులను చెల్లించలేకపోయారు. వాస్తవానికి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన ఆరోగ్యశ్రీ పథకం ఎన్నికల నియమావళిలోకి రాదు. పథకానికి సంబంధించిన బిల్లులు చెల్లింపులు చేయడానికి వీలుంటుంది. అయితే ఆ సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అప్పటికే అమలులో ఉన్న పథకాలకు ఎలాంటి చెల్లింపులు చేయకుండా చంద్రబాబు ఎన్నికల సంఘానికి పలుమార్లు ఫిర్యాదులు చేసి అడ్డుకున్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కోడ్ అమలులో ఉంది. దీంతో జనవరి, ఫిబ్రవరి నెలలకు మరో మూడు నెలల బిల్లులు వచ్చి చేరాయి. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఆ బకాయిలను చెల్లించకుండా తాత్సారం చేస్తూ యథావిధిగా గత ప్రభుత్వంపై అభాండాలు వేస్తూ పథకాన్ని నిర్వీర్యం చేయాలనే లక్ష్యాన్ని అమలు చేస్తోంది. అదే 2014–19 మధ్య చంద్రబాబు దిగిపోయే సమయంలో ఇదే పథకానికి (ఆరోగ్యశ్రీ) పెట్టిన రూ.700 కోట్ల బిల్లులను నాడు వైఎస్ జగన్ ప్రభుత్వం చెల్లించింది. సాక్షాత్తూ చంద్రబాబు బావమరిది, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణకు చెందిన బసవతారకం ఆస్పత్రికి సైతం ఎలాంటి వివక్ష లేకుండా పెండింగ్ బకాయిలను విడుదల చేయడం గమనార్హం.

పేదల్లో కలవరపాటు

ఓవైపు బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేయడం, మరోవైపు బీమా పేరిట ఆరోగ్యశ్రీ పథకానికి చంద్రబాబు సర్కారు పొగబెడుతుండటంతో పేదల్లో కలవరపాటు మొదలైంది. గత ఐదేళ్లలో దురదృష్టవశాత్తూ ఏదైనా జబ్బు చేస్తే ఆరోగ్యశ్రీ కార్డుతో వెళితే ఎంత ఖరీదైన వైద్యమైనా ఉచితంగా లభించే పరిస్థితి ఉండేది. 2019 అనంతరం రూ.5 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న వారికి పథకాన్ని వర్తింపజేయడంతో ప్రైవేట్ ఉద్యోగాలు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని జీవించే మధ్యతరగతి కుటుంబాలకు ఆరోగ్యశ్రీ రక్షగా నిలిచింది. అనంతరం చికిత్స వ్యయ పరిమితిని రూ.5 లక్షలు నుంచి దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.25 లక్షలకు వైఎస్ జగన్ పెంచారు. టీడీపీ హయాంలో కేవలం 1,059 ప్రొసీజర్లతో అస్తవ్యస్తంగా ఉన్న ఆరోగ్యశ్రీకి ప్రాణం పోసి ప్రొసీజర్లను ఏకంగా 3,257కి పెంచారు. ఐదేళ్లలో 45.10 లక్షల మందికి ఉచితంగా చికిత్సలు అందించి ఆరోగ్యశ్రీ పథకానికి రూ.13 వేల కోట్లకు పైగా వెచ్చించారు. అంతేకాకుండా శస్త్ర చికిత్సలు జరిగిన 24.59 లక్షల మందికి కోలుకునే సమయంలో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద రూ.1,465 కోట్లకుపైగా ఆర్థిక సాయం అందించి కష్టకాలంలో గత ప్రభుత్వం అండగా నిలిచింది. మరోవైపు నాడు–నేడు కింద రూ.16 వేల కోట్లకు పైగా నిధులతో ప్రభుత్వాస్పత్రులను సదుపాయాలతో తీర్చిదిద్దడంతోపాటు 17 వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టారు. 108, 104 వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు దేశంలోనే ఎక్కడా లేనటువంటి ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి వినూత్న కార్యక్రమాలను అమలు చేశారు. తద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణ కల్పించారు.

ఒక్క ఆరోగ్యశ్రీనే కాకుండా..

కేవలం ఒక్క ఆరోగ్యశ్రీనే కాకుండా ప్రభుత్వ వైద్య ఆరోగ్య రంగంలో గత ఐదేళ్లలో చేపట్టిన సంస్కరణలను చంద్రబాబు ప్రభుత్వం నిర్వీర్యం చేసేలా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా పేద ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని చేరువ చేయడంతో పాటు మన విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయడానికి తలపెట్టిన కొత్త వైద్య కళాశాలలకు అనుమతుల విషయంలోనూ కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రజలకు తాముంటున్న చోటే స్పెషాలిటీ వైద్య సేవలను అందించడంతోపాటు నిరంతర వైద్య పర్యవేక్షణ కల్పిస్తూ తెచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కూటమి సర్కారు నిలిపివేసింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలు కావస్తున్నా ఆస్పత్రుల్లో మందుల సరఫరాపై కనీసం దృష్టి పెట్టలేదు. దీంతో ఆస్పత్రులను మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రభుత్వాస్పత్రుల్లో వందకుపైగా రకాల మందుల కొరత ఉంది. గత ప్రభుత్వంలో బోధనాస్పత్రుల్లో 607 రకాల డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాలున్న మందులు అందుబాటులో ఉండేవి. గ్రామ స్థాయిలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లోనూ 105 రకాల మందులను అందుబాటులో ఉంచిన ఘనత వైఎస్ జగన్ ప్రభుత్వానికే దక్కింది.

కక్ష జనంపైనా.. జగన్‌పైనా?

- రెండో దశ వైద్య కళాశాలల ప్రారంభాన్ని పట్టించుకోని చంద్రబాబు ప్రభుత్వం
- ఎన్ఎంసీ అనుమతులు రాబట్టేలా కావాలనే చర్యలు తీసుకోని వైనం
- 2024–25 విద్యా సంవత్సరంలోనే పలు చర్యలు తీసుకున్న వైఎస్ జగన్ ప్రభుత్వం
- దాదాపు 250 వైద్య, వందల సంఖ్యలో సిబ్బంది పోస్టులు భర్తీ
- ఇప్పుడు స్వల్ప స్థాయిలో వైద్యులు, చిన్న చిన్న మౌలిక వసతులు కల్పిస్తే చాలు
- అయినా ఉద్దేశ పూర్వకంగా, నిర్లక్ష్యంతో పట్టించుకోని కూటమి సర్కారు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రారంభంపై చంద్రబాబు ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. మన విద్యార్థులకు వైద్య విద్య అవకాశాలను పెంచడంతో పాటు, నిరుపేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని చేరువ చేసే లక్ష్యంతో ఏకంగా రూ.8 వేల కోట్లకుపైగా నిధులతో 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటిలో ఐదు వైద్య కళాశాలలను గత ఏడాది ప్రారంభించగా, మరో ఐదు ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించడానికి చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో ఈ ఏడాది మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, ఆదోని, పాడేరు కళాశాలల్లో ఒక్కో చోట 100 ఎంబీబీఎస్ సీట్లతో తరగతులు ప్రారంభించాల్సి ఉంది. అయితే ఈ కళాశాలలను ప్రారంభిస్తే వైఎస్ జగన్‌కు క్రెడిట్ దక్కుతుందని కూటమి ప్రభుత్వం.. అనుమతులు రాబట్టడంలో చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవడం లేదు.

మొక్కుబడిగా అప్పీల్

వైద్య కళాశాలలు ప్రారంభించడం కోసం ఐదు చోట్ల సెకండరీ కేర్ ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేయడంతో పాటు, నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) నిబంధనలకు అనుగుణంగా పోస్టులను గత ప్రభుత్వంలోనే మంజూరు చేశారు. మెజార్టీ శాతం పోస్టుల భర్తీ చేపట్టారు. మిగిలిన పోస్టులు కూడా భర్తీ చేసే క్రమంలోనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. మరోవైపు మొదటి ఏడాది ఎంబీబీఎస్ విద్యార్థుల అకడమిక్ కార్యకలాపాల కోసం లెక్చర్ హాల్, ల్యాబ్, వసతి కోసం హాస్టల్స్, క్యాంటిన్ ఇలా వివిధ నిర్మాణాలు చేపట్టింది. ఎన్నికల ఫలితాలు వెలువడే నాటికి 80 శాతం మేర నిర్మాణ పనులు పూర్తయ్యాయి. జూన్ 24న ఎన్ఎంసీ బృందాలు ఈ ఐదు కళాశాలల్లో తనిఖీలు నిర్వహించాయి. మదనపల్లెలో 12 శాతం, పాడేరు, మార్కాపురం, పులివెందుల, ఆదోనీల్లో స్వల్ప స్థాయిలో ఫ్యాకల్టీ కొరత ఉందని, కళాశాలల్లో కొన్ని వసతులను మెరుగుపరుచుకోవాలని అనుమతులను నిరాకరిస్తూ జూలై 6న కళాశాలలకు సమాచారం వచ్చింది. ఈ నేపథ్యంలో మిగిలిన కొద్ది పోస్టులను భర్తీ చేయడంతో పాటు, కళాశాలలు, హాస్టల్స్‌లో ఫర్నీచర్ సమకూర్చడంతో పాటు, తుది దశ పనులను పూర్తి చేస్తే రెండో దశ తనిఖీల్లో వంద శాతం సీట్లకు అనుమతులు వస్తాయి. అప్పీల్‌కు వెళ్లడానికి చివరి వరకూ నాన్చి.. నాన్చి.. గడువు ముగిసే ముందు రోజు వైద్య శాఖకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఇదిలా ఉంటే ఎన్ఎంసీ రెండో విడత తనిఖీలు నిర్వహించే నాటికి వసతులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన కల్పించాల్సి ఉండగా ఆ విషయాన్ని పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో బుధవారం పులివెందుల కళాశాలలో వర్చువల్‌గా ఎన్ఎంసీ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. తొలి దశ తనిఖీలప్పుడు ఉన్న పరిస్థితులే ఇప్పుడూ ఉన్నాయని గుర్తించినట్టు సమాచారం.

ఉద్దేశ పూర్వకం.. ఇదే నిదర్శనం

- ఈ ఐదు వైద్య కళాశాలల కోసం గత వైఎస్ జగన్ ప్రభుత్వం 250కి పైగా వైద్యుల పోస్టులు, దాదాపు సరిపడా సంఖ్యలో సిబ్బంది పోస్టులను భర్తీ చేసింది. ఇంకా ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా మరో 380 పోస్టుల భర్తీకి అనుమతులు ఇచ్చింది. ఇంతలో చంద్రబాబు ప్రభుత్వం రావడంతో వీటిని భర్తీ చేయాలని తొలి సమీక్షలోనే వైద్య శాఖ సీఎం దృష్టికి తీసుకెళ్లినా అనుమతులు ఇవ్వలేదు.
- పలు స్పెషాలిటీల్లో ఎన్నిసార్లు నోటిఫికేషన్‌లు ఇచ్చినా వైద్యులు రావడం లేదని గిరిజన ప్రాంతాల్లో 50 శాతం, గ్రామీణ ప్రాంతంలో 30 శాతం అదనపు ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు, కాంట్రాక్ట్ విధానంలో ప్రొఫెసర్, అసోసియేట్‌లను తీసుకోవాలని గతంలోనే నిర్ణయించారు. వీటిని కొనసాగించకుండా ఈ ప్రభుత్వం అడ్డుకుంది. కాగా కొన్ని స్పెషాలిటీలలో దేశ వ్యాప్తంగా వైద్యుల కొరత ఉన్నప్పటికీ, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల చొరవ వల్ల ఎన్ఎంసీ అనుమతులు వస్తున్నాయి.
- 313 స్టాఫ్ నర్సుల పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసి జాబితా ప్రకటించి, వారికి పోస్టింగ్‌లు ఇచ్చే సమయంలో టీడీపీ ప్రజాప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారని ఉత్తర్వులు ఇవ్వకుండా నిలిపి వేశారు. స్టాఫ్ నర్సులు లేక ఆయా బోధనాస్పత్రుల్లో వైద్య సేవలపై ప్రభావం పడుతున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.


పులివెందులలో నిర్మాణం పూర్తి అయిన మెడికల్ కాలేజీ

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండి ఉంటే

పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయడం కోసం వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో చిత్తశుద్ధితో అడుగులు వేశారు. గత ఏడాది విజయనగరం, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాల కళాశాలల్లో తొలి విడత తనిఖీల్లో ఒక్క విజయనగరానికి మాత్రమే అనుమతులు లభించాయి. రెండో విడత తనిఖీల్లో అనుమతులు రాబట్టడం కోసం చిత్తశుద్ధితో అప్పట్లో ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రస్తుత ప్రభుత్వానికి కూడా పేదల ఆరోగ్యం, విద్యార్థుల ఆకాంక్షల పట్ల చిత్తశుద్ధి ఉండి ఉంటే అదే తరహాలో చర్యలు తీసుకుని ఉండేదని వైద్య వర్గాల్లోనే చర్చ నడుస్తోంది. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే ఐదు వైద్య కళాశాలలకు అనుమతులు రావడం కష్టమేనన్న భావన వ్యక్తమవుతోంది.

చంద్రబాబు రాజకీయ మాయా జూదం

శకుని రాజకీయాలకు మరోసారి తెరతీసిన చంద్రబాబు.. వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుల కొనుగోలుకు కుట్ర

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు తన ట్రేడ్ మార్క్ కుట్ర రాజకీయాలకు తెరతీశారు. మహా భారతంలో శకునిని తలపిస్తూ పక్కా పన్నాగంతో రాజకీయ మాయా జూదానికి బరితెగించారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా రాజ్యసభలో కనిపించకుండాపోయిన పార్టీ పరువు నిలిపేందుకు నిస్సిగ్గుగా అడ్డదారులు తొక్కుతున్నారు. రాష్ట్రంలో రాజకీయాన్ని వ్యాపారం చేసిన తొలి రాజకీయ నేతగా ముద్రపడ్డ చంద్రబాబు, మరోసారి తనదైన శైలిలో రాజకీయ బేరసారాలకు బరితెగించారు. వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యులను కొనుగోలు చేసే కుట్రకు ఉపక్రమించారు. అందుకోసం ఒక్కో రాజ్యసభ సభ్యుడికి రూ.70 కోట్ల వరకు వెదజల్లేందుకు సిద్ధపడుతుండటం గమనార్హం. ఇప్పుడు ఎంపీ పదవికి రాజీనామా చేస్తే.. శాసనసభలో టీడీపీకి ఎమ్మెల్యేల బలం ఉన్నందున వెంటనే రాజ్యసభకు మళ్లీ అవకాశం కల్పిస్తామని ప్రలోభాలకు గురి చేస్తున్నారు.

ఒక్కొక్కరికి రూ.70 కోట్లు

1982లో టీడీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీకి రాజ్యసభలో కనీసం ఒక్క సభ్యుడు కూడా లేకుండా ప్రాతినిథ్యం కరువవ్వడం ఇదే తొలిసారి. మరోవైపు వైఎస్సార్‌సీపీకి రాజ్యసభలో 11 మంది సభ్యుల బలం ఉండటం చంద్రబాబుకు కంటగింపుగా మారింది. రాష్ట్రం నుంచి రాజ్యసభలో ఉన్న 11 స్థానాల్లో కూడా వైఎస్సార్‌సీపీ ఎంపీలే ప్రాతినిథ్యం వహిస్తున్నారు. మరో రెండేళ్ల వరకు రాజ్యసభ ద్వైపాక్షిక ఎన్నికలు కూడా లేవు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఏ బిల్లు ఆమోదించాలన్నా లోక్‌సభతోపాటు రాజ్యసభలో సంఖ్యా బలం అత్యంత కీలకం. ఈ కోణంలోనే వైఎస్సార్‌సీపీ జాతీయ స్థాయిలో రాజకీయంగా ప్రభావశీల పాత్ర పోషించే స్థితిలో ఉంది. ఆ విషయాన్ని అటు అధికార ఎన్‌డీయే కూటమితోపాటు ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికీ తెలుసు. చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో సాగిస్తున్న దురాగతాలకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన ధర్నాకు జాతీయ పార్టీల నుంచి విశేష మద్దతు లభించింది. ఈ పరిణామాలు చంద్రబాబుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దాంతో వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యులను ప్రలోభాలకు గురిచేసి, టీడీపీలో చేర్చుకునేందుకు ఆయన కుట్రలకు తెరతీశారు. కొన్ని రోజులుగా కొందరు వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యులతో తెరచాటు మంతనాలు సాగించేందుకు యత్నిస్తున్నారు. అందుకోసం ఎంత భారీ మొత్తం అయినా వెదజల్లేందుకు సిద్ధమని స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఒక్కో రాజ్యసభ సభ్యుడికి 40 నుంచి రూ.70 కోట్ల వరకు ఇస్తామని ఆఫర్ చేయడం చంద్రబాబు ఎంతకైనా బరితెగిస్తారనడానికి నిదర్శనం. అంతేకాదు 2014–19 నాటి పరిణామాలకు భిన్నంగా ప్రస్తుతం టీడీపీలో చేరిన వెంటనే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయాలని సూచిస్తున్నారు. అనంతరం ఆరు నెలల్లోపు నిర్వహించే ఎన్నికల్లో శాసనసభలో తమకున్న సంఖ్యా బలంతో వారిని మళ్లీ రాజ్యసభ సభ్యులుగా గెలిపిస్తామని మధ్యవర్తుల ద్వారా కబురు పంపుతున్నారు. అందుకోసం చంద్రబాబు ప్రత్యేకంగా కొందర్ని ఎంపిక చేసి, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుల వద్దకు పంపిస్తుండటం గమనార్హం.



బాబు చరిత్రంతా రాజకీయ వ్యాపారమే

వెన్నుపోటు రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ అయిన చంద్రబాబు చరిత్ర సమస్తం రాజకీయ వ్యాపారమేనన్నది బహిరంగ రహస్యం. రాష్ట్ర విభజన అనంతరం 2014లో ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే మరోసారి రాజకీయ కుట్రలు, బేరసారాలకు తెరతీశారు. 2015లో తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుకు కోట్లు కుట్రకు పాల్పడ్డారు. టీడీపీ అభ్యర్థిని గెలిపించేందుకు టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) ఎమ్మెల్యేకు రేవంత్ రెడ్డి ద్వారా బ్యాగులో కోట్ల రూపాయలు పంపించి ఆడియో, వీడియో సాక్ష్యాలతో సహా అడ్డంగా దొరికిపోయారు. ఆ ఉదంతంపై తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేయడంతో చంద్రబాబు హుటాహుటిన హైదరాబాద్ విడిచి పెట్టి, అమరావతికి వచ్చేశారు. టీడీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 67 మంది ఎమ్మెల్యేలతో బలమైన ప్రతిపక్షంగా వైఎస్సార్‌సీపీ శాసనసభ లోపల, బయట చేస్తున్న పోరాటాలతో చంద్రబాబు బెంబేలెత్తారు. దాంతో వైఎస్సార్‌సీపీకి చెందిన ముగ్గురు ఎంపీలతోపాటు ఏకంగా 23 మంది ఎమ్మెల్యేలను సంతలో పశువులను కొన్నట్టు కొనుగోలు చేశారు. వారిలో నలుగురికి మంత్రి పదవులు కూడా ఇచ్చారు. తన రాజకీయ అవసరాల కోసం ఎంతకైనా దిగజారుతానని చంద్రబాబు తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రతి సందర్భంలోనూ నిరూపిస్తూనే ఉన్నారు. తొలిసారి ముఖ్యమంత్రి అయ్యింది కూడా రాజకీయ కుట్రతోనే.

ఏరు దాటాక బోడి మల్లన్నే..

రాజకీయ అవసరాలకు ఉపయోగించుకుని, అవసరం తీరిపోయాక వదిలేయడం చంద్రబాబు నైజం. 1978 నుంచి నేటి వరకు ఆయన రాజకీయ చరిత్ర అంతా అదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఎన్టీ రామారావును 1995లో కుట్ర పూరితంగా పదవి నుంచి తొలగించిన వైస్రాయ్ హోటల్ కుట్రలో సహకరించిన తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, బావమరిది నందమూరి హరికృష్ణలతోపాటు అప్పటి రాజ్యసభ సభ్యుడు మోహన్‌బాబు తదితరులు అందరికీ తర్వాత పొగబెట్టి టీడీపీ నుంచి బయటకు పంపారు. అప్పటి రాజ్యసభ సభ్యురాలు జయప్రద పరిస్థితి కూడా అంతే. చంద్రబాబు పార్టీ నుంచి వెళ్లగొట్టడంతో ఆమె ఏకంగా ఏపీని వదిలి ఉత్తరప్రదేశ్‌కు వలస వెళ్లాల్సి వచ్చింది. 2014–19లో వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన భూమా నాగిరెడ్డి, కిడారి సోమేశ్వరరావుకు మంత్రి పదవులు ఇస్తానని మాట తప్పారు. అదే వేదనతో భూమా నాగిరెడ్డి గుండెపోటుతో మరణించారు. కిడారి సోమేశ్వరరావు మావోయిస్టుల చేతిలో హత్యకు గురయ్యారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యులను చంద్రబాబు ప్రలోభాలకు గురిచేస్తున్న నేపథ్యంలో ఆయన గతంలో మాటిచ్చి, మోసగించిన ఉదంతాలను పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యులు టీడీపీలో చేరి, తమ పదవులకు రాజీనామా చేసిన తర్వాత.. నాలుగైదు నెలలకు మళ్లీ రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఇంతలో చంద్రబాబు రాజకీయ సమీకరణలను మార్చేస్తారని ఆ పార్టీ వర్గాలే చెబుతున్నాయి. 2024 ఎన్నికల్లో జనసేన, బీజేపీ పొత్తు వల్ల టికెట్లు ఇవ్వలేకపోయిన టీడీపీ నేతలు, తనకు ఎన్నికల నిధులు సమకూర్చిన బడా బాబులను తెరపైకి తెచ్చి, కొనుగోలు చేసిన వారిని శాశ్వతంగా వదిలించుకునే వ్యూహం పన్నారు.

క్లుప్తంగా...

ముంబై తరహాలో అమరావతి అభివృద్ధి

మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ



ముంబైలో సీఆర్డీఏ అధికారులతో నారాయణ

సాక్షి, అమరావతి: ఏపీ రాజధానిగా అమరావతిని గొప్ప నగరంగా ప్రభుత్వం తీర్చిదిద్దుతుందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. రాజధాని నిర్మాణంలో 2019కు ముందు ఉన్న మాస్టర్ ప్లాన్ ప్రకారమే ముందుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మంత్రి నారాయణ ఆధ్వర్యంలోని సీఆర్డీఏ అధికారుల బృందం బుధవారం నవీ ముంబైలో పర్యటించి సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (సిడ్కో) అధికారులతో చర్చించింది. మంత్రి మాట్లాడుతూ.. అమరావతి నిర్మాణంలో భాగంగా అభివృద్ధి చెందిన ఆధునిక నగరాలు అనుసరించిన విధానాలను గతంలో ప్రభుత్వం అధ్యయనం చేసిందన్నారు. ఇందులో భాగంగా సిడ్కో ప్రాజెక్ట్‌లను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. మంత్రి వెంట సీఆర్డీఏ కమిషనర్ కె.భాస్కర్, అదనపు కమిషనర్‌లు నవీన్, సూర్య సాయి ప్రవీణ్‌చంద్ ఉన్నారు.

రూ.150కే కిలో కందిపప్పు


మంత్రి నాదెండ్ల



సాక్షి, అమరావతి: బియ్యం, కందిపప్పు, స్టీమ్డ్ బియ్యాన్ని తక్కువ ధరలకు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం తెలిపారు. రైతు బజార్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో కందిపప్పు కిలో రూ.160కు విక్రయిస్తుండగా ఇకపై రూ.150కి, బియ్యం రూ.46కి, స్టీమ్డ్ బియ్యం రూ.47కి అందిస్తామన్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వం నెల వ్యవధిలో బియ్యం, కంది పప్పు ధరలను రెండుసార్లు తగ్గించిందని చెప్పారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించాలి

సీపీఎం కార్యదర్శి శ్రీనివాసరావు



సాక్షి, అమరావతి: విశాఖ స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించి.. ఎన్డీయే ప్రభుత్వం తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సహాయపడతామని చెబుతున్న బీజేపీ పెద్దలు ఆ దిశగా ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మండిపడ్డారు. ఒడిశాలోనూ బీజేపీ ప్రభుత్వమే ఉన్నందున స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించడం ఏమాత్రం సమస్య కాదన్నారు. టీడీపీ, జనసేన ఎంపీ సభ్యుల ద్వారా కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి ఒడిశా ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించేలా చూడాలని ఆయన బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

విమానాలకు బాంబు బెదిరింపు

సాక్షి, చెన్నై: చెన్నై నుంచి ముంబై, గోవా, బెంగళూరు వెళ్లే విమానాల్లో బాంబులు పెట్టినట్లు వచ్చిన బెదిరింపుతో అధికారులు అప్రమత్తమయ్యారు. చెన్నై విమానాశ్రయం కార్యాలయానికి బుధవారం ఈమెయిల్ ద్వారా వచ్చిన బెదిరింపుతో విమానాలను తనిఖీ చేసి అనంతరం టేకాఫ్‌కు అనుమతించారు.

యువతిపై హోంగార్డు అత్యాచారం

ఎస్ఐనని బెదిరించి దారుణం

విజయనగరం క్రైమ్/నెల్లిమర్ల: విజయనగరం జిల్లాలో ఒక హోంగార్డు యువతిపై అత్యాచారం చేశాడు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుర్ల మండలానికి చెందిన యువతి (22), మరో యువకుడు మంగళవారం విజయనగరం మండలం కొండకరకాం వద్ద ఉన్న లేఅవుట్‌లో మాట్లాడుకుంటున్నారు. అక్కడికి ఖాకీ ప్యాంట్ ధరించి మోటారు సైకిల్‌పై వెళ్లిన వ్యక్తి.. ఇక్కడెందుకున్నారని వారిని ప్రశ్నించాడు. తాను ఎస్ఐనని చెప్పి వారి ఫోన్లు లాక్కుని, యువకుడిని బలవంతంగా పంపేశాడు. ఆ యువతిని మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని నెల్లిమర్ల మండలం టొంపలపేట సమీపంలోని చంపావతి నదీతీరం వైపు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాధిత యువతి బుధవారం నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. హోంగార్డుపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాలతో దిశ మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగి ఆధారాలు సేకరించారు. నిందితుడు బొండపల్లి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న నెల్లిమర్ల మండలం చంద్రంపేటకు చెందిన మొయిద సురేష్‌గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. త్వరగా దర్యాప్తు పూర్తిచేసి నిందితుడిపై అభియోగపత్రం దాఖలు చేసి కఠినశిక్ష పడేలా చేస్తామని ఎస్పీ తెలిపారు. నిందితుడు సురేష్‌ను శాశ్వతంగా విధుల నుంచి తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

మునిసిపల్ చైర్‌పర్సన్‌పై హత్యాయత్నం

- ఇంటికి వెళ్లి మరీ టీడీపీ కార్యకర్త దాష్టీకం
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- చెత్త పత్రిక రోత రాతలపై పరువునష్టం దావా



మంగతాయారును పరామర్శిస్తున్న దొరబాబు

పెద్దాపురం: పెద్దాపురం మునిసిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారుపై బుధవారం హత్యాయత్నం జరిగింది. ఆమె భర్త ఇంట్లో లేని సమయంలో టీడీపీ కార్యకర్త సానాది సోములు (లింగం) ఇంటి తలుపులను బద్దలుగొట్టి ఆమెను హత్య చేసేందుకు ప్రయత్నించాడు. లోపల నుంచి ఆమె వెంటనే పెద్దాపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, మునిసిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు ఆరెళ్లి వీర్రాఘవులు, సత్యభాస్కర్, విడదాసరి రాజా, తాటికొండ వెంకటలక్ష్మి ఆమెను పరామర్శించారు. అధికారపక్షం రెచ్చగొడితేనే తనపై హత్యాయత్నం జరిగిందని, తనకు ప్రాణహాని ఉన్నందున రక్షణ కల్పించాలని చైర్‌పర్సన్ పోలీసులను కోరారు.

రోత రాతలను సహించం

అబద్ధాలు, ఆధారాల్లేని ఊహాగానాలతో ఈనాడు పత్రిక పెద్దాపురం కౌన్సిల్ సభ్యులపై తప్పుడు రాతలు రాసిందని మునిసిపల్ కౌన్సిల్ ధ్వజమెత్తింది. కౌన్సిల్ సమావేశం బుధవారం చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఈనాడులో వచ్చిన తప్పుడు రాతలపై కౌన్సిల్ సభ్యులు ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించారని వచ్చిన వార్తలో ఎంతవరకు వాస్తవం ఉందో పత్రిక తేల్చాలన్నారు. పత్రికలో వచ్చిన 410 సర్వే నంబర్ పూర్తి జిరాయితీ అయితే 83 సెంట్ల భూమి రూ.4కోట్లు అంటూ తప్పుడు కథనం ఇవ్వడం సమంజసమా అని ప్రశ్నించారు. ఈ కథనంపై కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. కథనం రాసిన పత్రిక ప్రతినిధి ఓపక్క జర్నలిస్ట్‌గా, మునిసిపాలిటీలో టౌన్ ప్లానింగ్ సర్వేయర్‌గా చలామణి అవుతున్నాడని ధ్వజమెత్తారు.

వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కంటతడి

- తమ కుటుంబ సభ్యుల రేషన్ షాపు తొలగించారని మహిళా కౌన్సిలర్ ఆవేదన
- షాపు అవసరం లేదని బలవంతంగా సంతకం చేయించుకున్న టీడీపీ నేతలు



టీడీపీ ఫ్లోర్ లీడర్ జీవరత్నంనాయుడిని నిలదీస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ రాధ

పుత్తూరు: కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు టార్గెట్‌గా వ్యవహరిస్తున్న టీడీపీ శ్రేణులు రాజకీయ కక్షసాధింపు చర్యల్ని కొనసాగిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడమేగాక వారి ఆధ్వర్యంలో నడుస్తున్న రేషన్ షాపులను తొలగిస్తున్నారు. ఈ క్రమంలోనే తిరుపతి జిల్లా పుత్తూరులో ఐదేళ్లుగా నిజాయితీగా కార్డుదారులకు సరుకులు ఇస్తూ ఎలాంటి ఆరోపణలు లేని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కుటుంబసభ్యులు నిర్వహిస్తున్న రేషన్ దుకాణాన్ని తొలగించారు. దీనిపై బుధవారం 18వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కె.రాధ కౌన్సిల్ సమావేశంలో కంటతడి పెట్టారు. కక్షసాధింపులు తగవని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎ.హరి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ జీవరత్నం నాయుడు మాట్లాడుతూ కౌన్సిలర్లు అందరూ సమానమేనని, అధికారపక్షం, ప్రతిపక్షం అంటూ తేడాలు ఉండకూడదని చెప్పారు. దీనిపై స్పందించిన కౌన్సిలర్ రాధ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చెప్పే మాటలకు, చేసే చేతలకు పొంతన లేకుండా పోయిందని విమర్శించారు. ఇందుకు నిదర్శనం తమ కుటుంబసభ్యులు ఐదేళ్లుగా నిర్వహిస్తున్న రేషన్ షాపును తొలగించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. తన అక్క మంజుల ఐదేళ్లుగా ఎలాంటి ఆరోపణలు లేకుండా రేషన్ షాపు నడుపుతున్నారని తెలిపారు. రెండురోజుల కిందట టీడీపీ నాయకులు కొందరు రాత్రిపూట ఇంటివద్దకు వచ్చి మంజులను బెదిరించి రేషన్ షాపు అవసరం లేదంటూ బలవంతంగా సంతకం చేయించుకున్నారని చెప్పారు. ఇందుకు సంబంధించిన సాక్ష్యాలు సైతం తమవద్ద ఉన్నాయన్నారు. ఇది ఎంతవరకు న్యాయమని నిలదీశారు.

అటవీ భూముల ఆక్రమణకు టీడీపీ నేతల యత్నం



ఆక్రమణకు గురైన భూములను పరిశీలిస్తున్న అధికారులు

చిల్లకూరు: తిరుపతి జిల్లా చిట్టమూరు మండలం ఆరూరు పంచాయతీలోని అటవీ భూముల్ని ఆక్రమించేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. పలువురు నాయకులు అటవీ భూముల్ని చదును చేస్తున్నారు. చిట్టమూరు మండలంలో సర్వే నంబరు 432లో సుమారు 400 ఎకరాల అటవీభూములు ఉన్నాయి. వీటిలో సగం వరకు ఇప్పటికే ఆక్రమణలకు గురికాగా మిగిలిన భూములను ఆక్రమించేందుకు టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. ఆ భూమిని చదును చేసే పనుల్ని స్థానికులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన చెరువు లోతట్టులో కూడా సుమారు 50 ఎకరాల వరకు దున్ని సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఈ విషయాలను స్థానికులు గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై వీఆర్వో శ్రీనివాసులను అడగగా.. భూములు ఆక్రమణలకు గురవుతున్న విషయం వాస్తవమేనన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక ఇస్తామని చెప్పారు.

పోలీసు శాఖలో 'రెడ్‌బుక్' రూల్

96 మంది డీఎస్పీల బదిలీ.. 57 మందికి పోస్టింగులివ్వని ప్రభుత్వం

- డీఎస్పీల బదిలీల్లో కక్ష సాధింపు
- డీజీపీ ఆఫీసులో రిపోర్ట్ చేయాలని వారికి ఆదేశం
- ఇప్పటికే 24 మంది ఐపీఎస్‌లకు పోస్టింగులు ఇవ్వని ప్రభుత్వం
- ప్రభుత్వ వైఖరిపై మండిపడుతున్న పోలీసు వర్గాలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర పోలీసు శాఖలో మంత్రి నారా లోకేశ్ 'రెడ్‌బుక్' రాజ్యమేలుతోంది. కూటమి ప్రభుత్వం పోలీసు అధికారుల బదిలీలను 'రెడ్‌బుక్'ను అనుసరించి కక్షపూరిత వైఖరితోనే చేపడుతోంది. సీఐ నుంచి ఐపీఎస్‌ల వరకు అధికారులపై వేధింపులకు పాల్పడుతోంది. ఇప్పటికే 24 మంది ఐపీఎస్ అధికారులకు ఎక్కడా పోస్టింగులు ఇవ్వకుండా ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణి ప్రదర్శిస్తోంది. దేశంలో ఏ రాష్ట్రంలో ఇంత భారీ స్థాయిలో ఐపీఎస్ అధికారులకు పోస్టింగులు ఇవ్వకుండా పక్కన పెట్టిన సందర్భం లేదు. ఇదే అత్యంత వివాదాస్పద రీతిలో డీఎస్పీలను బదిలీ చేసింది. బుధవారం భారీస్థాయిలో 96 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో ఏకంగా 57 మంది డీఎస్పీలకు ఎక్కడా పోస్టింగ్‌లు ఇవ్వకపోవడం గమనార్హం. వీరందరినీ రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయమని ఆదేశించారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వం కక్ష పూరిత ధోరణికి ఇది మరో నిదర్శనమని స్పష్టమవుతోంది. తుళ్లూరు డీఎస్పీ ఇ. అశోక్ కుమార్ గౌడ్, రాజంపేట డీఎస్పీ చైతన్యను మంగళవారం బదిలీ చేసి రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయమని ప్రభుత్వం ఆదేశించింది. తుళ్లూరు డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్ బుధవారం రిటైర్ అయ్యారు. ఇలా రిటైర్మెంట్‌కు ఒక రోజు ముందు బదిలీ చేయడం, మరో చోట పోస్టింగ్ ఇవ్వకుండా పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించడం నిబంధనలకు విరుద్ధం. అయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ వ్యవహారంపై డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్ డీజీపీ ద్వారకా తిరుమలరావును కలిసి తన అసంతృప్తిని తెలియజేసినట్లు సమాచారం. పోలీసు అధికారుల పట్ల టీడీపీ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు వైఖరిపై పోలీసువర్గాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

జనసేన నేత వేధింపులతో మహిళ బలవన్మరణం

- సాయం చేసిన నగదు వెనక్కివ్వాలని వేధింపులు
- నకరికల్లు మండలం చేజర్లకు చెందిన మహిళ ఆత్మహత్య
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మృతురాలి భర్త



మృతురాలు కృష్ణవేణి

నకరికల్లు: ఆర్థిక సాయం చేసిన సొమ్ము వెనక్కి ఇవ్వాలంటూ జనసేన నాయకురాలు వేధిస్తుండటంతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చేజర్లలో చోటుచేసుకుంది. మృతురాలి భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ కె.నాగేంద్రరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికలకు ముందు చేజర్ల గ్రామానికి చెందిన ఉప్పు కృష్ణవేణి (28) కుమారుడు అనారోగ్యం బారినపడ్డాడు. జనసేన పార్టీ మండల అధ్యక్షురాలు తాడువాయి లక్ష్మి అతడిని పరామర్శించింది. ఈ విషయాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బొర్రా అప్పారావు దృష్టికి తీసుకెళ్లగా.. సుమారు రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. కాగా.. ఎన్నికలలో కృష్ణవేణి కుటుంబం జనసేనకు ఓటు వేయలేదని భావించిన జనసేన నాయకురాలు తాడువాయి లక్ష్మి ఆ సొమ్మును తిరిగి ఇవ్వాలని రెండు నెలలుగా వేధిస్తోంది. తాము ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని, పరిస్థితి కుదుటపడ్డాక చెల్లిస్తామని చెప్పినప్పటికీ ఒత్తిడి ఆపలేదని మృతురాలి భర్త కోటేశ్వరరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 25న తాను ఇంట్లో లేని సమయంలో తాడువాయి లక్ష్మి ఇద్దరు మహిళలను వెంటబెట్టుకుని తమ ఇంటికి వచ్చిందని, తన భార్యను తీవ్ర వేధింపులకు గురి చేసిందని ఫిర్యాదులో ఆమె భర్త వివరించారు. వేధింపులు తాళలేక తీవ్ర మనస్తాపానికి గురైన తన భార్య ఆత్మహత్య చేసుకుందని కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ పేరుతో ఆర్థిక సాయం చేసి.. ఆ డబ్బును తిరిగి ఇవ్వాలంటూ తీవ్ర వేధింపులకు గురి చేసి తన భార్య ఆత్మహత్యకు కారణమైన తాడువాయి లక్ష్మిని కఠినంగా శిక్షించాలని ఫిర్యాదులో కోరారు.

మట్టిపోసి వలంటీర్ ఇంటి దారిమూత



కంకణాలపల్లిలోకుటుంబ సభ్యులతో బ్రహ్మయ్య

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కంకణాలపల్లిలో వలంటీర్ కంటు బ్రహ్మయ్య ఇల్లు తొలగించాలని టీడీపీ నేతలు దౌర్జన్యం చేస్తున్నారు. 20 ట్రాక్టర్ల మట్టిపోసి వలంటీర్ ఇంటికి దారి మూసేశారు. వ్యవసాయ కూలిపనులు చేసుకుంటూ చిన్న టీ హోటల్ నడుపుతూ జీవిస్తున్న బ్రహ్మయ్య 30 సంవత్సరాల నుంచి గ్రామంలో బీసీలకు కేటాయించిన పోరంబోకు స్థలంలో పూరి గుడిసె వేసుకుని ఉంటున్నాడు. బ్రహ్మయ్య వలంటీర్‌గా వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేశాడంటూ కక్షతో అతడి ఇల్లు కూల్చేయాలని టీడీపీ నేతలు కుట్రచేశారు. టీడీపీకి చెందిన పచ్చ సుధీర్, పచ్చ అప్పయ్య, నల్లబోతు కోటయ్య, బొడ్డు లింగయ్య, మరో 20 మంది ఈ నెల 29న బ్రహ్మయ్య ఇంట్లోలేని సమయంలో ఆయన ఇంటికి దారిలేకుండా 20 ట్రాక్టర్ల మట్టిపోశారు. బ్రహ్మయ్య ఇంటిముందు ఎన్టీఆర్ బొమ్మ ఏర్పాటు చేసి అక్కడ అభివృద్ధి చేయాలంటూ ఆ ఇంటిని కూల్చేయాలని ప్రయత్నిస్తున్నారు.

లోకేశ్ అన్ని శాఖలనూ సమీక్షిస్తున్నారు

- బీపీసీఎల్ ఎక్కడ పెట్టాలన్నది ఇంకా నిర్ణయించలేదు
- పారిశ్రామిక సంఘాలతో చర్చించి కొత్త పాలసీలు



సాక్షి, అమరావతి: ఐటీ శాఖ మంత్రి లోకేశ్ కీలకంగా వ్యవహరిస్తూ అన్ని శాఖల పనితీరును సమీక్షిస్తున్నారని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. లోకేశ్ ఏ శాఖనూ వదలడం లేదని, ప్రతి రెండు రోజులకు ఒకసారి తనకు మెసేజ్ చేసి పలానా పరిశ్రమ గురించి ఫాలో చేస్తున్నావా లేదా అని అడుగుతున్నారన్నారు. బుధవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. సచివాలయంలో పరిశ్రమల శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారని చెప్పారు. 15 రోజుల్లో నూతన పారిశ్రామిక విధానాలపై ముసాయిదా రూపొందించాలని ఆదేశించారన్నారు. ముసాయిదాలోని అంశాలపై పారిశ్రామిక సంఘాలతో చర్చించి తుది పాలసీని రూపొందిస్తామన్నారు. ఇప్పటికే ఓర్వకల్లు, కృష్ణపట్నం, ఏపీ బల్క్ డ్రగ్ పార్క్, కొప్పర్తి క్లస్టర్లు ఉన్నాయని.. వీటికి అదనంగా కుప్పం, లేపాక్షి, సత్యసాయి జిల్లా, శ్రీకాకుళం జిల్లా మూలపేట, ప్రకాశం జిల్లాలోని దొనకొండ క్లస్టర్లను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. రూ.75 వేల కోట్ల పెట్టుబడులతో బీపీసీఎల్ రాష్ట్రానికి రాబోతోందని, దానిని ఏ ప్రాంతంలో ఏర్పాటు చేయాలనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదన్నారు. ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై 90 రోజుల్లో సీఎం నిర్ణయం తీసుకుంటాని పేర్కొన్నారు. కృష్ణపట్నంలో బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటుకు విన్ ఫాస్ట్ ముందుకొచ్చిందని చెప్పారు. పారిశ్రామిక రాయితీలు చెల్లించేందుకు ప్రయత్నిస్తామన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి యువరాజ్ పాల్గొన్నారు.

లార్సన్‌ను కలిసిన మంత్రి

రాష్ట్రంలో కంపెనీలు ఏర్పాటు చేసేందుకు సహకరించాలని అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌ను కోరినట్టు టీజీ భరత్ తెలిపారు. విజయవాడలో జెన్నిఫర్ లార్సన్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్టు చెప్పారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆమె సానుకూలంగా స్పందించారన్నారు.

రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా లక్ష్మీనారాయణ

- ఉత్తర్వులు జారీ చేసిన న్యాయశాఖ కార్యదర్శి
- ఏజీపీలుగా మరో 14 మంది నియామకం



సాక్షి, అమరావతి: రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)గా మెండ లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆయన మూడేళ్ల పాటు ఈ పోస్టులో కొనసాగుతారు. ఈ మేరకు న్యాయశాఖ ఇన్‌చార్జి కార్యదర్శి సునీత బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టులో ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరఫున పలు రకాల క్రిమినల్ కేసులను వాదిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును సంప్రదించి న్యాయమూర్తులందరి అభిప్రాయాలు తీసుకున్న తరువాత పీపీ నియామక ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాకుళం జిల్లా, సొంత బొమ్మాళి మండలం, కృష్ణా చంద్రాపురానికి చెందిన లక్ష్మీనారాయణ తెలుగుదేశం పార్టీ న్యాయ విభాగంలో క్రియాశీలకంగా పనిచేశారు. 2014–19 మధ్య కాలంలో ప్రత్యేక సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించారు. తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తి పీపీగా నియమితులైన నేపథ్యంలో, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పదవి జనసేనకు ఇవ్వనున్నారు.

ఏజీపీలుగా మరో 14 మంది నియామకం


హైకోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాదులు (ఏజీపీ)గా మరో 14 మంది నియమితులయ్యారు. న్యాయశాఖ ఇన్‌చార్జి కార్యదర్శి సునీత్ ఉత్తర్వులు జారీ చేశారు. మోర్తా శ్రీనుబాబు, సీహెచ్.శాంసన్, మద్దాల సంధ్య దీప్తి, మేకల అనూష, షహీనా ఖతూన్, రెల్లి సూర్యనారాయణ, కొరిబిల్లి సందీప్, తుంగల రఘుప్రసాద్, ఆర్.ఎస్.మణిధర్ పింగళి, జె.కృష్ణ ప్రణీత్, అరువ రఘురాం, శ్రీనివాస్ పాతూరి, ఎ.వినీత్, కాటా సాంబశివరావు నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వీరు. మూడేళ్ల పాటు పోస్టులో ఉంటారు. ఈ 14 మందితో కలిసి ఇప్పటి వరకు ఏజీపీలుగా నియమితులైన వారి సంఖ్య 28కి చేరుకుంది.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్య



అక్షిత (ఫైల్)

నందిగాం/సాక్షి, అమరావతి: శ్రీకాకుళం జిల్లా నందిగాం మండల కేంద్రంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న లిమ్మక అక్షిత (16) మంగళవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొత్తూరు మండలం పారాపురం సమీపంలోని మహసింగి గ్రామానికి చెందిన లిమ్మక గిరి, శ్రావణి చిన్న కుమార్తె అక్షిత జూలై 24న జరిగిన రెండో విడత కౌన్సెలింగ్‌లో సీటు సాధించి ఇంటర్‌లో చేరింది. మంగళవారం రాత్రి స్టడీ అవర్‌లో చదివి నిద్రపోయింది. బుధవారం వేకువజామున చూసేసరికి కిటికీకి విగత జీవిగా వేలాడుతూ కనిపించింది. నందిగాం ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రులు గురుకులానికి చేరుకుని విలపించారు. కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని, సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై మంత్రి డోలా వీరాంజనేయస్వామి కలెక్టర్, ఎస్పీతో మాట్లాడారు. పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని ఆదేశించారు.



వాస్తవంలో కంటే
ఊహలోనే మనం ఎక్కువగా బాధపడతాం.
– సెనెకా

సాక్షి
గురువారం, 1 ఆగస్టు 2024

ప్రకృతి శాపమా? మన పాపమా?

దేవతల రాజ్యంగా పేరుబడ్డ కేరళలోని సుందరమైన వయనాడ్ ప్రకృతి ఆగ్రహానికి గురై శ్మశాన స్థలిగా మారిన దృశ్యాలు చూస్తుంటే ఎవరికైనా భావోద్వేగం కలగకమానదు. జూలై 29 సోమవారం అర్ధరాత్రి దాటాక రెండు గంటల ప్రాంతంలో అందరూ ఆదమరిచి నిద్రిస్తున్న వేళ భారీ వాన, ఉరుము లేని పిడుగులా వరుసగా భారీయెత్తున కొండచరియలు విరిగి మీద పడడంతో కేరళ ఉత్తర ప్రాంతంలోని ఆ జిల్లా చిగురుటాకులా వణికిపోయింది. కళ్ళుపొడుచుకున్నా కనిపించని చీకటిలో, ఏం జరుగుతోందో తెలిసే లోపల ఇళ్ళు కూలిపోయాయి. నిలువెత్తు బురదలో మునిగి, గ్రామాలు తుడిచి పెట్టుకుపోయాయి. ఘటనాస్థలి నుంచి కొన్ని పదుల కిలోమీటర్ల వరకు మనుషులు కొట్టుకుపోయి, ఛిద్రమైన దేహాలతో శవాలై తేలారు. మృతుల సంఖ్య 150 దాటి అంతకంతకూ పెరుగుతున్న వేళ ఇటీవల కొన్నేళ్ళుగా కేరళలో ఆకస్మిక వరదలు, భూపతనాలు పెరిగిపోవడం పట్ల చర్చ మొదలైంది. ఈ విలయంలో ప్రకృతి శాపమెంత? పాలకుల పాపమెంత?

గమనిస్తే... గత ఏడేళ్ళలో దేశంలో అత్యధికంగా కొండచరియలు విరిగిపడింది కేరళలోనే! 2015 నుంచి 2022 మధ్య దేశవ్యాప్తంగా 3,782 ఘటనలు జరిగితే, వాటిలో 59.2 శాతం ఘటనలు ఒక్క మలయాళ సీమలోనే సంభవించాయి. 1961 – 2016 మధ్యతో పోలిస్తే, ఇప్పుడు ఏటా ఇలాంటి దుర్ఘటనలు, ప్రాణనష్టం అనూహ్యంగా పెరగడానికి అనేక కారణాలున్నాయి. ప్రకృతితో పాటు మనం కూడా దీనికి కారణమేనని నిపుణులు, శాస్త్రవేత్తలు తేల్చారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న మార్పులూ దానికి వచ్చి చేరాయి. వాతావరణ మార్పుల వల్ల కేరళపై కమ్ముకుంటున్న క్యుములోనింబస్ మేఘాలు హఠాత్తుగా భారీ వర్షాలు కురిపిస్తున్నాయి. అసలు కేరళలో దాదాపు సగం... భౌగోళికంగా 20 డిగ్రీలకు మించిన ఏటవాలు భూముల ప్రాంతం. అందువల్ల నేలకోత, కొండచరియలు విరిగిపడడం ఎక్కువే! దానికి తోడు కొండరాళ్ళను పట్టి ఉంచే మట్టి వదులుగా మారి, ముప్పు పెరుగుతోంది. వాలుభూముల్లో భారీగా వానలు వస్తే, పై మట్టి బాగా వదులైపోయి, కొండచరియలు పతనమై ప్రాణాంతకమవుతాయి. వయనాడ్‌లో ఇప్పుడు జరిగింది అదే!


వయనాడ్ జిల్లాలో చిన్న పట్నమైన ముండక్కాయ్ లాంటి వాటి పరిస్థితి మరీ ఘోరం. కొండచరియలు విరిగిపడిన ఘటనల నుంచి గత నాలుగు దశాబ్దాల్లో రెండుసార్లు (1984లో, 2019లో) ప్రాణనష్టం, ఆస్తినష్టంతో బయటపడ్డ ఆ పట్నం తాజా విలయంలో పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. దాన్ని బట్టి తాజా విలయం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. 400 మందికి పైగా మరణానికి కారణమైన 2018 నాటి కేరళ వరదల తర్వాత అత్యంత దురదృష్టకరమైన విపత్తు ఇది. నిజానికి, తుపానులు, అధిక వర్షపాతం, భూకంపం లాంటి ప్రకృతి విపత్తులకు సంబంధించి ప్రమాద హెచ్చరిక వ్యవస్థలు ఎవరికైనా కీలకం. అనేక ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో అందుకు అత్యాధునిక వ్యవస్థలు ఉన్నాయని కేంద్ర సర్కారు చెబుతోంది. అంతెందుకు... అధిక వర్షపాతం గురించి కేరళను అప్రమత్తం చేస్తూ, వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడడానికి వారం రోజుల ముందే జూలై 23న ముందస్తు హెచ్చరిక చేశామంటోంది. కేరళ సర్కార్ మాత్రం ప్రమాద స్థాయి తక్కువైన ఆరెంజ్ ఎలర్ట్ మాత్రమే తమకు అందిందని అంటోంది.

రాజకీయాలు, పరస్పర నిందారోపణలు పక్కనపెడితే... కేరళ సహా పడమటి కనుమలు వ్యాపించిన ప్రాంతమంతటా ఇలాంటి ప్రమాదాలు పొంచివున్నాయని కొన్నేళ్ళుగా నిపుణులు గగ్గోలు పెడుతున్నారు. 2011లోనే కేంద్రం పడమటి కనుమల పరిరక్షణకై పర్యావరణవేత్త మాధవ్ గాడ్గిల్ సారథ్యంలో నిపుణుల కమిటీ వేసింది. అరుదైన జీవజాలానికి ఆవాసమైన దట్టమైన అరణ్యాలున్నందు వల్ల గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, గోవా, కేరళలకు విస్తరించిన పడమటి కనుమల్లో 75 శాతం మేర ప్రాంతాన్ని పర్యావరణరీత్యా సున్నితమైనదిగా ప్రకటించాలని కమిటీ సిఫార్సు చేసింది. గాడ్గిల్ కమిటీ నివేదిక ఇచ్చి 13 ఏళ్ళవుతున్నా కేరళ సహా ప్రభుత్వాలేవీ ఆ సిఫార్సుల్ని పాటించలేదు. అదేమంటే, సిఫార్సులు కఠినంగా ఉన్నాయనీ, అభివృద్ధికీ, జీవనోపాధికీ నష్టం చేస్తాయనీ సాకులు చెబుతున్నాయి. పైగా, అభివృద్ధి రేసులో పడి కొండల్ని తొలిచి, భారీ నిర్మాణాలకు దిగాయి. జలవిద్యుత్ కేంద్రాలు చేపట్టాయి. కేరళలో హోటళ్ళు, టూరిస్ట్ రిసార్ట్‌లు, అక్రమ తవ్వకాలకైతే అంతే లేదు. సున్నిత పర్యావరణ ప్రాంతాల్లోని ఈ తప్పుడు అభివృద్ధి నమూనాను ఇకనైనా మార్చుకోకపోతే కష్టం.

కేరళ, తమిళనాడు, కర్ణాటక – మూడు రాష్ట్రాలకూ కూడలిలో వయనాడ్ అందమైన పర్యాటక ప్రాంతమన్నది నిజమే. దేశదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు అనువుగా వసతులు పెంచి, పర్యాటక ఆర్థిక వ్యవస్థను పెంపొందించాలన్న ఆకాంక్ష సహజమే. కానీ, పర్యావరణ రీత్యా అత్యంత సున్నితమైన ప్రాంతంలో ఇష్టారీతిన నిర్మాణాలు చేపట్టి, యథేచ్ఛగా ప్రకృతి విధ్వంసం సాగిస్తే అది మొదటికే మోసమన్న ఇంగితం లేకుంటే ఎలా? ప్రకృతితో సహజీవనం మరిచి, ఇటు చట్టబద్ధంగానూ, అటు చట్టవిరుద్ధంగానూ గనుల తవ్వకాలను అనుమతిస్తే అన్ని రకాలుగా విలయమే తప్ప వికాసం జరుగుతుందా? మనుషుల భద్రత కన్నా మాయదారి వ్యాపారం ఎక్కువా? అందుకే, ఒక్క మాటలో వయనాడ్ విలయం కేవలం ప్రకృతి సృష్టించినది కాదు. మనుషుల దురాశకు ఫలితం. అభివృద్ధి పేరిట మనం సాగిస్తున్న ప్రకృతి వినాశనం తాలూకు విపరిణామం. మనిషి తన పరిధి, పరిమితి గుర్తెరిగి ప్రవర్తించకపోతే, మనుగడకే ముప్పని చెప్పే నిష్ఠురసత్యం. బాధ్యులైన అందరం ఇకనైనా కళ్ళు తెరవాలి. ప్రకృతి పునరుజ్జీవనానికి ఆగి ఆలోచించాలి. వయనాడ్ నేర్పే పాఠం అదే!

గెలిచినా, ఓడినా చరిత్రే!

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

భారతీయ బ్రాహ్మణ మూలాలున్న కమలాదేవి హ్యారిస్‌కు అమెరికాలో జరిగింది ఒక సామాజిక అద్భుతం అని చెప్పాలి. తండ్రి వైపు నుంచే కాకుండా, తల్లి పోరాటాల రీత్యా కూడా ఆమె నల్లజాతి వారసత్వాన్ని ఎంచుకున్నారు. యవ్వనంలోనూ, ఆ తర్వాతా తెల్లజాతి జాత్యహంకార భావాలకు వ్యతిరేకంగా పోరాడారు. ఆ దేశానికి తొలి నల్లజాతి మహిళా ఉపాధ్యక్షురాలిగా ఇప్పటికే చరిత్ర సృష్టించారు. ఇది కొన్ని దశాబ్దాల క్రితం ఊహించడానికి కూడా వీలు లేని సామాజిక దృగ్విషయం. ఇప్పుడు డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా శ్వేతజాతీయ వాదులతోనూ, మహిళా వ్యతిరేకి అయిన ట్రంప్‌తోనూ ఆమె పోరాడుతారు. గెలిచినా ఓడినా ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది మహిళలకు రోల్ మోడల్‌గా నిలుస్తారు.

'నేను హిందువునెట్లయిత?' అని 1996లో నేను రాసిన పుస్తకంలో, బ్రాహ్మణుడు తనను తాను దళితుడిగా మార్చుకున్నప్పుడే భారతదేశం మార్పు చెందుతుందని చెప్పాను. అలాంటిది జరుగుతుందని ఊహించలేమని కొంత మంది భారతీయ చరిత్ర, సంస్కృతి పండితులు విమర్శించారు. సంస్కృతీకరణ ప్రక్రియలో భాగంగా బ్రాహ్మణుల అన్ని జీవన విధానాలను శూద్రులు, దళితులు అవలంబిస్తారనేది వారి వాదన. మరాఠాలు ఓబీసీ రిజర్వేషన్ పొందడానికి 'కుస్బీ' సర్టిఫికెట్ అడగటం గురించి గానీ, చాలామంది శూద్ర ఓబీసీలు రిజర్వేషన్ కోటా కోసం ఆదివాసీ లేదా దళిత హోదా అడగటం గురించి గానీ వారు ఏం చెబుతారో నాకు తెలీదు. ఉత్తర భారత బనియాలు ఓబీసీ సర్టిఫికెట్లను తీసుకుంటూ రిజర్వేషన్ పొందడం గురించి వాళ్లేమంటారు? దీన్ని సంస్కృతీకరణ అనవచ్చా? నా దృష్టిలో అది దళితీకరణే కానీ సంస్కృతీకరణ కాదు. ఈ రోజుల్లో ఏ కులమైనా బ్రాహ్మణ సర్టిఫికెట్ కోసం అడగడం లేదు. భారతదేశంలో ఇలా జరుగుతుండగా, పాశ్చాత్య దేశాలలోని వలస భారతీయుల్లో ఏం జరుగుతోంది?

భారతీయ బ్రాహ్మణ మూలాలున్న కమలాదేవి హ్యారిస్‌కు అమెరికాలో జరిగింది ఒక సామాజిక అద్భుతం అని చెప్పాలి. ఆమె ఆఫ్రికన్–అమెరికన్ హోదాను పొందింది తన నల్లజాతి తండ్రి కారణంగానే కాదు... ఆమె తల్లి శ్యామల గోపాలన్ హ్యారిస్ తమిళ బ్రాహ్మణ వలసదారు. నల్లజాతి స్త్రీలా కనిపించేవారు. పైగా వివాహానికి ముందు తన జీవితంలో ఎక్కువ భాగం యూసీ బర్కిలీ ప్రాంతంలోని నల్లజాతి పరిసరాల్లో జీవించారు. మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ సాగించిన పౌర హక్కుల ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. డొనాల్డ్ హ్యారిస్‌తో ఆమె వివాహం జరిగిన తర్వాత కలిగిన ఇద్దరు కుమార్తెలు కమల, మాయ నల్లజాతీయుల పరిసరాల్లోనే పెరిగారు. వారు తమ ప్రారంభ జీవితంలో నల్లజాతి ఆధిపత్య పాఠశాలలో చదువుకున్నారు. ఆమె భర్త డొనాల్డ్ హ్యారిస్ జమైకన్ అమెరికన్ ఆర్థికవేత్త. శ్యామలకు విడాకులు ఇచ్చిన తర్వాత ఇప్పుడు జమైకాలో నివసిస్తున్న ఆయన కూడా నవ్యభావాలు కలిగిన వ్యక్తి. ఏమైనప్పటికీ, కమల తన తల్లి వైపు పూర్వీకుల బ్రాహ్మణ గోధుమవర్ణ సంప్రదాయ వారసత్వాన్ని ప్రకటించుకోవచ్చు. లేదా తల్లి, తండ్రి మాదిరిగా నల్లవారి జీవితాలూ విలువైనవే భావనతో కూడిన క్రైస్తవీకరణ ప్రక్రియను అనుసరించవచ్చు. ఆమె నల్లజాతి వారసత్వాన్ని ఎంచుకున్నారు. తన యవ్వనంలోనూ, ఆ తర్వాతా తెల్లజాతి జాత్యహంకార భావాలకు వ్యతిరేకంగా పోరాడారు.

ఆ దేశానికి తొలి నల్లజాతి మహిళా ఉపాధ్యక్షురాలిగా కమల ఇప్పటికే చరిత్ర సృష్టించారు. ఇది కొన్ని దశాబ్దాల క్రితం ఊహించడానికి కూడా వీలు లేని సామాజిక దృగ్విషయం. ఆఫ్రికనీకరణ చెందిన నల్ల–గోధుమ బ్రాహ్మణ మహిళ అయిన కమలా హ్యారిస్,



కమలా హ్యారిస్

డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా శ్వేతజాతీయ వాదులతోనూ, మహిళా వ్యతిరేకి అయిన ట్రంప్‌తోనూ పోరాడుతారు. ఎన్నికల్లో గెలిస్తే అమెరికాకు తొలి మహిళా అధ్యక్షురాలు, తొలి నల్లజాతి మహిళా అధ్యక్షురాలు అవుతారు.

250 ఏళ్ల ప్రజాస్వామ్య చరిత్రలో అధ్యక్షురాలిగా వైట్‌హౌజ్‌లో ప్రవేశించడానికి శ్వేతజాతి లేదా నల్లజాతి మహిళను అమెరికా ఎప్పుడూ అనుమతించలేదు. వైట్‌హౌజ్‌లో నివసించిన మహిళలందరూ వారి అధ్యక్ష భర్తలకు సహాయక పాత్రను పోషించే ప్రథమ మహిళలు (ఫస్ట్ లేడీస్)గా ఉండేవారు. కమల గెలిస్తే తన భర్తను ప్రథమ పురుషుడి (ఫస్ట్ మ్యాన్)గా మార్చిన మహిళ అవుతారు. ఇకపై ఆయన భూమిపై ఉన్న తన అత్యంత శక్తిమంతమైన భార్యామణిని జాగ్రత్తగా చూసుకోవాలి.

బరాక్ ఒబామా మొట్టమొదటి అమెరికన్ నల్లజాతి పురుష అధ్యక్షుడిగా ఎంపికైనప్పుడు, శ్వేతజాతి ఆధిపత్యవాదులు మినహా అందరూ ఆ విజయాన్ని పండుగలా జరుపుకొన్నారు. పైగా ఆయన ఎనిమిదేళ్ల విజయవంతమైన అధ్యక్షుడిగా నిరూపించుకున్నారు. అయినా అది అమెరికా ప్రాథమిక పితృస్వామ్య స్వభావాన్ని మార్చలేదు.

మరొక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, చాలామంది భారతీయ సంతతికి చెందిన పురుషులు, మహిళలు పాశ్చాత్య దేశాలలో అధికారాన్ని చేజిక్కించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. రిషి సునాక్ ఇప్పటికే తనను తాను హిందువునని పదేపదే ప్రకటించుకుంటూ ఏడాదికి పైగా ప్రధానిగా బ్రిటన్‌ను పాలించారు. అయితే, కమల మత విశ్వాసం రీత్యా క్రైస్తవురాలు. ఆమె క్రిస్టియన్ కాకపోతే ఉపాధ్యక్ష పదవి వచ్చేది కాదు, అధ్యక్ష అభ్యర్థిగా అవకాశం కూడా వచ్చేది కాదు. హిందువుగా ఉంటూ వైట్‌హౌజ్‌లోకి వెళ్లాలనుకునేవారు కొందరున్నారు. భారతీయ మూలాలకు చెందిన శాకాహార బ్రాహ్మణుడైన వివేక్ రామస్వామి తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారుగానీ విఫలమయ్యారు. కమలను 'పిల్లలు లేని పిల్లి' అని పిలిచిన రిపబ్లికన్ల ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ భార్య ఉషా చిలుకూరి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బ్రాహ్మణ మూలాలున్న మహిళ. ఆమె తన హిందూ శాకాహార సాంస్కృతిక విలువను బహిరంగంగా ప్రకటించుకున్నారు.

విగ్రహాలను పూజించే సునాక్‌ను ప్రధానిగా అనుమతించిన బ్రిటన్‌లా కాకుండా, భారతదేశ ప్రధానిగా మరే విదేశీ వ్యక్తినీ అనుమతించకూడదనే ఆరెస్సెస్/బీజేపీ నమూనాను అమెరికా కూడా అనుసరించవచ్చు. ఇతర మతవిశ్వాసం గల మరే వ్యక్తినీ అధ్యక్షుడిగా అమెరికా అనుమతించకపోవచ్చు. ఏదేమైనా, కమల వారి ఆధ్యాత్మిక భావాలకు సరిపోతారు.

కమల తన ఆఫ్రికన్–అమెరికన్ ముద్రతో దేశాధ్యక్షురాలైతే, నల్లజాతి అమెరికన్లతో అంతగా సంబంధం లేని భారతీయ ప్రవాసులు విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటారు. సంపన్న భారతీయులు, ముఖ్యంగా మితవాద హిందూ భారతీయులు... ట్రంప్ దాతలుగా, ట్రంప్ ఓటర్లుగా ఉంటున్నారు. ట్రంప్ 2020లో మోదీ బలపరిచిన అభ్యర్థి. బహుశా ఇప్పటికీ ఆరెస్సెస్/బీజేపీ పంథా అదే కావచ్చు. వారు డెమోక్రటిక్ పార్టీని వామపక్ష ఉదారవాద పార్టీగా చూస్తారు. ఉపాధ్యక్షురాలిగా తన అధికారిక హోదాలో కమల భారత్‌ను సందర్శించలేదు.

నలుపు, గోధుమరంగు స్త్రీ–పురుష సంబంధాలను నివారించడానికీ, తెల్లవారితో కలిసి జీవించడానికీ భారతీయ అమెరికన్లు ప్రయత్నిస్తారు. శ్యామలా గోపాలన్, కమలాదేవిలా కాకుండా, వారు శ్వేతజాతీయుల పరిసరాల్లో లేదా వారి సొంత భారతీయ (దక్షిణాసియా కూడా కాదు) పరిసరాల్లో ఉంటూ, స్వచ్ఛమైన శాకాహార పార్టీలతో జీవించడానికి ఇష్టపడతారు. అలాంటి పార్టీలలో మగవాళ్లు సూట్లు ధరిస్తారు, మహిళలు భారతీయ నారీమణుల్లాగా చీరలు కట్టుకుంటారు. కమలా హ్యారిస్ మాత్రం అమెరికన్ వ్యక్తిలా చక్కగా డిజైన్ చేసిన ఫుల్ సూట్లో కనిపిస్తారు. ఆమె దుస్తుల కోడ్ ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శిస్తూ, పురుషునిలాగా ఎలా ఉండాలని అమెరికన్ స్త్రీలు కూడా ఆమె నుండి నేర్చుకునేలా ఉంటుంది. అన్నిటికంటే మించి ఆమె జీవన శైలి సమానత్వంతో కూడుకున్నది.

కమలా హ్యారిస్ అధ్యక్ష రేసులో గెలిచినా, ఓడినా మార్పు దోహదకారులలో ఒకరిగా మారారు. భారతీయ సంతతికి చెందిన మహిళగా ఆమె ఆఫ్రికనీకరణ, మార్పు దోహదకారి పాత్రను నేను ఎంతగానో ఆరాధిస్తున్నాను. ఆమె భవిష్యత్తులోనూ శతాబ్దాల పాటు ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది మహిళలకు రోల్ మోడల్‌గా ఉంటారు. ఆమె గెలిచి తన భర్తను వైట్‌హౌజ్‌లో ప్రథమ పురుషుడి (ఫస్ట్ మ్యాన్)గా చేస్తారని ఆశిస్తున్నాను.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మహా రచయిత



ఇవ్వాళ (జూలై 31) మున్షీ ప్రేమ్‌చంద్ జయంతి. ఈనాటికీ ఎవరూ అందుకోలేని రీతుల్లో ఆయన హిందీ, ఉర్దూ సాహిత్యాలను పునర్నిర్వచించారు. మా తాత ఘన వారసత్వం నన్ను అమితమైన గర్వానికి గురిచేస్తుంటుంది. ఇప్పుడూ, ఎప్పుడూ ఆయన్ని ఉత్సవం చేసుకుందాం.

– ప్రవీర్ రాయ్, రచయిత

వచ్చిందేమిటి?



అక్టోబర్ 7 నాడు ఇజ్రాయెల్ మీద హమాస్ దాడిని ఇస్మాయిల్ హనియే ప్రత్యక్షంగా నవ్వుతూ వీక్షించారు. తర్వాత ఇతర హమాస్ అధికారులతో కలిసి ప్రార్థన చేశారు. ఇప్పుడాయన చచ్చిపోయారు.

– యాసర్ అలీ, కాలమిస్ట్

ఏం చేయాలని?



ఇరాన్ నడిబొడ్డున (హమాస్ నేత) ఇస్మాయిల్ హనియేను హత్య చేసేంత సామర్థ్యం ఇజ్రాయెల్‌కు ఉంది. కానీ లక్ష మందికి పైగా (పాలస్తీనా) పౌరులను చంపకుండా గాజాలోని తన 200 మంది బందీలను మాత్రం కాపాడలేదు.

– సరయు పానీ, కాలమిస్ట్

గందరగోళమే సహజం



క్రమం అనేది ముఖ్యమని మనం తప్పుగా భావిస్తుంటాం. కానీ వాస్తవం ఏమంటే, ప్రపంచం అనేది సాధారణంగా, మానవ జీవితం అనేది నిర్దిష్టంగా అస్తవ్యస్తంగా ఉండేట్లుగానే రూపొందింది. ఏదో ఒక ఘర్షణ లేకపోతే మనుషులు బోరుకొట్టి చచ్చిపోతారు.

– రాంగోపాల్ వర్మ, దర్శకుడు

ఏ విధంగా?



జమైకా ఆఫ్రికాలో లేదు. ఇండియా ఆఫ్రికాలో లేదు. మరి (అమెరికా డెమోక్రాట్ అధ్యక్ష అభ్యర్థి) కమలా హ్యారిస్ ఆఫ్రికన్–అమెరికన్ ఎలా అవుతారు?

– లావెర్న్ స్పైసర్, రిపబ్లికన్ నేత

ఇన్ బాక్స్

నరకాలుగా నగరాలు

ఢిల్లీ నడిబొడ్డున పేరొందిన ఒక కోచింగ్ సెంటర్‌లో వరద నీటిలో మునిగి ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. సివిల్ సర్వీసు పరీక్షలకు మంచి కోచింగ్ సెంటర్‌గా ఆ సంస్థకు దశాబ్దాల చరిత్ర ఉంది. రాజధాని నగరంలో ఉన్న ఆ సెంటరు నిబంధనలకు వ్యతిరేకంగా భవనం బేస్‌మెంట్‌లో లైబ్రరీ నిర్వహిస్తోంది. విద్యార్థులు ముగ్గురూ అందులో చిక్కుకుని మరణించిన వారే. ఎన్నో ఆశలతో, ఎంతో ధనం ఫీజుల రూపంలో వెచ్చించి ఆ సంస్థలో చేరిన విద్యార్థులు, సంస్థ నిర్వాహకుల అత్యాశ, అధికారుల అలసత్వం, అవినీతి, ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల జీవితాల్ని కోల్పోయారు.

బేస్‌మెంట్‌ని పార్కింగు కోసం, లేదా స్టోర్ రూమ్‌గా మాత్రమే వినియోగించాలని ఒక నిబంధన. దాన్ని లైబ్రరీగా మార్చి సొమ్ము చేసుకోవడం ఆ సంస్థ కక్కుర్తి. అలా ప్రాణాపాయం కలిగే అవకాశం ఉన్నా, నిబంధనల్ని అతిక్రమించినా పట్టనట్టు వ్యవహరించడం, లేదా లంచాలు తిని ఉపేక్షించడం నగర పాలక సంస్థ నిర్వాకం. ఆ సెంటరులోకి వరద నీరు ఒక్క ఉదుటున చేరడానికి కారణం యథేచ్ఛగా అక్రమ కట్టడాల్ని అనుమతించడం. డ్రయిన్ వ్యవస్థ పూడుకున్నంత వరకూ వదిలేయడం. అయితే ఈ సమస్య ఆ ఒక్క కోచింగ్ సెంటర్‌కో, ఆ ప్రాంతానికో పరిమితం కాదు. పుట్టగొడుగుల్లా నగరమంతా వ్యాపించిన కోచింగ్ సెంటర్లు, వాణిజ్య సముదాయాలు, అక్రమ కట్టడాలు... ఇలా పట్టణ ప్రణాళికల్ని తుంగలో తొక్కేవి కోకొల్లలు. అలాగే ఢిల్లీ ఒక్కటే ఇలా దయనీయంగా లేదు. దేశంలో ప్రతీ పట్టణమూ ఇలా అఘోరిస్తున్నవే. రాష్ట్రాలకు పెరుగుతున్న ఒత్తిడి మేరకు కేంద్రం నిధులు, మార్గదర్శకాలు ఇవ్వాలి. పట్టణాల అభివృద్ధిని రాష్ట్రాలు దగ్గరగా పర్యవేక్షించాలి. నగర పాలక సంస్థలు సమర్థంగా వ్యవహరించాలి. దురదృష్టవశాత్తూ అలాంటి రోజులు దగ్గరలో కనబడడం లేదు.

– డా॥ డి.వి.జి. శంకరరావు,
పార్వతీపురం మాజీ ఎంపీ, విజయనగరం

అలుపెరుగని అక్షరాయుధుడు

సందర్భం



టి. ఉడయవర్లు

తెలుగు జర్నలిజాన్ని కొత్త పుంతలు తొక్కించిన సృజనాత్మక సంపాదకుడు ఏబీకే ప్రసాద్. పుస్తకాలు చదివే అలవాటు లేని వారంతా ఇతర కారణాలతో సంపాదకులై పోతున్న తరుణంలో ఏబీకే లాంటి నిత్య పఠనాభిలాషి సంపాదకుడు కావడం అరుదు, ఆదర్శం.


వెనకటికి 'నా కలమే ఖడ్గ'మని చెప్పిన కోటంరాజు రామారావు ప్రతిరోజూ రాజీనామా లేఖ తన జేబులో పెట్టుకొని ఉండేవారని చెప్పగా విన్నాము. కానీ ఏబీకే విషయంలో దాన్ని సమకాలీనులంతా స్వయంగా చూశారు. తన భావాలకు చోటు లేనిచోట ఆయన నిమిషమైనా నిలువలేరు. అందుకే 'ఈనాడు' వైజాగ్ ఎడిషన్‌లో ఎడిటర్‌గా తన జీవితాన్ని ప్రారంభించిన ఏబీకే రాష్ట్రంలో ఎడిటర్‌గా పనిచేయని తెలుగు దినపత్రికంటూ దాదాపు లేకుండా పోయింది. నిజానికి తెలుగు పత్రికల సంస్థాపక సంపాదకుడుగా ఆయనకు గొప్ప పేరు వచ్చింది.

'ఈనాడు' తర్వాత 'ఉదయం', 'వార్త', 'ఆంధ్రజ్యోతి' హైదరాబాద్, తిరుపతి ఎడిషన్లు ఏబీకే వెలిగించిన దీపాలే. 'ఆంధ్రభూమి' అసోసియేట్ ఎడిటర్‌గా, 'ఆంధ్రప్రభ' చీఫ్ ఎడిటర్‌గానూ ఆయన పనిచేశారు. ప్రభుత్వ మాస పత్రిక 'ఆంధ్రప్రదేశ్'కు కూడా ఎడిటర్‌గా పనిచేశారాయన. పక్ష పత్రికలు 'సుప్రభాతం', 'మాభూమి'లకు ఎడిటర్‌గా తొలు దొలుత వాటిని తీర్చిదిద్దింది ఆయనే.

1956లో వామపక్ష భావాల పత్రిక 'విశాలాంధ్ర'లో తెలుగు జర్నలిజం రంగంలో ప్రవేశించిన ఏబీకే గత ఏడు దశాబ్దాలుగా ఈ భూప్రపంచంలో జరిగే మానవ సంబంధ పరిణామాలన్నింటిపై స్పందించారు. ఆయన చలించిపోయి అక్షరాకృతి నిచ్చిన 'నిబద్ధాక్షరి' సాహిత్య ప్రియులంతా చదివి తీరవలసిందే. ఏబీకే సంపాదకీయాలు ఇప్పటివరకు పది సంపుటాలుగా వచ్చాయి. ఆయన సంపాదకీయాలు విస్తృత విజ్ఞానానికి, పఠనశీలానికి, నిశిత పరిశీలనాశక్తికి, భావనాపటిమకు, భాషా పాటవానికి, పాఠక మార్గదర్శకత్వానికి ప్రతీకలు. మరీ ముఖ్యంగా తెలుగు పత్రికలలో ఇతర సంపాదకులు స్పృశించని ఆర్థిక సంబంధ అంశాలకు చెందిన అంశాలను తీసుకుని ఎంతో లోతుగా, సమయస్ఫూర్తితో సంపాదకీయాలు రాశారు. ఆర్థిక రంగ నిపుణులకు దిక్సూచి వంటి సేవలందించారు.

పాఠక జనరంజకంగా సంపాదకీయం రాయడంతో పాటుగా పత్రిక మొదటి పేజీని సుందరంగా, సందర్భానుసారంగా తీర్చిదిద్దడం, చద్దివాసన లేకుండా పరిశోధనాత్మక వార్తలు ప్రచురించడం, ఆకర్షణీయమైన శీర్షికలు పెట్టడం, ఆ తర్వాత ఎడిట్ పేజీని చక్కగా రూపొందించడం, ప్రత్యేకంగా వ్యాసాలు రాయడం, ఇతరులతో పలు కొత్త శీర్షికలు రాయించడం – దిన పత్రికను అన్నివిధాలా సమగ్రంగా, అప్పుడే వండి వార్చిన భోజనంలాగా తాజా వార్తల కోసం, వ్యాసాల కోసం నకనకలాడే పాఠక జనానికి వడ్డించడంలో ఏబీకే సిద్ధహస్తులు. అత్యాధునిక భావాలుగల ఏబీకేలో పట్టుదల, సమయస్ఫూర్తి, వేగం ఎక్కువ. జర్నలిజం





ఏబీకే ప్రసాద్

రంగంలో ఆయనతో పాటుగా కలాలు పట్టిన వారంతా కలాలు మూసేశారు. ఏబీకే లాగా ఇప్పటికీ రచనలు చేస్తున్న పాత్రికేయులెవరూ లేరు.

ఇవాళ తెలుగు జర్నలిజం రంగంలో పనిచేస్తున్న వారిలో ఎక్కువమంది ఏబీకే తయారుచేసిన సైన్యమే. ప్రవృత్తిపరంగా ఎవరెలా ఉన్నా, వృత్తిపరంగా చాలామందిని ఆయన చాకుల్లా మార్చారు. ప్రజాభిప్రాయాన్ని మలచడంలో ఏడు దశాబ్దాల అనుభవం గల ఏబీకే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు అధికార భాషా సంఘం అధ్యక్షుడుగా నిరంతర కృషి చేశారు. తెలుగు భాషకు ప్రాచీన ప్రతిపత్తి సాధించడంలో ఆయన పాత్ర ఎంతగానో ఉంది.

ముప్పై శాతం మంది పిల్లలు తమ మాతృభాషకు దూరమైపోతున్న కొద్దీ ఆ భాషను మృత భాషగా పరిగణించవలసి వస్తుందని యునెస్కో నిర్ధారణ చేసిందనీ, సమాచార విశ్వీకరణవల్ల భాషా వైవిధ్యానికి ప్రమాదం ఏర్పడిందనీ కూడా యునెస్కో తీర్మానించిందని ఏబీకే హెచ్చరించారు. ఒక భాష మరొక భాషపై పెత్తనం చలాయించడాన్ని నిరసించాలని యునెస్కో ఇచ్చిన సలహాను తెలుగు ప్రజానీకం ఆహ్వానించాలన్నారు. పాఠశాల విద్యలో తెలుగు బోధనను అయిదవ తరగతి వరకే పరిమితం చేయకుండా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలన్నింట్లో ఎస్.ఎస్.సి. వరకు విధిగా అమలు చేస్తేనే విద్యార్థుల్లో భావప్రకటనకు స్థిరత్వం వస్తుందని ఏబీకే అభిప్రాయం వ్యక్తం చేశారు. జపనీస్, చైనీస్ భాషల అభివృద్ధికి, వాటి వికాసానికి మూలం అంతా మాతృభాషలను మాధ్యమంగా చేసుకున్నందు వల్లనే అన్నారు.

ఈ ఆగస్టు ఒకటో తేదీన తొంభయ్యవ ఏట అడుగిడుతున్న ఏబీకేను వయోధిక పాత్రికేయ సంఘం 'జీవన సాఫల్య పురస్కారం'తో ప్రెస్‌క్లబ్‌లో సత్కరిస్తున్నది. ఏబీకే వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తూ సమగ్రంగా రూపొందించిన 'అలుపెరుగని అక్షరాయుధుడు–ఏబీకే' గ్రంథాన్ని పూర్వ ప్రధాని మీడియా సలహాదారు సంజయ్‌బారు ఆవిష్కరిస్తున్నారు.

ఈ సందర్భంగా యువ పాత్రికేయులకు మీరిచ్చే సందేశమేమిటి? అని ప్రశ్నిస్తే – 'యువ పాత్రికేయులు సమకాలీన సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, సాంకేతిక, శాస్త్రీయ సంబంధమైన ప్రతి పరిణామాన్నీ పరిశీలించాలి. వాటిని అవగాహన చేసుకోవాల'న్నారు. పుస్తక పఠనాన్ని మరవకూడదన్నారు. పాత్రికేయులు వృత్తిరీత్యా తమకు అప్పగించిన పని మీద దృష్టి మొత్తం కేంద్రీకరించాలన్నారు.

అంతేకాదు– 'యువ పాత్రికేయులు తమ వృత్తికి సంబంధంలేని అంశాలలో జోక్యం చేసుకోకూడదు, ధర్మాచరణను వీడకూడదు. ఇందులో సాధకబాధకాలు ఉన్నాయి. అది అందరికీ తెలిసిన విషయమే అయినా, అన్ని అవాంతరాలను తట్టుకుని నిలబడినవాడే ఆదర్శం కాగలడ'ని ఏబీకే ఘంటాపథంగా చెప్పారు.


వ్యాసకర్త సీనియర్ పాత్రికేయుడు । 98856 86415

(నేడు ఏబీకే ప్రసాద్ 90వ జన్మదినం సందర్భంగా హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో 'అలుపెరుగని అక్షరాయుధుడు–ఏబీకే' పుస్తకావిష్కరణ)

కోరికలు – ఆత్మ సాధన

మనస్సు నుండి అనేక కోరికలు జనిస్తూ ఉంటాయి. అటువంటివాటిలో కొన్ని మనం ఏ ప్రయత్నం చేయకుండానే పూర్తి అవుతాయి. అందువలన మనం సంతోషాన్ని పొందుతాం. మరికొన్ని కోరికలు మనం ఎంతగా ప్రయత్నం చేసినా పూర్తి కావు. కోరికలు ఫలించని పరిస్థితిలో రెండు రకాల ప్రశ్నలు మనముందు ఉంటాయి. అవి: ఒకటి 'నా కోరికలు ఏ విధంగా నెరవేరతాయి?' రెండు 'ఏ కోరికలు నెరవేరతాయో అటువంటి కోరికలనే నేను కోరుకోవాలా?' అయితే ఈ రెండూ మన చేతిలో లేవు. మనస్సు వస్తువులతో అంటిపెట్టుకొని ఉండడం వలన కోరికలు జనిస్తాయి. ఇటువంటి కోరికల వల్ల మనకు వస్తువులతో సంబంధం ఉన్నట్లు ఆలోచనలు కలుగుతాయి. ఏదో ఒక కోరిక నెరవేరితే... దానివలన కొంత అనుభవం వస్తుంది. ఒకవేళ కోరిక నెరవేరకపోతే అది ఒత్తిడికి లేక కలవరపాటుకు దారితీస్తుంది. అందువలన వేరొక రకమైన అనుభవం వస్తుంది. కోరికలు నెరవేరినా లేక నెరవేరకున్నా, వాటిని గూర్చి మనస్సులో ఎక్కువ ఆలోచనలు కలుగుతాయి. ఎవరైతే ఇటువంటి పరిస్థితిలో చిక్కుకొంటారో అటువంటివారి విధిని ఊబిలో చిక్కిన మనిషితో పోల్చవచ్చు. ఈ విధంగా చిక్కుకొని ఉన్నప్పుడు పరిష్కారం ఎక్కడ లభిస్తుంది?

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మనస్సును నెమ్మదిగా, క్రమంగా, ఆలోచనారహిత స్థితికి తీసుకొని రావాలి. మనస్సులో ఆలోచనలు పుట్టకపోతే, అసలు ఆలోచనలనేవి ఉండనే ఉండవు. అలాగే కోరికలు కూడా ఉండవు. ఎవరైనా తన మనస్సును విచారించకుండా ఆపగలరా? ఎందుకంటే... ఎల్లప్పుడూ ఆలోచించడం మనస్సు సహజ లక్షణం. కాబట్టి (ఆత్మ) సాధకుడు తన సాధనల ద్వారా... ఆలోచనల వలన కలిగే ఒత్తిడిని దూరం చేసుకోవాలి. ఇందుకోసమై సాధకుడు తన దృష్టిని మళ్ళించకుండా, ఆధ్యాత్మిక లక్ష్యంపైనే మనస్సును కేంద్రీకరింప జేయాలి. దేవుని అనుగ్రహం వలన సాధకుడు కాస్త ముందుగానో లేక ఆలస్యంగానో తన సాధన ఫలితాలను పొందగలుగుతాడు.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.ద్వాదశి సా.4.18 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** మృగశిర ప.12.13 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** రా.8.38 నుండి 10.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.58 నుండి 10.49 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.57 వరకు, **అమృత ఘడియలు:** రా.2.14 నుండి 3.50 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.42, **సూర్యాస్తమయం:** 6.31.

ఫామ్ గేట్ కంపెనీలో ఐటీ శాఖ సోదాలు



గంగవరం/పలమనేరు: చిత్తూరు జిల్లా గంగవరం మండలంలోని గండ్రాజుపల్లి సెజ్ వద్ద ఫామ్ గేట్ మిల్క్ ప్రొడక్ట్స్ కంపెనీలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. న్యూఢిల్లీ నుంచి వచ్చిన పలువురు ఐటీ అధికారులతో కలిసి తిరుపతి ఐటీ (తనిఖీల విభాగం) అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ ఈ సోదాలు చేపట్టారు. న్యూఢిల్లీతో పాటు దేశంలోని 3, 4 చోట్ల ఉన్న ఈ ఉత్పత్తుల కంపెనీల్లో ఏకకాలంలో తనిఖీలు చేసినట్లు సమాచారం. న్యూఢిల్లీలోని కంపెనీలో ట్యాక్స్ ఇన్వాయిస్‌కు సంబంధించి తేడాలు, పన్నుల ఎగవేతపై వచ్చిన సమాచారం ఆధారంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది.

రూ.2 లక్షల విలువైన కర్ణాటక మద్యం స్వాధీనం



కర్నూలు: పోలీసు తనిఖీల్లో భారీగా కర్ణాటక మద్యం పట్టుబడింది. వివరాల్లోకి వెళితే... కర్నూలు జిల్లా కల్లూరు మండలం సంపత్‌నగర్ ఆర్చి వద్ద బుధవారం నాలుగో పట్టణ సీఐ శంకరయ్య ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మహీంద్రా బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా 52 అట్ట పెట్టెల్లో సుమారు రూ.2 లక్షలు విలువ చేసే 4,992 కర్ణాటక మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. అందులో ఉన్న ముగ్గురిని అదుపులో తీసుకుని విచారించగా, కర్ణాటక నుంచి కృష్ణగిరి మండలం టి.గోకులపాడు గ్రామానికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. గోకులపాడు గ్రామానికి చెందిన బోయ పూలజాన్, బోయ అజేయుడు, బోయ అంజిలను అదుపులోకి తీసుకుని విచారించగా గ్రామంలో బెల్టు షాపుల ద్వారా విక్రయాలు జరిపేందుకు తీసుకెళ్తున్నట్లు అంగీకరించారు. బొలెరో వాహనంతో పాటు మద్యం, ఒక హోండా షైన్ మోటార్ సైకిల్ సీజ్ చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు.

సెప్టెంబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా పశుగణన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వి.పి.సింగ్

మహారాణిపేట(విశాఖ దక్షిణ): దేశంలో రైతుల ఆదాయం రెట్టింపు చేసేలా పశు సంవర్థక శాఖలో ప్రణాళికాబద్ధమైన మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కేంద్ర పశు సంవర్థక శాఖ డైరెక్టర్ వి.పి.సింగ్ తెలిపారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి దేశవ్యాప్తంగా నాలుగు నెలల పాటు 21వ పశుగణన ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రాంతీయ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం విశాఖలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. సింగ్ మాట్లాడుతూ.. దేశంలో 6.6 లక్షల గ్రామాల్లో 30 కోట్ల పశు పెంపకందార్ల నుంచి సమాచార సేకరణ చేయబోతున్నామన్నారు. కేంద్ర పశు సంవర్థక శాఖ కార్యదర్శి అల్కా ఉపాధ్యాయ మాట్లాడుతూ.. ఒక దేశం గొప్పతనాన్ని అక్కడ జంతువులను చూసే విధానం ద్వారా అంచనా వేయవచ్చన్నారు. భారత ప్రభుత్వ పశుగణాంకాల విభాగం సలహాదారుడు హెచ్.జగత్, ఆంధ్రప్రదేశ్ పశు సంవర్థక, పాడి పరిశ్రమ శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ ,పశు సంవర్థక శాఖ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఒంగోలు జాతి పశువులు, నెల్లూరు జాతి గొర్రెలు వంటి పశు సంపదలో ఏపీ గొప్పతనాన్ని కొనియాడారు. 2022–23లో జీడీపీ సాధించడంలో పశు సంపద ముఖ్య పాత్ర పోషించిందన్నారు.

కేజీబీవీలో ఇంటర్ బాలిక ప్రసవం



కొత్తపట్నం: ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం మోటుమాలలోని కస్తూర్బా బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థిని బుధవారం మగశిశువును ప్రసవించింది. తెలంగాణ రాష్ట్రం భద్రాచలానికి చెందిన వారు ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం మర్రిచెట్లపాలెం వద్ద నివాసం ఉంటున్నారు. వారి కుమార్తె కొత్తపట్నం మండలం మోటుమాల కేజీబీవీలో ఇంటర్మీడియట్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. జూన్ 19వ తేదీన కేజీబీవీలో చేరి 26వ తేదీ వరకు ఉండి ఇంటికి వెళ్లింది. మళ్లీ జూలై 11వ తేదీ కేజీబీవీకి వెళ్లింది. బుధవారం ఉదయం బాత్‌రూమ్‌కి వెళ్లిన విద్యార్థిని ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో సిబ్బంది, ప్రిన్సిపాల్ అరుణ కుమారి పక్కగదిలో కుర్చీపైకి ఎక్కి చూశారు. బాలిక ప్రసవించిన మగశిశువు మృతిచెంది ఉండటం గమనించారు. ఈ విషయాన్ని సమగ్రశిక్ష జీసీడీవో దృష్టికి తీసుకెళ్లారు. జీసీడీవో సమాచారంతో డీఈవో.. కలెక్టర్ తమీమ్ అన్సారియాకు తెలిపారు. స్పందించిన కలెక్టర్ జెడ్పీ సీఈవో, ఐసీడీఎస్ పీడీగా విధులు నిర్వర్తిస్తున్న మాధురిని నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో కదిలిన జిల్లా యంత్రాంగం కేజీబీవీకి చేరుకుంది. పరిస్థితులను గమనించి బాలికను కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. రెండో పట్టణ సీఐ జగదీష్, కొత్తపట్నం ఎస్ఐ సాంబశివరావు బాలికను ప్రాథమికంగా విచారించారు. తన గర్భానికి చీమకుర్తి మండలం మర్రిచెట్లపాలెం వద్ద నివసిస్తున్న ముగ్గురు వ్యక్తులు కారణమని బాలిక ప్రాథమిక విచారణలో తెలిపినట్లు సమాచారం. తాను ఒక వ్యక్తితో మాట్లాడుతుండగా చూసిన అదే గ్రామస్తుడు బెదిరించి లొంగదీసుకున్నాడని చెప్పినట్లు తెలిసింది. మరో వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రూ.10 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

- ఎనిమిది మంది నిందితుల అరెస్టు
- ప్రకాశం జిల్లా మూలగుంటపాడు వద్ద ఘటన



సింగరాయకొండ: గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10 లక్షల విలువైన 40 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఈ కేసు వివరాలను ఒంగోలు డీఎస్పీ ఎం.కిషోర్‌బాబు బుధవారం వెల్లడించారు. ఆయన మాటల్లో... కర్నూలు జిల్లా డోన్ మండలానికి చెందిన కోల వినోద్‌కుమార్, నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం రాంపల్లి గ్రామానికి చెందిన గోగుల రాజశేఖర్, తమిళనాడు రాష్ట్రం తిరునామలై మండలం అల్లినగర్ గ్రామానికి చెందిన అర్జున్ జెమిని వైజాగ్‌కు చెందిన దినేష్ వద్ద 40 కేజీల గంజాయి కొనుగోలు చేశారు. ఒంగోలులోని భరత్‌కాలనీలో నివసిస్తున్న షేక్ అజారుద్దీన్, షేక్ అబ్దుల్ సమీర్, నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలానికి చెందిన మూరం వంశీ, గోపిరెడ్డి మహేష్, మాచునూరి మదన్‌లకు మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని పోలేరమ్మ గుడి వద్ద విక్రయిస్తుండగా డీఎస్పీ కిషోర్‌బాబు పర్యవేక్షణలో సీఐ దాచేపల్లి రంగనాథ్, వారి సిబ్బంది వీరిని పట్టుకున్నారు.

వీర బొబ్బిలి కోటలో.. వీణ బొబ్బిలి పాట



వీణ తయారీలో నిమగ్నమైన కళాకారుడు

మూడొందల ఏళ్లుగా సంగీతాన్ని పలికిస్తున్న బొబ్బిలి వీణలు

- అంతర్జాతీయంగా భౌగోళిక గుర్తింపు దక్కించుకున్న విపంచి
- అమెరికా మాజీ ప్రధాని బిల్‌క్లింటన్ మెచ్చిన వీణ కూడా ఇదే
- తాజాగా అంబానీ ఇంట వివాహ వేడుకల్లో మెరిసిన వీణ



బొబ్బిలి వీణ



సాక్షి, అమరావతి: తెలుగునాట వీణ అంటే అంతా బొబ్బిలి వైపే చూస్తారు. అక్కడ తయారయ్యే వీణల ప్రత్యేకత అలాంటిది మరి. వీణ ధ్వని, స్పష్టత ఎక్కువగా ఉండేలా తీగలు నిర్మించడం వల్ల బొబ్బిలి వీణలు ప్రత్యేక గుర్తింపు పొందాయి. తంజావూరు లాంటి సంప్రదాయ వీణల తయారీకి మూడు రకాల చెక్కలు వినియోగిస్తే.. బొబ్బిలి వీణలను పనస చెక్కలతో రూపొందించడం మరో ప్రత్యేకత. ఇవన్నీ కలగలిపి బొబ్బిలి వీణలకు అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టాయి. తాజాగా ప్రముఖ వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వివాహ మహోత్సవంలో తెలుగు వీణాగానం అలరించింది. వీణా విద్వాంసురాలు శ్రీవాణికి దక్కిన అరుదైన గౌరవంతో మరోసారి దేశవ్యాప్తంగా బొబ్బిలి వీణపై చర్చ మొదలైంది.

ఇదీ ప్రస్థానం..

17వ శతాబ్దంలో బొబ్బిలి రాజ్య వ్యవస్థాపకుడైన పెద్దరాయుడికి కళలపై ఉన్న మక్కువ బొబ్బిలిలో వీణల తయారీకి బీజం వేసిందని చెబుతారు. తన సంస్థానంలో సిద్ధహస్తులైన ఇద్దరు వడ్రంగులను మైసూరు పంపించి.. అక్కడి వీణల తయారీ నేర్చుకోవాలని పెద్దరాయుడు సూచించారు. ఆయన సూచనలతో అక్కడికి వెళ్లి వచ్చిన వారితో బొబ్బిలి వీణల తయారీ మొదలైంది. నాటి మైసూరు సంస్థానంలోని తంజావూరులో ఈ వీణల తయారీ గురించి తెలుసుకున్న సర్వసిద్ధి అచ్చెన్న బొబ్బిలి తిరిగి వచ్చాక ఇక్కడ తయారుచేసిన వీణలు మంచి ఆదరణ పొందాయి. ఆ వీణల వాయిద్యం నేర్చుకుని బొబ్బిలి రాజులు ఎంతో మురిసిపోయినట్టు చెబుతారు. ఆ తర్వాత విజయనగర ఆస్థానం సహా అనేక మంది రాజులు కూడా బొబ్బిలి వీణల కొనుగోలుకు సిద్ధం కావడంతో ఆదరణ పెరిగింది. క్రమంగా బొబ్బిలి వీణలకు దేశవ్యాప్త గుర్తింపు వచ్చింది. ఈమని శంకర శాస్త్రి వంటి ఎందరో వైణిక విద్వాంసులు బొబ్బిలి వీణలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. వీణావాదన సంగీత ద్వయం వాసా కృష్ణమూర్తి, వాసా సాంబమూర్తి 1850 ప్రాంతంలో బొబ్బిలి వీణలపైనే వాయించడం ద్వారా వాటికి వన్నెతెచ్చారు.

ఇప్పటికీ 40 మంది తయారీదారులు

విజయనగరం జిల్లా బొబ్బిలిలోని గొల్లపల్లి వీణల కేంద్రంలో సర్వసిద్ధి వర్గానికి చెందిన దాదాపు 40 మంది కళాకారులు వీణలను తయారు చేస్తున్నారు. ఇక్కడి నుంచి తిరుమల తిరుపతి దేవస్థానంతో పాటు పలు పుణ్యక్షేత్రాలకు వందల సంఖ్యలో వీణలు సరఫరా అవుతుంటాయి. లేపాక్షి సంస్థ వీణలు కొనుగోలు చేసి పర్యాటక కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి విక్రయిస్తోంది. దాదాపు 14 రకాల ఆకారాలతో గిఫ్ట్ వీణలను కూడా ఇక్కడ తయారు చేస్తున్నారు. నూజివీడులోనూ వీణలు తయారు చేస్తున్నారు. 120 ఏళ్లుగా వంశపారం పర్యంగా నూజివీడు వీణ ఆదరణ పొందుతోంది. అధికారిక పర్యటనలకు వచ్చే ఉన్నతాధికారులు, ప్రముఖులకు, కళాకారులకు, ప్రజా ప్రతినిధులకు జ్ఞాపికగా ఇచ్చేందుకు వీణను వినియోగిస్తున్నారు. అలా 2000 సంవత్సరంలో మన రాష్ట్రానికి వచ్చిన అప్పటి అమెరికా ప్రధాని బిల్ క్లింటన్ బొబ్బిలి వీణల తయారీ గురించి తెలుసుకుని అచ్చెరువొందారు. వీణల తయారీలో ఉత్తమ వృత్తి కళాకారునిగా రాష్ట్రపతి అవార్డు అందుకున్న సర్వసిద్ధి వీరన్నను వైట్‌హౌస్‌కు రావలసిందిగా ఆహ్వానించారు. ఎంతో చరిత్ర కలిగిన బొబ్బిలి వీణకు 1980లో జాతీయ అవార్డు లభించగా.. 2011లో జియోగ్రాఫికల్ గుర్తింపు లభించింది.

ఎన్నో ప్రత్యేకతల సమాహారం

వీణ ప్రముఖంగా కర్ణాటక సంగీత కచేరీలలో వినియోగిస్తారు. దీనిని ఉత్తరాదిన రుద్రవీణగా.. దక్షిణాదిలో సరస్వతీ వీణగా.. మధ్య భారతంలో విచిత్ర వీణగా పిలుచుకుంటారు. వీణలో ముఖ్యంగా కుండ, దండి, యాళి (పౌరాణిక జంతువు మెడ ఆకారం), సొరకాయ బుర్ర అనే భాగాలుంటాయి. వీణల్లో చాలా రకాలు ఉన్నాయి. మన రాష్ట్రంలో తయారమ్యే సరస్వతి వీణ, మయూరీ వీణ, మీరా వీణ, డ్రాగన్ వీణ, విపంచి వీణ, శంఖం వీణ, గోటు వీణ, మధుర వీణ, మత్స్య వీణ ప్రసిద్ధి చెందాయి. పనస చెట్టు కర్ర వీణసారె వీణ తయారీలో ప్రధానమైన భాగం. ఇది తేలికగా ఉండటమే కాకుండా మంచి ధ్వని పలికిస్తుంది. దృఢత్వం, మన్నిక, తేమని తట్టుకోగలగడం వల్ల దీన్ని విరివిగా వాడతారు. మైసూరు, తంజావూరు వీణలను మూడు కొయ్య ముక్కలను కలిపి తయారు చేసేవారు. కానీ మన రాష్ట్రంలో మాత్రం ఏకాండీ కొయ్య ముక్క (ఒకే చెక్క ప్రత్యామ్నాయ బొబ్బిలి వీణ ముక్క) తోనే వీణను తయారు చేస్తారు.

గిట్టుబాటు కావడం లేదు



ప్రస్తుత వీణల ధరలు గిట్టుబాటు కావడం లేదు. కలప, ఇతర ముడి సరుకుల ధరలు బాగా పెరిగాయి. వీణల ధరలు పెంచేందుకు హస్తకళల అభివృద్ధి కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం. అక్కడి నుంచి అనుమతులు వస్తే పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.
– ఎస్.రామకృష్ణ, బొబ్బిలి వీణల కేంద్రం ఇన్‌చార్జి

కలప కొరత వేధిస్తోంది

వీణల తయారీకి వాడే పనస కలపకు గిరాకీ ఎక్కువగా ఉంది. పనస కలప అయితేనే వీణలు నచ్చిన ఆకృతుల్లో తయారు చేసేందుకు అనువుగా ఉంటాయి. మా కళాకారులందరికీ ప్రభుత్వం కలపను సబ్సిడీపై సరఫరా చేయాలి.
– పెదపాటి కిరణ్, వీణల తయారీదారు

ఏడాదంతా పని దొరుకుతోంది

వీణల కేంద్రంలో మాకు గౌరవప్రదమైన పని ఏడాది పొడవునా దొరుకుతోంది. విశ్వవ్యాప్తమైన బొబ్బిలి వీణల కళాకారులుగా మంచి పేరు పొందడం ఆనందంగా ఉంది.
– సర్వసిద్ధి చైతన్య, వీణల తయారీదారు

ధాన్యం బకాయిలు చెల్లించాలని రైతుల ధర్నా



భీమవరం: ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ సార్వా నాట్లు పూర్తవుతున్నా దాళ్వా పంట డబ్బులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఇది రైతులపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. జిల్లాలో 30 వేల మందికి రూ.450 కోట్ల వరకు ధాన్యం సొమ్ములు ఇవాల్సి ఉందన్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. ఒక సీనియర్ అధికారి మాట్లాడుతూ తమకు సంబంధం లేదని.. వెళ్లి ముఖ్యమంత్రి దగ్గరో.. ఉప ముఖ్యమంత్రి దగ్గరో ధర్నా చేయండి అనటంతో రైతులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పౌరసరఫరాల శాఖ జిల్లా డిప్యూటీ మేనేజర్ దుర్గారావు ఈ సమస్యను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆర్థిక నిర్వహణ అధికారి నాగ సుధారాణి దృష్టికి తీసుకెళ్లారు. ఆగస్టు 5వ తేదీలోపు జిల్లా రైతులకు ధాన్యం డబ్బులు చెల్లిస్తామని ఆమె హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ప్రకృతి సాగుతోనే నాణ్యమైన దిగుబడులు

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్



సాక్షి, అమరావతి: మారుతున్న వాతావరణ పరిస్థితుల కనుగుణంగా నాణ్యమైన లాభసాటి దిగుబడులను సాధించేందుకు ప్రకృతి వ్యవసాయ విధానం శ్రేయస్కరమని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్ స్పష్టం చేశారు. మంగళగిరిలోని వ్యవసాయ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దశాబ్ద కాలంగా పురుగుమందుల వాడకాన్ని తగ్గిస్తూ నాణ్యమైన పంట ఉత్పత్తులద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సంస్థ కృషి చేస్తున్నదని తెలిపారు. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం (జెడ్‌బీఎన్ఎఫ్) నేడు ఆంధ్రప్రదేశ్ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీ సీఎన్ఎఫ్)గా రూపాంతరం చెంది ఇటు రైతుల్లోనూ.. అటు ప్రజల్లోనూ నమ్మకం, ఆర్థిక భరోసా కల్పించిందన్నారు ప్రకృతి వ్యవసాయంలో రాష్ట్రం దేశానికే చాంపియన్‌గా నిలిచిందని చెప్పారు. ప్రపంచ దేశాలు సైతం ఏపీ మోడల్‌ను అనుసరించేందుకు పోటీ పడుతున్నాయన్నారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానమే వ్యవసాయ రంగానికి భవిష్యత్ అన్నారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఫార్మర్ సైంటిస్ట్ కోర్సులో రెండు సెమిస్టర్స్ పూర్తి చేసుకుని మూడో సెమిస్టర్‌కు వచ్చిన విద్యార్థులతో ముచ్చటించారు. వ్యవసాయ శాఖ స్పెషల్‌సీఎస్ బుడిత రాజశేఖర్, ఉద్యాన, మార్కెటింగ్ డైరెక్టర్లు కే శ్రీనివాసులు, ఎం.విజయసునీత, మార్క్‌ఫెడ్, ఏపీ సీడ్స్ ఎండీలు డాక్టర్ మనజీర్ జిలాని సమూన్, శివప్రసాద్, రైతు సాధికార సంస్థ సీఈఓ బీ రామారావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శామ్యూల్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలోని ఆక్సిలెంట్ ఫార్మాకు 'ఎఫ్‌డీఏ' సర్టిఫికెట్



శ్రీసిటీలోని ఆక్సిలెంట్ ఫార్మా పరిశ్రమ

శ్రీసిటీ/సత్యవేడు (తిరుపతి జిల్లా): యునైటెడ్ స్టేట్స్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యూఎస్ ఎఫ్ డీఏ) నుంచి తొలి ఎస్టాబ్లిష్‌మెంట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్ (ఈఐఆర్)ను శ్రీసిటీలోని ఆక్సిలెంట్ ఫార్మా సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ పొందింది. ఈ సర్టిఫికెట్ అందించే సంస్థ ఈ ఏడాది జూన్ 17–21 మధ్య పరిశ్రమను సందర్శించి నాణ్యత తనిఖీలు చేపట్టింది. ఆక్సిలెంట్ ఫార్మా సహ వ్యవస్థాపకుడు, చైర్మన్ జితేష్ దేవేంద్ర మాట్లాడుతూ..ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు తమ సంస్థకు మరింత విలువను జోడిస్తుందని చెప్పారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- కార్యకర్తలు, ప్రజలు, నేతలు, అభిమానులతో మమేకం



తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో అవ్వాతాతల్ని ఆప్యాయంగా పలకరిస్తున్న వైఎస్ జగన్


సాక్షి, అమరావతి: ఎవరూ అధైర్యపడవద్దు.. అన్ని విషయాల్లో చివరి వరకు అండగా ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారు. తాడేపల్లిలోని తన క్యాంపు ఆఫీస్‌లో బుధవారం కార్యకర్తలు, ప్రజలు, నేతలు, అభిమానులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా జగన్.. అందరినీ పలకరించి వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడొద్దని, పార్టీ అండగా ఉంటుందని, అందరం కలిసి కట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని వివరించారు. రానున్న కాలంలో ప్రతి కార్యకర్తకు తనతో పాటు వైఎస్సార్‌సీపీ తోడుగా ఉంటుందని వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు.



ఇటీవల ఐపీఎస్‌కు ఎంపికైన శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు కుమారుడు చిట్టిరాజును అభినందిస్తున్న వైఎస్ జగన్

హత్యాయత్నం కేసుపై నిజ నిర్ధారణ కమిటీ

బెజవాడ బార్ అసోసియేషన్ కార్యదర్శి శివరామప్రసాద్



విజయవాడస్పోర్ట్స్: బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) న్యాయవాది ఒగ్గు గవాస్కర్‌పై మంగళగిరి రూరల్ పోలీసులు నమోదు చేసిన హత్యాయత్నం కేసులో వాస్తవాలు వెల్లడి చేసేందుకు నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసినట్లు బీబీఏ కార్యదర్శి అరిగెల శివరామప్రసాద్(రాజా) తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంపై 2021లో జరిగిన దాడిలో న్యాయవాది గవాస్కర్ పాత్ర ఉందంటూ ఇటీవల మంగళగిరి పోలీసులు ఆయనపై క్రైం నంబర్ 650/2021లో 307(హత్యాయత్నం) కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సదరు ఘర్షణలో తాను పాల్గొనలేదని, పోలీసులు అక్రమంగా తనపై కేసు బనాయించారంటూ గవాస్కర్ ఇటీవల బీబీఏకు విన్నవించుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసుపై వాస్తవాలు వెలికి తీసేందుకు 14 మంది బార్ సభ్యులతో కూడిన నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కమిటీకి కన్వీనర్‌గా సోము కృష్ణమూర్తి, కో కన్వీనర్‌గా ఎస్.దుర్గాశ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారన్నారు.

'శ్రీవారి' ప్రధాన అర్చకుడిగా కొనసాగించేలా ఆదేశాలివ్వండి

హైకోర్టులో ఎ.వి.రమణదీక్షితులు పిటిషన్



సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడి బాధ్యతల నుంచి తనను తప్పిస్తూ ఈ ఏడాది మార్చి 2న టీటీడీ ఈవో జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాలు చేస్తూ డాక్టర్ ఎ.వి.రమణదీక్షితులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై విచారించిన హైకోర్టు.. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శిని, టీటీడీ ఈవోని ఆదేశించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. అంతకుముందు రమణదీక్షితులు న్యాయవాది శీతిరాజు శ్యాంసుందర్ వాదనలు వినిపిస్తూ.. శ్రీవారి ఆలయం ప్రధాన అర్చకుడి బాధ్యతల నుంచి పిటిషనర్‌ను టీటీడీ ఈవో ఏకపక్షంగా తొలగించారని చెప్పారు. ముందస్తు నోటీసు కూడా ఇవ్వలేదని, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ధార్మిక, హిందూమత సంస్థలు, ధర్మాదాయ చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఈవో ప్రొసీడింగ్స్ జారీచేశారని చెప్పారు. అందువల్ల ఈ ప్రొసీడింగ్స్‌ను రద్దుచేసి, పిటిషనర్ రమణదీక్షితుల్ని ప్రధాన అర్చకుడిగా కొనసాగించేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి ప్రతివాదులు దేవదాయముఖ్య కార్యదర్శి, టీటీడీ ఈవోలను కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు.

ఏపీలో వారసత్వ సంపదను సందర్శించండి

వరల్డ్ హెరిటేజ్ డైరెక్టర్‌కు అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆహ్వానం



సాక్షి, అమరావతి: ప్రపంచం మెచ్చే చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపదలకు ఆంధ్రప్రదేశ్ నిలయమని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ జాస్తి వీరాంజనేయులు తెలిపారు. ఢిల్లీలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న యునెస్కో వరల్డ్ హెరిటేజ్ కమిటీ 46వ సమావేశంలో బుధవారం ఆయన వరల్డ్ హెరిటేజ్ డైరెక్టర్ (యునెస్కో పారిస్) లాజరే ఎలౌండొ అస్సోమోని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏపీలోని వారసత్వ సంపదను, నూతన రాజధాని అమరావతిని సందర్శించాలని ఆహ్వానించగా అస్సోమో సానుకూలంగా స్పందించారు. అనంతరం అస్సోమోను స్వామివారి శేష వస్త్రంతో సన్మానించారు.

100 రోజుల్లో 5 నూతన పారిశ్రామిక పాలసీలు

- కొత్తగా 4 పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటు అంశాన్ని పరిశీలించండి
- పరిశ్రమల శాఖపై సమీక్షలో సీఎం

అమరావతి/మడకశిర: రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు అనువైన వాతావరణం కల్పించేలా ఐదు నూతన పారిశ్రామిక విధానాలను 100 రోజుల్లోగా అందుబాటులోకి తేవాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. నూతన పారిశ్రామిక విధానంతో పాటు ఎంఎస్ఎంఈ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ, ఎలక్ట్రానిక్, ఐటీ అండ్ క్లౌడ్ పాలసీ, టెక్స్ టైల్ పాలసీలు తేవాలని సూచించారు. సచివాలయంలో బుధవారం పరిశ్రమల శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా చేయాలన్న లక్ష్యంతో పాలసీలు రూపొందించాలని సూచించారు. కుప్పం, మూలపేట, చిలమత్తూరు, దొనకొండ లేదా పాముూరులో కొత్త పారిశ్రామిక క్లస్టర్స్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఎలక్ట్రానిక్స్, ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్, హార్డ్ వేర్ సంస్థల ఏర్పాటుకు కృషి చేయాలని చెప్పారు. కృష్ణపట్నం, నక్కపల్లి, ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్స్ పనితీరుతో పాటు నక్కపల్లిలో రూ.11,542 కోట్లతో ఏర్పాటు చేసే బల్క్ డ్రగ్ పార్క్, రూ.60 వేల కోట్లతో ఏర్పాటయ్యే ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్, ప్రస్తుతం చర్చలు జరుపుతున్న బీపీసీఎల్ ప్రాజెక్టుల స్థితిగతులపై సీఎం సమీక్షించారు.

ప్రోత్సాహకాల అంశాన్ని పరిశీలిస్తాం..

2014–19 హయాంలో పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందాలు చేసుకుని వెనక్కి వెళ్లిపోయిన పారిశ్రామికవేత్తలతో తిరిగి సంప్రదింపులు జరపాలని, అవసరమైతే తానే వారితో మాట్లాడతానని సీఎం చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో పనులు ప్రారంభించిన ప్రాజెక్టులను వేగవంతం చేయడం ద్వారా ఏడాదిలో లక్ష కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ప్రాజెక్టులు పూర్తి చేసి 1,36,260 మందికి ఉపాధి కల్పించాలన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా మల్లవల్లి పారిశ్రామిక వాడలో భూముల రేట్లు తగ్గించే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

నేడు సత్యసాయి జిల్లాకు చంద్రబాబు

సీఎం చంద్రబాబు గురువారం శ్రీసత్యసాయి జిల్లాలో పర్యటించనున్నారు. మడకశిర మండలం కె.గుండుమలలో మధ్యాహ్నం 2.20 గంటలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. గ్రామ ప్రజలు, పట్టు రైతులతో ముఖాముఖి సమావేశమవుతారు. మల్బరీ షెడ్, పట్టు పురుగుల పెంపకాన్ని పరిశీలిస్తారు. కాగా, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర శాఖ కార్యదర్శి కె.రామకృష్ణ సీఎం చంద్రబాబును సచివాలయంలో బుధవారం కలిశారు. అలాగే టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో కుప్పం నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. అదే విధంగా సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమావేశమయ్యారు.

తిరుపతిలో 1,390 పింఛన్లు తొలగింపు!

తిరుపతి అర్బన్: వైఎస్ జగన్ పాలనలో ఐదేళ్ల పాటు కులం, మతం, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా పింఛన్లు అందుకున్న లబ్ధిదారులకు ఇక్కట్లు మొదలయ్యాయి. తిరుపతి జిల్లాలో ఏకంగా 1,390 మంది పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. వీటిని ఎందుకు తొలగించారు? ఎవరి పింఛన్లు తొలగించారు? అనే సమాచారాన్ని అధికారులు బయటకు వెల్లడించడం లేదు. జూలై నెలలో తిరుపతి జిల్లాలో 2,69,162 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు అధికారులు గత నెలలో వెల్లడించారు. కానీ ఆగస్టు నెలలో 2,67,772 మందికే పింఛన్లు అందిస్తున్నట్లు మీడియాకు తెలియజేశారు. ఈ నెల రోజుల్లోనే 1,390 మంది పింఛన్లు మాయమయ్యాయి. మరోవైపు కొత్తగా 5 వేల మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ దరఖాస్తుల సంగతి కూడా ప్రభుత్వం తేల్చలేదు. ఈ సమస్యపై తిరుపతి డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభావతి స్పందిస్తూ.. కొత్త పింఛన్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉందన్నారు. అలాగే పలువురు మృతి చెందడంతో ఈ నెలలో పింఛన్ల సంఖ్య తగ్గిందని చెప్పారు.

ఎటు చూసినా వినాశనమే

బురద, శిథిలాల నుంచి బయటపడుతున్న మృతదేహాలు

కొనసాగుతున్న అన్వేషణ, సహాయక చర్యలు



మరుభూమిగా మారిన వయనాడ్‌లో బుధవారం కొనసాగుతున్న సహాయక చర్యలు

- 167 దాటిన మరణాలు
- 191 మంది జాడ గల్లంతు
- 219 మందికి గాయాలు

వయనాడ్/తిరువనంతపురం: ప్రకృతి ప్రకోపానికి గురై శవాల దిబ్బగా మారిన కేరళలోని వయనాడ్ జిల్లా మారుమూల కుగ్రామాల వద్ద అన్వేషణ, సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున కుంభవృష్టి వర్షాలతో నానిన కొండచరియలు పడటంతో బురదలో కూరుకుపోయిన ఇళ్ల శిథిలాల కింద పెద్ద సంఖ్యలో మృతదేహాలను ఆర్మీ, సహాయక బృందాలు వెలికితీశాయి. దీంతో మరణాల సంఖ్య 167కి పెరిగింది. 191 మంది జాడ తెలియాల్సి ఉంది. 219 మంది గాయపడ్డారు. ఛిద్రమైన చాలా మృతదేహాలను గుర్తించాల్సి ఉంది. వందలాది మందిని సమీప పట్టణాల ఆస్పత్రుల్లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ముండక్కై, చూరల్మల, అత్తమల, నూల్పుజ గ్రామస్తుల మరణాలతో వారి బంధువుల, ఆక్రందనలు, తమ వారి జాడ కోసం కుటుంబసభ్యుల వెతుకులాటతో ఆ ప్రాంతాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. శిథిలాల కింద బ్రతికుంటే బాగుణ్ణు అని ఆశ, ఏ చెడువార్త వినాల్సి వస్తుందోనన్న భయాలతో వందలాది మంది ఆత్మీయులు, మిత్రుల రాకతో ఆ ప్రాంతాల్లో విషాదం రాజ్యమేలింది. కొండపై నుంచి వచ్చిన వరద, బురద ధాటికి రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో బుధవారం ఉదయం మాత్రమే పూర్తిస్తాయిలో సహాయక కార్యక్రమాలు మొదలుపెట్టగలిగారు. రెండ్రోజుల్లో 1,592 మందిని కాపాడినట్లు కేరళ సీఎం విజయన్ చెప్పారు.

వేయి మందిని రక్షించిన ఆర్మీ: యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలతో రంగంలోకి దిగిన భారత సైన్యం దాదాపు 1,000 మందికిపైగా స్థానికులను సురక్షితంగా కాపాడింది. డిఫెన్స్ సెక్యూరిటీ కోర్ బృందాలు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బలగాలు, తీరగస్తీ దళాలు సంయుక్తంగా చేపడుతున్న రెస్క్యూ ఆపరేషన్లతో చాలా మంది ప్రాణాలతో బయటపడ్డారు. హెలికాప్టర్లు, తాత్కాలిక వంతెనల సాయంతో ఘటనాస్థలి నుంచి వారికి జాగ్రత్తగా తీసుకొస్తున్నారు. కొందరు మానవహారంగా ఏర్పడి ఆవలి ఒడ్డు నుంచి కొందరిని ఇటువైపునకు తీసుకొస్తూ సాహసంచేస్తున్నారు. డాగ్ స్క్వాడ్‌లతో పాటు స్థానికు తమ వంతు సాయం చేస్తున్నారు. శిబిరాలకు 8,017 మందిని తరలించారు.

ఆదుకుంటున్న బెలీ వంతెనలు: 330 అడుగుల పొడవైన తాత్కాలిక బెలీ వంతెనలు నది ప్రవాహం ఆవలివైపు చిక్కుకున్న బాధితులను ఇటువైపు తీసుకొచ్చేందుకు ఎంతగానో ఉపయో గపడుతున్నాయి. 690 అడుగుల బెలీ వంతెనలను ఢిల్లీ కంటోన్మెంట్ నుంచి తెప్పి స్తున్నారు. మేప్పడి–చూరల్మల వంతెన నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన చేపడు తున్నారు. నిఘా హెలికాప్టర్లు కొండప్రాంతాలు, నదీ ప్రవాహం వెంట తిరుగుతూ బాధితుల జాడ కోసం అన్వేషణ కొనసా గిస్తున్నాయి.

పరిస్థితిని సమీక్షించిన ప్రధాని మోదీ

దిగ్భ్రాంతికర ఘటనలో సహాయక చర్యలు, పునరావాసం తదితర చర్యల పురోగతిపై ప్రధాని మోదీ సమీక్ష జరిపారు. కేరళకు పూర్తిస్థాయిలో కేంద్రం మద్దతిస్తోందని కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ ఘటనాస్థలిని సందర్శించిన సందర్భంగా చెప్పారు.

కుగ్రామాల్లో శ్మశాన వైరాగ్యం

భారీ శిలలు పడి నేలమట్టమైన ఒక ఇంట్లో నాలుగైదు మంది కుటుంబసభ్యులు ఒకరినొకరు గట్టిగా పట్టుకుని అలాగే బురదలో కూరుకుపోయిన విషాద దృశ్యం అక్కడి సహాయక బృందాలను సైతం కంటతడి పెట్టించింది. ముండక్కై జంక్షన్, చూరల్మల ప్రాంతాల్లో భీతావహ దృశ్యాలు అక్కడి ప్రకృతి విలయాన్ని కళ్లకు కట్టాయి. '' ముండక్కై గ్రామంలో ఘటన జరిగిన రోజు దాదాపు 860 మంది జనం ఉన్నారు. వాళ్లలో ఎంతమంది ప్రాణాలతో ఉన్నారో తెలీదు' అని స్థానికులు వాపోయారు. ''చెట్లను పట్టుకుని కొందరు, చెట్టు కింద పడి మరికొందరు, బురదలో కూరుకుపోయి ఇంకొందరు ప్రాణాలు కోల్పోయారు. కుర్చీలో కూర్చుని, మంచాల మీద పడుకుని ఉన్న మృతదేహాలను గుర్తించాం'' అని సహాయక బృందాలు వెల్లడించాయి. ''అంతా కోల్పోయా. అందర్నీ కోల్పోయా. నాకు ఇక్కడ ఇంకా ఏమీ మిగల్లేదు' అంటూ ఒక పెద్దాయన ఏడుస్తూ కనిపించారు. ''బురదలో కాలు పెట్టలేకున్నాం. మావాళ్లు ఎక్కడున్నారో'' అంటూ ఒకరు కంటతడి పెట్టుకున్నారు.

10 శాతం ఇళ్లు మిగిలాయి

ముండక్కైలో దాదాపు 500 ఇళ్లు ఉంటాయని ఓ అంచనా. విధ్వంసం తర్వాత 450 ఇళ్లు నేలమట్టమయ్యాయి. 49 ఇళ్లే మిగిలాయి. బాధితులు అంగన్‌వాడీ కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు.



చిన్నారులను తరలిస్తున్న సిబ్బంది

ముందుగానే హెచ్చరించాం: అమిత్ షా



కుంభవృష్టిపై వారం క్రితమే ముందస్తు హెచ్చరికలు చేశామని రాజ్యసభలో వయనాడ్ విషాదంపై తాత్కాలిక చర్చ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడారు. '' ముందు జాగ్రత్తగా జూలై 23వ తేదీన ఎన్‌డీఆర్‌ఎఫ్ నుంచి 9 బృందాలను కేరళకు పంపించాం. వయనాడ్‌లో విలయం మొదలవగానే జిల్లా కలెక్టర్ నుంచి ఈ బృందాలకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. వెంటనే వాళ్లంతా రంగంలోకి దిగారు. అన్వేషణ, సహాయ, పునరావాస కార్యక్రమాల్లో కేరళకు పూర్తి స్థాయిలో మోదీ సర్కార్ అండగా నిలుస్తుంది. ఆరు సంవత్సరాల క్రితమే ఇలాంటి కొండప్రాంతాల నుంచి జనాన్ని వేరేచోటుకు తరలించాలని ఢిల్లీ ఐఐటీ నిపుణులు హెచ్చరించారు. అయినా వారి సలహాను కేరళ సర్కార్ పెడచెవిన పెట్టింది. భారీ వర్షాలు పడొచ్చని జూలై 18న, 25న రెండుసార్లు హెచ్చరికలు పంపాం. 20 సెం.మీ. భారీ వర్షం పడి కొండచరియలు పడొచ్చని 26న హెచ్చరించాం. స్థానికులను ఎందుకు తరలించలేదు?'' అని కేరళ సర్కార్‌ను అమిత్ ప్రశ్నించారు.

పంపింది ఆరెంజ్ అలెర్ట్... అదీ 29న: విజయన్



అమిత్ షా వ్యాఖ్యలను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఖండించారు. ఈ మేరకు తిరువనంతపురంలో పత్రికా సమావేశంలో మాట్లాడారు. '' అమిత్ షా చెప్పేదంతా అబద్ధం. 28వ తేదీవరకు ఎలాంటి అలర్ట్ పంపలేదు. వర్షాలొస్తాయని భారత వాతావరణ శాఖ వయనాడ్ జిల్లాకు సాధారణ ఆరెంజ్ అలర్ట్‌ను 29వ తేదీన మాత్రమే పంపింది. 20 సెంటీమీటర్లలోపు వర్షాలకు ఆరెంజ్ అలర్ట్, 24 సెం.మీ.లోపు వర్షాలకు రెడ్ అలర్ట్ ఇస్తారు. కానీ వయనాడ్ జిల్లాలో అసాధారణంగా 572 మిల్లీమీటర్లకు మించి కుంభవృష్టి నమోదైంది. ఇంతటి భారీ వర్షసూచన వాతావరణశాఖ చేయలేదు. మంగళవారం కొండచరియలు పడ్డాక తీరిగ్గా ఉదయం ఆరుగంటలకు రెడ్ అలర్ట్‌ను పంపించారు. వరదపై హెచ్చరించాల్సిన సెంట్రల్ వాటర్ కమిషన్ నుంచి ఎలాంటి హెచ్చరిక రాలేదు. అయినా ఇది పరస్పర విమర్శలకు సమయం కాదు'' అని అన్నారు.

దురాశ తెచ్చిన దుఃఖం

వయనాడ్‌లో పర్యావరణ విధ్వంసం

యథేచ్ఛగా తవ్వకాలు, హోటళ్లు, రిసార్టులు

కాస్త వానకూ వణుకుతున్న కొండ ప్రాంతం

అత్యాశే మనిషికి పెను శాపంగా మారుతోంది. వయనాడ్ విలయమే ఇందుకు తాజా ఉదాహరణ. అసలే కేరళకు పశ్చిమాన అరేబియా సముద్రం. ఆపై తూర్పున విస్తారమైన పశ్చిమ కనుమలు. దాంతో పుష్కలమైన వానలకు ఆ రాష్ట్రం పెట్టింది పేరు. ఏకంగా 310 సెంటీమీటర్ల వార్షిక సగటు వర్షపాతం నమోదవుతుంది. ఇందులో మూడొంతుల వానలు జూన్–సెప్టెంబర్ మధ్య వర్షాకాలంలోనే కురుస్తాయి. కేరళలో పశ్చిమ కనుమల అందాలు కన్ను తిప్పుకోనివ్వవు. వాటిని ఆస్వాదించేందుకు పర్యాటకుల రాక కొన్నేళ్లుగా ఊహాతీతంగా పెరుగుతోంది. దాంతో ఎకో టూరిజం పేరిట హోటళ్లు, రిసార్టుల నిర్మాణం అడ్డూ అదుపూ లేకుండాపోయింది. అందుకోసం అడవులను విచ్చలవిడిగా నరికేస్తున్నారు. కొండ ప్రాంతాలను కూడా ఎక్కడ పడితే అక్కడ అడ్డగోలుగా తవ్వేయడం నిత్యకృత్యంగా మారింది. వీటిని కట్టడి చేసి సమతుల్యత పాటించాల్సింది పోయి రాష్ట్ర ప్రభుత్వమూ వీటిని వీలైనంతగా ప్రోత్సహిస్తూ వస్తోంది. పర్యావరణపరంగా అత్యంత సున్నిత ప్రాంతమైన పశ్చిమ కనుమలు ఈ విపరిణామాలను తట్టుకోలేకపోతున్నాయి. ఫలితమే విపరీతమైన వాతావరణ మార్పులు. అవి కేరళలో కొన్నేళ్లుగా పరిపాటిగా మారాయి. 2017, 2018, 2019ల్లో వరుసగా తుఫాన్లు, వరదలు రాష్ట్రాన్ని ముంచెత్తాయి. అతి భారీ వర్షాలు ఇకపై మరింత పెరుగుతాయని ఈ ట్రెండ్ చెబుతోంది.

విపరీత వాతావరణ పరిస్థితులు...

వయనాడ్ విధ్వంసానికి మనిషి దురాశే ప్రధాన కారణమని లండన్ ఇంపీరియల్ కాలేజ్ రీసెర్చ్ అసోసియేట్ మరియం జకారియా అన్నారు. ''వయనాడ్, ఇడుక్కి జిల్లాల్లో కొండ ప్రాంతాలపై నిర్మాణాలు విపరీతంగా పెరిగిపోవడమే పెను సమస్యగా పరిణమించింది. దాంతో ఒకప్పుడు చల్లగా ఉండే వయనాడ్ ప్రాంతం ఇప్పుడు వేడిగా, పొడిగా మారిపోయింది. వేసవిలో తీవ్రమైన ఎండలు, వర్షాకాలంలో మితిమీరిన వానలు పరిపాటిగా మారాయి. దాంతో కొండచరియలు విరిగిపడే ముప్పు నానాటికీ పెరుగుతోంది. బాగా ఎండిన నేలల్లో వాననీరు తక్కువగా ఇంకుతుంది. కొండల పైభాగంలో రాతి శిఖరాలను ఆవరించి ఉండే మట్టి పొరలు వదులుగా ఉంటాయి. భారీ వర్షాలకు తడిసి, వరద ఉధృతికి కొట్టుకుపోతాయి. తాజా విలయమే ఇందుకు ఉదాహరణ'' అని వివరించారు. ''వాయు, సముద్ర ఉష్ణోగ్రతల్లో పెరుగుదల ఈ విపరీత వాతావరణ పరిస్థితులకు దోహదపడుతోంది. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పుల వంటివి తీవ్రతను మరింతగా పెంచుతున్నాయి. ఫలితంగా ఉన్నట్టుండి కుంభవృష్టి కురిసి భారీ ఆస్తి, ప్రాణ నష్టానికి దారితీస్తుంది'' అని జకారియా వివరించారు.

అటకెక్కిన కమిటీ సిఫార్సులు...

అత్యంత సున్నితమైన భౌగోళిక పరిస్థితులు కేరళ ప్రత్యేకత. కొంత ప్రాంతాలు ఎక్కువ కావడంతో దాదాపుగా సగం రాష్ట్రం 20 డిగ్రీల ఏటవాలు కోణంలో ఉంటుంది. పెలుసు బారిన మట్టితో కూడిన కొండల పై ప్రాంతాలు భారీ వర్షాలకు విరిగిపడటం పరిపాటి...

- గత ఏడేళ్లలో దేశవ్యాప్తంగా అత్యంత ఎక్కువ సంఖ్యలో కొండచరియలు విరిగిపడ్డ ఘటనలు నమోదైంది కేరళలోనే! దేశమంతటా 3,782 ఘటనలు జరిగితే వీటిలో కేరళ వాటాయే 2,239!
- 2021లో కొట్టాయం, ఇడుక్కి జిల్లాల్లో భారీ వరదలు, కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో భారీగా ప్రాణనష్టం జరిగింది.
- పశ్చిమ కనుమల్లో 61 శాతాన్ని పర్యావరణ పరంగా అతి సున్నిత ప్రాంతంగా ప్రకటించి పరిరక్షించాలని మాధవ్ గాడ్గిల్ కమిటీ 13 ఏళ్ల క్రితమే కేంద్రానికి సిఫార్సు చేసింది.
- కేరళలో కొంత ప్రాంతాలన్నింటినీ ఈ జాబితాలో చేర్చి ఎలాంటి అభివృద్ధి, నిర్మాణ పనులూ జరగకుండా చూడాలని పేర్కొంది.
- గనుల తవ్వకాలు, ఇసుక తవ్వకాలు, జల–పవన విద్యుత్కేంద్రాలు, కాలుష్యకారక పరిశ్రమల నిర్మాణం తదితరాలను పూర్తిగా నిషేధించాలని సూచించింది.
- కానీ ప్రజల జీవనోపాధికి, రాష్ట్రాభివృద్ధికి ఈ సిఫార్సులు గొడ్డలిపెట్టంటూ కమిటీ నివేదికను కేరళ ప్రభుత్వం పట్టించుకోలేదు.
- వయనాడ్‌లో గత 50 ఏళ్లలోనే పచ్చదనం ఏకంగా 60 శాతానికి పైగా హరించుకుపోయిందని 2022లో జరిగిన అధ్యయనం తేల్చింది.
- అదే సమయంలో జిల్లావ్యాప్తంగా తేయాకు తోటల సాగు ఏకంగా 1,800 శాతం పెరిగిపోయిందని వివరించింది.
- కొండ ప్రాంతాల్లో నేల పై పొరల్ని గట్టిగా పట్టి ఉంచే చెట్లు తదితరాలు లేకపోవడం కొద్దిపాటి వర్షాలకే మట్టిపెళ్లలు విరిగిపడటం పరిపాటిగా మారింది.

\- సాక్షి, నేషనల్ డెస్క్

ప్రధానిపై సభాహక్కుల తీర్మానం

- నోటీసు ఇచ్చిన కాంగ్రెస్ ఎంపీ చన్నీ
- రికార్డుల్లోంచి తొలగించిన వ్యాఖ్యలను షేర్ చేశారని ఆరోపణలు

న్యూఢిల్లీ: విపక్షనేత రాహుల్ గాంధీపై లోక్‌సభలో బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాగూర్ చేసిన అభ్యంతరకర వ్యాఖ్యల వివాదం మరో మలుపు తీసుకుంది. అనురాగ్ వ్యాఖ్యల్లో స్పీకర్ తొలగించిన భాగాలను కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్'లో షేర్ చేశారని, ఇది సభాహక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని కాంగ్రెస్ ఎంపీ, పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జిత్ సింగ్ చన్నీ బుధవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు నోటీసు ఇచ్చారు. సభా నియమావళి రూల్–222 కింద ప్రధానిపై సభాహక్కుల ఉల్లంఘన తీర్మానానికి నోటీసు ఇస్తున్నట్లు చన్నీ తెలిపారు. మంగళవారం అనురాగ్ ఠాకూర్ లోక్‌సభలో మాట్లాడుతూ.. తమ కులమేమిటో తెలియని వారు కులగణన గురించి మాట్లాడుతున్నారని రాహుల్‌ను ఉద్దేశించి అన్నారు. దీనిపై విపక్ష సభ్యుల అభ్యంతరంతో స్పీకర్ స్థానంలో ఉన్న జగదంబికా పాల్ (కాంగ్రెస్ ఎంపీ) అనురాగ్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించారు. 'నిబంధనల ప్రకారం రికార్డుల నుంచి తొలిగించిన వ్యాఖ్యలను ప్రచురించడం సభాహక్కుల ఉల్లంఘనే. సుప్రీంకోర్టు కూడా దీన్నే ధృవకరించింది' అని చన్నీ తెలిపారు. ' అయితే అనురాగ్ తమ కులమేమిటో తెలియని వారు కులగణన గురించి మాట్లాడుతున్నారని అన్నపుడు ఎవరి పేరునూ తీసుకోలేదని, ఈ వ్యాఖ్యను రికార్డుల నుంచి తొలగించలేదని, దీని ఆధారంగా చన్నీ ఇచ్చే నోటీసు పరిగణనకు రాకపోవచ్చని అధికారవర్గాలు తెలిపాయి. ప్రధాని మోదీ మంగళవారం ఎక్స్‌లో అనురాగ్ ఠాకూర్ ప్రసంగాన్ని మొత్తం షేర్ చేస్తూ.. 'తప్పకుండా వినాల్సినది. వాస్తవాలు, హాస్యం మేలు కలయిక. ఇండియా కూటమి నీచ రాజకీయాలను ఎండగట్టింది' అని కితాబిచ్చారు. అనురాగ్ వ్యాఖ్యలపై బుధవారం కూడా లోక్‌సభలో తీవ్ర దుమారం రేగింది.

అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కండి: సోనియా



న్యూఢిల్లీ: ప్రజామోదం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉందని ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ వ్యాఖ్యానించారు. త్వరలో జరగబోయే కీలకమైన రాష్ట్రాల శాసనసభ ఎన్నికలకు సంసిద్ధం కావాలని నేతలకు ఆమె దిశానిర్దేశం చేశారు. బుధవారం ఆమె పార్టీ నేతలు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ''లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పట్ల ప్రజల్లో సానుకూలత బాగా పెరిగింది. ఇది చూసి అతివిశ్వాసాన్ని మీ దరి చేరనీయకండి' అని నేతలకు హితవు పలికారు.

99 శాతం డెలిగేట్ల మద్దతు కమలకే



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష స్థానానికి పోటీ చేసే దిశగా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్.. కీలక ముందడుగు వేశారు. డెమొక్రటిక్ పార్టీ ప్రతినిధుల వర్చువల్ రోల్‌కాల్ ఓట్లు కోరే అర్హత సాధించారు. బరిలో ఆమె ఒక్కరే మిగలడంతో.. పార్టీ తరపున అధ్యక్ష అభ్యర్థిగా కమలా హారిస్ ఎన్నిక ఇక లాంఛనమే కానుంది. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఖాయం చేసుకునేందుకు కమలా హారిస్ నామినేషన్‌కు 3,923 మంది డెలిగేట్లు (99 శాతం) మద్దతు పలికారు.

అనురాగ్ క్షమాపణ చెప్పాలి: విపక్షాలు

న్యూఢిల్లీ: రాహుల్ గాంధీ కులంపై బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలంటూ విపక్ష సభ్యులు బుధవారం ఉదయం లోక్‌సభ కార్యకలాపాలను అడ్డుకున్నారు. కులగణన చేపట్టాలని నినాదాలు చేశారు. కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ, శివసేన (యూబీటీ) ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడబోతుండగా పేపర్లను చించి వెల్‌లోకి విసిరేశారు. గందరగోళం మధ్యనే ప్రశ్నోత్తరాలు కొనసాగాయి. స్పీకర్ పిలిచినా.. కొందరు కాంగ్రెస్ సభ్యులు తమ ప్రశ్నలు అడగలేదు.

రాహుల్ కులమడిగితే తప్పేంటి?: రిజిజు

న్యూఢిల్లీ: రాహుల్ గాంధీ కులమేమిటని అడిగితే తప్పేమిటని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రశ్నించారు. ''ప్రతి ఒక్కరినీ మీద ఏ కులమని అడుగుతూ దేశాన్ని కులం ఆధారంగా విభజించాలని రాహుల్ చూస్తున్నారు. విలేకరులను, సైనికులను, ప్రజలనూ కులం గురించి వాకబు చేస్తారు. ఆయన కులం మాత్రం ఎవరూ అడగొద్దా? ఇదేం విడ్డూరం? అన్నారు..

ఇరాన్ సవాలు.. ఇజ్రాయెల్ సమాధానం

హమాస్ చీఫ్ హత్య

ఇరాన్ అధ్యక్షుని ప్రమాణస్వీకారంలో పాల్గొన్న హనియే

కాసేపటికే టెహ్రాన్‌లోని సొంతింట్లోనే వైమానిక దాడికి బలి

కేవలం 12 గంటలు. అంత స్వల్ప వ్యవధిలో ఇటు హిజ్బొల్లాను, అటు హమాస్‌ను ఇజ్రాయెల్ చావుదెబ్బ తీసింది. రెండు ఉగ్ర సంస్థల్లోనూ అత్యున్నత స్థాయి నేతలను అత్యంత కచ్చితత్వంతో కూడిన వైమానిక దాడుల ద్వారా అడ్డు తొలగించుకుంది. మంగళవారం రాత్రి హిజ్బొల్లా మిలిటరీ కమాండర్ ఫాద్ షుక్ర్‌ను లెబనాన్ రాజధాని బీరూట్‌లో అంతమొందించింది. తెల్లవారుజామున తన ఆగర్భ శత్రువైన ఇరాన్ రాజధాని టెహ్రాన్ నడిబొడ్డులో హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియేను ఆయన సొంతింట్లోనే హత్య చేసింది. తద్వారా ఎక్కడైనా, ఎవరినైనా, ఎప్పుడైనా లక్ష్యం చేసుకోగల సత్తా తనకుందని మరోసారి నిరూపించుకుంది. గాజా యుద్ధంతో ఇప్పటికే అట్టుడుకుతున్న పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ తాజా చర్యలతో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. హనియే హత్యకు ప్రతీకారం తప్పదని ఇరాన్ సుప్రీం కమాండర్ ఖమేనీ హెచ్చరికలు జారీ చేశారు. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం తప్పకపోవచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. హిజ్బొల్లా కూడా షుక్ర్ మృతిని ధ్రువీకరించింది. 'ఇజ్రాయెల్ మూల్యం చెల్లించక తప్పద'ని పేర్కొంది. గాజాలో కాల్పుల విరమణకు ఇక దారులు మూసుకుపోయినట్టేనని భావిస్తున్నారు...



మంగళవారం సాయంత్రం టెహ్రాన్‌లో ఖమేనీతో హనియే

- పశ్చిమాసియాలో సంక్షోభం తీవ్రం
- ప్రతీకారం తప్పదన్న హమాస్
- ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య మళ్లీ కమ్ముకుంటున్న యుద్ధమేఘాలు

టెహ్రాన్/బీరూట్: పాలస్తీనా ఉగ్రవాద సంస్థ హమాస్‌కు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఆ సంస్థ చీఫ్ ఇస్మాయిల్ హనియే (62) వైమానిక దాడిలో హత్యకు గురయ్యారు. మంగళవారం రాత్రి టెహ్రాన్లో ఇరాన్ నూతన అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఇరాన్ దీన్ని తన బల ప్రదర్శనకు వేదికగా మలచుకుంది. అందులో భాగంగా గాజాను వీడి 2019 నుంచీ ఖతార్‌లో ప్రవాసంలో గడుపుతున్న హనియే తదితర హమాస్ నేతలతో పాటు పాలస్తీనియన్ ఇస్లామిక్ జిహాద్, హెజ్బొల్లా, యెమన్‌కు చెందిన హౌతీ తదితర ఉగ్ర సంస్థల అగ్ర నేతలంతా కార్యక్రమంలో పాల్గొన్నారు. 'ఇజ్రాయెల్‌కు మరణం' అంటూ మూకుమ్మడిగా నినాదాలు చేశారు. కాసేపటికే ఇజ్రాయెల్ గట్టిగా జవాబిచ్చింది. కార్యక్రమం ముగిసి హనియే టెహ్రాన్‌లోని తన ఇంటికి చేరుకున్న కాసేపటికే ప్రాణాంతక వైమానిక దాడికి దిగింది. ఇల్లు దాదాపుగా ధ్వంసం కాగా హనియే, బాడీగార్డు చనిపోయారు. దీన్ని హమాస్ కూడా ధ్రువీకరించింది. హనియేను ఇజ్రాయెల్ వైమానిక దాడితో పొట్టన పెట్టుకుందని మండిపడింది. ఇజ్రాయెల్‌పై దీటుగా ప్రతీకార చర్యలుంటాయని స్పష్టం చేసింది. దాడిపై ఇరాన్ స్పష్టత ఇవ్వకున్నా ఇరాన్ పారామిలటరీ రివల్యూషనరీ గార్డ్స్ దర్యాప్తు చేపట్టింది. ఇది ఇజ్రాయెల్ పనేనని అమెరికా కూడా అభిప్రాయపడింది. ఇజ్రాయెల్ మాత్రం దీనిపై స్పందించలేదు. అయితే, ''మేం యుద్ధాన్ని కోరుకోవడం లేదు. కానీ ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నాం'' అని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గలాంట్ ప్రకటించారు.

హెచ్చరించినట్టుగానే...

గతేడాది అక్టోబరు 7న తన గడ్డపై హమాస్ నరమేధానికి ప్రతీకారంగా గాజాపై ఇజ్రాయెల్ యుద్ధానికి దిగడం తెలిసిందే. హనియేతో పాటు హమాస్ అగ్ర నేతలందరినీ మట్టుబెట్టి తీరతామని ఆ సందర్భంగానే ప్రతిజ్ఞ చేసింది. హమాస్ నేతలు ఎక్కడున్నా వెంటాడి వేటాడాలంటూ ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొసాద్‌కు బాహాటంగానే అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహూ ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్ 7 నాటి దాడిలో హనియేకు నేరుగా పాత్ర లేదు. పైగా హమాస్‌లో మితవాద నేతగా ఆయనకు పేరుంది. అయినా నాటి దాడికి ఆయన ఆశీస్సులూ ఉన్నాయని ఇజ్రాయెల్ నమ్ముతోంది.

ఇజ్రాయెల్‌కు మరణశాసనమే: ఖమేనీ అల్టిమేటం

హనియే మృతికి ప్రతీకారం తప్పదని ఇరాన్ ఆధ్యాత్మిక నేత, సుప్రీం కమాండర్ అయతొల్లా అలీ ఖమేనీ హెచ్చరించారు. అది తమ పవిత్ర బాధ్యత అని స్పష్టం చేశారు. ''మా ప్రియతమ అతిథిని మా నేలపైనే ఇజ్రాయెల్ పొట్టన పెట్టుకుంది. తద్వారా తనకు తానే మరణశాసనం రాసుకుంది'' అంటూ తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. ఈ నేపథ్యంలో ఇరాన్ స్పందన తీవ్రంగానే ఉండొచ్చని అనుమానిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం ఖమేనీ నివాసంలో సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ అత్యవసర సమావేశం జరగడం దీన్ని బలపరుస్తోంది. తమపైకి వస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ అన్నారు.

షుక్ర్‌ను మట్టుపెట్టాం: ఇజ్రాయెల్



హెజ్బొల్లా మిలిటరీ కమాండర్ ఫాద్ షుక్ర్‌ను ఇజ్రాయెల్ హతమొందించింది. ఇజ్రాయెల్ ఆక్రమిత గోలన్ హైట్స్‌లో హెజ్బొల్లా ఇటీవలి రాకెట్ దాడులతో చిన్నారులతో పాటు మొత్తం 12 మంది ఇజ్రాయెలీలు మరణించడం తెలిసిందే. దానికి ప్రతీకారంగా లెబనాన్ రాజధాని బీరూట్‌పై మంగళవారం రాత్రి ఇజ్రాయెల్ రాకెట్ దాడులకు దిగింది. ఈ దాడుల నుంచి షుక్ర్ తప్పించుకున్నట్టు హెజ్బొ ల్లా చెప్పుకున్నా, అతను మరణించినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. 1983లో బీరూట్‌లో అమెరికా సైనిక స్థావరంపై దాడులకు సంబంధించి షుక్ర్ ఆ దేశ వాంటెడ్ లిస్టులో ఉన్నాడు.

శరణార్థి నుంచి హమాస్ చీఫ్ దాకా...

ఇస్మాయిల్ హనియే గాజా సమీపంలో శరణార్థి శిబిరంలో 1962లో జన్మించారు. 1987లో మొదటి పాలస్తీనా యుద్ధ సమయంలో పుట్టుకొచ్చిన హమాస్‌లో ఆయన వ్యవస్థాపక సభ్యుడు. సంస్థ వ్యవస్థాపకుడు, తొలి చీఫ్ అహ్మద్ యాసిన్‌కు అత్యంత సన్నిహితుడు. 2004లో ఇజ్రాయెల్ దాడుల్లో యాసిన్ మరణించాక హమాస్‌లో కీలకంగా మారారు. ఉద్రూతలూగించే ప్రసంగాలకు పెట్టింది పేరు. 2006లో పాలస్తీనా ప్రధానిగా గాజా పాలన చేపట్టారు. ఏడాదికే పాలస్తీనా నేషనల్ అథారిటీ అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ ఆయన్ను పదవి నుంచి తొలగించారు. నాటి నుంచి గాజాలో ఫతా–హమాస్ మధ్య పోరు సాగుతోంది. అబ్బాస్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ హనియే గాజా ప్రధానిగా కొనసాగుతున్నారు. 2017లో హమాస్ చీఫ్ అయ్యారు.

యూపీఎస్‌సీ చైర్‌పర్సన్‌గా ప్రీతీ సుదన్



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ కేడర్ సీనియర్ మాజీ ఐఏఎస్ అధికారిణి ప్రీతీ సుదన్ బుధవారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్‌సీ)కి నూతన చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు. '' రాష్ట్రపతి ద్రౌపది ముర్ము యూపీఎస్‌సీ ప్రస్తుత సభ్యురాలైన ప్రీతీ సుదన్‌ను చైర్‌పర్సన్‌గా నియమించారు. 2024 ఆగస్టు ఒకటో తేదీ నుంచి 2025 ఏప్రిల్ 29వ తేదీదాకా లేదంటే తదుపరి ఉత్తర్వులు వచ్చేదాకా ఆమె చైర్‌పర్సన్‌గా కొనసాగుతారు' అని కేంద్రం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుత యూపీఎస్‌సీ చైర్మన్ మనోజ్ సోని పదవీకాలం 2029 మే నెలదాకా ఉన్నప్పటికీ హఠాత్తుగా తన పదవికి రాజీనామాచేయడంతో ప్రీతీకి సారథ్య బాధ్యతలు అప్పగించారు.

పలు శాఖల్లో కీలక బాధ్యతల్లో..

ప్రీతీ 2022 నవంబర్ 29 నుంచి యూపీఎస్‌సీలో సభ్యులుగా ఉన్నారు. 1983 బ్యాచ్ ఐఏఎస్ అయిన ప్రీతీ 2020 జూలై ముందువరకు మూడేళ్ల కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శిగా పనిచేశారు. ఆరోగ్య కార్యదర్శి పదవిలో చివరి ఆరునెలల్లో కోవిడ్ సంక్షోభకాలంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో 37 సంవత్సరాలపాటు పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఆమెకు ఉంది. రక్షణ శాఖలో, శిశు,మహిళాభివృద్ధి శాఖ మంత్రిత్వ శాఖల్లోనూ పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ కేడర్‌లో పనిచేసినపుడు ఆర్థిక, ప్రణాళిక, విపత్తునిర్వహణ, పర్యాటకం, వ్యవసాయ రంగాల అభివృద్ధి కోసం కృషిచేశారు. ప్రపంచబ్యాంక్‌కు కన్సల్టెంట్‌గానూ పనిచేసిన అంతర్జాతీయ అనుభవం ఆమె గడించారు.

ఏమిటీ యూపీఎస్‌సీ?

అఖిలభారత సర్వీసులు నిర్వహించే అధికారుల ఎంపిక కోసం 1926 అక్టోబర్ ఒకటిన నాటి బ్రిటిష్ ప్రభుత్వం దీనిని 'పబ్లిక్ సర్వీస్ కమిషన్'గా ఏర్పాటుచేసింది. తర్వాత ఇది ఫెడరల్ పబ్లిక్ కమిషన్‌గా, ఆ తర్వాత యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా రూపాంతరం చెందింది. యూపీఎస్‌సీ పరీక్షలు, తుది ఇంటర్వ్యూలు చేసి ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్ ఇలా అఖిలభారత సర్వీసులకు అధికారులను ఎంపికచేస్తుంది.

పూజా ఖేడ్కర్ అభ్యర్థిత్వం రద్దు

తదుపరి పరీక్షలు, నియామకాల నుంచి డిబార్: యూపీఎస్‌సీ



న్యూఢిల్లీ: వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ అధికారిణి పూజా మనోరమ దిలీప్ ఖేడ్కర్‌పై యూపీఎస్‌సీ శాశ్వత వేటువేసింది. అధికారి దుర్వినియోగం, తప్పుడు పత్రాలతో సివిల్స్‌లో నెగ్గడం వంటి అవకతవకలకు పాల్పడ్డ నేరానికి శిక్షగా ఆమె ప్రొవిజనల్ అభ్యర్థిత్వాన్ని రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది. తదుపరి ఎంపికలు, నియామకాల నుంచి ఆమెను డిబార్ చేస్తున్నట్లు యూపీఎస్‌సీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. '' గత 15 ఏళ్లలో ఒక అభ్యర్థి తన అవకాశాలు(పరీక్ష అటెంప్ట్‌లు) మించి మరోసారి పరీక్ష రాయడం ఇదే తొలిసారి. పూజా ఖేడ్కర్ తప్పుడు గుర్తింపు పత్రాలతో అదనంగా మరోసారి సివిల్స్ పరీక్ష రాసి సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్స్,2022 నిబంధనలను ఉల్లంఘించినట్లు స్పష్టమైంది'' అని యూపీఎస్‌సీ తెలిపింది. ''మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలపాలంటూ జూలై 18న షోకాజ్ నోటీసులిచ్చాం. జూలై 25దాకా గడువు ఇచ్చాం. ఆగస్టు నాలుగోతేదీదాకా గడువుకావాలని ఆమె కోరారు. తుది గడువు జూలై 30 మధ్యాహ్నం 3.30గంటలకల్లా రావాలని చెప్పినా ఆమె నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అందుకే తుది చర్యలు తీసుకున్నాం. పూజా ఉదంతంతో 2009–2023కాలంలో సివిల్స్‌లో తుది ఎంపికకు సెలక్ట్ అయిన 15వేలకుపైగా అభ్యర్థుల జాబితాను క్షుణ్ణంగా వడగట్టాం. ఎవ్వరూ ఇలా అదనపు అటెంప్ట్ చేయలేదు'' అని పేర్కొంది.

బీజేడీ ఎంపీ మొహంతా రాజీనామా



న్యూఢిల్లీ: బిజూ జనతాదళ్ రాజ్యసభ ఎంపీ మమతా మొహంతా బుధవారం ఎగువసభలో తన సభ్యత్వానికి రాజీనామా చేశారు. మమత స్వదస్తూరీతో రాజీనామా లేఖను రాసి, తనను కలిసి అందజేశారని, నిబంధనల ప్రకారమే ఉండటంతో ఆమె రాజీనామాను తాను ఆమోదించానని రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వెల్లడించారు. మమత బీజేపీలో చేరనున్నారని పార్టీవర్గాలు వెల్లడించాయి. మమత రాజీనామాతో రాజ్యసభలో బీజేడీ బలం ఎనిమిదికి పడిపోయింది. ఒడిశాలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఆ స్థానాన్ని దక్కించుకోనుంది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం | 1 | ఆగస్టు | 2024

స్కాముల్లో మన తప్పేం లేదు!

- ఢిల్లీ టూర్‌లో సీఎం, డీసీఎంల వివరణ?

శివాజీనగర: సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీ.కే.శివకుమార్ ఢిల్లీ టూర్ కొనసాగుతోంది. రాష్ట్రంలో ముడా స్థలాలు, వాల్మీకి మండలి నిధుల స్కాంలో తగిలిన ఎదురు దెబ్బలతో హస్తినకు పయనమయ్యారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేను భేటీ చేసి సుదీర్ఘంగా చర్చలు జరిపారు. స్కాంల ఆరోపణల ద్వారా సర్కారును అస్థిరపరిచే ప్రయత్నం జరుగుతోందని వారికి వివరించారు. ముడా స్థలాలు న్యాయబద్ధంగా తీసుకున్నవని సిద్దరామయ్య వివరించే ప్రయత్నం చేశారు. వాల్మీకి నిధుల కుంభకోణంలోనూ ఇదే మాట చెప్పారు.

కొందరు మంత్రులు ఇంటికి

రాష్ట్రంలో మంత్రిమండలి మార్పుల గురించి ఇరువురు నేతలతో చర్చించారని తెలిసింది. లోక్‌సభ ఎన్నికల్లో పనిచేయని కొందరు మంత్రులను తప్పించాలని చర్చించినట్లు సమాచారం.

న్యూస్‌రీల్

ఇద్దరు జలసమాధి



లక్ష్మి, శివకుమార్ దంపతులు, రాజు (ఫైల్)

యశవంతపుర: నదిలోకి దూకిన భార్యను రక్షించడానికి వెళ్లిన భర్త, అతని బంధువు జలసమాధి అయ్యారు. ఈ దుర్ఘటన కలబురగి జిల్లా అఫజలపుర తాలూకా దేవణగాంవ్ వంతెన కింద భీమా నదీలో జరిగింది. వివరాలు.. అఫజలపుర తాలూకా కడణికి చెందిన లక్ష్మీ భర్తతో గొడవపడి వచ్చి నదిలోకి దూకింది. ఆమెను కాపాడడానికి భర్త శివకుమార్ కడణి, బంధువు రాజు కూడా నదిలోకి దూకారు. భార్య జాలర్లు వేసిన వలలో చిక్కుకుని ప్రాణపాయం నుంచి బయట పడింది. అయితే శివకుమార్, రాజులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి మరణించారు. ఫైర్, పోలీసులు గాలించి మృతదేహాలను ఒడ్డుకు చేర్చారు. భార్య తొందరపాటు పనికి రెండు ప్రాణాలు పోయాయని బంధువులు విలపించారు.

అది గొర్రెల మాంసం!

శివాజీనగర: బెంగళూరుకు రాజస్థాన్ నుంచి తెప్పించిన మాంసం పెట్టెలపై రగడ చెలరేగడం తెలిసిందే. కొందరు వ్యాపారులు కుక్క మాంసాన్ని తెప్పించి మేక మాంసం పేరుతో అమ్ముతున్నారని కొన్ని సంఘాలు రభస చేయడంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆ మాంసం నమూనాలను ఆహార భద్రత, ఆరోగ్య అధికారులు ల్యాబ్‌కు పంపించి టెస్టులు చేయించారు. అది గొర్రెల మాంసమని అధికారులు బుధవారం ప్రకటించారు. గత నెల 26న రాత్రి రైలులో వచ్చిన మాంసం పెట్టెలను కొందరు అడ్డుకుని గొడవ చేశారు.

న్యాయం కోసం ప్రధానికి యువతి లేఖ

దొడ్డబళ్లాపురం: ప్రేమ పేరుతో వాడుకుని అబార్షన్ చేయించాడు ప్రియుడు, న్యాయం చేయాలని పోలీసులకు మొర పెట్టుకుంటే పట్టించుకోలేదు, గత్యంతరం లేని యువతి ప్రధాని మోదీకి లేఖ రాసింది. ఈ సంఘటన రామనగర జిల్లా మాగడిలో వెలుగు చూసింది. వివరాలు.. మాగడికి చెందిన యువతీ యువకుడు ప్రేమలో పడ్డారు. యువతి ఒక ప్రైవేటు ఆస్పత్రిలో నర్సు. ఈ నేపథ్యంలో ఆమె గర్భం దాల్చగా ప్రియుని ఒత్తిడితో అబార్షన్ చేయించుకుంది. పెళ్లి చేసుకోమని అడిగితే ప్రియుడు దయానంద్ (24) పరారయ్యాడు. దీంతో బాధిత యువతి తనను మోసగించిన దయానంద్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పట్టించుకోలేదని, మీరైనా న్యాయం చేయాలని బాధితురాలు ప్రధాని మోదీకి లేఖ రాసింది. న్యాయం చేయకపోతే రామనగర జిల్లా ఎస్పీ ఆఫీసు ముందు ఆత్మహత్య చేసుకుంటానని పేర్కొంది.

చాముండేశ్వరి పూజలు



మైసూరు: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్, చాముండేశ్వరి సేవా బళగ ఆధ్వర్యంలో చాముండేశ్వరి దేవి పూజా మహోత్సవం నగరంలోని మహారాజ కాలేజీలో ఘనంగా జరిగింది. మైసూరు దసరా నిర్వహణలో ప్రముఖుడైన ప్రహ్లాద్ ఆచార్ చేతుల మీదుగా అర్చన పూజలు, మహా మంగళ హారతి నెరవేర్చారు.

బీరు సీసాలతో దాడి

రాయచూరురూరల్: కొంతమంది ఆకతాయిలు ఖాళీ బీర్ సీసాలను ప్రార్థనా మందిరంపై విసిరిన ఘటన సిరవారలో ఉద్రిక్తతకు దారితీసింది. మంగళవారం రాత్రి 8 గంటలకు ఫిర్దోస్ ప్రార్థనా మందిరంపై సీసాలు విసిరారు. దీంతో అందులో ప్రార్థన చేస్తున్నవారు రోడ్డు మీదకు వచ్చి ధర్నా చేశారు. దుండగులను అరెస్టు చేయాలని పట్టుబట్టారు. వెంటనే జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య, అదనపు ఎస్పీ శివకుమార్, పోలీసులు చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేశారు. ఏడు మంది నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు, వీరిలో ఒకరు బాలుడని తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా ఘోరం

మైసూరు: బంధువుల అంత్యక్రియలకు వెళ్లిన ఓ వ్యక్తి బైక్‌పై తిరిగి వస్తుండగా గూడ్స్ ఆటో ఢీకొని మరణించగా, మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన వరుణ వద్ద జరిగింది. జిల్లాలోని టీ.నరసీపుర తాలూకా వాటాళుపుర నివాసి ప్రభుస్వామి (56) మరణించగా, అదే గ్రామానికి చెందిన నాగణ్ణ గాయపడ్డారు. వీరిద్దరూ పిల్లహళ్లిలో మృతి చెందిన తమ బంధువు అంత్యక్రియలకు వెళ్లారు. తమ బైక్‌లో తిరిగి వస్తుండగా హొసహళ్లి వద్ద వేగంగా వచ్చిన గూడ్స్ ఆటో ఢీకొట్టింది.

కొండలా.. పెను ముప్పు

- ఓ వైపు వరదలు, మరోవైపు కొండ చరియలతో ప్రమాదం
- వయనాడు దుర్ఘటనతో కలకలం
- పశ్చిమ ఘాట్ల జిల్లాలకు హైఅలర్ట్



శివమొగ్గ నగర శివార్లలో తుంగా నది వరద



హాసన్ జిల్లాలో శిరాడి ఘాట్ రహదారిలో కూలిన కొండచరియలు, చిక్కుకున్న వాహనాలు

సాక్షి, బెంగళూరు: కేరళ వయనాడు విపత్తు కర్ణాటకకు భారీ హెచ్చరికగా మారింది. ఇలాంటి ప్రమాదమే కర్ణాటకకు లేకపోలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పశ్చిమ ఘాట్లలో తరచూ కొండ చరియలు విరిగిపడుతూ ఉండడం ప్రమాద ఘంటికలనే అని చెబుతున్నారు.

వయనాడ్ ప్రమాదంతో కన్నడనాట అలర్ట్ ప్రకటించారు. ముఖ్యంగా కేరళకు సరిహద్దుగా, పశ్చిమ ఘాట్లలోని జిల్లాలకు భారీ హెచ్చరికలు జారీ చేశారు. కొన్నిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోతకు కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. ఇటీవల కార్వార వద్ద జాతీయ రహదారి–66లో ఇలాగే కొండచరియలు పడిపోయి 8 మంది చనిపోగా, ముగ్గురు గల్లంతు కావడం తెలిసిందే. ఈ క్రమంలో వయనాడ్ ప్రమాదం అతిపెద్ద ప్రమాద హెచ్చరిక అని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

శిరాడి ఘాట్లో ప్రమాదం

మంగళవారం సాయంత్రం హాసన్ జిల్లాలో శిరాడి ఘాట్ రహదారిలో మట్టి చరియలు పడి ఒక టిప్పర్, కారు, మరో వాహనం ధ్వంసమయ్యాయి. ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. నిరంతర వర్షాలతో కర్ణాటక పశ్చిమ ఘాట్లలో భూమి కుంగిపోవడం, కొండచరియలు విరిగిపడడం పరిపాటిగా మారింది. కొండ చరియలకు దిగువన ఉన్న ప్రజలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు వెంటనే సహాయక శిబిరాలకు చేరుకోవాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. చిక్కమగళూరు, దక్షిణ కన్నడ, కొడగు, శివమొగ్గ, ఉడుపి జిల్లాల్లో కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉంది. అధికారులు, మంత్రులు సహాయక చర్యలకు ఆదేశించారు.

ఆగ్రహించిన కృష్ణమ్మ

మరోవైపు ఉత్తర కర్ణాటక జిల్లాల్లో కృష్ణా నది పొంగి ప్రవహిస్తోంది. బుధవారం కూడా ముంపు ముప్పు కొనసాగింది. బెళగావి జిల్లా అథణి తాలూకాలో పలు గ్రామాలను కృష్ణా నది ముంచెత్తింది. వందలాది కుటుంబాలు వరదల నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాయి. ఆవులు, ఎద్దులు, మేకలు వంటి పశు సంపదను వదిలేసి వెళ్లామని వాపోయారు. వరద తగ్గేవరకు గ్రామాలకు వెళ్లలేమని అన్నారు. మహారాష్ట్ర నుంచి భారీ మొత్తంలో నీరు రావడంతో నది పోటెత్తింది.



అథణి తాలూకాలో ఇంగల్‌గావ్‌లో నీటమునిగిన ఇళ్లు

దర్శన్‌కు ఇంటి భోజనం ఇస్తారా.. లేదా?

- 10 రోజుల్లో తేల్చాలని జైలు అధికారులకు హైకోర్టు ఆదేశం



చెరసాల భోజనం తినలేక దర్శన్ అవస్థలు (ఫైల్)

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో పరప్పన జైలులో ఉన్న హీరో దర్శన్ తనకు ఇంటి భోజనం కావాలని హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. 10 రోజుల్లో ఈ అర్జీపై జైలు అధికారులు ఒక నిర్ణయం తీసుకుని చెప్పాలని హైకోర్టు ఆదేశించింది. జైలు నిబంధనల ప్రకారం ఇంటి భోజనానికి ఆస్కారం ఉందని జడ్జి పేర్కొన్నారు. పిటిషనర్‌కు పౌష్టికాహారం అవసరం ఉందని చెబుతూ ఆగస్టు 20కి వాయిదా వేశారు. స్టార్ హీరో అయిన దర్శన్, నటి పవిత్ర గౌడ తదితరులు జూన్ 10 నుంచి హత్య కేసులో జైలు పాలయ్యారు. అప్పటి నుంచి జైలు తిండితో ఇబ్బంది పడుతున్నారు.

చిక్కుల్లో సిద్ధారూఢ

పరప్పన అగ్రహార జైలులో దర్శన్‌కు టీవీతో పాటు వీఐపీ సౌకర్యాలు కల్పించారని చెప్పిన మాజీ ఖైదీ సిద్ధారూఢపై చర్యలు తీసుకోనున్నారు. తాను జైలులో దర్శన్‌కు యోగ నేర్పించానని, ఆయనకు సకల సౌకర్యాలు అందుతున్నాయని ఇటీవల సిద్ధారూఢ మీడియా ముందు చెప్పారు. సత్ప్రవర్తన కింద విడుదలైన సిద్ధారూఢ ఇలా అవాస్తవాలు ప్రచారం చేశారంటూ పోలీసులు కేసు నమోదు చేసి మళ్లీ జైలుకు తరలించనున్నట్టు సమాచారం.

జైలు తిండి బాగుంటుంది: చేతన్

తనకు జైలులో వడ్డించే భోజనం నచ్చిందని, అయితే అదే భోజనం నటుడు దర్శన్‌కు ఎందు నచ్చలేదో అర్థం కావడం లేదని నటుడు, సామాజిక కార్యకర్త చేతన్ అన్నారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన చేతన్ తాను జైలులో ఉండగా తన కుటుంబ సభ్యులను ఎవరినీ చూడడానికి అనుమతించలేదన్నారు. తనను జైలులో ఆరుమంది ఉన్న సెల్‌లో ఉంచారని, రెండవసారి జైలుకు వెళ్లినప్పుడు నలభైమంది ఉన్న బ్యారెక్‌లో ఉంచారన్నారు. అందరిలాగే తానూ జైల్లో పని చేశానన్నారు. జైలులో పెట్టే భోజనం బాగా ఉండేదన్నారు. మరి దర్శన్‌కు ఎందుకు నచ్చడం లేదో, పదే పదే ఇంటి భోజనం కావాలని ఎందుకు కోరుతున్నాడో తెలియడం లేదన్నారు.

వయనాడులో కన్నీటి గాథలు

- ముగ్గురు కన్నడిగులు మృతి
- కొత్త జంట సహా 10 మంది మిస్సింగ్

యశవంతపుర: కన్నడనాడుకు ఆవల కేరళలో వయనాడులో సంభవించిన ప్రకృతి విపత్తులో రానురాను మృతుల సంఖ్య పెరుగుతోంది. అందులో కర్ణాటకకు చెందిన పలువురు జాడ లేదని తెలిసింది. చామరాజనగర జిల్లాకు చెందిన నలుగురు మృతి చెందగా అనేక మంది అదృశ్యమయ్యారు. పుట్టసిద్ధ శెట్టి (62), రాణిమదర్ (50), రాజన్, రజిని అనేవారు మరణించారు. మండ్య జిల్లా కేఆర్‌పేట తాలూకా కత్తరఘట్టకి చెందిన లీలావతి అనే మహిళ, నిహాల్ అనే బాలుడు వయనాడు కొండచరియల ప్రమాదంలో గల్లంతయ్యారు. అనిల్, ఆయన భార్య ఝాన్సీ, తండ్రి దేవరాజు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

మృతులు, గల్లంతైనవారు...

ఇప్పటివరకు కర్ణాటకకు చెందిన రాజేంద్ర (50), పుట్టసిద్ధశెట్టి (62), రాణిమదర్ మృతదేహాలను రక్షణ దళాలు వెలికితీశాయి. గురుమల్లన్(10), సావిత్రి (54), సబితా (43), శివణ్ణన్ (50), అప్పణ్ణన్ (39), అశ్విన్ (13), జీతు (11), దివ్య (35), రత్న (48) అనేవారి జాడ దొరకలేదు. వీరందరూ అక్కడ పర్యాటక ప్రదేశాలను చూడడానికో, పనుల కోసమో వెళ్లి ఉన్నట్లు సమాచారం. వీరిలో కొందరు అక్కడే కొన్నేళ్లుగా స్థిర నివాసం ఏర్పరచుకున్నారు.



వయనాడులో మృతదేహాల తరలింపు దృశ్యం

సాయానికి సీఎం హామీ

సీఎం సిద్దరామయ్య కేరళ సీఎం విజయన్‌తో మాట్లాడి రక్షణ సిబ్బందితో పాటు సహాయక సామగ్రిని పంపుతామని హామీ ఇచ్చారు. మరణించిన కన్నడిగుల కుటుంబాలకు తలా రూ. ఐదు లక్షల పరిహారం అందించనున్నట్లు సీఎం ప్రకటించారు. వారి మృతిపై సంతాపం తెలిపారు. మంత్రి సంతోష లాడ్‌ను పర్యవేక్షణ కోసం వయనాడుకు పంపించారు. కర్ణాటక నుంచి కేరళకు వెళ్లే మైసూరు– సుల్తాన్ బత్తేరి–వయనాడు మార్గంలో వాహనాల సంచారాన్ని రద్దు చేశారు. బెంగళూరు నుంచి కేరళకు వెళ్లే అనేక బస్సులు బందయ్యాయి. బెంగళూరు– వయనాడు హైవేలో వాహనాలను మళ్లించారు.

హనీమూన్‌కు వెళ్లి అదృశ్యం

బెంగళూరు నుంచి వయనాడుకు హనీమూన్‌కి వెళ్లిన రెండు జంటల్లో ఇద్దరు కనిపించలేదు. బెంగళూరులో పనిచేసే ఒడిశాకు చెందిన ఇద్దరు నవ దంపతులు బసచేసిన రెస్టారెంట్ వరదలో కొట్టుకుపోయింది. రెస్టారెంట్‌కు 3 వందల మీటర్ల దూరంలో కారులో నిద్రిస్తున్న హావేరికి చెందిన కారు డ్రైవర్ మంజునాథ్ క్షేమంగా బయట పడ్డాడు. మరో జంట గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దూరంగా కారులో నిద్రించటంతో ప్రాణాలు దక్కినట్లు మంజునాథ్ తెలిపాడు. రెస్టారెంట్‌లో నిద్రించి ఉంటే తాను కూడా గల్లంతయ్యేవాడనని చెప్పాడు. అక్కడ చిక్కిన కన్నడిగులను రక్షించడానికి కర్ణాటకకు చెందిన పలు స్వయం సేవా సంఘాలకు చెందిన 15 మంది అంబులెన్స్‌ను పెట్టుకొని సేవలందిస్తున్నారు.



బుధవారం సాయంత్రం బెంగళూరు జయమహల్ రోడ్డులో జోరు వాన

స్టేషన్‌కు వస్తానన్న ప్రతాప్‌సింహ

- ఫిర్యాదు చేసిన ఏసీపీ, కేసు నమోదు

దొడ్డబళ్లాపురం: బెంగళూరు బసవేశ్వర నగర ఏసీపీ చందన్‌ను బెదిరించారంటూ మైసూరు బీజేపీ మాజీ ఎంపీ ప్రతాప్ సింహపై కేసు నమోదైంది. ఇటీవల బెంగళూరులో శునక మాంసం అంటూ మాంసం తరలింపును అడ్డుకున్న పునీత్ కెరెహళ్లిని పోలీసులు అరెస్టు చేసి నగ్నంగా హింసించారని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రతాప్‌సింహ ట్వీట్ చేశారు. తమ్ముడు పునీత్ కెరెహళ్లి విడుదలయ్యాడు. అతడిని బట్టలు విప్పి పోలీసులు హింసించారు. ఏసీపీ చందన్..నేను రేపు స్టేషన్‌కు వస్తాను. మీరూ ఉండాలి. అని పేర్కొన్నారు. ట్వీట్ ఆధారంగా ఏసీపీ చందన్.. ప్రతాప్ సింహపై స్థానిక ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రాజకీయ ఉద్దేశంతో ఇలాంటి ట్వీట్ చేసారు. కాబట్టి ప్రతాప్ సింహపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏసీపీ చందన్ ఫిర్యాదులో పేర్కొన్నారు.



మాంసం గొడవ ముదిరి పాకాన... పునీత్ కెరెహళ్లి, మాజీ ఎంపీ ప్రతాప్ సింహ

మిత్ర కూటమి కుతకుత

- ఇప్పుడు పాదయాత్ర అవసరమా?
- బీజేపీ తీరుపై కేంద్రమంత్రి కుమారస్వామి ధ్వజం
- ప్రీతంగౌడకు పెద్దపీటపై భగభగ



కుమారస్వామి, ప్రీతంగౌడ

శివాజీనగర: రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి విరుద్ధంగా బీజేపీ చేపట్టిన బెంగళూరు నుంచి మైసూరుకు పాదయాత్రకు జేడీఎస్ మద్దతు లేనట్లే కనిపిస్తోంది. పార్టీ నేత, కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి మాటలే ఇందుకు నిదర్శనం. బుధవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడిన కుమారస్వామి, మైసూరు నుంచి బెంగళూరు వరకు మా బలం ఉంది. అయినా బీజేపీ మమ్మల్ని విశ్వాసంలోకి తీసుకోవడం లేదు. పాదయాత్రకు మేమెందుకు మద్దతు ఇవ్వాలి? రాజకీయం వేరు, ఎన్నికలు వచ్చినపుడు ఒక్కటిగా ఉండటం వేరు. ఇలాంటిది నా మనస్సుకు బాధ కలిగిస్తుందని రాష్ట్ర బీజేపీ నేతలపై మండిపడ్డారు. పాదయాత్రకు ఇది తగిన సమయం కాదు. పాదయాత్ర నుండి దూరంగా ఉంటామని కుమార తెలిపారు. వరదల వల్ల ప్రజలు అవస్థలు పడుతుంటే 10 రోజులు పాదయాత్ర చేస్తే ఎవరు మెచ్చుకొంటారో తెలియదని అసంతృప్తిని వ్యక్తం చేశారు.

నైతిక మద్దతు కూడా ఇవ్వం

పాదయాత్ర చేయాలని బీజేపీ నాయకులు మాతో మాట్లాడకుండానే నిర్ణయించుకున్నారు, మాకు సమాచారం ఇచ్చారంతే. పాదయాత్ర ప్రముఖునిగా ఎవరిని ఎంపిక చేసుకొన్నారు? ఆ ప్రీతం గౌడ ఎవరు? దేవేగౌడ కుటుంబాన్ని నాశనం చేస్తానని చెప్పినవాడు. అతనితో కలిసి సభల్లో పాల్గొనాలా? అని కుమార ధ్వజమెత్తారు. హాసన్‌లో పెన్‌డ్రైవ్ పంపిణీ చేసింది ఎవరని ప్రీతంగౌడను దుయ్యబట్టారు. దీంతో ప్రీతంగౌడకు బీజేపీ పెద్దపీట వేయడమే కుమార కోపానికి కారణమని తేలింది.

గంగావళి నదిలో మళ్లీ గాలింపు

- డ్రెడ్జింగ్ యంత్రాలు రెడీ

యశవంతపుర: కారవార శిరూరు వద్ద మట్టిచరియలు విరిగి పడిన ఘటనలకు సంబంధించి కార్యచరణ నిలిచిపోయింది. అయితే ఇప్పటికీ ముగ్గురి జాడ లేదు. వారి ఆచూకీ తెలుసుకోవాలని కార్వార ఎమ్మెల్యే సతీశ్‌సైల్ పట్టుబట్టారు. నదిలోకి చేరిన మట్టిని తొలగించి వెతకాలని అధికారులకు సూచించారు. శిరూరులో హైవే–66లో కూలిన కొండ మట్టి, రాళ్లు పక్కనే ఉన్న గంగావళి నదిలోకి చేరాయి. కేరళ త్రిశూరు వ్యవసాయశాఖ డిప్యూటి డైరెక్టర్ విబిన్ నేతృత్వంలో ముగ్గురు శాస్త్రవేత్తల బృందం బుధవారం గంగావళి నది వద్దకు వెళ్లి పరిశీలించింది. ప్రమాదంలో కొట్టుకుపోయిన కేరళ లారీ జాగాను ఎమ్మెల్యే అధికారులు పరిశీలించారు. అక్కడ మట్టి, చెట్లను తొలగిస్తే జాడ దొరకవచ్చని తెలిపారు. డ్రెడ్జింగ్ యంత్రాల ద్వారా నదిలో మట్టి తొలగింపు చేపట్టనున్నారు.



అధికారులతో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బెంగళూరుకు నిధుల భాగ్యమివ్వండి

- ప్రధానికి విన్నవించాం: డీసీఎం
- సౌకర్యాల కల్పనకు అవసరం



శివాజీనగర: గిఫ్ట్ సిటీ తరహాలో బెంగళూరును పరిగణించాలి. అది సాధ్యపడకపోతే సొరంగ రహదారి, సిగ్నల్ రహిత రోడ్డు, ప్రధాన రోడ్లు, వర్షం నీటి కాలువల అభివృద్ధి కి అధిక నిధులు ఇవ్వాలని ప్రధాని మోదీకి వినతి పత్రం ఇచ్చినట్లు డిప్యూటీ సీఎం డీ.కే.శివకుమార్ తెలిపారు. బుధవారం ఢిల్లీలో విలేకరులతో ఆయన మాట్లాడారు. దేశంలో బెంగళూరు అత్యధిక పన్ను పన్ను చెల్లించే నగరం. కానీ ఈ నగరానికి కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి సహాయం లభించలేదు. మన్మోహన్ సింగ్ కాలంలో జెనర్మ్ పథకం కింద ఎలక్ట్రానిక్స్ సిటీ, హెబ్బాళ, నెలమంగల వంతెనల నిర్మాణానికి నిధులు ఇచ్చారు అని తెలిపారు. అందుచేత పై పథకాలకు కేంద్ర ప్రభుత్వం సహాయం చేయాలని కోరినట్లు చెప్పారు. బెంగళూరుకు బయటి నుండి అధికంగా ప్రజలు వస్తున్నారు. మౌలిక వసతుల అభివృద్ధి చాలా అవసరముంది. ఇందుకు నిధులు కేటాయించాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. ఈసారి బడ్జెట్లో కర్ణాటకకు నిధులు ఇవ్వలేదని ఫిర్యాదు చేశామన్నారు.

తమిళనాడుకు 84 టీఎంసీల నీరు

అప్పర్ భద్రా పథకానికి గతంలో రూ.5,300 కోట్లు నిధులు ప్రకటించారని, ఆ నిధులను ప్రస్తావించామని, అలాగే తమిళనాడుకు 40 టీఎంసీల నీరు విడుదల చేయాల్సి ఉండగా ఇప్పటికే 84 టీఎంసీలకు పైగా వదిలామని డీకే చెప్పారు. ఇంత నీటిని వదలడం చరిత్రలో ఇదే తొలిసారన్నారు. నది చుట్టుపక్కల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీచేసినట్లు తెలిపారు. మేకదాటు ప్రాజెక్టు విషయంలో కేంద్రం జోక్యం చేసుకోవాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు.

దారి తప్పి.. కటకటాల పాలు

- తపాలా ఉద్యోగి హత్య కేసు..
- భార్య, ఆమె ప్రియుడు అరెస్టు



నిందితులతో కొరటగెరె పోలీసులు

తుమకూరు: పరాయి పురుషుని మోజులో పడిన మహిళ భర్తను హత్య చేసి చివరకు కటకటాల పాలైంది. తుమకూరు జిల్లా కొరటగెరెలో ఈ దారుణం వెలుగుచూసింది. కొరటగెరె తాలూకా తుంబాడి–సిద్ధరబెట్ట మార్గంలోని కెపిటిసిఎల్ వద్ద జూలై 28వ తేదీ రాత్రి 8 గంటలకు తపాలా ఉద్యోగి ప్రకాశ్ (32) హత్యకు గురయ్యాడు. పోలీసులు విచారణ చేయగా అతని భార్య హర్షిత (28), ఆమె ప్రియుడు బెంగళూరువాసి గోవిందరాజు (36), సోమశేఖర్(27), మహేష్ (32), కంబదహళ్లికి చెందిన దర్శన్ (24), బాగూరు రంగస్వామి అనే ఆరుగురి పాత్ర బయటపడింది. దీంతో అరెస్టు చేశారు.

అనాథ అయిన చిన్నారి..

గుల్బర్గాకు చెందిన ప్రకాష్ (32)కు, కొరటగెరె దగ్గర తుంబాడికి చెందిన హర్షితకు ఇన్‌స్టా ద్వారా పరిచయమై మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి 2 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ఇలా ఉండగా గోవిందరాజ్ అనే వ్యక్తితో 3 నెలల క్రితమే హర్షిత పరారైంది. భర్త ఫిర్యాదుతో పోలీసుల ద్వారా రాజీ కుదిరింది. అయితే ప్రియుడు, ఆమె కలిసి అతన్ని అడ్డు తొలగించుకోవాలని కిరాయి హంతకులతో కలసి హత్య చేశారు. చిన్నారి కొడుకు అనాథగా మిగిలాడు. జిల్లా ఎస్పీ అశోక్ ఆధ్వర్యంలో మధుగిరి డీఎస్పీ రామకృష్ణయ్య, కొరటగెరె సీఐ అనిల్, ఎస్‌ఐలు చేతనగౌడ, యోగీష్ దర్యాప్తు చేశారు.

వీధి కుక్కలా.. క్రూర మృగాలా?



పరామర్శకు వచ్చిన ఎమ్మెల్యేతో తల్లి ఆవేదన



బాలుని ముఖంపై పెద్ద గాయం

హొసపేటె: విజయనగర జిల్లా కేంద్రం హొసపేటెలో వీధి కుక్కలతో భయం నెలకొంది. బుధవారం హొసపేటె పట్టణంలోని చిత్తవాడ్గిలో పరశురామ (4) అనే బాలునిపై కుక్కలు దాడి చేశాయి. బాలుడు ఉదయం ఇంటి నుంచి బయటకు వస్తుండగా కుక్కల గుంపు అతని మీద పడి కరిచాయి. ముఖంపై కుడివైపు కండ పెరికేశాయి. కాలికి కూడా కరవడంతో గాయాలయ్యాయి. బాలుడు గట్టిగా ఏడవడంతో స్థానికులు వచ్చి కాపాడారు, లేకపోతే ప్రాణాలే పోయేవని తెలిపారు. ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రిలో బాలుడు, చికిత్స పొందుతున్నాడు. ఎమ్మెల్యే గవియప్ప తదితరులు పరామర్శించారు. పట్టణంలో కుక్కల బెడదను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

తిరుమలకు పాదయాత్ర



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

విజయపుర: బెంగళూరులోని యలహంక శివారు నుంచి తిరుమల ఆలయానికి భక్తులు పాదయాత్రగా బయలుదేరారు. ముందుగా హార్దీపురలోని శ్రీలక్ష్మీ వెంకటరమణస్వామి ఆలయంలో పూజలు చేశారు. భక్తుడు అత్తూరు శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలా పాదయాత్ర చేపట్టడం 29వ సంవత్సరమని తెలిపారు. కోలారు ప్రధాన రహదారి మీదుగా నడుస్తూ తిరుమలకు చేరుకొంటామన్నారు విజయ రాఘవేంద్ర, మాగడి వీరేష్, యలహంక హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు అందజేత



విద్యార్థులకు కిట్లు అందజేసిన దృశ్యం

బనశంకరి: బైరతి బండే ప్రాథమిక పాఠశాల, బైరతిబండే అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు సోమలరాజు ఫౌండేషన్ స్థాపకుడు శివరాజు ఆధ్వర్యంలో బుధవారం స్కూల్‌బ్యాగులు, నోటుపుస్తకాలు, వాటర్‌బాటిల్స్ ఉచితంగా అందజేశారు. బెంగళూరు నగరంలో పలు పాఠశాలల్లో పేద విద్యార్థుల అభివృద్ధికి తమ ఫౌండేషన్ కృషి చేస్తోందని ఆయన తెలిపారు. దాతలు డాక్టర్ జీకే. పణికుమార్, బాలకిషోర్, మల్లిక, వెంకటేశ్వరరాజు, నరసరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు అనిత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో వసతుల మెరుగునకు సూచనలు



మాట్లాడుతున్న జడ్జి జయంత్‌కుమార్

తుమకూరు: రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు అంగన్ వాడీ కేంద్రాలను సందర్శించి తనిఖీలు చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ చైర్మన్ జయంత్ కుమార్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మంచినీరు, ప్రాథమిక చికిత్స పరికరాలు, మౌలిక సౌకర్యాలను పరిశీలించడంతో పాటు అక్కడి సమస్యలను ఆలకించినట్లు తెలిపారు. జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ మెంబర్ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి నూరున్నీసా మాట్లాడుతూ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుభ్రతను కాపాడి పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించామన్నారు. కొన్ని అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు చేయించాలని, ఇతర మౌలిక వసతుల కల్పనలో ఉన్న లోపాలను త్వరగా సరిచేయాలని సూచించినట్లు తెలిపారు.

లవ్ జిహాద్ నిందితుడు అరెస్ట్

హుబ్లీ: జిల్లాలోని కలఘటిగి పట్టణంలో జైన్ మతానికి చెందిన మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి వేధించిన వ్యక్తిని కలఘటిగి పోలీసులు అరెస్ట్ చేశారు. ముజాహిద్‌ఖాన్ అనే వ్యక్తి మతాంతరం పేరుతో తనను వేధించాడని సదరు బాధిత మహిళ అశ్విని పద్మరాజ జైన్ కలఘటిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఐ శ్రీశైల కౌజలిగి, ఎస్‌ఐ బసవరాజ యల్లదగుడ్డ ఆధ్వర్యంలో నిందితుడిని అరెస్ట్ చేశారు.

వికటించిన మధ్యాహ్న భోజనం

- 62 మంది విద్యార్థులకు అస్వస్థత



విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకాలోని బడేలడకు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న 62 మంది విద్యార్థులు కడుపు ఉబ్బరంతో బాధపడుతుండగా గమనించిన ఉపాధ్యాయులు వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. పాఠశాలలో మధ్యాహ్న వేడి భోజనం తిన్న అనంతరం విద్యార్థులు కడుపునొప్పిబారిన పడటంతో వారిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు విద్యార్థులను పరీక్షించి వైద్య సేవలు అందించారు. ఈ విషయం తెలుసుకున్న కూడ్లిగి ఎమ్మెల్యే డాక్టర్ ఎన్‌టీ శ్రీనివాస్ వెంటనే ఆస్పత్రికి చేరుకొని విద్యార్థులు యోగక్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. తల్లిదండ్రులు భయపడాల్సిన పని లేదని, వైద్యులు అన్ని విధాలుగా చికిత్సను అందిస్తున్నారన్నారు.

శివమొగ్గ నగరంలో ముంపు ముప్పు

- చొచ్చుకొచ్చిన తుంగా నది జలాలు
- బాధిత ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన



రాత్రివేళ లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షిస్తున్న కమిషనర్

శివమొగ్గ: గాజనూరు సమీపంలోని తుంగా రిజర్వాయర్ నుంచి భారీగా నీటిని విడుదల చేయడంతో శివమొగ్గ నగరంలో తుంగా నది ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తోంది. నది వెంబడి కొన్ని నివాస ప్రాంతాల్లో మంగళవారం రాత్రి రోడ్లు జలమయమయ్యాయి. దీంతో నగర కమిషనర్ కవితా యోగప్పనవర్ తమ అధికారులు, సిబ్బందితో కలిసి నగరంలోని తుంగా నది ఒడ్డున ఉన్న లోతట్టు ప్రాంతాలో పర్యటించి ప్రజలకు జాగ్రత్తలు చెప్పారు. సీగేహట్టిలో ముందుజాగ్రత్త చర్యగా పెద్ద సంఖ్యలో కుటుంబాలను కార్పొరేషన్ యంత్రాంగం రాత్రికి రాత్రే తరలించింది. సంరక్షణ కేంద్రాల్లో వారికి భోజన, వసతి ఏర్పాట్లు చేశారు. నది ఒడ్డున ఉన్న లోతట్టు ప్రాంతాల వాసులు మంగళవారం రాత్రి నిద్రలేకుండా గడిపారు. తుంగా నదిలో భారీగా నీరు ప్రవహించడం, కొన్ని చోట్ల నదీజలాలతో రోడ్లన్నీ జలమయం కావడంతో తమ ఇళ్లలోకి కూడా ఎక్కడ నీరు చొరబడుతుందో అనే ఆందోళనతో కాలం గడుపుతున్నారు.

పొంచి ఉన్న మరింత ప్రమాదం

బుధవారం ఉదయం సమాచారం మేరకు గాజనూరు తుంగా జలాశయం నుంచి సుమారు 82 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో శివమొగ్గ నగరంలో తుంగా నది ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తోంది. డ్యాం నుంచి విడుదల చేసే నీటి పరిమాణం పెరిగితే నగరం చుట్టుపక్కల లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. కమిషనర్ మాట్లాడుతూ సంరక్షణ కేంద్రాల్లో వారికి భోజన, వసతి ఏర్పాట్లు చేశామన్నారు. ప్రవాహం తగ్గుముఖం పట్టే వరకు నది ఒడ్డున ఉన్న లోతట్టు ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించామన్నారు.



నీట మునిగిన నంజనగూడులోని ప్రధాన రహదారి



నీట మునిగిన నదీ తీరంలోని ఆలయం

వరద ముట్టడిలో దక్షిణ కాశీ

- శ్రీకంఠేశ్వర ఆలయం వరకూ కపిలా నది జలాలు

మైసూరు: కేరళలోని వయనాడు ప్రాంతంలో కురిసిన కుంభవృష్టితో మైసూరు జిల్లాలోని కబిని జలాశయానికి భారీగా వరద పోటెత్తింది. దీంతో జలాశయం నుంచి 70,750 క్యూసెక్కుల నీటిని నదికి వదులుతుండటంతో కపిలా నది ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తోంది. దీంతో దక్షిణ కాశీగా పేరొందిన నంజనగూడులో ముంపు భయం నెలకొంది. నంజనగూడు పట్టణంలోని మల్లనమూలె మఠం సమీపంలోని మైసూరు- నంజనగూడు హైవే రెండో సారి జలమయమైంది. నది ఒడ్డున ఉన్న శ్రీ బసవేశ్వర సహిత మల్లన మూలె మఠం, లింగభటర గుడి, కాశీ విశ్వనాథ స్వామి దేవాలయం, చాముండేశ్వరి, అయ్యప్ప స్వామి, దత్తాత్రేయ స్వామి, పరశురామ ఆలయాలు పూర్తిగా నీట మునిగాయి. లోతట్టు ప్రాంతంలోని వందలాది ఎకరాల పొలాలె, శ్మశానవాటికలు కూడా నదిలో మునిగాయి. శ్రీకంఠేశ్వరాలయం చుట్టుపక్కల ముడికట్ట, సోపానకట్ట, దాసోహభవనంతో పాటు అనేక ప్రాంతాలు, కొన్ని ఇళ్లు మునిగిపోయాయి. నంజనగూడు తాలూకా యంత్రాంగం అన్ని పాఠశాలలు, కాలేజీలకు సెలవు ప్రకటించింది. జిల్లాలో పిరియాపట్టణ తాలూకాలోని లోతట్టు ప్రాంతాల్లోకి కావేరి నది నీరు ప్రవేశించడంతో పాటు తాలూకాలోని ముత్తినముళసోగె గ్రామంలో రోడ్లు, రైతుల పొలాలు జలమయమయ్యాయి. క్షణక్షణానికి పెరుగుతున్న వరద నీటిలో చాలా పంటలు నీట మునిగాయి.

పగలు పందుల పెంపకం.. రాత్రిళ్లు చోరీలు

- ముగ్గురు ఘరానా దొంగల ముఠా అరెస్ట్
- రూ.47 లక్షల చోరీ సొత్తు స్వాధీనం




స్వాధీనం చేసుకున్న నగలతో పోలీసు అధికారులు

మండ్య: పగలు పందులను పోషిస్తూ రాత్రిళ్లు ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు ఘరానా దొంగలకు బేడీలు పడ్డాయి. మద్దూరు తాలూకా అబ్లూరు గ్రామానికి చెందిన శేఖర్(54), క్యాతఘట్ట గ్రామానికి చెందిన కృష్ణ (52), వెంకటేష్ (65) అనే దొంగలను మళవల్లి పోలీసులు అరెస్టు చేశారు. నిందితులనుంచి రూ.47 లక్షల విలువైన 650 గ్రాముల బంగారం, 170 గ్రాముల వెండి, స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ మల్లికార్జున బాలదండి బుధవారం వివరాలు వెల్లడించారు. నిందితులు పందుల పెంపకంతో జీవనం సాగిస్తూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రిపూట దొంగతనాలు చేసేవారని తెలిపారు. ఈక్రమంలో మార్చి 9న కిరుగావలు గ్రామంలో సంతెమాళద కమలమ్మ అనే మహిళ తన కుటుంబంతో కలిసి బెంగళూరు వెళ్లిందని, పసిగట్టిన నిందితులు ఇంటిలోకి చొరబడి 55 గ్రాముల బంగారు, రూ. 80 వేల డబ్బు చోరీ చేశారన్నారు. మద్దూరు తాలూకాలోని బెసగరహళ్లి, కె.ఎం.దొడ్డి, మళవల్లి తాలూకాల్లోని హలగూరు, బెళకవాడి, మళవల్లి గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 14 చోట్ల చోరీలకు పాల్పడ్డారని ఎస్పీ తెలిపారు. నిందితులు 30 ఏళ్లుగా దొంగతనాలకు పాల్పడుతున్నారని, మండ్య, మైసూరు, బెంగళూరు, రామనగర సహా పలు జిల్లాల్లో వీరిపై 40 కేసులు నమోదయ్యాయన్నారు. ఏఎస్పీలు తిమ్మయ్య, గంగాధరస్వామి, మళవల్లి డీఎస్పీ వి.కృష్ణప్ప ఆధ్వర్యంలో హలగూరు సీఐ బీఎస్ శ్రీధర్, ఎస్‌ఐలు డి.రవికుమార్, వీసీ అశోక్, బి.మహేంద్రతో కూడిన బృందం నిందితులను అరెస్ట్ చేసిందని ఎస్పీ తెలిపారు. చోరీల నియంత్రణకు రాత్రి గస్తీ వ్యవస్థను పటిష్టం చేసినట్లు తెలిపారు.

తుంగభద్రకు వరద యథాతథం

- ఎగువ నుంచి డ్యాంకు మళ్లీ లక్ష క్యూసెక్కులకు పెరిగిన ఇన్‌ఫ్లో



తుంగభద్ర డ్యాం

హొసపేటె: తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. సోమవారం 1,31,179 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో మంగళవారానికి 68,630 క్యూసెక్కులకు పడిపోయింది. అయితే ఎగువన వర్షాలు ఊపందుకోవడంతో బుధవారం ఇన్‌ఫ్లో 1,05,973 క్యూసెక్కులకు పెరిగింది. శివమొగ్గ, మొరాళ్లు, తీర్థహళ్లి, శృంగేరి, ఆగుంబే, మంగళూరు తదితర పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వానలకు వరద పోటెత్తుతోంది. దీంతో 33 గేట్లలో 25 గేట్లను మూడున్నర అడుగులు, మిగతా 8 గేట్లను ఒక అడుగు పైకి ఎత్తి లక్షా 48వేల క్యూసెక్కుల నీటిని దిగువన నదికి విడుదల చేశారు. డ్యాంలో నీటి మట్టం 1631 అడుగులకు చేరగా నీటినిల్వ 99.705 టీఎంసీలుగా నమోదైంది. దిగువకు భారీగా నీటిని విడుదల చేయడంతో హంపీలోని అనేక మంటపాలు, స్మారకాలు నీట మునిగాయి. ఎగువ నుంచి వరద మరింత పెరిగే సూచనలు ఉన్నాయని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

తమిళనాడు పోలీసుల అదుపులో ఔషధ వ్యాపారి

హుబ్లీ: తమిళనాడులో నిషేధించిన ఓ ఔషధాన్ని విక్రయించాడన్న ఆరోపణలపై ధార్వాడలోని రాజస్థాన్ ఔషధాల అంగడి యజమానిని తమిళనాడు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. మెడికల్ షాపు యజమాని అనిల్ షాను తమిళనాడు కోయంబత్తూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ రాష్ట్రంలో నొప్పి నివారణ మాత్రను అక్కడి వ్యసనపరులు డ్రగ్స్‌గా మార్చుకొని వినియోగించుకుంటున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఈ ఔషధాన్ని నిషేధించారు. తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి ధార్వాడకు వచ్చి రాజస్థాన్ మెడికల్ షాపులో ఆ మాత్రలను కొనుగోలు చేసుకొని వెళుతూ తమిళనాడు పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిని విచారించగా ధార్వాడలోని రాజస్థాన్ మెడికల్ షాపులో కొనుగోలు చేసినట్లుగా చెప్పడంతో పోలీసులు సదరు షాపు యజమానిని అదుపులోకి తీసుకున్నారు. కాగా అనిల్ షాను తమిళనాడు పోలీసులు అదుపులోకి తీసుకోగా ఆయన కుటుంబ సభ్యులు ధార్వాడ టౌన్ పోలీసులకు కిడ్నాప్ చేశారని కేసు పెట్టడానికి వెళ్లగా ధార్వాడ పోలీసులు అసలు విషయాన్ని సదరు కుటుంబ సభ్యులకు వివరించారు.

భార్యా హంతకుడికి జీవిత ఖైదు

బళ్లారిఅర్బన్: మద్య వ్యసనానికి బానిసైన భర్త చేతిలోనే కిరాతకంగా హత్యకు గురైన భార్య కేసులో నిందితుడికి జిల్లా కోర్టు న్యాయమూర్తి యావజ్జీవ శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు. మోకా పోలీస్ స్టేషన్ పరిధిలో పాత మోకా గ్రామంలోని తిమ్మప్ప గుడి దగ్గర నిందితుడు కొల్లి దేవేంద్రప్ప, భార్య రంగమ్మ, పిల్లలతో నివాసం ఉండేవారు. మద్యానికి అలవాటు పడిన భర్త నిత్యం మద్యం మత్తులో భార్య పిల్లలను వేధించేవాడు. ఈ క్రమంలో 2022 జూలై 5న రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వచ్చిన దేవేంద్రప్ప భార్య శీలాన్ని శంకించడమే కాక మద్యానికి డబ్బులు ఇవ్వమని రంగమ్మను తీవ్రంగా కొట్టాడు. అయితే ఆమె తన వద్ద డబ్బులు లేవు అని చెప్పడంతో ఆగ్రహానికి గురైన నిందితుడు నోటికొచ్చినట్లుగా ఆమెను నిందిస్తూ కొడవలితో ఆమెపై దాడి చేశాడు. దీంతో ఆమె చేతులు, కాళ్లకు తీవ్రంగా గాయాలయ్యాయి. తలపై కూడా రక్త గాయం ఏర్పడిన రంగమ్మ అక్కడికక్కడే మరణించిందని సాక్షుల వాంగ్మూలం సేకరించిన పీడీహళ్లి సీఐ ఉమేష్ ఆ మేరకు కోర్టులో చార్జిషీట్ సమర్పించారు. కేసు మొత్తం విచారణ, సాక్షుల వాంగ్మూలం అనంతరం బళ్లారి రెండో జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వీపీ ప్రమోద్ నిందితుడికి యావజ్జీవ శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించలేని పక్షంలో రెండు నెలల పాటు అదనంగా శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున న్యాయవాది లక్ష్మీదేవి పాటిల్ ఈ కేసును వాదించారు.

కోలారు వార్తలు...

హుండీ ఆదాయం రూ.64 లక్షలు



హుండీ లెక్కింపు జరుగుతున్న దృశ్యం

మాలూరు: ప్రసిద్ధ చిక్కతిరుపతి ప్రసన్న వేంకటేశ్వర ఆలయంలోని మూడు హుండీలను బుధవారం తహసీల్దార్ రమేష్, ఈఓ సెల్వమణి, దేవాదాయ శాఖ అధికారిణి పద్మావతి సమక్షంలో లెక్కించారు. నాలుగు నెలల కాలంలో 64,48,825 నగదు, 50 గ్రాముల బంగారు, 545 గ్రాముల వెండి ఆభరణాలు భక్తులు సమర్పించినట్లు లెక్కింపులో తేలిందన్నారు.

కన్నడ సంస్కృతిని పరిరక్షించాలి



కన్నడ జ్యోతి రథానికి స్వాగతం పలికిన దృశ్యం

శ్రీనివాసపురం: కన్నడ సంస్కృతి, భాషను పరిరక్షించాలని తహసీల్దార్ సుధీంద్ర పిలుపునిచ్చారు. కన్నడ నాడుకు కర్ణాటక అని పునః నామకరణం చేసి 50 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న కన్నడ జ్యోతి రథం బుధవారం పట్టణంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా తహసీల్దార్, స్థానికులు, కన్నడ అభిమానులు రథానికి ఘన స్వాగతం పలికారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కన్నడపై అభిమానం కలిగి ఉండాలన్నారు. కసాప జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ కన్నడిగులు ప్రపంచంలో ఎక్కడున్నా మాతృభాషను కాపాడుకోవాలన్నారు. ఈఓ రవి, బీఈఓ బీసీ మునిలక్ష్మయ్య, బీఆర్‌సీ కేసీ వసంత, ముఖ్యాధికారి వైఎస్ సత్యనారాయణ్, సీఐ ఎం.బి.గొరవనహళ్లి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి



త్రిచక్రవాహనాల తాళాలు అందిస్తున్న ఎమ్మెల్యే రూపాశశిధర్

కేజీఎఫ్ : దివ్యాంగులు ప్రభుత్వ సౌలభ్యాలను వినియోగించుకొని జనజీవనస్రవంతిలో కలిసిపోవాలని ఎమ్మెల్యే రూపా శశిధర్ పిలుపు నిచ్చారు. బుధవారం ఆమె తహసీల్దార్ కార్యాలయం వద్ద 26 మంది దివ్యాంగులకు త్రిచక్రవాహనాలు అందించి మాట్లాడారు. దివ్యాంగులకు వికలాంగుల సంక్షేమ శాఖ అనేక సౌలభ్యాలు అందజేస్తోందన్నారు. దివ్యాగులను ఆదరించి ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వికలాంగ శాఖ రమణప్ప, ఇమ్రాన్‌పాషా, తహసీల్దార్ నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ.. ఒకరు మృతి



ఘటనా స్థలంలో ప్రమాద దృశ్యం

సాక్షి, బళ్లారి: విజయపుర జిల్లాలో కేఎస్‌ఆర్‌టీసీ బస్సు, జీపు ఢీకొని ఒకరు మృతి చెందారు. బుధవారం సాయంత్రం విజయపుర- హుబ్లీ జాతీయ రహదారి- 52లో కేఎస్‌ఆర్‌టీసీ బస్సు బొలెరో వాహనం ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే డ్రైవర్ మృతి చెందారు. మహారాష్ట్రకు చెందిన ఎర్టిగా వాహనం బస్సును ఢీకొనడంతో ఒకరు మృతి చెందడంతో పాటు ముగ్గురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటనలో ఎర్టిగా వాహనం నుజ్జునుజ్జయింది. అక్కడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలుషిత నీరు తాగి 30 మంది ఆస్పత్రి పాలు



చికిత్స పొందుతున్న గ్రామస్తులు

రాయచూరు రూరల్: కలుషిత నీరు తాగి 30 మంది ఆస్పత్రి పాలైన ఘటన మంగళవారం రాత్రి రాయచూరు జిల్లా లింగసూగూరు తాలూకా హాలుబావి తాండలో చోటు చేసుకుంది. వేసవిలో గ్రామంలోని బోరుబావులు చెడిపోయాయి. తాగునీటి ట్యాంకులో బ్లీచింగ్, క్లోరిన్ పౌడర్లు వేయనందున శుద్ధీకరించిన మంచినీటిని సరఫరా చేపట్టకపోవడంతో కలుషిత నీటిని తాగి వాంతులు, విరోచనాలు అధికం కావడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. యోగీశ్వరి(8), దిలీప్(4), సునీత(21), చంద్రమ్మ(44), జుమ్మాబాయి(28), గోజిబాయి(72), కమలాబాయి(28), నందీష్(14), ప్రవీణ్ కుమార్(5), శివప్ప(29), విఠల్(30), రవి(20)లు చికిత్స పొందుతున్నారు.

ఉపాధ్యాయుడి బదిలీని రద్దు చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

శ్రీనివాసపురం: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం ఎం.భైరేగౌడ బదిలీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఉద్యమించారు. ఈమేరకు తల్లిదండ్రులతో కలిసి పాఠశాల ఆవరణలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఎస్‌ఎండీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ పాఠశాలలో ఎల్‌కేజీ నుంచి 8వ తరగతి వరకు 520 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి ఉత్తమ బోధన అందజేసేలా హెచ్‌ఎం చర్యలు తీసుకున్నారన్నారు. ఇటీవల ఆయన్ను ముదిమడుగు ఉన్నత పాఠశాలకు బదిలీ చేశారన్నారు. కమిషనర్, డీఈఓను కలిసి ఆయన బదిలీని రద్దు చేయాలని వినతిపత్రం ఇచ్చామన్నారు. ఆయన్ను ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో తహసీల్దార్ కార్యాలయం ముందు విద్యార్థులతో కలిసి ప్రతిఘటన నిర్వహిస్తామని హెచ్చరించారు.

మానవ అక్రమ రవాణాను అడ్డుకోవాలి



సదస్సును ప్రారంభిస్తున్న జిల్లా కానూను సేవల ప్రాధికార కార్యదర్శి సునీల్ ఎస్ హొసమని

కోలారు: మానవ అక్రమ రవాణాను అడ్డుకోవాలని జిల్లా కానూను సేవల ప్రాధికార కార్యదర్శి సునీల్ ఎస్ హొసమని సూచించారు. మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రజలను చైతన్యపరిచేందుకు జిల్లా యంత్రాంగం, జిల్లా న్యాయసేవల ప్రాధికార ఆధ్వర్యంలో నగరంలోని బాలికల ప్రభుత్వ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సదస్సులో సునీల్ ఎస్ హొసమని పాల్గొని మాట్లాడారు. మానవ అక్రమ రవాణా గురించి తెలిస్తే1091కి ఫోన్ ద్వారా సమాచారం అందించాలన్నారు. బాలలను పనిలో పెట్టుకున్నా సమాచారం ఇవ్వాలన్నారు. కేజీఎఫ్ జిల్లా పిల్లల రక్షణాధికారి వీ నాగరత్న, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన తర్వాతే నిర్మాణాలకు అనుమతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్

కోలారు: స్థల పరిశీలన జరిపిన తర్వాతనే కట్టడాల నిర్మాణానికి నగరాభివృద్ధి ప్రాధికార అనుమతులు ఇవ్వాలని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ సూచించారు. నగరంలోని కేయూడీఏ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనమతులు ఒకదానికి తీసుకుని మరోవిధంగా నిర్మాణాలు సాగిస్తుంటారని తెలిపారు. ప్రైవేటు లే అవుట్లలో ప్లాన్ల ప్రకారం నిర్మాణాలు జరుగుతున్నాయా అనేది తెలుసుకోవాలన్నారు. నగరంలో సుమారు తొమ్మిది కిలోమీటర్ల మేర రింగ్ రోడ్డు పనులకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందన్నారు. ఎమ్మెల్సీ ఎం ఎల్ అనిల్‌కుమార్, కేయూడీఏ అధ్యక్షుడు మహ్మద్ హనీఫ్, డిప్యూటీ కలెక్టర్ మంగళ, కయూడీఏ కమిషనర్ శ్రీనాథ్ పాల్గొన్నారు.

బైక్ దొంగ అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

కేజీఎఫ్ : బైక్ చోరీలకు పాల్పడుతున్న శ్రీనివాసపురం పట్టణానికి చెందిన మన్సూర్(27) అనే దొంగను బంగారుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడినుంచి రూ.2.5లక్షల విలువైన ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నంజప్ప తెలిపారు.

క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి

శ్రీనివాసపురం: క్రీడల ద్వారా మానసిక,దైహిక ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి అన్నారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులకు తాలూకాలోని రాయల్పాడు ఫిర్కా కండ్లవారిపల్లి కావేరి పబ్లిక్ పాఠశాలలో బుధవారం నిర్వహించిన క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తాలూకాలోని రాయల్పాడు, గౌనిపల్లి, లక్ష్మీపుర, యల్దూరు, సుగటూరు గ్రామాల్లో మినీ క్రీడామైదానం నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. తాలూకాలో ఉద్యోగ సృష్టి కోసం ఐదు వేల ఎకరాల్లో పారిశ్రామిక వాడ నిర్మించడానికి ప్రభుత్వ స్థాయిలో చర్చలు చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ జీఎస్ సుధీంద్ర మాట్లాడుతూ గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో బీఈఓ బీసీ మునిలక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గురువులను మరువరాదు


గురువులతో పూర్వ విద్యార్థులు

గౌరిబిదనూరు: విద్యార్థి దశలో క్రమశిక్షణ అలవరచుకొంటే జీవితం సజావుగా సాగుతుందని విశ్రాంత ఉప ప్రిన్సిపాల్ ఆర్ఎస్ మైలారప్ప అన్నారు. పట్టణంలోని ఆచార్య పాఠశాల ఆవరణలో మంగళవారం 1988–89 బ్యాచ్ విద్యార్థులు ఏర్పాటు చేసిన గురువందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల, మతాలను పక్కనపెట్టి సమాజంలో సమానతకు కృషి చేయాలన్నారు. విద్యా సంస్థ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ఉన్నత స్థాయికి ఎదిగినా చదువు చెప్పిన గురువులను మరువకూడదన్నారు. అనంతరం గురువులు తిమ్మయ్య, గంగాధరయ్య, నాగరాజు, ఎన్ఆర్ గీతను ఘనంగా సన్మానించారు.

ముడా స్కాంపై ఆధారాలున్నాయి

బనశంకరి: మైసూరు ముడా ఇళ్ల స్థలాల కుంభకోణానికి సంబంధించి 25 పేజీలు కీలక ఆధారాలను లోకాయుక్త కు అందజేసినట్లు అవినీతి వ్యతిరేక వేదిక అధ్యక్షుడు ఎన్ఆర్.రమేశ్ తెలిపారు. బుధవారం ఆయన నగరంలో విలేకరులతో మాట్లాడుతూ.. ముడాలో అక్రమంగా స్థలాల కేటాయింపు ద్వారా ప్రభుత్వానికి రూ.60 కోట్ల నష్టం వచ్చిందని, దీనిపై 400 పేజీలతో పూర్తి ఆధారాలను అందజేశామన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య కుటుంబసభ్యులు, కొందరు అధికారులపై ముఖ్యమైన ఆధారాలు ఉన్నాయని చెప్పారు. 2004–2006 అవధిలో ధరంసింగ్ మంత్రివర్గంలో ఆర్థిక మంత్రిగా, మైసూరు జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రిగా ఉన్న సిద్దరామయ్య ఒత్తిడితో అప్పటి జిల్లా కలెక్టర్, తహశీల్దార్లు అక్రమంగా భూ పరివర్తన, స్థలాల కేటాయింపులు చేశారని ఆరోపించారు.

నేటి నుంచి ప్రవచనాలు


సామవేదం షణ్ముఖశర్మ

బనశంకరి: డాక్టర్ బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనాలు బెంగళూరులోని మారతహళ్లి న్యూ హారిజోన్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. మనకోసం-మంచిగాథలు-బోధలు శీర్షికన ఈ ప్రవచనాలు ఈనెల 7వరకు కొనసాగుతాయి. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి హాజరై ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని బెంగళూరు రుషిమఠం సత్సంగ సభ్యులు కోరారు.

17న బృహత్ ఉద్యోగమేళా


వివరాలు వెల్లడిస్తున్న ఎన్ఆర్.రమేశ్

బనశంకరి: బెంగళూరులోని పద్మనాభనగర దేవెగౌడ పెట్రోల్ బంక్ సమీపంలోని కార్మెల్ స్కూల్ పక్కన ఉన్న పుట్టలింగయ్య క్రీడామైదానం, పాఠశాల సభాంగణంలో ఈనెల 17న బృహత్ ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు అవినీతి వ్యతిరేక వేదిక అధ్యక్షుడు ఎన్ఆర్.రమేశ్ తెలిపారు. ఉదయం 9 గంటలకు మేళా ప్రారంభమవుతుందన్నారు. 150కి పైగా కంపెనీల ప్రతినిధులు హాజరై నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీతోపాటు ఐటీఐ, డిప్లొమా పాస్ లేదా ఫెయిల్ అయినవారు మేళాలో పాల్గొనవచ్చన్నారు.

రెండు బస్సులు ఢీ

యశవంతపుర: రెండు బస్సులు ఢీకొన్న ఘటనలో డ్రైవర్ గాయపడిన ఘటన ఉడుపి జిల్లా ఇంద్రాళిలో బుధవారం ఉదయం జరిగింది. ఉడుపి నుంచి మణిపాల్‌కు వెళుతున్న సిటీ బస్సును వేగంగా వెళుతున్న ఎక్స్‌ప్రెస్ బస్సు ఢీకొంది. ప్రమాదంలో సిటీబస్సు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది.

అభివృద్ధి పనులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రమేశ్ బండిసిద్దేగౌడ

మండ్య: తాలూకాలోని శ్రీరంగపట్న నియోజకవర్గం బేలూరు గ్రామ ఎస్సీ కాలనీలో రూ.కోటి సాంఘిక సంక్షేమ శాఖ నిధులతో రోడ్లు, మురుగు కాలువల పనులకు సెస్కు అధ్యక్షుడు, ఎమ్మెల్యే రమేశ్ బండిసిద్దేగౌడ బుధవారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ త్వరలో రూ.10 కోట్లతో నీటిపారుదల శాఖ పనులను చేపడతామన్నారు. ఇందుకోసం ప్రత్యేక నిధులు అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. కాంట్రాక్టర్ గంగాధర్ సిద్దరాజు, జెడ్పీ మాజీ అధ్యక్షుడు తగ్గహళ్లి వెంకటేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్ మిత్ర, జీపీ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో అన్నదాత జోరు

- రాష్ట్రంలో ఆశించిన మేర వర్షపాతం
- సంతోషంలో రైతాంగం
- 76 శాతం మేర వరి నాట్లు పూర్తి


బెళగావి ప్రాంతంలో వరినాట్లు


కలుపు నివారణకు గుంటికలతో సేద్యం పనులు

సాక్షి బెంగళూరు: రాష్ట్రంలో ఈసారి ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సాధారణం కంటే అధికంగా నమోదయ్యాయి. కొన్ని చోట్ల ఆశించిన దాని కంటే అధికంగా వర్షపాతం నమోదు కాగా మరికొన్ని ప్రాంతాల్లో వర్షాభావం ఏర్పడింది. రాష్ట్రంలో మొత్తం 82.48 లక్షల హెక్టార్లలో విత్తన నాట్లు లక్ష్యంగా చేసుకోగా, అందులో 62.36 లక్షల హెక్టార్లలో(76శాతం) ఇప్పటివరకు విత్తన నాట్లు పడ్డాయి. చిత్రదుర్గ వంటి ఉత్తర కర్ణాటక జిల్లాల్లో వర్షాలు ఆశించిన దాని కంటే అధికంగా కురవడంతో రైతులు ఉత్సాహంగా విత్తన నాట్లకు అడుగులు ముందుకు వేస్తున్నారు. కోలారు తదితర జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో రాగులు విత్తగా రెండు వారాలు అయినప్పటికీ మొలకలు కూడా రాలేదు. ఈ నేపథ్యంలో మరోసారి విత్తనాలను నాటాలని రైతులు ఆలోచనలు చేస్తున్నారు. అయితే వరుణుడు మరోసారి ముఖం చాటేస్తే ఇబ్బందుల్లో చిక్కుకుంటామని రైతులు వెనుకంజ వేస్తున్నారు.

గత మూడేళ్లలో రైతులకు నష్టాలు

రాష్ట్రంలో గడిచిన మూడేళ్లుగా ఖరీఫ్‌లో వర్షాలు సరిగ్గా లేక పంట సాగు తగ్గిపోయింది. అయితే ఈసారి సాధారణం కంటే అధికంగా వర్షాలు కురిశాయి. ఎక్కడ కూడా విత్తనాలు, రసాయనాలు, ఎరువుల కొరత కనిపించలేదు. దీంతో ఆశించిన మేర విత్తన నాట్లు పడే అవకాశాలు ఉన్నాయి. బాగలకోటె, బీదర్, బెళగావి, ధారవాడ, గదగ, హావేరి, కలబురిగి, విజయపుర వంటి ఉత్తర కర్ణాటక జిల్లాల్లో 96–100 శాతం విత్తనాలను రైతులు నాటారు. కొడగు, రామనగర, కోలారు, బళ్లారి వంటి జిల్లాల్లో విత్తన నాట్లు చాలా తక్కువగా ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం 82.48 లక్షల హెక్టార్లలో పంటల సాగుకు లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 62.36 లక్షల హెక్టార్లలో విత్తన నాట్లు పడ్డాయి. ఇందులో ఏకదళ విత్తనాలు 36.33 లక్షల హెక్టార్లలో సాగు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 21.02 లక్షల హెక్టార్లలో మాత్రమే చేశారు. ఇక ద్విదళ ధాన్యాలు 21.19 లక్షల హెక్టార్లలో సాగు చేయాలని లక్ష్యాన్ని నిర్ధేశించుకోగా, ఇప్పటివరకు 99 శాతం అనగా 21.02 శాతం విత్తన నాట్లు పడ్డాయి. మొత్తంగా 73 శాతం మేర పంటల సాగు ప్రగతి దశలో ఉంది. ఇక వాణిజ్య పంటల్లో 15.18 లక్షల హెక్టార్ల పైకి 12.96 లక్షల హెక్టార్లలో విత్తన నాట్లు పడ్డాయి. ఇంకా ఆగస్టు 15 వరకు విత్తన నాట్లకు అవకాశం ఉన్నందునా వ్యవసాయ కార్యకలాపాలు ఇంకా వేగాన్ని సంతరించుకుంటాయని వ్యవసాయ శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన జెడ్పీ సీఈఓ


మంచినీటి వ్యవస్థను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ హేమంత్

శివమొగ్గ: భద్రావతి తాలూకాలోని పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహాన్ని జెడ్పీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) ఎన్.హేమంత్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. జిల్లాలోని కొన్ని ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు సరైన సౌకర్యాలు అందడం లేదని అందిన ఫిర్యాదులపై ఆయన స్పందించి ఈ తనిఖీలు చేపట్టారు. హాస్టల్‌లోని మంచినీటి వ్యవస్థ, వంటగది, మరుగుదొడ్లు సహా ప్రతి గదిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను ఆలకించారు. వారితో కలిసి భోజనం చేశారు. ఆహారం రుచి, నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. క్రమశిక్షణతో వ్యవహరించి కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. భద్రావతి తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారి, సాంఘీక సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు, హాస్టల్ సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యను చక్కదిద్దాలి

- అధికారులకు మైసూరు కలెక్టర్ ఆదేశం
- బాధిత ప్రాంతాల్లో పర్యటన


నిరాశ్రితులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

మైసూరు: కేఆర్ఎస్, కబిని జలాశయాల నుంచి భారీగా నీరు వస్తున్నందున ముంపు సమస్యలపై జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు జిల్లాధికారి లక్ష్మీకాంతరెడ్డి సూచించారు. వరద ముంపునకు గురైన గ్రామాల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, పీడీఓలు తప్పనిసరిగా అక్కడే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు చక్కదిద్దాలన్నారు. వంతెనలు మునిగిన చోట వాహనాలు, ప్రజల రాకపోకల నిలిపివేతకు పోలీస్, స్థానిక సంస్థల సిబ్బందితో కలిసి తగిన బ్యారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. లోతట్టు ప్రాంతవాసులను సురక్షిత ప్రాంతాలకు లేదా పునారావాస కేంద్రాలకు తరలించాలన్నారు.

ఆశ్రయ కేంద్రంలో భోజనం

కబిని జలాశయం పరిధిలో ఎక్కువ వర్షాలు కురుస్తున్నందున జిల్లాలోని హెచ్‌డీ కోటె తాలూకా బీచనహళ్లి సమీపంలోని జలాశయం నుంచి భారీగా నీటిని వదులుతున్నారు. నంజనగూడు తాలూకా వరుణా నియోజకవర్గంలోని బొక్కహళ్లి గ్రామాన్ని సందర్శించి పరిశీలించారు. వరద తగ్గుముఖం పట్టేవరకు పునరావాస కేంద్రంలోనే ఉండాలని వారు గ్రామస్తులకు సూచించారు. జిల్లాలోని టీ.నరసీపుర తాలూకా తలకాడు ఫిర్కాలోని తడి మాలంగి గ్రామంలో ప్రారంభించిన పునరావాస కేంద్రంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ పీ.శివరాజు, ఉప విభాగాధికారులు రక్షిత్, తహసీల్దార్, జెడ్పీ ఉప కార్యదర్శి, ఇతర అధికారులు గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనం చేసి వారిలో ధైర్యాన్ని నింపారు.

వయనాడు బాధితుల వివరాలివ్వండి

మైసూరు జిల్లాకు చెందిన వారు కేరళలోని వయనాడులో కొండచరియల విపత్తులో చిక్కుకుని ఉంటే మైసూరులోని జిల్లా విపత్తు నిర్వహణ కార్యాలయం, లేదా 1077, 0821–2423800 నంబర్లకు సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు.

విద్యార్థినికి ఛాతి నొప్పి... కాపాడిన డ్రైవర్, కండక్టర్లు

శివాజీనగర: బస్సులో ప్రయాణిస్తున్న ఓ విద్యార్థినికి ఛాతిలో నొప్పి రాగా డ్రైవర్, కండెక్టర్లు స్పందించి బస్సును ఎక్కడా ఆపకుండా నేరుగా ఆస్పత్రికి తరలించి ఆ విద్యార్థిని ప్రాణాలు కాపాడారు. కృష్ణప్రసాద్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు మంగళవారం దక్షిణ కన్నడ జిల్లా కోళూరు మీదుగా మంగళాదేవి వైపు బయల్దేరింది. బంగ్రకోళూరులో 15మంది కాలేజీ విద్యార్థులు బస్సు ఎక్కారు. బస్సు కొట్టూరు సమీపంలోకి చేరుకుంటుండగా ఓ విద్యార్థిని ఛాతి నొప్పితో కుప్పకూలింది. డ్రైవర్ గజేంద్ర కుందర్ అంబులెన్స్ తరహాలో హారన్ మోగిస్తూ వేగంగా నేరుగా ఆరు నిమిషాల్లో ఆరు కిలోమీటర్ల దూరంలోని కంకనాడి ఫాదర్ ముల్లర్ ఆస్పత్రి ఆవరణలోకి తీసుకెళ్లారు. కండెక్టర్ మహేశ్ పూజారి, సురేశ్‌లు ఆ విద్యార్థినిని చేతులపై ఎత్తుకొని అత్యవసర విభాగంలోకి తీసుకెళ్లారు. వైద్యులు వెంటనే చికిత్సలు ప్రారంభించడంతో ఆ విద్యార్థిని కోలుకుంది. సకాలంలో ఆస్పత్రికి తీసుకురావడంతో విద్యార్థిని ప్రాణాలు నిలిచాయని వైద్యులు పేర్కొన్నారు. కండక్టర్లు, డ్రైవర్ల సమయస్ఫూర్తిని దక్షిణ కన్నడ జిల్లా బస్సు యజమానుల సంఘం అధ్యక్షుడు పర్తిపాడి కొనియాడారు. ఇటువంటి ఘటనలు జరిగినపుడు ఆసుపత్రికి చేర్చాలని సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

సీఎంపై బీజేపీ కుట్ర

- మంత్రి భైరతి ఆరోపణ

మండ్య: ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీపై అహింద వర్గం అప్రమత్తంగా ఉండాలని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి భైరతి సురేశ్ అన్నారు. ఆయన బుధవారం బీజేపీ–జేడీఎస్ చేపట్టిన పాదయాత్రకు వ్యతిరేకంగా మండ్య కనక సంఘం భవన్ లో మీడియాతో మాట్లాడారు. రెండోసారి సీఎం అయిన సిద్దరామయ్య ప్రతిష్టను దెబ్బతీయాలని బీజేపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ముడా స్థలాలు సిద్దరామయ్య భార్య పేరు మీద ఉన్నాయి. భూమి ఇచ్చినప్పుడు బదులుగా స్థలాలు ఇవ్వడం మామూలేనని చెప్పారు. ముడా కేసులో సిద్దరామయ్య పేరు ఇరికించారన్నారు. బీజేపీ, జేడీఎస్ రెండు పార్టీల నేతలు అధికారం కోల్పోయి కష్టాలు పడుతున్నారు. బీసీ నాయకులు దేవరాజు అరసు, ఎస్. బంగారప్ప, వీరప్ప మొయిలీ, ధరంసింగ్ తదితరులపై కూడా ఇదే తరహా కుట్ర జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ శివణ్ణ, ఎంఎల్ సురేశ్, కేహెచ్ నాగరాజు, సుబ్బణ్ణ, అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

హత్యకేసు నిందితుడిపై పోలీసు కాల్పులు


చికిత్స పొందుతున్న నిందితుడు కార్తీక్

దొడ్డబళ్లాపురం: కౌన్సిలర్ హత్యకేసు నిందితుడిపై పోలీసులు కాల్పులు జరిపి అరెస్ట్ చేశారు. ఆనేకల్ కౌన్సిలర్ రవి ఈనెల గతనెల 24న హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈకేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న రౌడీషీటర్ కార్తీక్ అలియాస్ జెకె పరారీలో ఉన్నాడు. ఇతను ఆనేకల్ తాలూకా మైసూరమ్మనదొడ్డి పరిసరాల్లో తలదాచుకున్నట్లు సమాచారం అందడంతో ఆనేకల్ సీఐ తిప్పేస్వామి తన సిబ్బందితో కలిసి వెళ్లారు. లొంగిపోవాలని హెచ్చరికలు జారీ చేయగా నిందితుడు పోలీసులపై దాడికి దిగాడు. దీంతో సీఐ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్పులు జరిపారు. నిందితుడి కాలిలోకి బుల్లెట్ తగిలి గాయపడగా అతన్ని బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. ఇదే కేసులో మిగతా నిందితులు హరీశ్, వినయ్ ఇప్పటికే కోర్టులో లొంగిపోయారు.


లారీ బీభత్సం

- డ్రైవర్ మృతి


ఎం.శ్రీనివాస్ (ఫైల్)


పెనుకొండ రూరల్: మూడు లారీలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడిన సంఘటన, పుట్టపర్తి జిల్లా పెనుకొండ వద్ద 44వ జాతీయ రహదారిపై కొత్తచెరువు బ్రిడ్జి సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. కర్ణాటకలోని కోలారు నుంచి టమాట లోడుతో హైదరాబాద్‌కి వెళుతున్న లారీ, ఘటనాస్థలి వద్దకు రాగానే డివైడర్‌ను ఢీకొని అవతలి లేన్‌లోకి దూసుకెళ్లింది. ఛత్తీస్‌గఢ్ నుంచి బంగాళాదుంపల లోడుతో బెంగళూరుకు వెళుతున్న లారీని ఢీకొట్టి మరో కంటైనర్ లారీని కూడా గుద్దింది. ఈ ఘటనలో టమాట లారీ డ్రైవర్ ఎం.శ్రీనివాస్ (35)తీవ్ర గాయాలతో మృతి చెందగా క్లీనర్ ముత్తు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బంగాళాదుంపల లారీ డ్రైవర్ శశికుమార్, క్లీనర్ గౌరప్పలకు స్వల్ప గాయాలయ్యాయి. మూడు వాహనాలు దెబ్బతినగా, గంటల కొద్దీ ట్రాఫిక్ స్తంభించింది. కియా పోలీసులు చేరుకుని బాధితులను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చెల్లని చెక్కులు ఇచ్చి వంచన


దయానంద(ఫైల్)

యశవంతపుర: సీఐడీ అధికారినని హల్‌చల్ చేస్తూ వంచనకు పాల్పడుతున్న బెళగావి జిల్లా హుక్కేరి తాలూకా ఇస్లాంపురకు చెందిన దయానంద రాము చింద్రాళి(33)అనే వ్యక్తిని బెళగావి నగర పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతను బెళగావిలోని ఆంజనేయ స్వామి నగర్‌లో నివాసం ఉంటున్నాడు. తాను సీఐడీ అధికారినంటూ చెప్పుకొని వంచనలకు పాల్పడేవాడు. ఈక్రమంలో స్నేహితుడికి ప్రమాదం జరిగిందని, చికిత్సకు డబ్బు కావాలని ఆటో నగర్‌కు చెందిన అఫ్జల్ అనే వ్యక్తి నుంచి రూ. ఐదు లక్షలు తీసుకున్నాడు. తిరిగి చెల్లించాలని కోరగా రెండు చెక్కులిచ్చాడు. అవి చెల్లకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు గాలింపు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు.

స్వాతంత్య్ర దినాన్ని ఘనంగా ఆచరించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ మహేశ్ పత్రి

గౌరిబిదనూరు: తాలూకా వ్యాప్తంగా ఆగస్టు 15న స్వాతంత్ర్యదిన వేడుకలు ఘనంగా ఆచరించాలని తహసీల్దార్ మహేష్‌పత్రి అధికారులకు సూచించారు. బుధవారం ఆయన సంఘ సంస్థలు, పలు శాఖల అధికారులతో సమావేశమై మాట్లాడారు. అన్ని కార్యాలయాలు, విద్యాసంస్థల్లో జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. నేతాజీ క్రీడా మైదానంలో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ గీతాలాపన తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. కమిషనర్ గీత, విద్యాశాఖ అధికారి శ్రీనివాసమూర్తి, తా.పం. ఈఓ హొన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీలు చేయిస్తున్న ట్రాన్స్‌జెండర్ అరెస్ట్

దొడ్డబళ్లాపురం: మైనర్లతో బైక్ చోరీలు చేయిస్తున్న ట్రాన్స్‌జెండర్‌ను దేవనహళ్లి తాలూకా విజయపుర పోలీసులు అరెస్టు చేశారు. దేవనహళ్లి, విజయపుర, కుంబళగోడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో చైన్‌స్నాచింగ్‌లు, బైక్ చోరీలు అధికమయ్యాయి. సీరియస్‌గా తీసుకున్న పోలీసులు గాలింపు చేపట్టారు. ఒక ట్రాన్స్‌జెండర్ అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. బాలురతో చోరీలు చేయిస్తున్నట్లు విచారణలో తేలడంతో ట్రాన్స్‌జెండర్‌ను అరెస్ట్ చేశారు. 12 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. చోరీలు చేస్తున్న బాలురు 2022లో బాలమందిరం నుంచి ఉడాయించి వారిగా తేలిందని పోలీసులు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా

శివాజీనగర: హిందూ కార్యకర్త పునీత్ కెరెహళ్లిపై పోలీసుల దాడిని నిరసిస్తూ మాజీ ఎంపీ ప్రతాప్ సింహ బుధవారం ఉదయం బెంగళూరులోని బసవేశ్వర నగర పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేశారు. వివరాలు..రాజస్థాన్ నుంచి నగరంలోని రైల్వే స్టేషన్‌కు వచ్చిన మాంసం అనుమానాస్పదంగా ఉండటంతో పునీత్ కెరెహళ్లి పరిశీలించేందుకు వెళ్లగా కాటన్ పేట పోలీసులు అతన్ని అడ్డుకొని అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన బెయిల్‌పై బయటకు వచ్చారు. కాగా పునీత్‌కెరెహళ్లి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు సరిగా లేదని, సదరు పోలీసులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ డిమాండ్ చేశారు. అనంతరం సీనియర్ పోలీసు అధికారులకు వినతిపత్రం అందజేశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గౌరిబిదనూరు: యువకుడు ఆత్మహత్యకు యత్నించి గాయాల పాలయ్యాడు. ఒడిశాలోని సుందర్‌ఘర్ గ్రామానికి చెందిన అమర్(30) మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్‌కు చేరుకొని గూడ్స్ వ్యాగన్‌పైకి ఎక్కి పైనున్న హైటెన్షన్ తీగను పట్టుకున్నాడు. దీంతో కరెంటు షాక్‌కు గురై ప్లాట్‌ఫారంపై పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. దొడ్డబళ్ళాపురం రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గేదెను ఢీకొన్న బైక్.. ఒకరి మృతి

మండ్య: గేదెను బైక్ ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన మళవళ్లి తాలూకాలోని అంతరవళ్లి, దడమహళ్లి గ్రామాల మధ్య జరిగింది. హలగూరు సమీపంలోని అప్పాజయ్యనదొడ్డి గ్రామానికి చెందిన ఈరస్వామి(38) తొరెకాడనహళ్లి సమీపంలో వడ్రంగి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతను దినుకుమార్ అనేవ్యక్తితో కలిసి హుల్లాగాల గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా అంతరవళ్లి, దడమహళ్లి గ్రామాల మధ్య ఓ గేదె రోడ్డు మీదకు దూసుకు రావడంతో బైక్ ఢీకొంది. దినకర్‌కు సాధారణ గాయాలు కాగా వెనుక కూర్చొన్న ఈరస్వామి తలకు బలమైన గాయాలు కావడంతో మళవళ్లి తాలూకా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మండ్య జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని వారసులకు అప్పగించారు. మళవళ్లి పోలీస్‌లు కేసు దర్యాప్తు చేపట్టారు.

హోసూరు వార్తలు..

కార్పొరేషన్ భేటీ రసాభాస

హోసూరు: కార్పొరేషన్ ప్రజా సమస్యల పరిష్కారంపై బుధవారం హోసూరు సిటి కార్పొరేషన్ కార్యాలయంలో కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మేయర్ ఎస్.ఏ.సత్య, డిప్యూటీ కమిషనర్ టిటో, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు. ప్రజా సమస్యలను కార్పొరేషన్ యంత్రాంగం పట్టించుకోవడం లేదని, ప్రధానంగా అన్నాడీఎంకే పార్టీకి చెందిన కార్పొరేటర్లు ఉన్న వార్డుల్లో అభివృద్ధి పనులు సూన్యమని 16 మంది కార్పొరేటర్లు ఆరోపించి సమావేశాన్ని బహిష్కరించారు. దీనికి తోడు ఉపమేయర్ ఆనందయ్యతో పాటు 15 మందికి పైగా డీఎంకే కార్పొరేటర్లు కూడా సమావేశానికి రాకపోవడంతో అర్ధాంతరంగా ముగించారు. అన్నాడీఎంకే కార్పొరేటర్లు మాట్లాడుతూ 45 వార్డులలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో కార్పొరేషన్ యంత్రాంగం విఫలమైందని, వార్డుల్లో ప్రజలు అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పలేకపోతున్నామని వాపోయారు.

తల్లి దెబ్బలకు కూతురు బలి

క్రిష్ణగిరి: తల్లి దౌర్జన్యానికి చిన్నారి కూతురు బలైంది. ఈ సంఘటన పోచ్చంపల్లి వద్ద చోటు చేసుకుంది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా పోచ్చంపల్లి సమీపంలోని సంధూర్ చెక్కిలిపట్టి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు జయరామన్, ఇతని భార్య సత్య. వీరికి శరణ్య (12) అనే కూతురు ఉండగా, ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతూ వచ్చింది. భార్యాభర్తల మధ్య ఏర్పడిన గొడవలతో సత్య కూతురిని తీసుకుని పుట్టింటికి వచ్చింది. అవి మనసులో ఉంచుకుని బాలికను తీవ్రంగా కొట్టింది. కింద పడిన బాలిక తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో పోచ్చంపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లగా ఫలితంలేక బాలిక మృతి చెందింది. పోచ్చంపల్లి పోలీసులు కిరాతక తల్లిని అరెస్ట్ చేశారు.

బాలికపై దాష్టీకం

హోసూరు: బాలికపై అత్యాచారానికి పాల్పడిన వలస కార్మికునిపై హోసూరు మహిళా పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వివరాలు.. బిహార్‌కు చెందిన 14 ఏళ్ల బాలిక హోసూరు ప్రాంతంలో తల్లిదండ్రులతో కలిసి నివాసుంటుండేది. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అజయ్‌కుమార్ (20) అక్కడే అద్దె గదిలో నివాసముంటూ ఫ్యాక్టరీలో పనిచేసేవాడు. ఇటీవల బాలికను ప్రేమిస్తున్నట్లు నమ్మించి తన గదికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. విషయం తెలుసుకొన్న బాలిక తల్లి హోసూరు మహిళా పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

హోసూరు: అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో జరిగింది. వివరాల మేరకు హోసూరు సమీపంలోని వన్నలవాడి గ్రామానికి చెందిన ప్రసాంత్, భార్య కనక (28). హోసూరు సమీపంలోని తొరపల్లి గ్రామంలో నివాసముంటున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం సొంత ఇల్లు కొనుగోలు కోసం బంధువులు, మిత్రుల వద్ద అప్పు చేశారు. ఆ అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెందిన కనక మంగళవారం పురుగుల మందు తాగింది. స్థానికులు చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ కన్నుమూసింది. హోసూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే యత్నాళ్‌పై పరువు నష్టం కేసు

శివాజీనగర: ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్‌పై మంత్రి దినేశ్ గుండూరావు భార్య తబు గుండూరావు బుధవారం బెంగళూరులోని ప్రజా ప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానంలో పరువు నష్టం కేసు నమోదు చేశారు. తబు తరపున సూర్య ముకుంద్ రాజ కోర్టులో వాదనలు వినిపించారు. ప్రజా ప్రతినిధిగా ఉన్న యత్నాళ్ గుండూరావు కుటుంబంపై చేసిన వ్యాఖ్యలు అవమానకరమైనవన్నారు. జాతీయత, దేశాభిమానాన్ని ప్రశ్నించేలా వ్యాఖ్యలు చేశారన్నారు. వాదనలు ఆలకించిన కోర్టు ఈ కేసును ఆగస్టు 7,8వ తేదీలకు వాయిదా వేసింది.

2న ఆషాఢ శుక్రవార ప్రత్యేక పూజలు

మండ్య: తాలూకాలోని తుంబకెరె పట్టలదమ్మ ఆలయంలో ఈనెల 2న ఆషాఢమాస శుక్రవార ప్రత్యేక పూజలు నిర్వహించనున్నటుల నిర్వాహకులు తెలిపారు. ఆరోజు ఉదయం 7 గంటలకు గ్రామం నుంచి ఆలయం వరకు కుంభకలశాలతో ఊరేగింపు, 9 గంటలకు పంచామృత అభిషేకం, 10 గంటలకు తంబిట్టు హారతి, వీరగాసె నృత్యంతో అమ్మవారి విగ్రహ ఊరేగింపు, మధ్యాహ్నం 12 గంటలకు మహామంగళ హారతి, అన్నసంతర్పణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు పైకార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

గురువు అనుగ్రహంతోనే జ్ఞానార్జన

గౌరిబిదనూరు: గురువు అనుగ్రహంతోనే జ్ఞానార్జన సాధ్యమని ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం మాజీ అధ్యక్షుడు ఎన్ సిద్దరామయ్య అన్నారు. పట్టణంలోని నాగయ్యరెడ్డి కాలనీలో ఉన్న ప్రభుత్వ హయ్యర్ ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగరాజు ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగరాజు దంపతులను ఘనంగా సత్కరించారు. ఎన్.సిద్దరామయ్య మాట్లాడుతూ గురువులను గౌరవించడం భారతీయ సంస్కృతికి నిదర్శనమన్నారు. గంగాధరప్ప, లింగప్ప, జి.కృష్ణప్ప, నారాయణస్వామి, హనుమంత రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు మల్లికా తదితరులు పాల్గొన్నారు.

బాలుడి చేతికి బైక్.. తల్లిదండ్రులపై కేసు

దొడ్డబళ్లాపురం: పిల్లల చేతికి వాహనాలు ఇవ్వవద్దని పోలీసులు ఎంత చెబుతున్నా తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదు. కేజీ హళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీసాయి ఆస్పత్రి వద్ద మైనర్ బాలుడు బైక్‌పై వీలింగ్ చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. అతడి తల్లితండ్రులపై కేసు నమోదు చేశారు.

షేర్ల పేరుతో రూ. 14.50 లక్షలు స్వాహా

హోసూరు: షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే రెండింతల లాభం అని చెప్పి ప్రైవేట్ ఉద్యోగి వద్ద రూ. 14.50 లక్షలు కొట్టేశారు. వివరాల మేరకు హోసూరు పారిశ్రామికవాడ చిన్నయలసగిరి ప్రాంతానికి చెందిన 40 ఏళ్ల వ్యక్తి బెంగళూరులోని ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. గత మార్చి 12వ తేదీన వాట్సాప్ ద్వారా సంప్రదించిన సైబర్ నేరగాడు.. షేర్‌మార్కెట్‌లో పెట్టుబడి చేయడం ద్వారా రెండింతల లాభం పొందవచ్చునని చెప్పాడు. దీంతో బాధితుడు రూ. 14.50 లక్షలు వివిధ బ్యాంకు ఖాతాలకు జమ చేశాడు. ఇంత వరకు లాభం, అసలు రాకపోవడంతో వారిని సంప్రదించగా స్విచ్ఆఫ్ అని వచ్చింది. బాధితుడు క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఫిర్యాదుల స్వీకరణ


ఫిర్యాదులను స్వీకరిస్తున్న దృశ్యం

హోసూరు: ప్రజల వద్దకే ముఖ్యమంత్రి పథకం ద్వారా కెలమంగలం సమితి నాగమంగలం గ్రామంలో ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డెంకణీకోట తహసీల్దార్ పరిమేల్‌అళగన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. చైర్మన్ కేశవమూర్తి మాట్లాడుతూ ప్రజల నుంచి సుమారు 400కుపైగా ఫిర్యాదులను స్వీకరించారని, అధికార్లు స్పందించి స్వీకరించిన ఫిర్యాదులను 30 రోజుల్లో పరిష్కారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగమంగలం పంచాయతీ అధ్యక్షులు గోవిందరాజు, తిమిజేపల్లి పంచాయతీ అధ్యక్షులు ఈశ్వరిముత్తనన్ పాల్గొన్నారు.

ఇళ్లకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కెలమంగలం: డెంకణీకోట తాలూకా బెట్టముగిళాలం గ్రామపంచాయతీలో గిరిజన కుటుంబాలకు పక్కా ఇళ్ల నిర్మాణానికి తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ప్రజల వినతి మేరకు ఎమ్మెల్యే ప్రభుత్వం నుంచి 48 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ అనుమతిని తీసుకొచ్చారు. కార్యక్రమంలో కెలమంగలం బీడీవో శాంతి, యూనియన్‌కౌన్సిలర్ సుజాతమారప్పన్, పంచాయతీ అధ్యక్షులు మునిరాజ్ పాల్గొన్నారు.

గుట్కా స్వాధీనం

హోసూరు: హోసూరు హడ్కో పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటేష్ నగర్ ప్రాంతంలో గుట్కా గిడ్డంగి నిర్వహిస్తుండగా పోలీసులు దాడులు చేసి 112 కిలోల గుట్కా స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతానికి చెందిన క్రిష్ణమూర్తి (40)కి చెందినదని, దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. అదేవిధంగా హోసూరు పట్టణ పోలీసులు మంగళవారం రాత్రి బస్టాండు ప్రాంతంలో రాజశేఖర్ (31), తిరుమురుగన్ (44)ను అరెస్టు చేసి కొంత మొత్తంలో గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు.

క్లుప్తంగా...

రూ.71.61 కోట్ల ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

ఐడీబీఐని మోసం చేసిన కేసులో..



సాక్షి, అమరావతి: బోగస్ పత్రాలతో ఐడీబీఐని మోసం చేసిన కేసులో నేరెళ్ల వెంకటరామమోహన్‌రావుతోపాటు ఇతర నిందితులకు చెందిన రూ.71.61 కోట్ల మార్కెట్ విలువ చేసే స్థిరాస్తులతోపాటు రూ.15.55 లక్షల బ్యాంకు నిల్వలను ఈడీ అధికారులు అటాచ్ చేశారు. నిందితుల పేరిట ఏపీ, తెలంగాణల్లో ఉన్న వ్యవసాయ భూములు, వాణిజ్య స్థలాలు, రూ.15.55 లక్షల బ్యాంకు నిల్వలు ఉన్నాయి. వీరు బోగస్ పత్రాలు సమర్పించి రాజమహేంద్రవరంలోని ఐడీబీఐ నుంచి రూ.311 కోట్ల రుణాలు తీసుకున్నారు. దీనిపై బ్యాంకు అధికారుల ఫిర్యాదుతో విశాఖపట్నంలోని ఈడీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్థిరాస్తులు, బ్యాంకు నిల్వను అటాచ్ చేసినట్టు ఈడీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఒక్కరోజే 50 లక్షల ఐటీ రిటర్నులు



సాక్షి, అమరావతి: ఆదాయ పన్ను రిటర్నుల (ఐటీఆర్‌ల) దాఖలుకు బుధవారంతో గడువు ముగుస్తుండటంతో పెద్దసంఖ్యలో పన్నుచెల్లింపుదారులు ఐటీఆర్‌లు దాఖలు చేశారు. బుధవారం ఒక్కరోజే ఏకంగా 50 లక్షల మందికిపైగా రిటర్నులు దాఖలు చేసినట్టు ఆదాయపన్ను శాఖ ప్రకటించింది. ఈ మదింపు సంవత్సరంలో ఏడుకోట్లకు పైగా రిటర్నులు దాఖలైనట్టు 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేసింది. గతేడాది 8.61 కోట్ల రిటర్నులు దాఖలయ్యాయి.

మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లికి బెయిల్ నిరాకరణ



నగరంపాలెం: మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి బెయిల్ ఇచ్చేందుకు గురజాల అదనపు జిల్లా కోర్టు బుధవారం నిరాకరించింది. ఆయనకు బెయిల్ విషయమై గురజాల అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారిగా ఉన్న గుంటూరు జిల్లా ప్రత్యేక న్యాయస్థానం న్యాయాధికారి ముందు బుధవారం వాదనలు జరిగాయి. ప్రస్తుతం పిన్నెల్లి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రం నెల్లూరులోని జైలులో ఉన్నారు.

మతి మరుపు బాబుకు.. గతి తప్పిన పవన్ తోడు..

ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్



సాక్షి, న్యూఢిల్లీ: మతి మరుపు చంద్రబాబుకు.. గతి తప్పిన పవన్‌కళ్యాణ్ తోడయ్యాడని.. వీరిద్దరూ ఎన్నికల హామీ 'సూపర్ సిక్స్'ను తుంగలో తొక్కి ఏపీ ప్రజలను తీవ్రంగా మోసం చేస్తున్నారని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు కేఏ పాల్ ధ్వజమెత్తారు. వచ్చీరాని ఇంగ్లిష్‌తో ఏం మాట్లాడుతున్నారో వారికే అర్థం కావడం లేదన్నారు. బుధవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో కేఏ పాల్ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు హామీలివ్వడం.. దానికి పవన్ గ్యారంటీ ఇవ్వడం.. ఆ తరువాత ప్రజలను మరచిపోవడం 2014 నుంచీ జరుగుతున్నదేనన్నారు. వారు చెప్పే దొంగ మాటలు నమ్మొద్దని తాను 2024 ఎన్నికలకు ముందే ప్రజలను హెచ్చరించానని తెలిపారు. బిహార్ సీఎం పట్టుబట్టి మరీ రూ.60వేల కోట్లు సాధించిన విషయాన్ని గుర్తించాలన్నారు. 'కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. పోలవరం, రైల్వే జోన్, వైజాగ్ స్టీల్ ప్లాంట్, అమరావతికి గాడిదగుడ్డు ఇచ్చాడు మోదీ' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ నెలలో ఢిల్లీ వేదికగా గ్లోబల్ ఎకనామిక్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు పాల్ చెప్పారు.

సాగర్‌లోకి కృష్ణమ్మ పరవళ్లు



నాగార్జునసాగర్ జలాశయం

సాక్షి, అమరావతి/విజయపురిసౌత్/శ్రీశైలం ప్రాజెక్టు/హొళగుంద: నాగార్జునసాగర్‌లోకి కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. బుధవారం సాయంత్రం 6 గంటలకు 2,18,622 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఇక్కడ నీటి నిల్వ 526.8 అడుగుల్లో 161.97 టీఎంసీలకు చేరింది. సాగర్ నిండాలంటే ఇంకా 151 టీఎంసీలు అవసరం. ఎగువ నుంచి భారీ వరద వస్తున్న నేపథ్యంలో మరో ఐదారు రోజుల్లో జలాశయం నిండుతుందంటున్నారు. జూరాల, సుంకేశుల బ్యారేజీల నుంచి శ్రీశైలం ప్రాజెక్టులోకి 3,62,411 క్యూసెక్కులు చేరుతున్నాయి. దీంతో 8 గేట్లను పది అడుగుల మేర ఎత్తి.. కుడి, ఎడమగట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ మొత్తం 2,83,360 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు.

గోదావరికి స్వల్పంగా పెరిగిన వరద

పోలవరం/ధవళేశ్వరం: గోదావరి పరివాహక ప్రాంతంలో వరద ప్రవాహం పెరుగుతుండటంతో పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద నీటిమట్టం 32.63 మీటర్లకు చేరింది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి దిగువకు 9,91,000 క్యూసెక్కులు కిందికి వదులుతున్నారు. ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం రాత్రి 10,41,489 క్యూసెక్కులను సముద్రంలోకి వదులుతున్నారు.

విధుల్లేకుండా.. జీతాలివ్వకుండా..

వలంటీర్లపై కూటమి సర్కారు కక్షసాధింపు

- జూలై ఒకటిన చెల్లించాల్సిన వేతనాలు ఇవ్వలేదు..
- ఆగస్టు 1న జీతాలు ఇస్తారో లేదో తెలియదు
- రూ.10 వేలు పెరుగుతాయన్న హామీ అతీగతి లేదు
- అగమ్య గోచరంగా వలంటీర్ల పరిస్థితి
- నెలన్నర రోజులుగా మంత్రులు, కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తున్నా పట్టించుకునేవారే లేరు..



వలంటీర్లకు నెలకు రూ.10 వేల జీతం ఇస్తానంటూ విజయనగరం జిల్లా బొండపల్లి సభలో ప్రకటించిన చంద్రబాబు (ఫైల్)

సాక్షి, అమరావతి: ఎన్నికల ముందు టీడీపీ-జనసేన-బీజేపీ నేతల మాటలకు.. అధికారంలోకి వచ్చాక వారి వైఖరికి ఎక్కడా పొంతన లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లు తీవ్ర నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆయా పార్టీల నేతలు చేస్తున్న ప్రకటనలు.. ప్రభుత్వ తీరు చూస్తుంటే తమ భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉందని వారు గగ్గోలు పెడుతున్నారు. ఎన్నికల ముందు కొందరు రాజీనామాలు చేయగా ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2 లక్షల 6వేల మంది వలంటీర్లు ఇప్పటికీ విధుల్లో కొనసాగుతున్నారు. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చాక వారికి జూలై ఒకటిన చెల్లించాల్సిన వేతనాలు ఇప్పటికీ అందలేదు. పైగా.. విధులూ చెప్పడంలేదు. స్థానిక ఎమ్మెల్యేల మౌఖిక ఆదేశాలతో డీడీఓలు వలంటీర్ల గౌరవ వేతన బిల్లులు పెట్టడంలేదని వలంటీర్ల సంఘాల్లో ప్రచారం జరుగుతోంది. నిజానికి.. జూన్ ఒకటిన వీరు సకాలంలో వేతనాలు అందుకోగా జూన్ 4న ఎన్నికల ఫలితాలు తర్వాత వీరి ఇక్కట్లు మొదలయ్యాయి. దీంతో జూన్ నెల గౌరవ వేతనాలు ఇప్పటివరకు వలంటీర్లకు అందలేదు. అలాగే, రేపు ఆగస్టు 1న చెల్లించాల్సిన వేతనాలకు సంబంధించిన ప్రక్రియను కూడా ఎక్కువమంది డీడీఓలు తాత్సారం చేస్తున్నారని ఈ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

విధులు అప్పజెప్పని సర్కారు..

మరోవైపు.. కూటమి ప్రభుత్వం అధికారికంగా వలంటీర్లకు ఎలాంటి విధులు కూడా అప్పజెప్పడంలేదని వారంటున్నారు. గత ఐదేళ్ల పాటు రాష్ట్రంలో పింఛన్ పంపిణీని వీరు ప్రతీ నెలా ఠంఛనుగా ఒకటో తేదీ తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందించగా.. చంద్రబాబు సీఎం బాధ్యతలు చేపట్టిన తర్వాత జూలై ఒకటిన వలంటీర్లతో కాకుండా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసింది. ఇక ఆగస్టు ఒకటిన చేపట్టే పింఛన్ల పంపిణీకీ కూడా ప్రభుత్వం వలంటీర్లను దూరంగా ఉంచబోతోంది. ఇలా రాష్ట్ర ప్రభుత్వం తమతో దోబూచులాడుతోందని... అలాగే, వలంటీర్ల వ్యవస్థ అవసరమేలేదన్నట్లుగా ఉందని వలంటీర్ల సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఐదేళ్లపాటు అన్నింటా వారే..

వాస్తవానికి.. గత ఐదేళ్లలో వలంటీర్ల సేవలు కేవలం పింఛన్ల పంపిణీకే పరిమితం కాలేదు. రాష్ట్రంలో 2019–24 మధ్య ప్రభుత్వం అమలు చేసిన 33 రకాల ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో ఎలాంటి అవినీతికి, పైరవీలకు తావులేకుండా ఆయా పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఇంటివద్దే వలంటీర్లు అందించారు. గ్రామాల్లో ప్రభుత్వాఫీసుల్లో ఎవరికి ఏ పని ఉన్నా వలంటీర్లు వారికి దిక్సూచిగా పనిచేశారు. ప్రభుత్వం ఏ పథకం అమలుచేసినా వీరే ఇంటింటికీ వెళ్లి ఆయా పథకాల గురించి వారికి వివరించి, అర్హులను గుర్తించి, అవి వారికి అందేలా ఎంతో తోడ్పడ్డారు. కరోనా వంటి అత్యంత విపత్కర పరిస్థితుల్లో వలంటీర్ల సేవలను ఎంత చెప్పుకున్నా తక్కువే. అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రతినెలా రెండు విడతల చొప్పున ఫీవర్ సర్వేను విజయవంతంగా పూర్తిచేసి కరోనా నియంత్రణలో కీలక భూమిక పోషించారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం అవన్నీ మర్చిపోయి పింఛన్ల పంపిణీ నుంచి వారిని దూరంపెట్టి ఆ కార్యక్రమానికి వారి అవసరమే లేదన్నట్లుగా వ్యవహరిస్తోంది.

ఆందోళన బాట వలంటీర్లు..

ఇదిలా ఉంటే.. తాము అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇవ్వడంతో పాటు వారి గౌరవ వేతనాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని అరచేతిలో వైకుంఠం చూపించారు. కానీ, ఎన్నికల్లో గెలిచాక టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి నేతల్లో తమపట్ల స్పష్టమైన వ్యతిరేక భావన కనిపిస్తోందని వలంటీర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు పనిచేసిన వలంటీర్లు అందరినీ కొనసాగించడంతో పాటు తమకు జూన్ నెల గౌరవ వేతనం బకాయిలతో చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లు కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు. నెలన్నర రోజులుగా మంత్రులు, అధికారులకు కూడా వినతిపత్రాలు అందజేసినట్లు వలంటీర్ల సంఘ ప్రతినిధులు చెప్పారు.

'హామీ' ఇవ్వలేం!

- వాటిని అటకెక్కించడమే లక్ష్యంగా చంద్రబాబు సర్కారు అడుగులు
- అందుకే 4 నెలల్లో రూ.1.29 లక్షల కోట్ల వ్యయానికి అనుమతి
- గవర్నర్ ఆమోదంతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆర్డినెన్స్ జారీ



సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్, ఇతర హామీలను అటకెక్కించడమే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆర్డినెన్స్ జారీ చేసింది. గత ప్రభుత్వాలకు భిన్నంగా పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టకుండా అసెంబ్లీ సమావేశాలను మంగళవారం ప్రొరోగ్ చేసి బుధవారం ఓటాన్ అకౌంట్ ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చింది. ఆగస్టు 1వ తేదీ నుంచి నవంబర్ 30వ తేదీ వరకు నాలుగు నెలల కాలానికి రాష్ట్ర సంచిత నిధి నుంచి రూ.1,29 లక్షల కోట్ల వ్యయానికి అనుమతిస్తూ గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం ఆర్డినెన్స్ జారీకి ఆమోదం తెలిపారు. దీంతో న్యాయ శాఖ కార్యదర్శి సునీత ఆర్డినెన్స్ జారీ చేశారు. ప్రభుత్వం ఇటీవలే అధికారంలోకి వచ్చినందున, ఆర్థిక శాఖ ఇతర శాఖలతో సమన్వయపరుచుకుంటూ అప్పులు, ఆర్థిక వనరులను ఖరారు చేస్తున్న నేపథ్యంలో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టలేమని అందులో పేర్కొంది. పూర్తి స్థాయి బడ్జెట్‌కు మరి కొంత సమయం కావాల్సి ఉందని, శాసన సభ ఇప్పుడు సమావేశంలో లేనందున ఓటాన్ అకౌంట్ ఆర్డినెన్స్ ద్వారా నాలుగు నెలల వ్యయానికి ఆర్డినెన్స్ జారీ చేయాల్సి వచ్చిందని ఆర్డినెన్స్‌లో పేర్కొనడం గమనార్హం. అసెంబ్లీ సమావేశాలు జూలై 26వ తేదీ వరకు నిర్వహించినప్పటికీ పూర్తి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టకుండా శ్వేత పత్రాల పేరుతో గత ప్రభుత్వంపై నిందలు వేయడానికే చంద్రబాబు ప్రభుత్వం పరిమితమైంది. పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే వాస్తవ అప్పులను బడ్జెట్ డాక్యుమెంట్‌లో స్పష్టం చేయాల్సి ఉంటుంది. అప్పుడు అప్పులపై చంద్రబాబు అండ్ కో ఎన్నికల ముందు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని తేలిపోతుంది. దీంతో పాటు సూపర్ సిక్స్ హామీలకు పూర్తి స్థాయి బడ్జెట్‌లో నిధులు కేటాయింపు చేయాల్సి వస్తుంది. ఈ రెండు అంశాల నుంచి తప్పించుకోవడానికే ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ ఆర్డినెన్స్ జారీ చేసింది.

ఏడాదిలో రెండుసార్లు ఓటాన్ అకౌంట్!

కేంద్రం నుంచి వచ్చే ఆదాయ వనరులు, రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వనరులు స్పష్టంగా ఉన్నప్పటికీ పూర్తి స్థాయి బడ్జెట్ పెట్టక పోవడానికి కేవలం హామీలను ఎగరకొట్టేందుకేనని స్పష్టం అవుతోంది. గతంలో ఎప్పుడూ ఒకే ఆర్థిక సంవత్సరంలో రెండుసార్లు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పెట్టిన దాఖలాల్లేవు. రాష్ట్రంలో కోవిడ్ లాంటి అసాధారణ పరిస్థితులు లేకున్నా, ఆర్డినెన్స్ జారీ విడ్డూరంగా ఉందని.. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనే 4 నెలల వ్యయానికి సభ ఆమోదం పొందే అవకాశం ఉందని అధికార వర్గాలంటున్నాయి. తొలి వంద రోజుల్లో ప్రాధాన్యతాంశాలను ప్రభుత్వం ఖరారు చేసింది. వాటిలో ఆర్థికంగా ముడిపడి ఉన్న సూపర్ సిక్స్ హామీలకు చోటు లేదు. తల్లికి వందనం, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500, నిరుద్యోగులకు నెలకు రూ.3000 భృతి అంశాలు 100 రోజుల ప్రాధాన్యతాంశాల్లో లేవు. నాణ్యమైన లిక్కర్, నూతన ఇసుక విధానం, నూతన ఎంఎస్ఎంఈ విధానం, నూతన పారిశ్రామిక విధానం, సీఆర్‌డీఏలో పెండింగ్ పనులు పూర్తి చేయడం, చెత్త తొలగింపు తదితర ఆర్థికేతర అంశాలే 100 రోజుల ప్రాధాన్యతల్లో ఉన్నాయి. దీంతో పాటు హామీలను తక్షణమే అమలు చేయడం సాధ్యం కాదని కూడా గవర్నర్ ప్రసంగం ద్వారా చెప్పించిన విషయం తెలిసిందే. హామీలను ఇప్పట్లో అమలు చేయకుండా కాలయాపన చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశంగా స్పష్టమవుతోంది.

ఆర్డినెన్స్ పేరుతో నాటకం

- ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన
- సూపర్ సిక్స్ హామీలు ఎగ్గొట్టేందుకే ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆర్డినెన్స్
- 2019 మే 30 నాటికి ఖజానాలో మిగిలింది రూ.100 కోట్లే
- అయినా 2019 జూలై 12న రూ.2,27,975 కోట్లతో పూర్తి బడ్జెట్ ప్రవేశపెట్టాం
- ఈ ఏడాది జూన్ 10న పన్నుల్లో వాటా అదనపు నిధులు రూ.5,655.72 కోట్లు విడుదల చేసిన కేంద్రం
- జూలై 23న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పన్నుల్లో రాష్ట్ర వాటా, గ్రాంట్ల రూపంలో నిధుల లెక్కపై స్పష్టత
- అయినా సరే పూర్తి బడ్జెట్ ప్రవేశపెట్టక పోవడం సంప్రదాయాలకు విరుద్ధం కాదా?



సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా తప్పించుకోవడంతో పాటు రాష్ట్ర అప్పుపై చేసిన దుష్ప్రచారం బండారం బట్టబయలవుతుందనే భయంతోనే 2024–25 సంవత్సరం పూర్తి బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశ పెట్టలేదని ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ధ్వజమెత్తారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆర్డినెన్స్ జారీ చేసి నాటకాలాడుతోందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యే నాటికి అంటే 2019 మే 30 నాటికి ఖజానాలో రూ.వంద కోట్లే మిగిలాయంటూ 'ఈనాడు' ప్రచురించిన కథనాన్ని గుర్తు చేస్తూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న చిత్తశుద్ధితో 2019–20కి సంబంధించి రూ.2,27,975 కోట్లతో పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని చెప్పారు. కొత్త సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయడానికి రెండ్రోజుల ముందు అంటే జూన్ 10న కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా అదనపు నిధులు రూ.5,655.72 కోట్లు రాష్ట్రానికి విడుదల చేసిందని.. జూలై 23న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పన్నుల్లో వాటా, గ్రాంట్ల రూపంలో రాష్ట్రానికి వచ్చే నిధుల లెక్కను తేల్చి చెబుతూ కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిందని ఎత్తి చూపారు. కోవిడ్ వంటి ప్రత్యేక పరిస్థితులు లేకున్నా, నిధుల విషయంలో అస్పష్టత లేకపోయినప్పటికీ పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే ధైర్యం ఎందుకు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీ మొదటి సమావేశాలు జూన్ 21.. రెండో సమావేశాలు జూలై 22–27 వరకు నిర్వహించారని, ఆ సమావేశాల్లో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టకుండా.. ఆర్డినెన్స్ ఎందుకు జారీ చేయాల్సి వచ్చిందో చెప్పాలని నిలదీశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో ఉన్న వివరాలు ఇలా ఉన్నాయి.

అబద్ధాలు బయట పడకూడదనే..

- పూర్తి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆర్డినెన్స్ జారీ చేయడానికి ప్రభుత్వానికి రెండు కారణాలు ఉన్నాయి. అందులో ఒకటి నిధులు లేవనే సాకు చూపి సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా సమర్థించుకోవడం. మరొకటి రాష్ట్ర అప్పు రూ.14 లక్షల కోట్లంటూ ఎన్నికల్లో చెప్పిన అబద్ధాల బండారం బయట పడకుండా చూసుకోవడం.
- పూర్తి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టకపోవడం ద్వారా ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతిగా ఇస్తామని ఇచ్చిన హామీకి మంగళం పాడినట్టేనా?
- దీపం పథకం కింద ఒక్కో ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయనట్లేనా?
- మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన హామీని అటకెక్కించినట్లేనా?
- తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేల చొప్పున ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకుండా మోసం చేయడం కాదా?
- 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెన్షన్ ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకుండా తప్పించుకోవడానికేనా?
- రైతులకు ఏడాదికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీని అమలుచేయకుండా మోసం చేస్తారా?
- 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకుండా వారికి ద్రోహం చేస్తారా?
- రాష్ట్ర అప్పు రూ.14 లక్షల కోట్లుందని ఎన్నికల్లో దుష్ప్రచారం చేశారు. సీఎం చంద్రబాబు విడుదల చేసిన శ్వేత పత్రంలో రూ.9,74,556 కోట్లని తప్పుడు లెక్కలు చెప్పారు. వాస్తవానికి అన్ని రకాల అప్పులు కలిపి రాష్ట్రానికి ఉన్నది రూ.7 లక్షల కోట్లే.

నేడు హంద్రీ-నీవాకు నీటి విడుదల

యుద్ధ ప్రాతిపదికన పనులు

- టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సంస్థ కాలువను పూడ్చిన రోడ్డు పక్కన మరో దారి నిర్మాణం
- రాత్రి మొత్తం పనులు.. పర్యవేక్షిస్తున్న అధికారులు
- మల్యాలలో మోటార్లు ఆన్ చేసి నీటి విడుదలకు ఏర్పాట్లు
- చిన్న పైపులతో 500 క్యూసెక్కులకు మించి ప్రవహించడం కష్టమే
- 3,850 క్యూసెక్కుల కాల్వ సామర్థ్యంతో పోలిస్తే అవి ఏ మూలకు?
- కృష్ణమ్మ పోటెత్తినా 15 రోజులుగా నీళ్లివ్వకుండా తీవ్ర తాత్సారం



తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న పైపులు

సాక్షి ప్రతినిధి కర్నూలు: టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ నిర్లక్ష్యానికి, కూటమి సర్కారు నిర్వాకాలకు రాయలసీమలో దాదాపు 6.02 లక్షల ఎకరాలు బీడుగా మారే ప్రమాదం నెలకొన్న నేపథ్యంలో 'సాక్షి' ప్రచురించిన కథనంపై అధికార యంత్రాంగం ఎట్టకేలకు స్పందించింది. టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు చెందిన సంస్థ కర్నూలు – గుంటూరు జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టిన విషయం తెలిసిందే. గార్గేయపురం – బ్రాహ్మణకొట్కూరు మధ్య కాలువపై వంతెన నిర్మాణం కోసం పుట్టా సంస్థ కెనాల్‌ను పూడ్చివేయడంతో హంద్రీ–నీవా నీళ్లు దిగువకు విడుదల కాని దుస్థితి నెలకొంది. కాలువను పూడ్చేటప్పుడు నీళ్లు వెళ్లేందుకు వీలుగా పైపులు వేయకుండా అప్రోచ్ రోడ్డు నిర్మించారు. దీంతో రాయలసీమ మొత్తానికి జీవనాడి అయిన హంద్రీ–నీవాకు నీళ్లు రాకపోవడంతో 6.02 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి తాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది.

రాత్రి కూడా పనులు.. నేడు నీటి విడుదల

'పుట్టా పాపం.. సీమకు శాపం' శీర్షికతో బుధవారం 'సాక్షి' ప్రచురించిన కథనంతో జలవనరులశాఖ అధికారులు ఉదయమే హంద్రీ–నీవా కెనాల్ వద్దకు చేరుకుని ప్రత్యామ్నాయాలు అన్వేషించారు. ప్రస్తుతం కాలువ పూడ్చిన ప్రాంతం పక్కనే చిన్న సైజు సిమెంట్ పైపులు వేసి దానిపై రోడ్డు వేయాలని నిర్ణయించారు. రాత్రి పూట కూడా యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగించి గురువారం ఉదయానికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో నేటి ఉదయం 11 గంటలకు మల్యాల వద్ద మోటార్లు ఆన్ చేసి కాలువకు నీటిని విడుదల చేయనున్నారు.

స్వల్ప ప్రవాహం 'అనంత'కు చేరేదెలా?

హంద్రీ–నీవా కాలువ సామర్థ్యం 3,850 క్యూసెక్కులు కాగా లైనింగ్ లేనందున 2,300–2,500 క్యూసెక్కులు మాత్రమే ప్రవహిస్తాయి. అయితే ఇప్పుడు పుట్టా సుధాకర్ సంస్థ తాత్కాలికంగా అమరుస్తున్న పైపుల ద్వారా 500 క్యూసెక్కులకు మించి ప్రవహించవని అధికారులు చర్చించుకుంటున్నారు. కాలువను పూడ్చి అప్రోచ్ రోడ్డు నిర్మించే సమయంలోనే పెద్ద పైపులు వేసి ఉంటే ఈ సమస్య తలెత్తేది కాదు. 15 రోజులుగా నీళ్లు వదలకుండా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇప్పుడు తాపీగా చిన్న సైజు పైపులు వేస్తున్నారు. పెద్ద పైపులు వేసి ఉంటే 1000–1500 క్యూసెక్కులు ప్రవహించే వీలుండేదని నీటి పారుదలశాఖ అధికారులు చర్చించుకుంటున్నారు. దీంతో నీళ్లు విడుదల చేసినా స్వల్ప ప్రవాహం కర్నూలులోని క్రిష్ణగిరి, పత్తికొండ రిజర్వాయర్లను దాటి అనంతపురం జిల్లాకు చేరే అవకాశం కనిపించడం లేదు. కాస్త ఆలస్యంగానైనా ఈ ఏడాది కృష్ణమ్మ కరుణించింది. ఎగువ నుంచి పోటెత్తిన వరద ఉధృతితో శ్రీశైలం నిండుకుండలా మారింది. శ్రీశైలంలో 834 అడుగులకే నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా కూటమి ప్రభుత్వం నీళ్లు విడుదల చేయకుండా కళ్లప్పగించి చూసింది. రిజర్వాయర్‌లో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరడంతో 10 గేట్ల ద్వారా నాగార్జునసాగర్‌కు వదులుతున్నా హంద్రీ–నీవాకు నీటిని విడుదల చేసే మల్యాల పంప్‌లను ఇప్పటిదాకా ఆన్ చేయలేదు.

నాడు రిజర్వాయర్లు కళకళ..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉండగా హంద్రీ–నీవా ద్వారా 2020లో 47.34 టీఎంసీలు, 2021లో 45.65 టీఎంసీలు విడుదల చేశారు. నీటిని ఒడిసిపట్టి రైతుల సంక్షేమాన్ని కాంక్షించారు. నాడు 'సీమ'లో చెరువులన్నీ నిండి రిజర్వాయర్లు పూర్తి స్థాయి నీటి మట్టంతో కళకళలాడాయి. ఇప్పుడు చిన్నసైజు పైపులతో 500 క్యూసెక్కులు మాత్రమే ప్రవహిస్తే సీజన్ మొత్తంలో కనీసం 5 టీఎంసీలు కూడా నీటిని డ్రా చేయలేని దుస్థితి కనిపిస్తోంది.

నీళ్లున్నా ఎందుకీ నిర్వాకం?

చంద్రబాబు పాలనలో ప్రతిసారి రాయలసీమకు అన్యాయం జరుగుతూనే ఉంది. కుప్పం బ్రాంచ్ కెనాల్ పూర్తయ్యే వరకూ డిస్ట్రిబ్యూటరీల పనులు చేయవద్దని 2015 ఫిబ్రవరిలో టీడీపీ ప్రభుత్వం జీవో 22 జారీ చేసింది. దీంతో కళ్లెదుట నీళ్లు పారుతున్నా రైతులు నిస్సహాయంగా చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజాగా శ్రీశైలంలో నీళ్లు ఎక్కువై పది గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నా దుర్భిక్ష 'సీమ'కు అందని దుస్థితి ఉత్పన్నమైంది. రోడ్డు నిర్మాణ ప్రాంతంలో కాలువ సామర్థ్యం మేరకు పైపులైన్లు వేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించి ఉంటే పుట్టా సుధాకర్ సంస్థ ఆ మేరకు చర్యలు తీసుకోవాల్సి వచ్చేది. పెద్ద పైపులైన్లు వేస్తే 2 వేల క్యూసెక్కులకు తగ్గకుండా ప్రవాహం దిగువకు వెళ్లేది. అన్నదాతల ఇక్కట్లపై వైఎస్సార్ సీపీ తక్షణమే స్పందించి నిలదీయడంతో ఇక తప్పించుకునే అవకాశం లేక కంటి తుడుపు చర్యలు చేపట్టారు. దీంతో హంద్రీ–నీవా నీటి కోసం రైతు సంఘాలు ఉద్యమించేందుకు సిద్ధమవుతున్నాయి.

'స్కిల్' పిల్‌పై నోటీసులు

- కౌంటర్లు దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి సంబంధించిన వాస్తవాలను ప్రజలకు తెలిపేందుకు అప్పటి అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, అప్పటి సీఐడీ చీఫ్ సంజయ్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలను బహిర్గతం చేయడంపై దాఖలైన వ్యాజ్యంలో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అందులో భాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)కి, హోంశాఖ ముఖ్య కార్యదర్శికి నోటీసులు జారీచేసింది. అలాగే మీడియా సమావేశం నిర్వహించిన పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, సంజయ్‌లకు కూడా నోటీసులు జారీచేసి పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను సెప్టెంబర్ 25కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. స్కిల్ కుంభకోణం కేసు లేదా ఇతర ఏ కేసుకు సంబంధించిన సమాచారాన్ని కూడా బహిర్గతం చేయకుండా, ఆ కేసుకు సంబంధించి ఎలాంటి సమావేశాలు నిర్వహించకుండా అప్పటి ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, అప్పటి సీఐడీ చీఫ్ సంజయ్‌లను నియంత్రించాలని కోరుతూ ఏపీ యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ క్యాంపెయిన్ అధ్యక్షుడు ఎస్. సత్యనారాయణ 2023లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే.

● వైట్ హౌస్

న్యూస్‌మేకర్

ఆ రుచికి రిటైర్‌మెంట్


క్రిస్ కమర్‌ఫోర్డ్

'విందు భోజనం అంటే సరైన సమయంలో సరైన పదార్థం అందించడమే' అంటుంది క్రిస్ కమర్‌ఫోర్డ్. అన్య జాతులకు ప్రవేశం లేని అమెరికా అధ్యక్షుడి అధికారిక నివాసం వైట్‌హౌస్ వంటశాలలో ప్రవేశం సాధించిన మొదటి మహిళ ఆమె. తొలి శ్వేత జాతీయేతర మహిళ కూడా! 30 ఏళ్లు వైట్‌హౌస్‌లో పని చేశాక తన 61వ ఏట జూలై 31న ఆమె రిటైర్ అయ్యారు. ఎందరో దేశాధినేతలకు తన చేతి వంట తినిపించిన క్రిస్ కమర్‌ఫోర్డ్ పరిచయం.

'అమెరికాకు అనేక మంది రాయబారులు ఉంటారు. కాని క్రిస్ కమర్‌ఫోర్డ్ షెఫ్‌గా ఉండక శాకపాకాల రాయబారి వలే అలాంటి పనే చేశారు. అమెరికా రుచులను ప్రపంచనేతలకు పంచి ఎలా ఉత్సవభరితం చేయవచ్చో చూపించారు' అని క్రిస్ కమర్‌ఫోర్డ్ రిటైర్‌మెంట్ సందర్భంగా ఆమె సమకాలిక షెఫ్ ఒకరు వ్యాఖ్యానించారు. అధ్యక్షుడు జో బైడన్ సతీమణి జిల్ బైడన్ 'క్రిస్ కమర్‌ఫోర్డ్ తన టీమ్‌తో కలిసి ప్రేమ, ఆప్యాయతలతో కూడిన రుచులతో మా ఆత్మలను నింపారు' అని వీడ్కోలు సందేశంలో పేర్కొంది. క్రిస్ కమర్‌ఫోర్డ్ విజయగాథ...

ఫిలిప్పైన్స్ నుంచి

క్రిస్ కమర్‌ఫోర్డ్‌ది ఫిలిప్పైన్స్. మనీలాలో బాల్యం గడిచింది. గ్రాడ్యుయేషన్ అయ్యాక ఫుడ్ టెక్నాలజీలో పి.జి. చేయాలనుకుంది. 'నాకు సైన్స్ ఇష్టం. ఫుడ్ టెక్నాలజీలో పరిశోధన చేయాలనుకున్నాను. కాని మా నాన్న నువ్వు కలనరీ ఇన్‌స్టిట్యూట్‌లో చదివితే ఇంకా రాణిస్తావు అన్నాడు. నేను మా నాన్న సలహాను పాటించడం వల్లే పాకశాస్త్రం తెలుసుకొని వైట్‌హౌస్ దాకా వచ్చాను. కాబట్టి పెద్దల మాట వినండి' అంటుంది క్రిస్ కమర్‌ఫోర్డ్.


మిషెల్లీ ఒబామాతో క్రిస్ కమర్‌ఫోర్డ్

తన 23వ ఏట అమెరికా వలస వచ్చిన క్రిస్ మొదట షికాగో, తర్వాత న్యూయార్క్ రెస్టరెంట్లలో పని చేసింది. వైట్‌హౌస్‌లో వంటశాలలో మహిళలను తీసుకోకపోయినా, శ్వేతజాతీయేతర మహిళలను తీసుకునే అవకాశం అసలు లేకపోయినా 1995లో నాటి ఎగ్జిక్యూటివ్ షెఫ్ వాల్టర్ స్టానీ ఆమెను అసిస్టెంట్ షెఫ్‌గా తీసుకున్నాడు.

మన్‌మోహన్ సింగ్‌తో ప్రమోషన్

నాటి ప్రధాని మన్‌మోహన్ సింగ్ 2005లో అమెరికా సందర్శించినప్పుడు వైట్ హౌస్‌లో భారీ విందు జరిగింది. దానికి కావలసిన వంటా వార్పు అంతా క్రిస్ చూసింది. విందుకు హాజరైన వారంతా ఆహా ఓహో అన్నారు. క్రిస్ ప్రతిభ గమనించిన జార్జ్‌బుష్ సతీమణి లారా బుష్ ఆమెకు ఎగ్జిక్యూటివ్ షెఫ్‌గా ప్రమోషన్ ఇచ్చారు. ఎగ్జిక్యూటివ్ షెఫ్ వైట్‌హౌస్‌లోని సకల వంటా వార్పులకు సర్వోన్నత అధికారి. ఆమె పర్యవేక్షణలోనే దేశాధినేతలు వచ్చినప్పుడు వైట్‌హౌస్‌లో ఇచ్చే గౌరవ విందు, హాలిడే ఫంక్షన్లు, రిసెప్షన్లు, అధికారిక విందులు జరుగుతాయి.

వంట ఒక సవాలు

వైట్ హౌస్‌లో వంట ఒక సవాలు. జపాన్ దేశాధినేత వచ్చినప్పుడు ఒక మెనూ, కెన్యా అధ్యక్షుడు వచ్చినప్పుడు ఒక మెనూ, భారత ప్రధాని వచ్చినప్పుడు మరో మెనూ తయారు చేయాలి. ఒకోసారి ఆయా దేశాలకు చెందిన వంటవాళ్లను రప్పించి వారితో కలిసి వండాలి. 'ప్రతి విందుకు నాలుగు రోజుల ముందు నుంచే సిద్ధమవుతాం. సలాడ్‌లు తాజాగా ఉండేందుకు ఆ రోజున వైట్‌హౌస్‌లోని తోట నుంచి ఆకులు, దుంపలు సేకరిస్తాం. పండిన కూరగాయలు వృథా చేయడం నాకు ఇష్టం ఉండదు. వైట్ హౌస్‌లో ఉపయోగానికి రాకపోతే అవసరమైనవారికి పంపించేస్తాను' అంది క్రిస్.

ఆహారమే ఆరోగ్యం

'దేశ భవిష్యత్తు నిర్మించడమంటే నేటి బాలలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించడమే' అంటుంది క్రిస్. 'పాకశాస్త్రం తెలిసిన వారు ఏది ఉత్తమమైన ఆహారమో ఏది పౌష్టికతతో నిండినదో తర్వాతి తరాలకు తెలియ చేయాలి. పిల్లలు మెచ్చుకునే రీతిలో ఆరోగ్యకరమైన వంటలు చేయగలగాలి. వారిని కూరగాయలతో గడపనివ్వాలి. కూరగాయల మడులకు తీసుకెళ్లాలి. వంట పట్ల అభిరుచి, అవగాహన కలిగించాలి' అంటుందామె.

హెల్త్ ఫ్యాక్ట్

నాన్‌వెజ్ తిన్నాక బాదం తినండి... ఎందుకంటే..?

మాంసాహారం తిన్న తర్వాత కొన్ని బాదం పలుకులు తినడం వల్ల ఓ ప్రయోజనం ఉంది. కొవ్వుల కారణంగా జరిగే అనర్థాల్ని తగ్గించడం ద్వారా అవి కరోనరీ గుండెజబ్బులనూ నివారిస్తాయి.



బాదంలోని ఒమెగా-3 ఆల్ఫా లినోలిక్ యాసిడ్ ఆ ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది.

ఆ మాటకొస్తే మామూలు సమయాల్లో బాదం తినడం వల్ల కూడా చాలా మేలు కలుగుతుంది. వీటిలోని క్యాల్షియమ్ ఎముకలు ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. అంతేకాదు... ఆహారనాళాన్నీ ఆరోగ్యంగా ఉంచడంలో బాదం తోడ్పడుతుంది. గుండెకూ మేలు చేస్తుంది.

● గిరిజనతండాల్లో తీజ్ సంబురాలు

'ఆరుద్ర'ను చూస్తే అనువైన వరుడు

వంట సాగు నుండి కన్నెపిల్లల పరిణయాల వరకు అంతా ప్రకృతి చెప్పిన విధంగానే నడుచుకుంటారు గిరిజనులు. అంతటి ప్రాధాన్యత కల్గిన వాటిల్లో 'తీజ్' పండుగ ముఖ్యమైనది.


గిరిజనులకు తల్లీ తండ్రి ప్రకృతే. కొరత లేకుండా ధాన్యాన్ని పస్తులు ఉంచకుండా పంటల్ని పుష్కలంగా ఇవ్వడమే కాదు తమకు అనువైన తోడును కూడా ప్రకృతి మాతే తీసుకువస్తుందన్నది ప్రగాఢమైన నమ్మకం. ఆ నమ్మకం పెళ్లీడుకు వచ్చిన పడతుల్లో కోటి ఆశలను విరబూయిస్తుంది. ఆ ఆశలే ఇంటింటా సంబరమవుతాయి.

తీజ్ అంటే...

పెళ్లీడుకు వచ్చిన గిరిజన (లంబాడ) అమ్మాయిలు సంబురంగా జరుపుకునే పండుగ తీజ్. గోధుమ నారునే కాదు ఈ కాలాన కనిపించే ఆరుద్ర పురుగులనూ తీజ్ అంటారు. ఎర్రగా అందంగా ఉండే ఆరుద్ర పురుగులను దేవుడు తమకోసం పంపిస్తాడని, ఈ పురుగులు కనిపించినప్పుడు మనసులో కోరుకున్న కోరిక ఫలిస్తుందని వీరి నమ్మకం.

ఇంటింటి ఆశీస్సులు...

పెళ్లీడుకు వచ్చిన యువతులు తమకు కావాల్సిన వరుడి కోసం చేసే ఈ పండగకు ముందు గా తల్లిదండ్రులు, పెద్దల ఆశీస్సులు తీసుకుంటారు. యువతులందరు ఇంటింటికి వెళ్లి పెద్దల ఆశీస్సులు తీసుకోవడం, వారు కానుకగా ఇచ్చే విరాళం తీసుకోవడంతో తండా అంతా సందడిగా మారుతుంది. ఇలా సేకరించిన విరాళం (ధాన్యం) తో తమకు కావాల్సిన గోధుమలు, శనగలు, ఇతర సామాన్లు కొనుగోలు చేస్తారు.



గోధుమ మొలకలు

తీజ్ పండుగలో ముఖ్యమైనది తీజ్ (గోధుమ మొలకలు) ఏపుగా పెరిగేందుకు ఆడపిల్లలు అడవికి వెళ్ళి దుస్సేరు తీగలు తెచ్చి, బుట్టలను అల్లి, తమ ఆరాధ్య దైవం తుల్జా భవాని, సేవాబాయి, సీత్లా భవానీలకు పూజలు చేసి, పుట్టమట్టిని తెస్తారు. మేకల ఎరువును కలిపి తండా నాయక్ చేతిలో ఉంచిన బుట్టలో పోస్తారు. అప్పటికే నానబెట్టి ఉంచిన గోధుమలను అందులో వేస్తారు.

శనగలకు రేగుముళ్లు

తీజ్ వేడుకల్లో భాగంగా నానబెట్టిన శనగలకు యువతులు రేగుముళ్లు గుచ్చుతారు. ఈ ప్రక్రియను బావ వరుసయ్యే వారు పడతుల మనస్సు చెదిరేలా వారిని కదిలిస్తూ ఉంటారు.

నియమ నిష్టలతో...

తండాలోని యువతులందరు తమ బుట్టలను ఒకేచోట పెడతారు. ఈ తొమ్మిది రోజులు పెట్టిన బుట్టలకు నీళ్ల పోస్తూ, వాటి చుట్టూ తిరుగుతూ గిరిజన నృత్యాలు, పాటలు పాడుతూ గడుపుతారు.

ఏడవ రోజు ఢమోళీ...

ఏడవరోజు జరిగే ఢమోళీ చుర్మోను మేరామా భవానీకి నివేదిస్తారు. వెండితో చేసిన విగ్రహం, రూపాయి బిళ్ల అమ్మవారి ముందు పెట్టి మేకపోతులు బలి ఇచ్చే తంతును'ఆకాడో' అంటారు.

నాకు అరవై ఏళ్లు. మా చిన్నప్పుడు కూడా తీజ్ పండుగ చేసుకున్నాం. తీజ్ పెరిగిన తీరును చూసి మా అమ్మా నాన్నలు, తండా పెద్దలు నాకు పెళ్లి చేశారు. ఇదే ఆనవాయితీ మా పిల్లలు కూడా చేస్తున్నారు.

- భూక్యా వీరమ్మ
గన్యాతండ, మహబూబాబాద్



దేవతల ప్రతిరూపాలకు...

ఎనిమిదవ రోజు మట్టితో ఆరాధ్య దైవాల ప్రతిరూపాలను తయారు చేస్తారు. అబ్బాయి(డోక్రా), అమ్మాయి(డోక్రీ)లుగా పేర్లు పెడతారు. వీటికి గిరిజన సాంప్రదాయాల ప్రకారం పెండ్లి చేస్తారు. ఆడపిల్లలు పెళ్లి కూతురుగా, మగ పిల్లలు పెళ్లికొడుకుగా ఊహించుకుంటూ ఈ తంతులో పాల్గొంటారు. పెళ్లి తర్వాత తమ కుటుంబ సభ్యులను విడిచి పెడుతున్నట్లు ఊహించుకుని ఏడ్వడం, వారిని కుటుంబ సభ్యులు ఓదార్చడంతో ఈ తంతును నిర్వహిస్తారు.

తొమ్మిదవ రోజు నిమజ్జనం

డప్పు చప్పుళ్ల, నృత్యాలతో అందరూ బుట్టల వద్దకు వెళ్తారు. తండా నాయక్ వచ్చి యువతులకు బుట్టలను అందజేస్తారు. యువతులు ఆశీర్వాదాలు తీసుకుంటారు. తమ పూజాఫలంగా పెరిగిన తీజ్‌ను అన్నదమ్ముళ్లకు ఇచ్చి.. వారి ఆశీర్వాదాలు తీసుకుంటారు. తర్వాత యువతీ, యువకులు బుట్టలను పట్టుకొని ఊరేగింపుగా వెళ్లి చెరువులో నిమజ్జనం చేస్తారు.

- ఈరగాని భిక్షం, సాక్షి, మహబూబాబాద్
ఫొటోలు: **మురళీ కృష్ణ**

వినోదం... పోరాటం సినిమా


● కీర్తి సురేష్

కీర్తి సురేష్ లీడ్ రోల్‌లో నటించిన ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'రఘుతాత'. సుమన్‌కుమార్ దర్శకత్వం వహించిన సినిమా ఇది. హోంబలే ఫిలింస్ తమ బేనర్‌పై నిర్మించిన ఈ తొలి తమిళ సినిమా ఆగస్టు 15న విడుదల కానుంది. తెలుగులోనూ ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సినిమా తమిళ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'ఒక అమ్మాయిలా నువ్వు ఎందుకు డ్రెస్సింగ్ చేసుకోవు?', 'ఒక అచ్చమైన అమ్మాయిలా ఉండేందుకు నాకు ఆసక్తి లేదు' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఓ భాష నేర్చుకోవడానికి ఓ యువతి పడే ఇబ్బందులు, ఆమె ముందు ఉన్న సవాళ్లు, ఆమె పోరాటం నేపథ్యంలో ఈ సినిమా కథనం వినోదాత్మకంగా ఉంటుందని సమాచారం.

జాబిలమ్మ వచ్చెనండి

రామ్‌చరణ్, కియారా అద్వానీ జంటగా నటిస్తున్న చిత్రం 'గేమ్ చేంజర్'. శంకర్ దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది క్రిస్మస్ సందర్భంగా విడుదల కానుంది. బుధవారం కియారా అద్వానీ బర్త్ డే సందర్భంగా 'గేమ్ చేంజర్'లో 'జాబిలమ్మ..' అంటూ యూనిట్ ఆమె కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసింది. ఇప్పటికే ఈ సినిమాలో రామ్‌చరణ్ పాత్ర షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం మిగిలిన ప్రధాన తారాగణం పాల్గొనగా హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతోంది.


● కియారా

హై ఓల్టేజ్ యాక్షన్

గోపీచంద్ హీరోగా రూపొందిన హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'విశ్వం'. శ్రీను వైట్ల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కావ్యా థాపర్ హీరోయిన్‌గా నటించారు. దోనేపూడి చక్రపాణి సమర్పణలో టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి నిర్మించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్స్ చివరి దశలో ఉన్న 'విశ్వం' మూవీ త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా 'ది జర్నీ ఆఫ్ విశ్వం' అనే వీడియోను విడుదల చేశారు. ''హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రం 'విశ్వం'. శ్రీను వైట్ల మార్క్ హ్యూమర్, యాక్షన్, కామెడీతో ఈ సినిమా ఉంటుంది. గోపీచంద్‌ని ఒక విభిన్నమైన పాత్రలో చూపిస్తున్నారు దర్శకుడు. సినిమాలో ఎలాంటి అంశాలు ఉంటాయో తెలియజేయడంతో పాటు ఆడియన్స్‌లో ఎగ్జయిట్‌మెంట్‌ని క్రియేట్ చేసేలా ఈ వీడియోను అద్భుతంగా డిజైన్ చేశారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలో నటించిన ఈ చిత్రానికి కెమెరా: కేవీ గుహన్, సంగీతం: చేతన్ భరద్వాజ్.


● గోపీచంద్

నా దగ్గర ఆధారాలు ఉన్నాయి - రాజ్ తరుణ్



లివింగ్ రిలేషన్‌షిప్‌లో ఉండి తనను రాజ్ తరుణ్ మోసం చేశాడని, ఇందులో మాల్వీ మల్హోత్రా ప్రమేయం కూడా ఉందని ఇటీవల లావణ్యా చౌదరి అనే అమ్మాయి ఆరోపణలు చేసిన విషయం గుర్తుండే ఉంటుంది. ఈ వివాదంపై రాజ్ తరుణ్ బుధవారం జరిగిన 'తిరగబడర సామీ' చిత్రం ప్రీ రిలీజ్ వేదికగా స్పందించారు. రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా ఏయస్ రవికుమార్ దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది.

ఈ వేదికపై రాజ్ తరుణ్ మాట్లాడుతూ - ''నేను చేయని తప్పుకు నిందలు వేస్తుంటే చాలా బాధగా ఉంది. నా కుటుంబ సభ్యులు కూడా బాధపడుతున్నారు. ఆరోపణలు చేసేవారు (పరోక్షంగా లావణ్యను ఉద్దేశించి..) బయట మాట్లాడతారు. ప్రతి దానికీ నా దగ్గర ఆధారాలు ఉన్నాయి. భయపడాల్సిన అవసరం నాకు లేదు. లీగల్‌గానే ప్రొసీడ్ అవుతాను... అవుతున్నాను. నాపై ఆరోపణలు చేసేవారి మాటలు విన్నారు కానీ ఏ రోజైనా ప్రూఫ్స్ అడిగారా? (మీడియాను ఉద్దేశించి..) అన్నారు. వారు చూపించాల్సిన ఆధారాలు చూపిస్తున్నారని ఓ జర్నలిస్ట్ మాట్లాడుతుండగా... మధ్యలో రాజ్ తరుణ్ జోక్యం చేసుకుని ''వాళ్ల ప్రూఫ్‌లను కోర్టులో చూపించుకుంటామన్నారు'' అన్నారు.

ఇంకా రాజ్ తరుణ్ మాట్లాడుతూ- ''ఆవిడ మాట్లాడిన తర్వాత ఫస్ట్ డేనే నేను మీడియా ముందుకు వచ్చి మాట్లాడాను. నేను ఆ రోజు చెప్పిన దాంట్లో ఏ అబద్ధం లేదు. ఇప్పుడూ చెప్పడం లేదు. నా సోదరుడు శేఖర్ చాలా ఆధారాలు తీసుకువచ్చాడు. నా దగ్గరా చాలా ఆధారాలు ఉన్నాయి. అయితే వాటిలో వేరే వాళ్ల పేర్లు, వివరాలు ఉన్నాయి. ఆ పేర్లు బయటపెట్టడం ఇష్టం లేక ఆ ఆధారాలు బయటపెట్టలేదు'' అంటున్న రాజ్ తరుణ్‌తో 'మీరు ఆమెకు అబార్షన్ చేయించారని ఆమె అంటున్నారు' అని ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించగా... ''మరి... నాపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఆ సెక్షన్ ఎందుకు లేదు?' అన్నారు రాజ్ తరుణ్.


''నా సోదరుడిపై ఆమె (లావణ్యను ఉద్దేశించి...) చేసిన ఆరోపణలకు సంబంధించి పోలీసులతో మాట్లాడాను. జూలై 24న ఆమె నాకు పంపిన సందేశాన్ని పోలీసులకు పంపాను. లీగల్ యాక్షన్ తీసుకుంటున్నారు. 2020లో నన్ను ఇబ్బంది పెట్టిన కొందరు క్రిమినల్స్‌తో ఆమె టచ్‌లో ఉన్నారు. నా దృష్టిలో ఆమె కూడా ఓ క్రిమినల్'' అన్నారు **మాల్వీ.** కాగా ఈ వేదిక ప్రాంగణంలో ''రాజ్ తరుణ్ నా మనిషి... నా కెరీర్‌ని వదులుకుని అతని కోసం పదేళ్లు ఇంటి పట్టునే ఉన్నాను. తనకోసం ఎంతదాకా అయినా వెళతాను'' అంటూ **లావణ్య** మాట్లాడారు.

గద్దర్ అవార్డులకు కమిటీ

''దివంగత గాయకుడు గద్దర్ పేరు మీద 'గద్దర్ అవార్డ్స్' ఇవ్వడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కానీ, సినీరంగ ప్రముఖుల నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికైనా సినిమా రంగానికి చెందిన ప్రముఖులు ముందుకొచ్చి ఈ ప్రతిపాదనను, ఈ కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాలి'' అంటూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సోమవారం మాట్లాడిన సంగతి తెలిసిందే. ఆయన వ్యాఖ్యలపై తాజాగా 'తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి', 'తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి' స్పందించాయి. ఈ మేరకు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశాయి. వాటి సారాంశం ఇలా... ''తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డిగారు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిగారు చేస్తున్న కృషికి ధన్యవాదాలు. నటునిగా, కళాకారునిగా, గాయకునిగా కళారంగానికి గద్దర్‌గారు చేసిన సేవలు ఎనలేనివి. ఆయన పట్ల మాకు చాలా గౌరవం ఉంది. ఆయన పేరిట అవార్డులు ఇస్తున్నందుకు గర్వంగా ఉంది. ఈ అవార్డ్స్‌కు సంబంధించిన కమిటీ విషయంపై 'తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్'తో చర్చించాం. త్వరలోనే ఒక కమిటీని నియమించి, విధి విధానాలను రూపొందిస్తాం. వాటిని తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారికి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిగారికి అతి త్వరలో అందజేస్తాం'' అని ఆ ప్రకటనల్లో 'తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి', 'తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి పేర్కొన్నాయి.

స్వచ్ఛమైన ప్రేమకథ

''అలనాటి రామచంద్రుడు' నేటి తరం కథ. హానెస్ట్ లవ్ స్టోరీ, మంచి ఫ్యామిలీ డ్రామాతో రూపొందిన ఈ మూవీని అన్ని వర్గాలవారు చూస్తారని నమ్ముతున్నాను'' అన్నారు డైరెక్టర్ చిలుకూరి ఆకాశ్ రెడ్డి. కృష్ణ వంశీ, మోక్ష జంటగా చిలుకూరి ఆకాశ్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'అలనాటి రామచంద్రుడు'.


● కృష్ణవంశీ, మోక్ష, ఆకాశ్ రెడ్డి

హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మించారు. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఆగస్టు 2న రిలీజ్ చేస్తోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్‌లో కృష్ణ వంశీ మాట్లాడుతూ- ''ఈ మూవీలో నా పాత్ర పేరు సిద్ధు. తను రామచంద్రుడులాంటి వాడే'' అన్నారు. ''మా 'అలనాటి రామచంద్రుడు' మూవీ 'దిల్' రాజు గారికి నచ్చి రిలీజ్ చేయడం మా అదృష్టంగా భావిస్తున్నాం. చాలా మంచి కథ. నేటి తరానికి కావాల్సిన స్వచ్ఛమైన ప్రేమకథని చూపించబోతున్నాం'' అన్నారు శ్రీరామ్ జడపోలు.

కొత్తగా ప్రయత్నించాలని ఈ సినిమా చేశాను - అశ్విన్‌బాబు



అశ్విన్‌బాబు హీరోగా నటించిన చిత్రం 'శివం భజే'. ఇందులో దిగంగనా సూర్యవన్షీ హీరోయిన్. మూలి మహేశ్వర్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు (గురువారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో అశ్విన్‌బాబు మాట్లాడుతూ- ''హిడింబ' తర్వాత చాలా కథలు విన్నాను. మళ్లీ ఏదో ఒకటి కొత్తగా ప్రయత్నించాలనుకుంటున్న సమయంలో 'శివం భజే' కథ విన్నాను. చాలా నచ్చింది. నా గత చిత్రాలు 'రాజుగారి గది, హిడింబ'లా 'శివం భజే' పాయింట్ బాగుంటుంది. ఈ చిత్రంలో పక్కింటి కుర్రాడిలా కనిపిస్తాను. ఎప్పుడేం జరుగుతుందో తెలియదు. అంతా విధి. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అంటారు కదా!.. ఆ టైపులో ఇందులోని నా క్యారెక్టర్ ఉంటుంది. అప్సర్ 'శివం భజే' కథను రాసుకున్న తీరు, ఐడియాలజీ నాకు నచ్చింది. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు కథను డివైన్ పాయింట్‌కు కనెక్ట్ చేసిన విధానం బాగుంటుంది. నిర్మాత రాజీ పడకుండా ఎక్కువే ఖర్చుపెట్టారు. ఏమన్నా అంటే అంతా శివయ్య చూసుకుంటారు అనేవారు. ఆగస్టు 1న నా బర్త్ డే కాబట్టి ఈ సినిమా రిలీజ్‌ను ప్లాన్ చేయలేదు. మేం ఓ రిలీజ్ డేట్ అనుకున్నాం. సరిగ్గా అది నా బర్త్ డేకి కుదిరింది... అంతే. ఇక 'రాజుగారి గది 4' సినిమా ప్లానింగ్ జరుగుతోంది. మరో రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.

పట్నం పిల్లని పట్టేశారో..


● తేజస్, ఖుష్బూ

తేజస్ కంచర్ల హీరోగా నటిస్తున్న చిత్రం 'ఉరుకు పటేల'. వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను నిర్మించిన ఈ సినిమా టీజర్‌ను హీరో అడవి శేష్ రిలీజ్ చేశారు. 'నీకో బంపర్ ఆఫర్... నన్ను పెళ్లి చేసుకో... నీకు లైఫ్ ఇస్తా', 'నిన్ను మాత్రం చేసుకోను నేను' అనే డైలాగ్స్‌తో పాటు 'పట్నం పిల్లని పట్టేశారో...', 'పటేలా పటేలా నీకే సలామ్ కొట్టాలా..' అనే సాంగ్స్ కూడా టీజర్‌లో వినిపిస్తాయి. ఈ సందర్భంగా తేజస్ కంచర్ల మాట్లాడుతూ- ''మంచి కంటెంట్ ఇవ్వాలని కాస్త టైమ్ తీసుకున్నాను. దర్శకుడు వివేక్ చెప్పిన కథ నచ్చింది'' అన్నారు. ''చాలా ఎంజాయ్ చేస్తూ ఈ సినిమాను పూర్తి చేశాం'' అన్నారు దర్శకుడు వివేక్. ''ఇది మా ఫస్ట్ మూవీ. మా అబ్బాయి తేజస్‌తో తీశాను. వివేక్ మంచి కథ ఇచ్చారు'' అన్నారు బాల భాను. ''టీజర్‌లో ఒక్క శాతం మాత్రమే చూపించాం. కథ చాలా ఉంది'' అన్నారు ఖుష్బూ చౌదరి.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. అల్లు శిరీష్‌తో 'ఏబీసీడీ' సినిమా, రాజ్ తరుణ్‌తో 'అహ నా పెళ్లంట' వెబ్ సిరీస్‌కి దర్శకత్వం వహించిన సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'మధుర' శ్రీధర్ రెడ్డి, నిర్వి హరి ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా నుంచి విక్రాంత్ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ''మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. ఒక సమకాలీన సమస్యను వినోదాత్మకంగా చూపిస్తూ ఈ సినిమాను రూపొందిస్తున్నారు సంజీవ్'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: మహి రెడ్డి పండుగుల, సంగీతం: సునీల్ కశ్యప్.


● విక్రాంత్



జొకోవిచ్ ముందుకు...

కెరీర్‌లో లోటుగా ఉన్న ఒలింపిక్ స్వర్ణ పతకాన్ని సాధించే దిశగా సెర్బియా టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ మరో అడుగు వేశాడు. పారిస్ ఒలింపిక్స్ పురుషుల టెన్నిస్ సింగిల్స్ విభాగంలో జొకోవిచ్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ జొకోవిచ్ 7-5, 6-3తో డొమినిక్ కోఫ్ఫెర్ (జర్మనీ)పై గెలుపొందాడు. 37 ఏళ్ల జొకోవిచ్ ఇప్పటి వరకు సింగిల్స్ విభాగంలో 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించాడు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచాడు.

స్వియాటెక్ జోరు...

పారిస్ ఒలింపిక్స్ టెన్నిస్ మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) జోరు కొనసాగుతోంది. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో స్వియాటెక్ 6-2, 6-4తో 52వ ర్యాంకర్ వాంగ్ జియు (చైనా)పై గెలిచింది. క్వార్టర్ ఫైనల్లో ఎనిమిదో సీడ్ డానియెలా కొలిన్స్ (అమెరికా)తో స్వియాటెక్ తలపడుతుంది. మరో మ్యాచ్‌లో మాజీ నంబర్‌వన్, 36 ఏళ్ల కెర్బర్ (జర్మనీ) 6-4, 6-3తో లేలా ఫెర్నాండెజ్ (కెనడా)పై గెలిచి ఒలింపిక్స్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన పెద్ద వయస్కురాలిగా గుర్తింపు పొందింది.





లవ్లీనా

లవ్లీ 'పంచ్' పవర్

క్వార్టర్ ఫైనల్లో భారత స్టార్ బాక్సర్ లవ్లీనా ● మరో విజయం సాధిస్తే పతకం ఖాయం

పారిస్: భారత ఒలింపిక్స్ క్రీడల చరిత్రలో ముగ్గురికే సాధ్యమైన ఘనతను సాధించేందుకు మహిళా స్టార్ బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్ ఒక్క విజయం దూరంలో ఉంది. వరుసగా రెండో ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న ఈ అస్సాం బాక్సర్ ఆడిన తొలి బౌట్‌లోనే ఏకపక్ష విజయంతో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన 75 కేజీల విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్లో లవ్లీనా 5-0తో (29-28, 30-27, 29-28, 30-27, 29-28) సునీవా హాఫ్‌స్టడ్ (నార్వే)ను చిత్తుగా ఓడించింది. ఆదివారం జరిగే క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ లీ కియాన్ (చైనా)తో లవ్లీనా తలపడుతుంది. ఈ బౌట్‌లో గెలిస్తే లవ్లీనాకు కనీసం కాంస్య పతకం ఖాయమవుతుంది. తద్వారా వ్యక్తిగత క్రీడాంశంలో రెండు ఒలింపిక్ పతకాలు గెలిచిన నాలుగో భారతీయ ప్లేయర్‌గా లవ్లీనా గుర్తింపు పొందుతుంది. ఇప్పటి వరకు భారత్ తరఫున రెజ్లర్ సుశీల్ కుమార్ (2008 బీజింగ్-కాంస్యం; 2012 లండన్-రజతం), షట్లర్ పీవీ సింధు (2016 రియో-రజతం; 2020 టోక్యో-కాంస్యం), పిస్టల్ షూటర్ మనూ భాకర్ (2024 పారిస్-2 కాంస్యాలు) రెండు ఒలింపిక్ పతకాల చొప్పున సాధించారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో 69 కేజీల విభాగంలో పోటీపడి కాంస్య పతకం నెగ్గిన లవ్లీనా ఈసారి 'పారిస్'లోనూ మెడల్ ఫేవరెట్స్‌లో ఒకరిగా బరిలోకి దిగింది. సునీవాతో జరిగిన బౌట్‌లో లవ్లీనా పక్కా వ్యూహంతో ఆడి ప్రత్యర్థికి ఏ దశలోనూ అవకాశం ఇవ్వలేదు. తన ఎత్తును ఉపయోగించుకొని నార్వే బాక్సర్ ముఖంపై నిలకడగా పంచ్‌లు కురిపించింది. నిర్ణీత మూడు రౌండ్‌లలోనూ లవ్లీనా పూర్తి ఆధిపత్యం చలాయించింది. దాంతో బౌట్‌ను పర్యవేక్షించిన ఐదుగురు జడ్జిలు లవ్లీనాయే పైచేయి సాధించినట్లు నిర్ణయించారు. క్వార్టర్ ఫైనల్లో లవ్లీనా సత్తాకు అసలు పరీక్ష ఎదురుకానుంది. చైనా బాక్సర్ లీ కియాన్ టోక్యో ఒలింపిక్స్‌లో 75 కేజీల విభాగంలో రజత పతకం సాధించింది. 2016 రియో ఒలింపిక్స్‌లో స్వర్ణం సొంతం చేసుకుంది. గత ఏడాది జరిగిన ఆసియా క్రీడల్లో లీ కియాన్ పసిడి పతకాన్ని దక్కించుకుంది. ఫలితంగా లవ్లీనా తన అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేస్తేనే చైనా బాక్సర్‌పై పైచేయి సాధించే అవకాశం ఉంటుంది.

పోరాడి ఓడిన ప్రీతి

మరోవైపు మహిళల 54 కేజీల విభాగంలో భారత బాక్సర్ ప్రీతి పవార్ పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రీతి పవార్ 2-3తో (29-28, 29-28, 30-27, 30-27, 28-29) రెండో సీడ్ మార్సెలా అరియస్ కాస్టనెడా (కొలంబియా) చేతిలో పోరాడి ఓడిపోయింది.



నాకౌట్ దశకు సింధు, లక్ష్య సేన్, ప్రణయ్

పారిస్ ఒలింపిక్స్ బ్యాడ్మింటన్ సింగిల్స్ విభాగాల్లో భారత స్టార్ ప్లేయర్లు పీవీ సింధు, లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్ నాకౌట్ దశకు అర్హత సాధించారు. తద్వారా పతకం గెలిచే ఆశలను సజీవంగా నిలబెట్టుకున్నారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ గ్రూప్ 'ఎమ్' రెండో లీగ్ మ్యాచ్‌లో సింధు 21-5, 21-10తో క్రిస్టిన్ కుబా (ఎస్తోనియా)పై అలవోకగా గెలిచింది. 33 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సింధుకు ఏ దశలోనూ ఇబ్బంది ఎదురుకాలేదు. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన సింధు గ్రూప్ 'ఎమ్' విజేతగా అవతరించి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు అర్హత పొందింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ హి బింగ్‌జియావో (చైనా)తో సింధు తలపడుతుంది.



లక్ష్య సేన్



ప్రణయ్

పురుషుల సింగిల్స్‌లో భారత రెండో ర్యాంకర్ లక్ష్య సేన్ సంచలనం సృష్టించాడు. ప్రపంచ నాలుగో ర్యాంకర్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)ను బోల్తా కొట్టించి గ్రూప్ 'ఎల్' టాపర్‌గా నిలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. 50 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 22వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21-18, 21-12తో క్రిస్టీపై గెలిచాడు. రెండో గేమ్‌లో స్కోరు 19-12 వద్ద ఉన్నపుడు ఇద్దరి మధ్య 50 షాట్‌ల ర్యాలీ జరిగింది. చివరకు క్రిస్టీ కొట్టిన షాట్ బయటకు వెళ్లడంతో పాయింట్ లక్ష్య సేన్‌కు లభించింది. ఆ తర్వాత లక్ష్య సేన్ మరో పాయింట్ నెగ్గి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. గ్రూప్ 'కె' టాపర్‌గా భారత నంబర్‌వన్ హెచ్‌ఎస్ ప్రణయ్ నిలిచాడు. చివరి లీగ్ మ్యాచ్‌లో ప్రపంచ 13వ ర్యాంకర్ ప్రణయ్ 16-21, 21-11, 21-12తో ఫట్ లె డక్ (వియత్నాం)పై నెగ్గాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత్‌కే చెందిన లక్ష్య సేన్‌తో ప్రణయ్ తలపడతాడు.

పక్కా ప్రణాళికతోనే పతకాలు

గగన్ నారంగ్

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ షూటర్లు పతకాలతో సత్తా చాటుకున్నారు. సమర్థవంతమైన మౌలిక వసతులు, ప్రణాళికబద్ధమైన కృషి వల్లే ఇది సాధ్యమైందని షూటింగ్ బృందం నిరూపించింది. సమయానుకూలంగా మారాల్సిన ఆవశ్యకతను ఈ విజయాలు తెలియజేశాయి. గత టోక్యో ఒలింపిక్స్‌లో ఒక్క పతకం లేకుండానే భారత షూటర్లు రిక్తహస్తాలతో తిరిగి వచ్చారు. మనూ భాకర్, సరబ్‌జోత్ సింగ్ పతకాలతో 12 ఏళ్ల తర్వాత విశ్వక్రీడల్లో మన షూటర్లు చరిత్ర సృష్టించారు. మను ఖాతాలో రెండు పతకాలున్నాయి. మూడో పతకం గెలిచేందుకు ముమ్మర కసరత్తు చేస్తోంది. దురదృష్టం వల్లే అర్జున్ బబూతాకు కాంస్యం చేజారింది. దీన్ని వైఫల్యంగా చూడలేం. నిజానికి అతను అత్యుత్తమ ప్రదర్శనే చేశాడు. కాకపోతే ఏం చేస్తాం ఆ రోజు తనది కాదు! ఈ ఒలింపిక్స్‌లో ఇంత మార్పు ఎలా సాధ్యమైంది. పతకాలు ఏలా సాకారమయ్యాయంటే మాత్రం యువ షూటర్ల ఆత్మవిశ్వాసమే ప్రధాన కారణం. క్రీడాగ్రామంలో నేను వారితో పోటీలకు ముందే భేటీ అయ్యాను. నేనో చెఫ్ డి మిషన్‌గా కాకుండా ఓ షూటర్‌గానే వాళ్లతో సంభాషించాను. అప్పుడు వాళ్ల విశ్వాసం, పట్టుదల ఏంటో నాకు అర్థమైంది. ఓ సీనియర్ షూటర్‌గా నేను వారికి చెప్పేదొకటే... గతం గురించి ఆలోచించకుండా ప్రస్తుత క్రీడలపైనే దృష్టి సారించాలని చెప్పాను. ప్రస్తుత బృందంలోని 21 మందిలో 10 మంది 'ఖేలో ఇండియా' ద్వారా వెలుగులోకి వచ్చారు. మరో 11 మంది టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం (టాప్స్) అండదండలతో విశ్వక్రీడలకు అర్హత సాధించగలిగారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ క్రీడాకారులకు ఉన్న ఆర్థిక కష్టాలను తొలగించి ఆటపై దృష్టి పెట్టేలా పెద్ద ఎత్తున కృషి చేశారు. క్రీడాకారులకు సంబంధించి ప్రత్యేక, వ్యక్తిగత శిక్షణ సిబ్బందిని ఎంచుకునే స్వేచ్ఛ కూడా కల్పించడం గొప్ప విషయం. విదేశీ కోచ్‌లు, విదేశాల్లో శిక్షణ వీటన్నింటి మీద క్రీడా శాఖ సమన్వయంతో పనిచేయడం వల్లే సానుకూల ఫలితాలు వస్తున్నాయి. ఆరంభంలోనే రెండు పతకాలు (షూటింగ్) రావడంతో ఈ విశ్వక్రీడల్లో భారత్ మరిన్ని పతకాలు గెలిచేందుకు పారిస్ ఒలింపిక్స్ దోహదం చేస్తుందని నేను ఆశిస్తున్నాను.



నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

ఆర్చరీ

పురుషుల వ్యక్తిగత (1/32 ఎలిమినేషన్ రౌండ్): ప్రవీణ్ జాధవ్ x వెన్‌చావో (చైనా) (మధ్యాహ్నం గం. 2:31 నుంచి). పురుషుల వ్యక్తిగత (1/16 ఎలిమినేషన్ రౌండ్): (మధ్యాహ్నం గం. 3:10 నుంచి).

షూటింగ్

పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ (ఫైనల్): స్వప్నిల్ కుసాలే (మధ్యాహ్నం గం. 1:00 నుంచి). మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ క్వాలిఫికేషన్ రౌండ్: సిఫ్ట్ కౌర్ సమ్రా, అంజుమ్ (మధ్యాహ్నం గం. 3:30 నుంచి).

గోల్ఫ్

పురుషుల వ్యక్తిగత ఫైనల్స్: గగన్‌జీత్ భుల్లర్, శుభాంకర్ శర్మ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి).

బాక్సింగ్

మహిళల 50 కేజీల ప్రిక్వార్టర్ ఫైనల్: నిఖత్ జరీన్ x యూ వూ (చైనా) (మధ్యాహ్నం గం. 2:30 నుంచి).

సెయిలింగ్

పురుషుల డింగీ తొలి రెండు రేసులు: విష్ణు శరవణన్ (మధ్యాహ్నం గం. 3:45 నుంచి). మహిళల డింగీ తొలి రెండు రేసులు: నేత్రా కుమానన్ (రాత్రి గం. 7:05 నుంచి)

హాకీ

భారత్ x బెల్జియం (గ్రూప్ మ్యాచ్) (మధ్యాహ్నం గం. 1:30 నుంచి).

బ్యాడ్మింటన్

పురుషుల సింగిల్స్ ప్రి క్వార్టర్ ఫైనల్స్: (మధ్యాహ్నం గం. 12:00 నుంచి). పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్: సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి x చియా ఆరోన్-సోహ్ వూయి యిక్ (మలేసియా) (సాయంత్రం గం. 4:30 నుంచి). మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్ (సాయంత్రం గం. 4:30 నుంచి).

గురి కుదిరితే మరో పతకం

పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్ ఫైనల్లో భారత షూటర్ స్వప్నిల్

- ఒలింపిక్స్‌లో ఈ ఘనత సాధించిన తొలి భారత షూటర్‌గా ఘనత
- క్వాలిఫయింగ్‌లో ఏడో స్థానంతో ఫైనల్‌కు అర్హత
- నేడు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పతకం కోసం పోటీ

మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో నిరాశపరిచిన భారత షూటర్లు పారిస్ ఒలింపిక్స్‌లో మాత్రం నిలకడగా రాణిస్తున్నారు. ఇప్పటికే మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో మనూ భాకర్... 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మనూ భాకర్-సరబ్‌జోత్ కాంస్య పతకాలు అందించారు. అంతా అనుకున్నట్లు జరిగితే నేడు భారత్ ఖాతాలో షూటింగ్ ద్వారా మూడో పతకం చేరుతుంది. బుధవారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో భారత్ తరఫున స్వప్నిల్ కుసాలే, ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ బరిలోకి దిగారు. స్వప్నిల్ ఏడో స్థానంలో నిలిచి ఫైనల్లోకి దూసుకెళ్లగా... ఐశ్వర్య ప్రతాప్ సింగ్ 11వ స్థానంతో సరిపెట్టుకున్నాడు.

పారిస్: అంతగా అంచనాలు లేకుండా తొలిసారి ఒలింపిక్స్ క్రీడల్లో బరిలోకి దిగిన భారత షూటర్ స్వప్నిల్ కుసాలే అదరగొట్టాడు. ఆద్యంతం నిలకడగా పాయింట్లు సాధించి పతకం రేసులో నిలిచాడు. బుధవారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో మహారాష్ట్రకు చెందిన 28 ఏళ్ల స్వప్నిల్ 590 పాయింట్లు స్కోరు చేసి ఏడో స్థానాన్ని దక్కించుకున్నాడు. మొత్తం 44 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో టాప్-8లో నిలిచిన వారికి ఫైనల్ బెర్త్‌లు ఖరారయ్యాయి. భారత్‌కే చెందిన ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ కూడా క్వాలిఫయింగ్‌లో పాల్గొని 589 పాయింట్లతో 11వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత పొందలేకపోయాడు. ఒలింపిక్స్ క్రీడల్లో పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఫైనల్‌కు అర్హత సాధించిన తొలి భారత షూటర్‌గా స్వప్నిల్ గుర్తింపు పొందాడు.

'త్రీ పొజిషన్స్' అని ఈవెంట్ పేరులో ఉన్నట్టే షూటర్లు వేర్వేరు మూడు భంగిమల్లో లక్ష్యం దిశగా షాట్‌లు సంధిస్తారు. తొలి సిరీస్‌లో షూటర్లు మోకాళ్లపై (నీలింగ్) కూర్చోని షూట్ చేస్తారు. రెండో సిరీస్‌లో సైనిక భంగిమ (ప్రోన్)లో షూట్ చేస్తారు. చివరిదైన మూడో సిరీస్‌లో నిల్చోని (స్టాండింగ్) లక్ష్యం వైపు షాట్‌లు కొడతారు. ఈ మూడు భంగిమల్లో స్కోరు చేసిన పాయింట్ల ఆధారంగా ర్యాంక్‌ను నిర్ణయిస్తారు. అత్యధికంగా పాయింట్లు సాధించి తొలి ఎనిమిది స్థానాల్లో నిలిచిన వారు ఫైనల్‌కు అర్హత సాధిస్తారు.

మహిళల రైఫిల్ త్రీ పొజిషన్స్ విభాగంలో ప్రపంచ మాజీ చాంపియన్, మహారాష్ట్రకే చెందిన తేజస్విని సావంత్ వద్ద శిక్షణ తీసుకుంటున్న స్వప్నిల్ క్వాలిఫయింగ్‌లో సంయమనం కోల్పోకుండా, ఏకాగ్రతతో షూట్ చేశాడు. ముందుగా 'నీలింగ్' సిరీస్‌లో 198 పాయింట్లు... 'ప్రోన్' సిరీస్‌లో 197 పాయింట్లు... చివరిదైన 'స్టాండింగ్' సిరీస్‌లో 195 పాయింట్లు స్కోరు చేశాడు. స్వప్నిల్‌తోపాటు జిరీ ప్రివ్రత్‌స్కయ్ (చెక్ రిపబ్లిక్), పీటర్ నింబర్‌స్కయ్ (చెక్ రిపబ్లిక్) కూడా 590 పాయింట్లు స్కోరు చేశారు. అయితే ఈ ముగ్గురిలో 10 పాయింట్ల షాట్‌లు స్వప్నిల్ (38 సార్లు), జిరీ (35 సార్లు) ఎక్కువగా కొట్టడంతో ఏడు, ఎనిమిదో ర్యాంక్‌లతో ఫైనల్‌కు చేరగా... పీటర్ (32 సార్లు) తొమ్మిదో స్థానంతో ఫైనల్ అవకాశాన్ని కోల్పోయాడు. ఐశ్వర్య ప్రతాప్ సింగ్ 'నీలింగ్'లో 197 పాయింట్లు... 'ప్రోన్'లో 193 పాయింట్లు... 'స్టాండింగ్'లో 193 పాయింట్లు స్కోరు చేసి 589 పాయింట్లతో 11వ స్థానాన్ని సంపాదించాడు. లియు యుకున్ (చైనా; 594 పాయింట్లు), జాన్ హెర్మన్ హెగ్ (నార్వే; 593 పాయింట్లు), సెర్హీ కులిష్ (ఉక్రెయిన్; 592 పాయింట్లు), డెనిస్ బెర్నార్డ్ లుకాస్ (ఫ్రాన్స్; 592 పాయింట్లు), లాజర్ కొవాసెవిచ్ (సెర్బియా; 592 పాయింట్లు), టొమాస్ బార్ట్‌నిక్ (పోలాండ్; 591 పాయింట్లు) వరుసగా తొలి ఆరు స్థానాల్లో నిలిచి స్వప్నిల్, జిరీలతో కలిసి నేడు జరిగే ఫైనల్లో పతకాల కోసం పోటీపడతారు.



స్వప్నిల్

రాజేశ్వరి, శ్రేయసి విఫలం

మహిళల ట్రాప్ ఈవెంట్‌లో భారత్ నుంచి ఇద్దరు షూటర్లు రాజేశ్వరి కుమారి, శ్రేయసి సింగ్ బరిలోకి దిగారు. మొత్తం 30 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో రాజేశ్వరి, శ్రేయసి 113 పాయింట్లు స్కోరు చేసి వరుసగా 22వ, 23వ స్థానాల్లో నిలిచారు. టాప్-6లో నిలిచిన వారు మాత్రమే ఫైనల్‌కు అర్హత సాధిస్తారు.

రోయింగ్ సెమీస్‌లో బల్‌రాజ్‌కు ఆరో స్థానం

భారత రోవర్ బల్‌రాజ్ పన్వర్ పారిస్ ఒలింపిక్స్ సింగిల్స్ స్కల్స్ సెమీఫైనల్లో ఆరో స్థానంలో నిలిచాడు. బుధవారం జరిగిన పోటీల్లో పన్వర్ 7 నిమిషాల 4.97 సెకన్లలో లక్ష్యాన్ని చేరాడు. ఇక 19 నుంచి 24 స్థానాల కోసం శనివారం జరగనున్న పోటీలో బల్‌రాజ్ బరిలోకి దిగనున్నాడు.

మనిక అవుట్... ప్రిక్వార్టర్స్‌లో శ్రీజ



శ్రీజ

పారిస్ ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్ (టీటీ) వ్యక్తిగత విభాగంలో భారత్ నుంచి ఆకుల శ్రీజ మాత్రమే బరిలో నిలిచింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో భారత నంబర్‌వన్, ప్రపంచ 25వ ర్యాంకర్ ఆకుల శ్రీజ 9-11, 12-10, 11-4, 11-5, 10-12, 12-10తో జెంగ్ జియాన్ (సింగపూర్)పై విజయం సాధించింది. 51 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీజకు గట్టిపోటీ ఎదురైంది. అయితే కీలక దశల్లో శ్రీజ పాయింట్లు గెలిచి విజయాన్ని ఖరారు చేసుకుంది. ఈ గెలుపుతో మనిక బత్రా తర్వాత ఒలింపిక్స్ క్రీడల టీటీ పోటీల్లో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన రెండో భారతీయ క్రీడాకారిణిగా తెలంగాణ అమ్మాయి శ్రీజ గుర్తింపు పొందింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ సన్ యింగ్షా (చైనా)తో శ్రీజ తలపడుతుంది. మరోవైపు భారత రెండో ర్యాంకర్ మనిక బత్రా పోరాటం విశ్వక్రీడల్లో ముగిసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 28వ ర్యాంకర్ మనిక 6-11, 9-11, 14-12, 8-11, 7-11తో ప్రపంచ 13వ ర్యాంకర్ మియు హిరానో (జపాన్) చేతిలో ఓడిపోయింది.

సాత్విక్ జోడీ సత్తాకు పరీక్ష

ఒలింపిక్స్‌లో పతకం రేసులో నిలవాలంటే భారత బ్యాడ్మింటన్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాల్సిన సమయం వచ్చేసింది. 'పారిస్' గేమ్స్‌లో బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ నాకౌట్ దశ 'డ్రా' బుధవారం విడుదలైంది. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంక్ ద్వయం ఆరోన్ చియా-సో వుయ్ యిక్ (మలేసియా)తో సాత్విక్-చిరాగ్ జంట తలపడనుంది. ముఖాముఖి రికార్డులో సాత్విక్-చిరాగ్ ద్వయం 3-8తో వెనుకబడి ఉంది. ఒకదశలో మలేసియా జంట చేతిలో వరుసగా ఎనిమిది మ్యాచ్‌ల్లో ఓడిపోయిన భారత జోడీ ఇటీవల ఈ ద్వయంతో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో గెలుపొందింది. అయితే గత టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన ఆరోన్ చియా-సో వుయ్ యిక్‌ను తక్కువ అంచనా వేసే పరిస్థితి లేదు.

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	చైనా	8	7	3	18
2	జపాన్	8	3	4	15
3	ఫ్రాన్స్	7	9	8	24
4	ఆస్ట్రేలియా	7	4	3	14
5	బ్రిటన్	6	6	5	17
6	దక్షిణ కొరియా	5	3	3	11
7	అమెరికా	4	13	12	29
39	భారత్	0	0	2	2

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

సాక్షి బిజినెస్
గురువారం
1-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	286	81,741
నిఫ్టీ ▲	94	24,951

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,515	▲ 369
డోజోన్స్	40,939	▲ 195
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,368	▲ 94
డాక్స్	18,509	▲ 97
షాంఘై	2,939	▲ 59
నికాయ్	39,102	▲ 576

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	69,309
బంగారం (99.5 స్వచ్ఛత)	69,031
వెండి (కేజీ)	82,974

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.32	84.34
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.45	109.03
€	యూరో	ఎస్‌బీఐ	89.60	91.97
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.25	55.47
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.59	55.52
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.32	65.01
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.43	22.99
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.91	23.69
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.73	12.55

మారుతీ లాభం జూమ్



నికర లాభం రూ. 3,650 కోట్లు • ఎగుమతులు 12% అప్

న్యూఢిల్లీ: కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (2024–25, క్యూ1) లో రూ. 3,650 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో నమోదైన రూ. 2,485 కోట్లతో పోలిస్తే 47 శాతం ఎగబాకింది. వ్యయ నియంత్రణలు, తగ్గిన కమోడిటీ ధరలు, విదేశీ మారక ఆర్జన లాభాల్లో వృద్ధికి దోహదపడినట్లు కంపెనీ కార్పొరేట్ వ్యవహారాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాహుల్ భారతీ పేర్కొన్నారు. అయితే ఒక్కో వాహనంపై డిస్కౌంట్ సగటున రూ. 14,500 నుంచి రూ. 21,700కు పెరిగినట్లు వెల్లడించారు. మొత్తం ఆదాయం సైతం రూ. 30,845 కోట్ల నుంచి రూ. 33,875 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో 5 శాతం అధికంగా 5,21,868 వాహనాలను విక్రయించింది. వీటిలో దేశీ విక్రయాలు 4 శాతం వృద్ధితో 4,51,308 యూనిట్లను తాకాయి. 2025 జనవరిలో ఏర్పాటుకానున్న భారత్ మొబిలిటీ షోలో తొలి ఎలక్ట్రిక్ వాహనాన్ని(ఈవీ) ప్రదర్శించనున్నట్లు రాహుల్ తెలిపారు.

ఫలితాల నేపథ్యంలో మారుతీ షేరు 2.3 శాతం లాభంతో రూ. 13,168 వద్ద ముగిసింది.


మహీంద్రా.. టాప్ గేర్



క్యూ1 లాభం రూ. 3,283 కోట్లు

న్యూఢిల్లీ: దేశీ వాహన దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (2024–25, క్యూ1)లో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 20 శాతం ఎగసి రూ. 3,283 కోట్లను తాకింది. గతేడాది (2023–24) ఇదే కాలంలో రూ. 2,745 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 10 శాతం పుంజుకుని రూ. 37,218 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 33,892 కోట్ల టర్నోవర్ అందుకుంది. గత క్యూ1లో కేజీ మొబిలిటీ పెట్టుబడి ద్వారా రూ. 405 కోట్లు, ఎస్‌సీఐఈలో వాటా ద్వారా రూ. 358 కోట్లు చొప్పున వన్‌టైమ్ లాభాలు కలసి ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా కంపెనీ ప్రస్తావించింది. క్యూ1లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 2.12 లక్షల యూనిట్లు విక్రయించినట్లు ఎంఅండ్ఎం ఎండీ, సీఈవో అనిష్ షా పేర్కొన్నారు. ఇది 14% వృద్ధి. యుటిలిటీ విభాగం కొత్త రికార్డ్‌తో 1.24 లక్షల యూనిట్లను తా కింది.

ఎంఅండ్ఎం షేరు 0.5% క్షీణించి రూ. 2,907 వద్ద క్లోజైంది.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
గ్రామాల్లో బ్యాంక్ సేవలు విస్తరించాలి
బ్యాంక్ ఆఫ్ బరోడా లాభం రూ. 4,728 కోట్లు

భలే మంచి

జోరందుకున్న బ్యాంకుల డిపాజిట్ వేట | రుణాల జోరు.. డిపాజిట్ల డీలా ఎఫెక్ట్ | అధిక వడ్డీ స్కీమ్‌లతో నిధుల సమీకరణకు సై.. | సీనియర్ సిటిజన్లకు అర శాతం అదనం

డిపాజిట్ బేరం!

గత కొన్నాళ్లుగా బ్యాంకుల రుణ వృద్ధి భారీగా ఎగబాకుతోంది. డిపాజిట్లు మాత్రం ఆ మేరకు పెరగడం లేదు. రెండింటి మధ్య కొంత అంతరం ఉండటం సహజమే కానీ, ఇంత భారీ వ్యత్యాసం ఉండకూడదు. దీనివల్ల బ్యాంకింగ్ రంగంలో వ్యవస్థాగత ద్రవ్య సరఫరా (లిక్విడిటీ) సమస్యలకు దారితీస్తుంది. ప్రజల పొదుపు ధోరణుల్లో తీవ్ర మార్పులు చోటు చేసుకుంటాయి. దీన్ని అధిగమించేందుకు బ్యాంకులు వెంటనే తగిన వ్యూహాలను అమలు చేయాలి.

– తాజాగా ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ వ్యక్తం చేసిన ఆందోళన ఇది.

ఈ దెబ్బతో బ్యాంకులు డిపాజిట్ల వేటను ముమ్మరం చేశాయి. ప్రత్యేక స్కీమ్‌ల ద్వారా మరిన్ని రిటైల్ డిపాజిట్ల సమీకరణకు తెరతీస్తున్నాయి. ఇప్పటికే ఉన్న డిపాజిట్ పథకాలతో పోలిస్తే 25–30 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు అంటే 1 శాతం) అధిక వడ్డీని కూడా ఆఫర్ చేస్తూ డిపాజిటర్లకు గాలం వేస్తున్నాయి. తాజా పరిణామాలతో, రుణాలపై అధిక వడ్డీరేట్ల భారం మరికొన్నాళ్లు కొనసాగుందని స్పష్టమవుతోంది. డిపాజిట్ల పెంపునకు తక్షణం చర్యలు చేపట్టాలంటూ బ్యాంకులను ఆర్‌బీఐ ఆదేశించిన తర్వాత ప్రభుత్వ రంగ బ్యాంకులు పోలోమంటూ కొత్త పథకాలను ప్రకటించాయి. ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ), యూనియన్ బ్యాంక్, అలాగే బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఈ రేసులో ముందున్నాయి. 7.25 శాతం నుంచి 7.3 శాతం మేర వడ్డీరేట్లతో డిపాజిట్ స్కీమ్‌లను ప్రకటించాయి. వీటి కాలవ్యవధి 399 రోజుల నుంచి 444 రోజుల వరకు ఉంటోంది. ఐఓబీ అత్యధికంగా 444 రోజుల డిపాజిట్ స్కీమ్‌పై 7.3 శాతం వడ్డీ ఇస్తోంది. అంతేకాకుండా బ్యాంకులన్నీ సీనియర్ సిటిజన్లకు అదనంగా మరో అర శాతం వడ్డీని కూడా అందిస్తుండటంతో డిపాజిటర్లకు మేలు చేకూరుతోంది. '4% స్థాయికి ద్రవ్యోల్బణం శాంతిస్తే, ఆర్‌బీఐ రేట్ల కోత మొదలవుతుంది. అప్పుడు డిపాజిట్లపై అధిక రేట్ల వల్ల బ్యాంకుల వ్యయాలు పెరిగిపోతాయి. అందుకే బ్యాంకులు స్వల్పకాలిక డిపాజిట్లకే అధిక వడ్డీని పరిమితం చేస్తున్నాయి' అని ఇక్రా రేటింగ్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ గుప్తా అభిప్రాయపడ్డారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

20 ఏళ్లలో తొలిసారి...

ఈ ఏడాది జూలై 12 నాటికి బ్యాంకుల డిపాజిట్ల వృద్ధి 11 శాతానికి పరిమితమైంది. అయితే, రుణ వృద్ధి మాత్రం 14 పైగా శాతంగా నమోదైంది. దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో రుణ, డిపాజిట్ వృద్ధిలో ఇంత తేడా రావడం గడిచిన 20 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. దీంతో ఈ అంతరాన్ని తగ్గించాల్సిందేనని బ్యాంకు సీఈఓలకు ఆర్‌బీఐ స్పష్టం చేస్తోంది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో భారత్ కూడా అందుకు మినహాయింపు కాదని, పాలసీ వడ్డీ రేట్ల కోత గురించి ఆలోచించడం తొందరపాటేనంటూ గవర్నర్ శక్తికాంత్ దాస్ తాజాగా పేర్కొనడం విశేషం. కాగా, ప్రస్తుత వడ్డీ రేట్లతో రిటైల్ డిపాజిట్ల సమీకరణ బ్యాంకులకు కష్టతరంగా మారిందని, అందుకే పరిమిత కాల స్కీమ్‌లను ప్రారంభించాల్సి వస్తోందని ఓ వాణిజ్య బ్యాంకు ట్రెజరీ హెడ్ పేర్కొన్నారు.

ప్రత్యేక డిపాజిట్ ఆఫర్స్...

- ఎస్‌బీఐ- అమృత్ వృష్టి: వడ్డీ రేటు 7.25% (కాల వ్యవధి 444 రోజులు)
- బ్యాంక్ ఆఫ్ బరోడా – మాన్సూన్ ధమాకా: 7.25% (399 రోజులు)
- బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర: 7.15% (666 రోజులు)
- యూనియన్ బ్యాంక్: 7.25% (399 రోజులు)
- ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్: 7.3% (444 రోజులు)



తగ్గిన ఇన్‌ఫ్రా జోరు

జూన్‌లో వృద్ధి 4 శాతానికి పరిమితం

న్యూఢిల్లీ: ఎనిమిది రంగాలతో కూడిన కీలక మౌలిక పరిశ్రమ గ్రూప్ జూన్‌లో తీవ్ర నిరాశ కలిగించింది. గడచిన 20 నెలల్లో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయిలో కేవలం 4 శాతం వృద్ధిని నమోదుచేసుకుంది. క్రూడాయిల్, రిఫైనరీ ప్రొడక్టుల పేలవ పనితీరు దీనికి ఒక కారణం. 2024 మేలో ఈ గ్రూప్ వృద్ధి రేటు 6.4 శాతం అయితే, 2023 జూన్‌లో వృద్ధి రేటు 8.4 శాతం.



మూడు నెలల్లో పురోగతి 5.7 శాతం...

కాగా, ఏప్రిల్ నుంచి జూన్ మధ్య కాలంలో గ్రూప్ వృద్ధి రేటు 5.7 శాతం. గత ఏడాది ఇదే కాలంలో ఈ స్పీడ్ 6 శాతం. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఎనిమిది రంగాల వాటా దాదాపు 40 శాతం. ఆగస్టు తొలి పక్షం రోజుల్లో జూన్ ఐఐపీ గణాంకాలు వెలువడనున్నాయి.

నాలుగోరోజూ లాభాలే

సెన్సెక్స్ లాభం 286 పాయింట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగోరోజూ లాభాలతో ముగిశాయి. మెటల్, ఆటో, విద్యుత్ షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 286 పాయింట్లు పెరిగి 81,741 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 94 పాయింట్లు బలపడి 24,951 వద్ద నిలిచింది. మారుతీ సుజుకీ, భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ షేర్లు 2% నుంచి 1% రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 372 పాయింట్లు బలపడి 81,828 వద్ద, నిఫ్టీ 127 పాయింట్లు ఎగసి 24,969 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. బీఎస్‌ఈ స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు ఇంట్రాడేలో జీవితకాల గరిష్టాలు నమోదు చేశాయి. ఫెడ్‌తో సహా బీఓజే, బీఓఈలు సరళతర ద్రవ్య విధాన వైఖరికి మొగ్గుచూపొచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.



టాటా స్టీల్ లాభం అప్..


క్యూ1లో రూ. 919 కోట్లు: 75% వృద్ధి

న్యూఢిల్లీ: వ్యయాలను గణనీయంగా తగ్గించుకోవడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఉక్కు దిగ్గజం టాటా స్టీల్ ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. క్యూ1లో నికర లాభం (కన్సాలిడేటెడ్) ఏకంగా 75 శాతం ఎగసి రూ. 919 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఇది రూ. 525 కోట్లు. సమీక్షాకాలంలో మొత్తం ఆదాయం రూ. 60,666 కోట్ల నుంచి రూ. 55,031 కోట్లకు తగ్గింది. అటు వ్యయాలు కూడా రూ. 58,553 కోట్ల నుంచి రూ. 52,389 కోట్లకు దిగి వచ్చాయి. మరోవైపు టీపీ పరివర్త్ సంస్థలో 26 శాతం వాటాల కొనుగోలు ప్రతిపాదనకు టాటా స్టీల్ బోర్డు ఆమోదముద్ర వేసింది. అటు ఈ ఆర్థిక సంవత్సరంలో నీలాచల్ ఇస్పాత్ నిగమ్ (ఎన్ఐఎన్ఎల్)కు రూ. 6,000 కోట్ల వరకు నిధులు సమకూర్చే ప్రతిపాదనను కూడా బోర్డు ఆమోదించింది.



ఇన్ఫీకి రూ.32,403 కోట్ల జీఎస్‌టీ ఎగవేత నోటీస్

న్యూఢిల్లీ: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్‌కు భారీ పన్ను ఎగవేతకు సంబంధించి 'ప్రీ షో కాజ్' నోటీసులు అందాయి. దాదాపు రూ. 32,403 కోట్ల మేర వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) ఎగవేతకు పాల్పడిందన్న ఆరోపణలపై ఈ నోటీసులు అందుకున్నట్లు బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న సంస్థ ఒక బీఎస్‌ఈ ఫైలింగ్‌లో పేర్కొంది. 2017 నుంచి 2022 మార్చి మధ్య ఇన్ఫోసిస్ విదేశీ బ్రాంచ్ ఆఫీస్‌లు చేసిన వ్యయాలకు ఈ పన్ను చెల్లించాలన్నది డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్‌టీ ఇంటెలిజెన్స్ నోటీసుల ప్రధాన సారాంశం. ఈ నోటీసుకు ప్రతిస్పందన సమర్పించనున్నట్లు సంస్థ తెలిపింది. నిబంధనల ప్రకారం, అటువంటి వ్యయాలకు జీఎస్‌టీ వర్తించదని కంపెనీ విశ్వసిస్తోంది. తాజా వార్తలతో అమెరికా మార్కెట్‌లో ఇన్ఫోసిస్ ఏడీఆర్ 2.5% తగ్గి 22 డాలర్లకు చేరింది.



సాక్షి స్పోర్ట్స్



అన్షుమన్ గైక్వాడ్ కన్నుమూత

భారత మాజీ క్రికెటర్, కోచ్ అన్షుమన్ గైక్వాడ్ (72) బుధవారం కన్నుమూశారు. గత కొంత కాలంగా ఆయన క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఇటీవలే చికిత్స చేయించుకున్నా గైక్వాడ్ కోలుకోలేకపోయారు. బరోడాకు చెందిన అన్షుమన్ భారత్ తరఫున 40 టెస్టుల్లో 1,985 పరుగులు, 15 వన్డేల్లో 269 పరుగులు చేయగా... 22 ఏళ్ల ఫస్ట్ క్లాస్ క్రికెట్ కెరీర్‌లో 206 మ్యాచ్‌లలో 12,136 పరుగులు సాధించారు. అసాధారణ బ్యాటర్ కాకపోయినా... భీకరమైన పేస్ బౌలింగ్‌నైనా సమర్థంగా ఎదుర్కొనే ధైర్యం, పట్టుదల గైక్వాడ్‌ను ప్రత్యేకంగా నిలిపాయి. 1975–76లో విండీస్ గడ్డపై హోల్డింగ్ తదితరుల ఫాస్ట్ బౌలింగ్‌ను ఎదుర్కొని చేసిన 81 పరుగులు గైక్వాడ్ కెరీర్‌లో చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్‌గా మిగిలిపోయింది. పాకిస్తాన్‌పై 671 నిమిషాల పాటు బ్యాటింగ్ చేసి సాధించిన 201 పరుగులు టెస్టుల్లో గైక్వాడ్ అత్యధిక స్కోరు. 1997–99 మధ్య అన్షుమన్ భారత జట్టు కోచ్‌గా వ్యవహరించారు. ఆ సమయంలో భారత జట్టు చెప్పుకోదగ్గ పలు విజయాలు సాధించింది. 2018లో బీసీసీఐ కల్నల్ సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో గైక్వాడ్‌ను గౌరవించింది.

నీరజ్ చోప్రాపైనే భారత్ ఆశలు



జావెలిన్ త్రో షెడ్యూల్
నీరజ్ చోప్రా, కిషోర్ జేనా
క్వాలిఫయింగ్: ఆగస్టు 6 మధ్యాహ్నం గం. 1:50 నుంచి
ఫైనల్: ఆగస్టు 8 రాత్రి గం. 11:55 నుంచి

నేటి నుంచి పారిస్ ఒలింపిక్స్ అథ్లెటిక్స్ పోటీలు
- బరిలో 29 మంది భారత అథ్లెట్లు
- తొలి రోజు 20 కిలోమీటర్ల రేస్ వాక్

పారిస్: విశ్వ క్రీడల్లో అందరూ ఆసక్తితో ఎదురు చూసే అథ్లెటిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీలకు నేడు తెర లేవనుంది. ఒలింపిక్స్ మొదలై ఐదు రోజులు దాటినా.. అసలు సిసలు మజా ఇచ్చే అథ్లెటిక్స్ ఈవెంట్ నేటి నుంచి జరుగుతుంది. భారత అభిమానుల విషయానికొస్తే స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాపైనే అందరి దృష్టి ఉంది. టోక్యో ఒలింపిక్స్‌లో పసిడి పతకంతో భారత అథ్లెటిక్స్ చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని లిఖించిన నీరజ్ మరోసారి అదే స్థాయి ప్రదర్శన చేసేందుకు సిద్ధమవుతుండగా.. భారత్ నుంచి మొత్తం 29 మంది అథ్లెట్లు ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో సత్తా చాటేందుకు రెడీ అయ్యారు. 'టోక్యో' క్రీడల్లో పసిడి పతకం సాధించిన తర్వాత అంతర్జాతీయ స్థాయిలో అదే నిలకడ కొనసాగిస్తూ వస్తున్న నీరజ్ వరుసగా రెండో స్వర్ణం నెగ్గాలని తహతహలాడుతున్నాడు. ఆగస్టు 6న పురుషుల జావెలిన్‌త్రో క్వాలిఫికేషన్ రౌండ్... రెండు రోజుల తర్వాత 8న ఫైనల్ జరగనుంది. నీరజ్ టైటిల్ నిలబెట్టుకుంటే.. ఒలింపిక్స్‌లో ఆ ఘనత సాధించిన ఐదో జావెలిన్ త్రోయర్ కానున్నాడు. విశ్వక్రీడల చరిత్రలో ఎరిక్ లామింగ్ (స్వీడన్; 1908, 1912), జానీ మైరా (ఫిన్లాండ్; 1920, 1924), జాన్ జెలెన్జీ (చెక్ రిపబ్లిక్; 1992, 1996, 2000), ఆండ్రీస్ థోర్‌కిల్డ్‌సెన్ (నార్వే; 2004, 2008) స్వర్ణాన్ని నిలబెట్టుకున్నారు.

రేస్ వాక్‌తో మొదలు..

అథ్లెటిక్స్‌లో భాగంగా తొలి రోజు మహిళల, పురుషుల 20 కిలోమీటర్ల రేస్ వాక్ పోటీలు ప్రారంభం కానున్నాయి. భారత్ నుంచి పురుషుల విభాగంలో అక్ష్‌దీప్ సింగ్, వికాస్ సింగ్, పరమ్‌జీత్ సింగ్ బిష్త్ పోటీలో ఉన్నారు. ఇక మహిళల విభాగం నుంచి ప్రియాంక గోస్వామి బరిలోకి దిగనుంది. పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో అవినాశ్ సాబ్లేపై భారీ అంచనాలు ఉండగా... 4–400 మీటర్ల పురుషుల ఈవెంట్‌లో మన జట్టు పతక ఆశలు రేపుతోంది. ఇటీవల పారిస్ డైమండ్ లీగ్‌లో అవినాశ్ జాతీయ రికార్డు బద్దలు కొట్టి 8 నిమిషాల 9.91 సెకన్లలో లక్ష్యాన్ని చేరి ఆరో స్థానంలో నిలిచాడు.

హర్డిల్స్‌లో జ్యోతి...రిలేలో జ్యోతిక శ్రీ

ఇక ఒలింపిక్స్ చరిత్రలో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో పాల్గొంటున్న తొలి భారత అథ్లెట్‌గా ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ గుర్తింపు పొందనుంది. ఇటీవలి కాలంలో అంతర్జాతీయ స్థాయిలో నిలకడైన ప్రదర్శన కనబరుస్తున్న జ్యోతి... 'పారిస్' క్రీడల్లోనూ అదే జోరు కనబర్చాలని చూస్తోంది. మహిళల 4X400 మీటర్ల రిలే జట్టులో కీలక సభ్యురాలైన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి దండి జ్యోతిక శ్రీపై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. ఇక మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌తో పాటు 5000 మీటర్ల పరుగులో పాల్గొంటున్న పారుల్ చౌదరి, మహిళల జావెలిన్‌త్రోలో అన్ను రాణి, పురుషుల షాట్‌పుట్‌లో తజిందర్ పాల్‌సింగ్ తూర్, ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రావేల్, అబూబాకర్ నుంచి కూడా మెరుగైన ప్రదర్శన ఆశించవచ్చు.

కొత్తగా రెపిచాజ్ రౌండ్..

రెజ్లింగ్, రోయింగ్ మాదిరిగానే ఈసారి నుంచి ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లోనూ రెపిచాజ్ విభాగాన్ని ప్రవేశ పెట్టనున్నారు. 200 మీటర్ల నుంచి 1500 మీటర్ల పరుగు వరకు వ్యక్తిగత విభాగాల్లో దీన్ని అమలు చేయనున్నారు. హర్డిల్స్‌కు కూడా ఇది వర్తించనుంది. గతంలో హీట్స్‌లో అగ్రస్థానంలో నిలిచిన అథ్లెట్లతో పాటు వేగవంతమైన టైమింగ్ నమోదు చేసుకున్న అథ్లెట్లు సెమీఫైనల్‌కు చేరేవారు. తాజా రెపిచాజ్ రౌండ్‌తో హీట్స్‌లో ముందు నిలిచిన వారు మాత్రమే సెమీస్‌కు అర్హత సాధిస్తారు. మిగిలిన వాళ్లందరూ రెపిచాజ్ రౌండ్‌లో పాల్గొంటారు. అందులో సత్తా చాటితే సెమీఫైనల్‌కు చేరేందుకు రెండో అవకాశం దక్కనుంది.

అసలేంటీ రెపిచాజ్

ఫ్రెంచ్ భాషలో రెపిచాజ్.. అంటే రెండో అవకాశం అని అర్థం. నిజంగానే ఇది అథ్లెట్లకు సెకండ్ చాన్స్ వంటిదే. 'పారిస్' క్రీడల ద్వారా అథ్లెటిక్స్‌లో ఈ రౌండ్‌ను మొదటిసారి ప్రవేశ పెట్టనున్నారు. గతంలో మార్షల్ ఆర్ట్స్, రోయింగ్, రెజ్లింగ్ క్రీడల్లో మాత్రమే ఈ అవకాశం ఉండేది. ఇప్పుడు రన్నింగ్, హర్డిల్స్‌లో 200 మీటర్ల నుంచి 1500 మీటర్ల వరకు దీన్ని అమలు చేయనున్నారు. దీంతో తొలి హీట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చలేకపోయిన వారికి సెమీఫైనల్ చేరడానికి మరో అవకాశం దక్కనుంది. 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్, 5000 మీటర్ల పరుగులో రెపిచాజ్ రౌండ్‌ను అనుమతించడం లేదు. ఈ ఈవెంట్‌లలో పాల్గొన్న అథ్లెట్లు తేరుకునేందుకు మరింత సమయం అవసరమవనుండటంతో.. 1500 మీటర్ల వరకే దీన్ని పరిమితం చేశారు. ఇక పురుషుల, మహిళల 10,000 మీటర్లు, మారథాన్స్‌లో కేవలం ఫైనల్ మాత్రమే నిర్వహించనున్నారు.



మహిళల 4x400 మీటర్ల రిలే
దండి జ్యోతిక శ్రీ
తొలి రౌండ్: ఆగస్టు 9
మధ్యాహ్నం గం 2:10 నుంచి
ఫైనల్: ఆగస్టు 11
అర్ధరాత్రి గం. 12.44 నుంచి



మహిళల 100 మీటర్ల హర్డిల్స్
జ్యోతి యర్రాజీ
తొలి రౌండ్: ఆగస్టు 7
మధ్యాహ్నం గం. 1:45 నుంచి
రెపిచాజ్ రౌండ్: ఆగస్టు 8
మధ్యాహ్నం గం. 2:05 నుంచి
సెమీఫైనల్: ఆగస్టు 9
మధ్యాహ్నం గం. 3:35 నుంచి
ఫైనల్: రాత్రి గం. 11:05 నుంచి

దీపిక ముందుకు...

తరుణ్‌దీప్ రాయ్ నిష్క్రమణ




పారిస్: టీమ్ ఈవెంట్‌లో నిరాశాజనక ప్రదర్శనను మరిపించే విధంగా భారత స్టార్ ఆర్చర్ దీపిక కుమారి వ్యక్తిగత విభాగంలో రాణించింది. వరుసగా నాలుగోసారి ఒలింపిక్స్ క్రీడల్లో పోటీపడుతున్న ఈ జార్ఖండ్ క్రీడాకారిణి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగం తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ దీపిక 6–5తో (29–28, 26–27, 27–27, 24–27, 30–27) 'షూట్ ఆఫ్'లో రీనా పర్నాత్ (ఎస్తోనియా)పై విజయం సాధించింది. ఐదు సెట్‌ల తర్వాత ఇద్దరూ సమంగా నిలువడంతో విజేతను నిర్ణయించేందుకు 'షూట్ ఆఫ్'ను నిర్వహించారు. 'షూట్ ఆఫ్'లో దీపిక సంధించిన బాణానికి 9 పాయింట్లురాగా, రీనా పర్నాత్ 8 పాయింట్లే స్కోరు చేసి ఓడిపోయింది. అనంతరం రెండో రౌండ్ మ్యాచ్‌లో దీపిక 6–2తో (29–28, 27–29, 25–17, 28–23) క్వింటీ రోఫీన్ (నెదర్లాండ్స్)పై గెలిచింది. శనివారం జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో మిచెల్లి క్రాపెన్ (జర్మనీ)తో దీపిక; దియనంద చోయ్‌రునీసా (ఇండోనేసియా)తో భజన్ కౌర్ తలపడతారు. మరోవైపు పురుషుల వ్యక్తిగత విభాగంలో భారత వెటరన్ ఆర్చర్ తరుణ్‌దీప్ రాయ్ కథ ముగిసింది. నాలుగోసారి ఒలింపిక్స్‌లో పోటీపడ్డ 40 ఏళ్ల తరుణ్‌దీప్ రాయ్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. తొలి రౌండ్‌లో తరుణ్‌దీప్ రాయ్ 4–6తో (27–27, 27–28, 28–25, 28–29, 29–29)తో టామ్ హాల్ (బ్రిటన్) చేతిలో ఓడిపోయాడు.

ఆ ఆర్చర్ గురికి ఒకటే పాయింట్!



పారిస్: ఆర్చరీ పోటీల్లో గురి లక్ష్య బిందువుపైనే ఉంటుంది. ఇది కుదిరితే 10 కాస్త అటుఇటు తప్పితే 9, 8, 7 పాయింట్లు సహజం. కానీ ఆఫ్రికన్ దేశం చాడ్ ఆర్చర్ ఇజ్రాయెల్ మదయె దాదాపు టార్గెట్ రింగ్స్ బోర్డుకే దూరమయ్యే బాణం సంధించాడు. త్రుటిలో బోర్డులో పడింది... కానీ వచ్చింది ఒకే పాయింట్! వినడానికి విడ్డూరంగా ఉన్న మదయె రెండో సెట్‌లో మూడు షాట్లలో ఒకటి ఒక్క పాయింటే తెచ్చి పెట్టింది. విలువిద్యలో కొరియన్ ఆర్చర్లకు తిరుగుండదు. పైగా మూడుసార్లు ఒలింపిక్ చాంపియన్ అయిన కిమ్ వూ జిన్ ముందు 36 ఏళ్ల మదయె ఓ పిల్లబచ్చ! ఈ మ్యాచ్‌లో 26–29, 15–29, 25–30 స్కోరుతో కిమ్ చేతిలో పరాజయం పాలయ్యాడు. తొలి సెట్‌లో 26 పాయింట్లు సాధించిన మదయె రెండో సెట్‌లో కేవలం 15 పాయింట్లే చేశాడు. అంటే మూడు బాణాల స్కోరుకు (10+10+10)కు సగమన్నమాట! ఇందులో మూడో షాట్ ఒక పాయింట్ తేవడంతో అతను సగం స్కోరుకు పరిమితమయ్యాడు. అయితే మూడో సెట్‌లో పుంజుకొని 25 పాయింట్లు సాధించాడు. ఇంత ఘోరంగా మదయె ఓడినప్పటికీ స్టేడియంలోని కొరియన్ అభిమానుల నుంచి ఓదార్పు లభించింది. చప్పట్లతో మదయెకు వీడ్కోలు పలికారు.

ఈక్వెస్ట్రియన్‌లో అనూష్‌కు నిరాశ



పారిస్ ఒలింపిక్స్ అశ్విక క్రీడల్లో (ఈక్వెస్ట్రియన్) భారత్‌కు నిరాశ తప్పలేదు. 2022 హాంగ్జౌ ఆసియా క్రీడల డ్రెసాజ్ విభాగంలో రెండు పతకాలతో మెరిసిన అనూష్ అగర్వల్లా.. విశ్వక్రీడల్లో అదే జోరు కనబర్చలేకపోయాడు. బుధవారం పురుషుల వ్యక్తిగత డ్రెసాజ్ ఈవెంట్ గ్రూప్ స్టేజ్‌లో అనూష్ 66.444 పాయింట్లతో తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. గ్రూప్ 'ఇ'లో పోటీపడిన 24 ఏళ్ల అనూష్ భారత్ నుంచి ఒలింపిక్స్ డ్రెసాజ్ విభాగంలో పాల్గొన్న తొలి ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు.

క్లుప్తంగా...

విద్యార్థులపై జారిపడిన విద్యుత్ స్తంభం

- ఐదుగురు చిన్నారులకు గాయాలు



రిమ్స్‌లో విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

అట్లూరు: ప్రభుత్వ పాఠశాల వద్ద ఆడుకుంటున్న విద్యార్థులపై విద్యుత్తు స్తంభం జారి పడి ఐదుగురు గాయపడిన ఘటన వైఎస్సార్ జిల్లా అట్లూరు మండలం పెద్దకామసముద్రం ప్రాథమికోన్నత పాఠశాల వద్ద బుధవారం జరిగింది. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట ఓ కాంట్రాక్టర్ విద్యుత్తు పనుల నిమిత్తం స్తంభాలు తెచ్చి నిర్లక్ష్యంగా ఒకదానిపై ఒకటి దించి వెళ్లారు. ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఆడుకుంటుండగా.. అకస్మాత్తుగా ఒక విద్యుత్తు స్తంభం జారి విద్యార్థులు గద్దె స్రవంతి, మద్దెల ప్రతీక, మద్దెల రిషి, తుమ్మలూరు లోచన, గూండాల రిత్వికలపై పడిపోయింది. దీంతో తోటి విద్యార్థులు కేకలు వేయడంతో సమీపంలోని రైతులు వచ్చి విద్యుత్తు స్తంభం తొలగించారు. గాయపడిన విద్యార్థులను అట్లూరు, బద్వేల్, గోపవరం 108 వాహనాల ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. విద్యార్థిని స్రవంతికి కాలు రెండు చోట్ల విరిగింది. గాయపడి రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ పరామర్శించారు.

గురుకులాల్లో అనాథ బాలల ప్రవేశానికి అవకాశం

సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కన్నబాబు



సాక్షి, అమరావతి: అనాథ బాలబాలికలకు గురుకులాల్లో ప్రవేశానికి అవకాశం కల్పించాలని సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కూనపురెడ్డి కన్నబాబు అధికారులను ఆదేశించారు. వారికి సెలవు దినాల్లో కూడా గురుకులాల్లోనే వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాడేపల్లిలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) ప్రధాన కార్యాలయంలో జిల్లా సమన్వయ అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెన్యువల్ చేయండి

కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ డిమాండ్

సాక్షి,అమరావతి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్ట్ లెక్చరర్ల సేవల రెన్యువల్ ఉత్తర్వుల జారీకి జాప్యాన్ని నివారించి..కొనసాగింపు ఉత్తర్వులు తక్షణమే విడుదల చేయాలని కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ కుమ్మరకుంట సురేష్, కోచైర్మన్ కల్లూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వీరు సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. ప్రభుత్వం స్పందించక పోతే తాము ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

వేల ఎకరాలు ఎక్కడున్నాయో చూపండి

- ఆధారాలు లేకనే అక్రమ కేసులు
- రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి

బి.కొత్తకోట: వైఎస్సార్‌సీపీ నేతలు వేల ఎకరాల భూములు ఆక్రమించుకున్నారని ఆరోపణలు చేస్తున్నవారు ఆ భూములు ఎక్కడున్నాయో చూపాలని అన్నమయ్య జిల్లా రాజంపేట ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డి కోరారు. ఆయన బుధవారం ఢిల్లీ నుంచి స్థానిక మీడియాతో మాట్లాడారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం కేసు విచారణ నెపంతో వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లల్లో సోదాలు నిర్వహించడానికి కారణమేమిటని ప్రశ్నించారు. సోదాలు నిర్వహించిన ఇళ్లల్లో ఏం ఆధారాలు దొరికాయో చూపాలని డిమాండ్ చేశారు. కేసుకు సంబంధం లేని వ్యక్తుల ఇళ్లల్లో సోదాలు చేసి ఒక్క ఆధారమైనా సీజ్ చేశారా అని అడిగారు. ఏమీ లేదు కాబట్టే అక్రమంగా కేసులు పెట్టి వేధించేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఫైళ్ల దగ్ధం కేసులో నిజాలు బయటకు తేవాలని ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. ఆరోపణలు చేసేవాళ్లు సాక్ష్యాధారాలతో నిరూపించాలన్నారు.

ప్రధాని మోదీకి 'కాల్ ఆఫ్ ది గిర్' తొలి ప్రతి

అందించిన రచయిత, వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ

సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ తన నూతన పుస్తకం 'కాల్ ఆఫ్ ది గిర్' మొదటి ప్రతిని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి బహూకరించారు. నత్వానీ తన కుటుంబసభ్యులతో కలిసి బుధవారం ఢిల్లీలోని ప్రధాని నివాసంలో ఆయనతో భేటీ అయ్యారు. నత్వానీ ఈ పుస్తకాన్ని ప్రధాని మోదీకి అంకితం చేశారు. ఈ పుస్తకంలో ప్రధాని సందేశం కూడా ఉంది. పుస్తకం అందుకున్న అనంతరం మోదీ.. గిర్‌లో పర్యాటకస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. గిర్‌లో విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు మౌలిక సదుపాయాలపై చర్చించారు. గిర్ అభయారణ్యం చుట్టుపక్కల అటవీప్రాంతం అవసరమని ప్రధాని చెప్పారు. అంతేగాక కాఫీ టేబుల్ బుక్ 'కాల్ ఆఫ్ ది గిర్'ను విడుదల చేయడంలో ఎంపీ నత్వానీ అంకితభావంతో కృషిచేశారని అభినందించారు.

ఈ డోలీ మోతకు ఎన్నిరోజులు పడుతుందో..



గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు అనారోగ్య పరిస్థితి వస్తే ఎంత కష్టమో ఈ దయనీయ ఘటన కళ్లకు కట్టినట్లు చెబుతుంది. తమ కుటుంబ సభ్యుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని తెలిసినా.. మెరుగైన వైద్యానికి దూరం తీసుకెళ్లలేని పరిస్థితుల్లో డోలీలోనే వెనక్కి తీసుకెళ్లిన ఘటన గూడెం కొత్తవీధి మండలం ధారకొండ పంచాయతీలో జరిగింది. ఈ పంచాయతీ పరిధిలోని నిమ్మచెట్టు గ్రామానికి చెందిన పాంగి గోపన్న వారం క్రితం అనారోగ్యం బారిన పడ్డాడు. చాలా రోజుల నుంచి గ్రామ శివారులోని గెడ్డ పొంగిపొర్లుతుండటంతో అతన్ని ఆస్పత్రికి తీసుకెళ్లలేకపోయారు. అయితే బుధవారం వర్షం తగ్గడంతో బాటు నిమ్మచెట్టు చెక్‌డ్యాం వద్ద వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో గోపన్నను బంధువులు డోలీ కట్టి ధారకొండలోని పీహెచ్‌సీకు తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు గోపన్న తీవ్ర అనారోగ్యంతో ఉన్నాడని, మెరుగైన వైద్యం కోసం చింతపల్లి తీసుకెళ్లాలని సూచించారు. దీనికి గోపన్న బంధువులు స్పందిస్తూ.. ''అనారోగ్యంతో ఉన్న వాడిని ఇక్కడకు తీసుకురావడానికే వారం పట్టింది. ఇక చనిపోతే మా వాడి శవాన్ని గ్రామానికి తీసుకెళ్లడానికి ఎన్నిరోజులు పడుతుందో..'' అంటూ గోపన్నను ఆసుపత్రికి తీసుకెళ్లకుండా డోలీలోనే తిరిగి స్వగ్రామానికి తీసుకెళ్లిపోయారు. గిరిజన ప్రాంతంలో డోలీ మోతలు లేకుండా చూస్తామని ముఖ్యమంత్రి, గిరిజన శాఖ మంత్రి చెప్పిన తర్వాత రోజునే ఈ ఘటన జరిగింది.

– సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

మా శాడిస్టు మామపై చర్యలు తీసుకోండి



పెళ్లిళ్లు చేసి కూతుళ్లను కాపురానికి పంపకుండా తమను వేధిస్తున్న శాడిస్టు మామపై చర్యలు తీసుకోవాలని ఇద్దరు అల్లుళ్లు ఏలూరు కలెక్టరేట్ వద్ద బుధవారం బ్యానర్‌లు పట్టుకుని ధర్నా చేశారు. గుజరాత్‌లో ప్రైవేట్ స్కూలు టీచర్‌గా పనిచేస్తున్న పెద్దల్లుడు వి.పవన్‌కు 2015లో, విజయవాడలో యానిమేషన్ ఉద్యోగిగా పనిచేస్తున్న చిన్నల్లుడు పీబీ శేషసాయికి 2024లో ఏలూరుకు చెందిన బూరుగడ్డ రామానుజ శ్రీనివాస అయ్యంగార్ కుమార్తెలతో వివాహాలు జరిగాయి. తమకు బిడ్డ పుట్టిన తర్వాత నుంచి తన భార్యను కాపురానికి పంపడం లేదని పవన్, పెళ్లయిన కొద్దినెలలకే తన భార్యను కూడా కాపురానికి పంపకుండా తండ్రి ఇంటి దగ్గరనే పెట్టుకున్నాడని శేషసాయి ఆవేదన వ్యక్తం చేశారు. కూతుళ్లకు వచ్చే ఆదాయంతో తమ మామ లబ్ధి పొందుతున్నారని వారు ఆరోపించారు. తమ భార్యలను పంపించమని అడుగుతుంటే తిరిగి తమపైనే పోలీస్ కేసులు పెట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, కలెక్టర్ అందుబాటులో లేక పోవడంతో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తే.. ఎస్పీని కలవమని ఆయన ఆ అల్లుళ్లకు సూచించారు.

– ఏలూరు (టూటౌన్)

ఇసుక ఉచితమే.. అయినా డబ్బు చెల్లించాలి

సాక్షి, అమరావతి: ఇసుక ఉచితంగానే ఇస్తామని, అయితే తవ్వకం, సీనరేజీ, రవాణా చార్జీలు ప్రజలే చెల్లించాలన్నది తమ విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రవాణా ఖర్చుల కారణంగా కొన్ని చోట్ల అనుకున్నంత తక్కువకు ఇసుక దొరకడంలేదని అన్నారు. గత ఐదేళ్లలో జరిగిన మైనింగ్ కార్యకలాపాలు, ఆదాయంపై బుధవారం ఆయన అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. తవ్వకం, రవాణా ఖర్చులు పెరగకుండా కొత్తగా ఏ విధానాలు అవలంబించవచ్చో చెప్పాలని అధికారులకు సూచించారు. గ్రామ సచివాలయాలు, పంచాయతీ కార్యాలయ సిబ్బంది ద్వారా ఇసుక విధానం అమలుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. అక్రమాలు జరగకుండా వినియోగదారులకు ఇసుక చేర్చే మెకానిజాన్ని ఏర్పాటు చేయడమే ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. పట్టా భూముల్లో సీనరేజ్ కట్టి అమ్ముకునే అవకాశం కల్పిద్దామనే అధికారుల సూచనలకు సీఎం ఆమోదం తెలిపారు. ప్రస్తుతం రోజుకు 45 వేల మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా అవుతోందని అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల టన్ను రూ.150కే లభిస్తున్నా, కొన్ని చోట్ల ఎక్కువ ధర ఉందన్నారు. దూర ప్రాంతాల నుంచి రవాణా చేయడం వల్లే ఈ సమస్య ఉందని వివరించారు. నేరుగా రీచ్ నుంచి వినియోగదారుడికి ఇసుక సరఫరా చేస్తే అంత భారం ఉండదని, ఈ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు.



ఐదేళ్లలో తగ్గిన మైనింగ్ ఆదాయం

ఆదాయంలో మైనింగ్ శాఖ 2014–19 మధ్య 24 శాతం వృద్ధి సాధించగా, 2019–24 మధ్య గత ప్రభుత్వంలో ఏడు శాతానికి పడిపోయిందని అధికారులు సీఎంకు వివరించారు. ప్రభుత్వం రూ.9,750 కోట్ల ఆదాయం నష్టపోయిందని తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సిలికా, క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు జరిగాయని తెలిపారు. అనుమతి లేని చోట్ల, నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపినట్లు గుర్తించామని చెప్పారు. ఐదేళ్ల కాలంలో ఇసుక తవ్వకాల్లో ఒప్పందాల ప్రకారం ప్రైవేటు ఏజెన్సీలు ప్రభుత్వానికి రూ.1,025 కోట్లు చెల్లించలేదని తెలిపారు. దీనిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. ఏపీఎండీసీ ద్వారా ఈ ఏడాది అదనంగా రూ.500 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు. మైనింగ్‌లో జరిగిన అక్రమాలను పూర్తిగా తవ్వితీయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర, ఆ శాఖల ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా, గనుల శాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ధర పెంపు.. కొనుగోలుదారుల నిరసన

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం ఆదేశించడంతో కలెక్టర్ సారథ్యంలోని కమిటీ ధరలను సమీక్షించింది. అగనంపూడి, భీమిలి డిపోల్లో టన్ను రూ.1,076 కు విక్రయించాలని నిర్ణయించింది. దీంతో భీమిలి వద్ద ధర పెరగ్గా, అగనంపూడి డిపోలో అంతే స్థాయిలో ధర తగ్గింది. భీమిలి వద్ద మంగళవారం టన్ను రూ.758కి ఇవ్వగా, బుధవారం ఒక్కసారిగా రూ. 1076కు పెరగడంతో కొనుగోలుదారులు నిరసనకు దిగారు. ఉచిత ఇసుకపేరుతో ఒక్కో వ్యక్తికి ఆధార్ కార్డుపై రోజుకు 20 టన్నులు ఇస్తున్నారు. రవాణా ఖర్చులు కొనుగోలుదారులే భరించాలి. దీంతో ఇసుక భారం మోయలేనంతగా పెరిగింది. ఉచితమని ప్రకటించి ప్రభుత్వం ఇలా డబ్బులు వసూలు చేస్తున్నా గత్యంతరం లేక విశాఖ, విజయనగరం జిల్లాల్లోని పలు ప్రాంతాల వారు భీమిలి వద్ద ఇసుక కొంటున్నారు. ఒక్కసారిగా ధర పెరగడంతో వారంతా షాక్ తిన్నారు. ముందస్తు సమాచారం లేకుండా ఎలా పెంచేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దూర ప్రాంతాల నుంచి లారీలు తెచ్చామని, ఇప్పుడు పెరిగిన రేటుకు ఇసుకను కొనలేక ఖాళీ లారీలతో వెనక్కి వెళ్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచితమన్న పేరుతో ఇలా దోచేస్తే ఇళ్లెలా కట్టుకొంటామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెంచిన ధరను తగ్గించి ఇసుకను అందివ్వాలని డిమాండ్ చేశారు.

ఒక్కసారిగా పెంచేస్తే ఎలా కొనగలం?



ఇసుక ధరను ఇలా పెంచుతారని ఎవరూ ఊహించలేదు. ఉదయం ర్యాంపు వద్దకు లారీలు తీసుకొస్తే... రేటు పెంచినట్టు తెలిపారు. టన్నుకు రూ.300 పైనే పెంచేశారు. ఉచితమని చెబుతూ ఇలా రేటు ఒక్కసారిగా పెంచేస్తే తట్టుకునే పరిస్థితి లేదు.

– తుపాకుల సురేష్, మజ్జివలస

ఉచితమని ప్రకటించడం ఎందుకు?




ఇసుక ధర ఇష్టం వచ్చినట్టు పెంచుకుంటూ పోతున్న ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్నట్టు ప్రకటించడం ఎందుకు? కనీసం పాత ధరకు కూడా ఇవ్వకుండా కొద్ది రోజుల్లోనే ధర ఇలా పెంచేయడం పద్ధతి కాదు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఎలా సమర్థించుకుంటుంది?

– జి.శ్రీను, ఆనందపురం


నిబంధనల మేరకే 'సాక్షి'కి ప్రభుత్వ ప్రకటనలు

పక్షపాత ధోరణితో వ్యవహరించలేదు

- శాసనసభకు తెలిపిన టీడీపీ కూటమి ప్రభుత్వం
- టీడీపీ ఎమ్మెల్యేల ప్రశ్నకు మంత్రి పార్థసారథి సమాధానం
- సాక్షి పత్రికపై ఆరోపణలు అవాస్తవమని వెల్లడి



(అ) 2019–2024 మధ్యకాలంలో వార్తాపత్రికలకు ప్రకటనలు ఇవ్వడం పక్షపాత ధోరణితో జరిగిన విషయం వాస్తవమేనా ;



ANSWER

No, Sir
Details are enclosed
Does not arise

...OVE ANSWER HAS BEEN APPROVED

నిబంధనలు ఉల్లంఘించ లేదని టీడీపీ కూటమి ప్రభుత్వం ఇటీవల శాసనసభకు లిఖిత పూర్వకంగా తెలిపిన సమాధానం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా 'సాక్షి' దిన పత్రికకు ప్రభుత్వం అధికంగా ప్రకటనలు ఇచ్చిందన్న టీడీపీ ఆరోపణ పూర్తి అవాస్తవం అని నిగ్గు తేలింది. అది కూడా ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వమే శాసన సభ వేదికగా వెల్లడించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సాక్షి పత్రికకు ప్రభుత్వం ప్రకటనలు జారీ చేయడంలో ఎక్కడా నిబంధనలను ఉల్లంఘించలేదని, అంతా నిబంధనల ప్రకారమే వ్యవహరించారని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి లిఖిత పూర్వకంగా శాసనసభకు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ప్రకటనలు జారీ చేసిన విధానంపై టీడీపీ ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, బెందాళం అశోక్, తెనాలి శ్రావణ్ కుమార్ అడిగిన ప్రశ్నకు ఆయన సవివరంగా సమాధానమిచ్చారు. దాంతో సాక్షి పత్రికకు ప్రభుత్వ ప్రకటనలపై టీడీపీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని టీడీపీ కూటమి ప్రభుత్వమే స్పష్టం చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సాక్షి పత్రికతోపాటు ఇతర పత్రికలకు కూడా ప్రభుత్వం జారీ చేసిన ప్రకటనలు.. జారీ చేసిన విధానంపై కూడా పైన పేర్కొన్న ముగ్గురు సభ్యులు ప్రశ్నలు సంధించారు. అందుకు మంత్రి కొలుసు పార్థసారథి లిఖిత పూర్వకంగా తెలిపిన సమాధానాలు ఇలా ఉన్నాయి.

అంతా నిబంధనల మేరకే..

2019– 24 మధ్య కాలంలో సమాచార శాఖ ద్వారా సాక్షి పత్రికకు రూ. 293 కోట్లు, వివిధ శాఖల ద్వారా రూ.78 కోట్లు.. మొత్తం రూ.371 కోట్ల మేర ప్రకటనలు ఇచ్చారు. ఈనాడు పత్రికకు కూడా మూడున్నరేళ్లపాటు అదే స్థాయిలో ప్రభుత్వం ప్రకటనలు జారీ చేసింది. ఆ మూడున్నరేళ్లలోనే ఈనాడు పత్రికకు సమాచార శాఖ ద్వారా రూ.190 కోట్లు, వివిధ శాఖల ద్వారా రూ.53 కోట్లు.. మొత్తం రూ.243 కోట్లు విలువైన ప్రకటనలు ఇచ్చింది. మూడున్నరేళ్ల తర్వాత ఈనాడు యాజమాన్యం తమకు ప్రభుత్వ ప్రకటనలు ఇవ్వొద్దని, తాము ప్రచురించబోమని అధికారికంగా సమాచార శాఖకు లేఖ రాసింది. దాంతో చివరి ఏడాదిన్నర ఈనాడు పత్రికకు ప్రకటనలు ఇవ్వలేదు. ఆ ఏడాదిన్నర కూడా ఈనాడు పత్రిక యాజమాన్యం ప్రకటనలు తీసుకొని ఉంటే ప్రభుత్వం మరో రూ.125 కోట్ల విలువైన ప్రకటన లు ఇచ్చేది. దాంతో సాక్షి పత్రికతో సమానంగా ఈనాడు పత్రికకు కూడా ప్రకటనల బడ్జెట్ కేటాయించినట్టయ్యేది. ఇదిలా ఉండగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈనాడు పత్రికకు ప్రకటనల బిల్లులు పూర్తిగా చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిందని టీడీపీ ఎమ్మెల్యేలు విమర్శించారు. వాస్తవమేమిటంటే.. ఈనాడు పత్రికకే కాదు.. సాక్షి పత్రికకు కూడా ప్రకటనల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈనాడు పత్రికకు చెల్లించాల్సిన ప్రకటన బకాయిలు రూ. 51 కోట్లు ఉండగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అయినప్పటికీ సాక్షి పత్రికకు రూ.104.85 కోట్ల యాడ్స్ బకాయిలు పెండింగులో ఉన్నాయి. 2019–24 మధ్య కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషలలో ప్రచురితమయ్యే 22 పెద్ద పత్రికలతోపాటు ఎన్నో చిన్న పత్రికలు, మేగజైన్లకు కూడా ప్రకటనలు ఇచ్చింది. ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్(ఏబీసీ) మార్గదర్శకాలను పాటిస్తూ.. ఏ పత్రిక పట్ల ఎలాంటి వివక్షకు తావు లేకుండా ప్రకటనలు జారీ చేసింది. ఆ విషయన్ని టీడీపీ కూటమి ప్రభుత్వమే శాసనసభకు లిఖితపూర్వకంగా వెల్లడించింది. దాంతో సాక్షి పత్రికపై టీడీపీ నేతలు, కొన్ని మీడియా సంస్థలు చేస్తున్న ఆరోపణలు పూర్తి అవాస్తవమని స్పష్టమైంది.

ప్రశ్న 1: 2019–24 మధ్య కాలంలో రాష్ట్ర ప్రభుత్వం వివిధ పత్రికలకు ప్రభుత్వ ప్రకటనలు జారీ చేయడంలో పక్షపాత ధోరణితో వ్యవహరించిన విషయం వాస్తవమేనా?
ప్రభుత్వ సమాధానం: లేదు. పక్షపాత ధోరణితో వ్యవహరించ లేదు.

ప్రశ్న 2: 2019–24 మధ్య కాలంలో వార్తా పత్రికల వారీగా, సంస్థల వారీగా, సంవత్సరాల వారీగా చెల్లింపుల వివరాలు ఏమిటి ?
ప్రభుత్వ సమాధానం : పూర్తి వివరాలను జత చేశాం.

ప్రశ్న 3 : ఎంపిక చేసిన వార్తా పత్రికలకు పెద్ద మొత్తంలో ప్రకటనలు, నిధులు జారీ చేయడంపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటి?
ప్రభుత్వ సమాధానం: ఆ ప్రశ్నే ఉత్పన్నం కాదు (ఎందుకంటే ఎంపిక చేసిన వార్తా పత్రికలకు పెద్ద మొత్తంలో ప్రకటనలు జారీ చేయలేదు. నిధులూ విడుదల చేయలేదు కాబట్టి)

టీడీపీ ప్రభుత్వ హయాంలోనే సాక్షి పత్రిక పట్ల వివక్ష

2014–19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రభుత్వ ప్రకటనల జారీలో 'సాక్షి' పత్రిక పట్ల వివక్షాపూరితంగా వ్యవహరించారు. ఆ ఐదేళ్లలో ఈనాడు పత్రికకు రూ.121.97 కోట్లు, ఆంధ్ర జ్యోతి పత్రికకు రూ.72.92 కోట్లు, సాక్షి పత్రికకు కేవలం రూ. 30.97 కోట్ల మేరకే ప్రభుత్వ ప్రకటనలు జారీ చేశారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

స్మార్ట్‌సిటీలను త్వరగా పూర్తిచేయండి

వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో గుర్తించిన నాలుగు స్మార్ట్ సిటీల పనులు త్వరగా పూర్తిచేయాలని కేంద్రానికి వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఏపీలో రూ.2 వేల కోట్ల విలువైన 59 ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బుధవారం రాజ్యసభలో గృహ, పట్టణ వ్యవహారాలశాఖ పద్దులపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. వరద నివారణను పరిగణనలోకి తీసుకుని భవనాల నిర్మాణం, నగరాల ప్రణాళిక, డ్రైనేజీల్లోకి వ్యర్థాల అక్రమ డంపింగ్, వర్షపాత నమూనాలకు అనుగుణంగా డ్రైనేజీలు లేకపోవడం వల్లే డ్రైనేజీ సమస్యలు వస్తున్నాయని వివరించారు. మెట్రో నగరాల్లో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఆయా రాష్ట్రాలతో కలిసి పనిచేయాలని కోరారు. నీటి ఎద్దటి నివారణకు పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, కాలువలు, మురుగునీటి వ్యవస్థలకు నిర్వహణ షెడ్యూలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇచ్చిన హామీలో ఇప్పటివరకు 67.45 శాతం మాత్రమే పూర్తయిందని చెప్పారు. కేటాయింపుల్లో మూలధనం, భూమి ఉన్నవారినే కాకుండా అత్యంత పేదలు, అట్టడుగువర్గాల వారిని కూడా గుర్తించాలని ఆయన కోరారు.

'స్వయం'లో 33 లక్షల విద్యార్థులు



ఏపీలోని 33 లక్షలమంది విద్యార్థులు స్టడీ వెబ్స్ ఆఫ్ యాక్టివ్–లెర్నింగ్ ఫర్ యంగ్ యాస్పైరింగ్ మైండ్స్ (స్వయం) రూపొందించిన మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సు (మూక్)లో నమోదు చేసుకున్నట్లు కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సుకంత మజుందార్ తెలిపారు. దేశవ్యాప్తంగా వేర్వేరు కళాశాలల విద్యార్థులు ఎక్కడి నుంచైనా ఇంజినీరింగ్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఇంటర్ డిసిప్లినరీ/మల్టీ డిసిప్లినరీలకు సంబంధించి నాణ్యమైన విద్య నేర్చుకోవచ్చని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

నాలుగేళ్లుగా నిధులివ్వలేదు



ఆంధ్రప్రదేశ్‌లోని జైళ్లలో ఆధునికీకరణ కోసం జైలు అథారిటీలకు 2020–21 నుంచి 2023–24 వరకు నిధులేమీ విడుదల చేయలేదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. 2019–20లో రూ.2.2 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో జైళ్ల సామర్థ్యం 8,659గా ఉంటే 7,254 మంది ఖైదీలు ఉన్నట్లు తెలిపారు.

1930కి 1.94 లక్షల ఫిర్యాదులు



మహిళలు/చిన్నారులపై సైబర్ నేరాలకు సంబంధించిన టోల్ ఫ్రీ నంబరు 1930కి ఏప్రిల్ వరకు 1.94 లక్షల చైల్డ్ పోర్నోగ్రఫీ/గ్యాంగ్ రేప్ ఫిర్యాదులు వచ్చాయని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధిశాఖ మంత్రి అన్నపూర్ణాదేవి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ నిరంజన్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. సైబర్ క్రైమ్ ప్రివెన్షన్ ఎగైనెస్ట్ ఉమెన్, చిల్డ్రన్ (సీసీపీడబ్ల్యూసీ) పథకం కింద రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో రూ.131.60 కోట్ల ఆర్థికసాయం చేసినట్లు చెప్పారు.

మత్స్యకారుల అభివృద్ధికి ఏపీ ప్రతిపాదనలకు అనుమతి



2020–2024 మధ్య మత్స్యకారులకు డీప్ సీ ఫిషింగ్ వెస్సెల్స్, బోట్ల రీప్లేస్‌మెంట్, వలలు ఇతరత్రాలపై ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలు అనుమతించినట్లు కేంద్ర మత్స్యశాఖ మంత్రి లల్లన్‌సింగ్ తెలిపారు. కేంద్రవాటా రూ.658.74 కోట్లు కలిపి రూ.2,337.18 కోట్ల విలువైన ప్రతిపాదనలను అనుమతించినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబూరావు ప్రశ్నకు జవాబిచ్చారు.

లోక్‌సభ

12,955 పంచాయతీలకు భారత్‌నెట్

వైఎస్సార్‌సీపీ ఎంపీ గుమ్మా తనూజరాణి ప్రశ్నకు కేంద్రం జవాబు



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని 12,955 గ్రామ పంచాయతీలకు భారత్‌నెట్ సేవలు అమలులో ఉన్నాయని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధిశాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ గుమ్మా తనూజరాణి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. కొత్తగా ఏర్పడిన మరో 526 గ్రామ పంచాయతీలకు భారత్‌నెట్ సేవలు కల్పించడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు.

ఆరేళ్లలో 59 బీచ్‌లలో క్లీన్-అప్ కార్యక్రమాలు



2017 నుంచి 2023 వరకు నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్, కేంద్ర పర్యావరణ, అటవీ శాఖల ఆధ్వర్యంలో ఏపీలోని 59 బీచ్‌ల్లో క్లీన్–అప్ కార్యక్రమం నిర్వహించినట్లు సైన్స్, టెక్నాలజీశాఖ మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సివిల్ సొసైటీ సంస్థలు పాల్గొన్నట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ పి.వి.విథున్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

దశాబ్దమైనా.. రైల్వేజోన్ ఏది?

వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటు వేదికగా రైల్వేజోన్‌పై వైఎస్సార్‌సీపీ మరోసారి గళమెత్తింది. విభజన చట్టం కాలపరిమితి ముగిసినా దశాబ్దం కిందట ఇచ్చిన ప్రత్యేక జోన్ హామీ ఇప్పటికీ సంపూర్ణం కాలేదని గుర్తుచేసింది. విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వేజోన్ ఏర్పాటుకు సంబంధించి స్పెషల్ డ్యూటీ అధికారి నియామకం మినహా మరో అడుగుముందుకు పడలేదని చెప్పింది. బుధవారం లోక్‌సభలో రైల్వేపద్దులపై జరిగిన చర్చలో వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి మాట్లాడారు. రైల్వేజోన్ వీలైనంత త్వరగా కార్యరూపం దాల్చేలా సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. విజయనగరం, అనంతపురం, గుంటూరు, కర్నూలు, చిత్తూరు తదితర ప్రధాన రైల్వే స్టేషన్లల్లో కోల్డ్ స్టోరేజీ సౌకర్యాలు, ఇతరత్రా వసరులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని పదేళ్లుగా కోరుతున్నామన్నారు. బోర్డు ఏర్పాటుపై తక్షణం ప్రకటన చేయాలని కోరారు. జనరల్ కంపార్ట్‌మెంట్లలో పరిస్థితులు దయనీయంగా ఉన్నాయని చెప్పారు. సామాన్యులను దృష్టిలో ఉంచుకొని వాటిని సరిచేయాలని, అదనపు జనరల్ బోగీల జోడింపుపై దృష్టిసారించాలని కోరారు. సీనియర్ సిటిజన్లు, ప్రభుత్వ గుర్తింపు పొందిన జర్నలిస్టులకు రాయితీలు పునరుద్ధరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

అవార్డు ప్రదానం



అవార్డు అందుకున్న మారుతీ బడిగేర

రాయచూరురూరల్: నగరానికి చెందిన సమాజ సేవకుడు, పాత్రికేయుడు మారుతి బడిగేర జాతీయ స్థాయి సాంస్కృతిక సంఘటన అవార్డు అందుకున్నారు. ఢిల్లీలోని కర్ణాటక సంఘం భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు నాగరాజ్, జైపూర్ కర్ణాటక సంఘం అధ్యక్షుడు నీలకంఠ రాయ పాటిల్ అవార్డు ప్రదానం చేశారు. మారుతీ బడిగేర 30ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి గుర్తింపు పొందారు.

రైల్వే పెండింగ్ పనులు పూర్తి చేయండి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: రాయచూరు- సింధనూరు రైల్వే పనులు చేపట్టాలని రైల్వే మండలి మాజీ సభ్యుడు బాబురావ్ కోరారు. ఈమేరకు రాయచూరు ఎంపీ కుమార్‌నాయక్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గిణిగేర-మహబూబ్ నగర్ రైల్వేలైన్ సింధనూరు వరకు ముగిశాయని, సింధనూరు,మాన్వి, రాయచూరు వరకు రైల్వే లైన్ ఏర్పాటుకు అవసరమైన నిధులు మంజూరు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



కామ్రేడ్ జి.రాయ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాయచూరురూరల్: ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘం సంచాలకురాలు సంధ్యా డిమాండ్ చేశారు. కన్నడ భవనంలో బుధవారం ఏఐయూటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆశా కార్యకర్తల సమ్మేళనాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఎన్నో ఒత్తిడి మధ్య విధులు నిర్వహిస్తూ అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న కార్యకర్తలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వీరేష్,ఈరమ్మ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కె.నితీష్

రాయచూరురూరల్: ఎస్సీ, ఎస్టీలపై దాడులను పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ కె.నితీష్ అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలపై దాడుల నియంత్రణకు తీసుకున్న చర్యలపై బుధవారం ఆయన తన కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశమై సమీక్ష చేశారు. పోలీస్, సాంఘిక సంక్షేమ శాఖల మధ్య సమన్వయం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరిగినా సరైన విచారణ జరగడం లేదన్నారు. ఇప్పటికైనా మేల్కొని ఎస్సీ, ఎస్టీలకు రక్షణ కల్పించి వారి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. జెడ్పీ సీఈఓ పాండ్వే రాహుల్ తుకారం, ఎస్పీ పుట్ట మాదయ్య, కమిషనర్ గురుసిద్దయ్య, అధికారులు చేతన్‌కుమార్, మహేష్, రవీంద్ర జాలదార్, విశ్వనాథ్‌పట్టి, విరుపాక్షి పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తి అరెస్ట్

హుబ్లీ: రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. హావేరి జిల్లా శిగ్గాంవి తాలూకాకు చెందిన విఠల్ ప్రభాకర్ అరెస్ట్ అయిన వ్యక్తి. సదరు స్టేషన్ జనరల్ వెయిటింగ్ హాల్ వద్ద అనుమానాస్పదంగా అటూ ఇటూ తిరుగుతుండగా పోలీసులు పసిగట్టి అరెస్ట్ చేశారు. ఘటనపై హుబ్లీ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుబ్లీ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన వరూరు హైవేలో జరిగింది. హుబ్లీ జిల్లా రామదుర్గ తాలూకా చుచ్చనూరు గ్రామానికి చెందిన ప్రకాష్ జట్టనవర (45) అనే వ్యక్తి వరూరు వద్ద హైవే సమీపంలో మంగళవారం రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తగ్గని వర్షాలు.. కొనసాగిన వరదలు



కృష్ణా నదీ తీరంలో నీటమునిగిన విద్యుత్ స్తంభాలు



వరద పీడిత ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే కరియమ్మ

- ప్రధాన నదుల్లో ఇంకా కొనసాగుతున్న ప్రవాహం
- ఆల్మట్టి నుంచి 2.97 లక్షల క్యూసెక్కుల విడుదల


రాయచూరు రూరల్: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలు తగ్గకపోవడంతో కృష్ణా, తుంగభద్ర నదుల్లో కూడా వరద ప్రవాహం క్రమంగా కొనసాగుతోంది. అయితే ఇప్పటికే అన్ని జలాశయాలు పూర్తిగా నిండటంతో ఎగువ నుంచి వస్తున్న వరదల నేపథ్యంలో ముందు జాగ్రత్తగా రిజర్వాయర్ల నుంచి అదనపు నీటిని దిగువకు వదులుతున్నారు. ఈక్రమంలో బుధవారం ఆల్మట్టి నుంచి కృష్ణా నదికి 2.97 లక్షలు క్యూసెక్కులను నారాయణ పుర డ్యాంకు వదిలారు. ఆల్మట్టి, నారాయణ పుర డ్యాంల పరిధిలోని బెళగావి, బాగలకోటె, విజయపుర, యాదగిరి, రాయచూరు జిల్లాల అధికార యంత్రాంగం అన్ని రకాలుగా వరద నివారణ చర్యలు చేపట్టారు. రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా హూవిన హడగి వంతెనపై గుండా ఇంకా వరద నీరు ప్రవహిస్తున్నాయి. రాయచూరు, కలబుర్గి, విజయపుర జిల్లాలకు రాకపోకలకు అంతరాయం కలిగింది.

కానరాని అమాత్యుల పరామర్శలు

మహారాష్ట్రలోని పూనా వద్ద కడక్‌వాస్లా డ్యాం నుంచి నీరు అధికంగా దిగువకు వదిలారు. దీంతో బెళగావి జిల్లా చిక్కోడి తాలూకా మాంజరిలో ఇటుకల బట్టీలు, విద్యుత్ స్తంభాలు నీట మునిగాయి. భారీ వర్షాలతో కృష్ణమ్మ వరద ఇంకా కొనసాగుతూనే ఉంది. ఉత్తర, కళ్యాణ కర్ణాటకలో వరదలు తగ్గుముఖం పట్టినా బాధితులను పరామర్శించాల్సిన అమాత్యుల జాడ లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తర కర్ణాటకలోని బెళగావి, బాగల్‌కోటె, విజయపుర, కళ్యాణ కర్ణాటకలోని యాదగిరి, రాయచూరు, కొప్పళ జిల్లాల్లో కృష్ణా, తుంగభద్రా నదులు వరదలతో పోటెత్తినా ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు ఏ జిల్లాలోనూ పర్యటించిన దాఖలాలు లేవు. కృష్ణా నదీ తీరంలో 72 గ్రామాలు, లింగసూగూరులో 13, దేవదుర్గలో 42, రాయచూరు తాలూకాలో 17 గ్రామాలు, తుంగభద్ర నది తీరంలో సింధనూరులో 13, మాన్విలో 11, రాయచూరులో 9 గ్రామాలు జలావృతం అయ్యాయి. బుధవారం దేవదుర్గ శాసన సభ్యురాలు కరియమ్మ వరద పీడిత ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు.

తుంగభద్రకు వరద యథాతథం

- ఎగువ నుంచి డ్యాంకు మళ్లీ లక్ష క్యూసెక్కులకు పెరిగిన ఇన్‌ఫ్లో



తుంగభద్ర డ్యాం

హొసపేటె: తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. సోమవారం 1,31,179 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో మంగళవారానికి 68,630 క్యూసెక్కులకు పడిపోయింది. అయితే ఎగువన వర్షాలు ఊపందుకోవడంతో బుధవారం ఇన్‌ఫ్లో 1,05,973 క్యూసెక్కులకు పెరిగింది. శివమొగ్గ, మొరాళ్లు, తీర్థహళ్లి, శృంగేరి, ఆగుంబే, మంగళూరు తదితర పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వానలకు వరద పోటెత్తుతోంది. దీంతో 33 గేట్లలో 25 గేట్లను మూడున్నర అడుగులు, మిగతా 8 గేట్లను ఒక అడుగు పైకి ఎత్తి లక్షా 48వేల క్యూసెక్కుల నీటిని దిగువన నదికి విడుదల చేశారు. డ్యాంలో నీటి మట్టం 1631 అడుగులకు చేరగా నీటినిల్వ 99.705 టీఎంసీలుగా నమోదైంది. దిగువకు భారీగా నీటిని విడుదల చేయడంతో హంపీలోని అనేక మంటపాలు, స్మారకాలు నీట మునిగాయి. ఎగువ నుంచి వరద మరింత పెరిగే సూచనలు ఉన్నాయని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

ముంపు నుంచి బయటపడ్డ వంతెన



కంప్లి-గంగావతి వంతెనపై పేరుకున్న చెత్త

హొసపేటె: తుంగభద్ర జలాశయం నుంచి నదిలోకి అదనపు నీటిని విడుదల చేయడంతో మునిగిపోయిన కంప్లి-గంగావతి మధ్య రోడ్డు వంతెన నాలుగు రోజుల తర్వాత మళ్లీ ప్రత్యక్షమైంది. లక్ష క్యూసెక్కులకు పైగా నీరు నదిలో చేరడంతో కంప్లి వంతెన నీట మునిగింది. దీంతో కొప్పళ-బళ్లారి జిల్లాల మధ్య నేరుగా రోడ్డు మార్గంలో వాహన సంచారం నిలిచి పోయింది. ఈ వైపు వాహనాలలో వెళ్లేవారు విజయనగరం లేదా రాయచూరు జిల్లా గుండా వెళ్లాల్సిన అనివార్యత ఏర్పడింది. గత రెండు రోజుల నుంచి నదిలో ప్రవహించే నీటి పరిమాణం కొద్దిగా తగ్గడంతో మునిగిపోయిన వంతెన తిరిగి కనిపిస్తోంది. కానీ దాదాపు మూడొందల మీటర్ల పొడవున ఉన్న వంతెన వెంబడి బ్రిడ్జి రిటైనింగ్ వాల్ బీమ్స్‌లో భారీ ఎత్తున చెట్లకొమ్మలు, చెత్త పేరుకుపోయింది. నీటిమట్టం తగ్గినప్పటికీ ప్రజాప్రనుల శాఖ అధికారులు ఇంకా వంతెనపైకి ఎవరూ వెళ్లేందుకు వీలు లేదని తేల్చి చెపుతున్నారు. గంగావతి, కంప్లి మధ్య కేవలం ఏడు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంది. విద్య, ఆరోగ్యం, కూరగాయలు, కిరాణ వంటి వివిధ అవసరాల కోసం కంప్లి నుంచి గంగావతికి ప్రతి రోజు వందలాది మంది ప్రజలు, విద్యార్థులు వెళ్లివస్తుంటారు. కానీ కంప్లి బ్రిడ్జి నీటి ప్రవాహానికి మునిగి పోవడంతో కంప్లి ప్రాంత ప్రజలు బుక్కసాగర- కడెబాగిలు వంతెన మీదుగా గంగావతికి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రజలు 20 కిలోమీటర్లు చుట్టు తిరిగి రావడం చాలా కష్టకరంగా మారింది.

పశువులు ఢీకొని వృద్ధుడి మృతి

- 108 వాహనం సకాలంలో రాలేదని స్థానికుల ధర్నా



వృద్ధుడి శవంతో ధర్నా చేస్తున్న స్థానికులు

హుబ్లీ: వీధి పశువుల దాడిలో వృద్ధుడు మృతి చెందిన ఘటన గదగ్‌లో జరిగింది. లక్ష్మేశ్వర తాలూకా సిగ్లి గ్రామానికి చెందిన శంకరప్ప హొళ్లి(70) బుధవారం వేకువజామున గదగ్‌లోని బెటగేరి ప్రభుత్వ పాఠశాల నంబర్ 7వద్ద కాలినడకన వెళ్తుండగా వీధి పశువులు అతనిపై దూసుకొచ్చాయి. ఘటనలో వృద్ధుడు తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. కాగా ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశామని, గంటన్నర తర్వాత వచ్చారని ఆరోపిస్తూ స్థానికులు మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి ధర్న చేశారు.

సౌర విద్యుత్‌తో ఆర్థికాభివృద్ధి ఊతం



మాట్లాడుతున్న శరణ బసప్ప పట్టేద్

రాయచూరు రూరల్: సౌర విద్యుత్(సోలార్ పవర్) వినియోగం వల్ల ఆర్థికంగా దేశాభివృద్ధికి దోహదపడుతుందని క్యాషుటెక్ ముఖ్య కార్య నిర్వహణాధికారి శరణ బసప్ప పట్టేద్ పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సోలార్ పవర్ వినియోగంపై గురించిన సమావేశంలో విద్యార్థుల నుద్దేశించి ఆయన మాట్లాడారు. 2070 నాటికి దేశంలో సోలార్ పవర్ వినియోగం అధికం అవుతుందన్నారు. ఒన్ పవర్ గ్రిడ్ పరికల్పనలో భాగంగా ప్రపంచ దేశాలు చేతులు జోడిస్తున్నట్లు వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో సార్క్ సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయాలను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ఇంటిపై సోలార్ విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు నెలకొల్పడానికి కేంద్ర సర్కార్ రూ.78 వేలు సహాయధనం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో బాలచంద్ర, శశికళ పాటిల్, శివానంద, అమిత్ కుమార్, అరవింద్, పల్లవి, నాగరాజ్, మల్లికార్జున, పూర్ణిమ, మధు, రామలింగలున్నారు.

మానవ అక్రమ రవాణాను అడ్డుకోవాలి



సదస్సును ప్రారంభిస్తున్న జిల్లా న్యాయ సేవల ప్రాధికార కార్యదర్శి సునీల్ ఎస్ హొసమని

కోలారు: మానవ అక్రమ రవాణాను అడ్డుకోవాలని జిల్లా కానూను సేవల ప్రాధికార కార్యదర్శి సునీల్ ఎస్ హొసమని సూచించారు. మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రజలను చైతన్యపరిచేందుకు జిల్లా యంత్రాంగం, జిల్లా న్యాయసేవల ప్రాధికార ఆధ్వర్యంలో నగరంలోని బాలికల ప్రభుత్వ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సదస్సులో సునీల్ ఎస్ హొసమని పాల్గొని మాట్లాడారు. మానవ అక్రమ రవాణా గురించి తెలిస్తే1091కి ఫోన్ ద్వారా సమాచారం అందించాలన్నారు. బాలలను పనిలో పెట్టుకున్నా సమాచారం ఇవ్వాలన్నారు. కేజీఎఫ్ జిల్లా పిల్లల రక్షణాధికారి వీ నాగరత్న, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి న్యాయవాదుల ధర్నా



ప్రధాన సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న లాయర్లు

హొసపేటె: రైతులు, సామాన్యుల సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం శాసనసభ ప్రత్యేక సమావేశాన్ని త్వరగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో అఖిల భారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం నేత కరుణానిధి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికార పార్టీ తగిన పరిష్కార చర్యలు చేపట్టడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా రాష్ట్రంలో వరదలు సంభవించి రైతులు పంట నష్టం చవిచూడటంతో పాటు ఇళ్లు దెబ్బతిన్నాయి, ఎంతో మంది ప్రజలు చనిపోయారు. నదులు ప్రమాదకర స్థాయికి మించి ప్రవహిస్తున్నాయి. కొండలు విపరీతంగా కూలి పోయి ప్రజలు చనిపోయారు. కానీ పరిపాలన యంత్రాంగం కేవలం ముందు జాగ్రత్త చర్యలను అనుసరించడం తప్ప మరొకటి చేయడం లేదన్నారు. ఇంత వరకు ఎలాంటి సహాయక చర్యలు చేపట్టలేదన్నా. దీనిపై శాసనసభలో రూల్- 69 కింద కూడా ఎలాంటి చర్చ జరగలేదన్నారు. అలా కాకుండా వాల్మీకి కార్పొరేషన్ కుంభకోణం ముడా కుంభకోణంపై చర్చకు సభా సమయాన్ని కేటాయించిన ప్రభుత్వం, ప్రతిపక్షాలతో రాష్ట్ర ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు.

వికటించిన మధ్యాహ్న భోజనం

- 62 మంది విద్యార్థులకు అస్వస్థత



విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకాలోని బడేలడకు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న 62 మంది విద్యార్థులు కడుపు ఉబ్బరంతో బాధపడుతుండగా గమనించిన ఉపాధ్యాయులు వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. పాఠశాలలో మధ్యాహ్న వేడి భోజనం తిన్న అనంతరం విద్యార్థులు కడుపునొప్పిబారిన పడటంతో వారిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు విద్యార్థులను పరీక్షించి వైద్య సేవలు అందించారు. ఈ విషయం తెలుసుకున్న కూడ్లిగి ఎమ్మెల్యే డాక్టర్ ఎన్‌టీ శ్రీనివాస్ వెంటనే ఆస్పత్రికి చేరుకొని విద్యార్థులు యోగక్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. తల్లిదండ్రులు భయపడాల్సిన పని లేదని, వైద్యులు అన్ని విధాలుగా చికిత్సను అందిస్తున్నారన్నారు.

భార్యా హంతకుడికి జీవిత ఖైదు

బళ్లారిఅర్బన్: మద్య వ్యసనానికి బానిసైన భర్త చేతిలోనే కిరాతకంగా హత్యకు గురైన భార్య కేసులో నిందితుడికి జిల్లా కోర్టు న్యాయమూర్తి యావజ్జీవ శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు. మోకా పోలీస్ స్టేషన్ పరిధిలో పాత మోకా గ్రామంలోని తిమ్మప్ప గుడి దగ్గర నిందితుడు కొల్లి దేవేంద్రప్ప, భార్య రంగమ్మ, పిల్లలతో నివాసం ఉండేవారు. మద్యానికి అలవాటు పడిన భర్త నిత్యం మద్యం మత్తులో భార్య పిల్లలను వేధించేవాడు. ఈ క్రమంలో 2022 జూలై 5న రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వచ్చిన దేవేంద్రప్ప భార్య శీలాన్ని శంకించడమే కాక మద్యానికి డబ్బులు ఇవ్వమని రంగమ్మను తీవ్రంగా కొట్టాడు. అయితే ఆమె తన వద్ద డబ్బులు లేవు అని చెప్పడంతో ఆగ్రహానికి గురైన నిందితుడు నోటికొచ్చినట్లుగా ఆమెను నిందిస్తూ కొడవలితో ఆమెపై దాడి చేశాడు. దీంతో ఆమె చేతులు, కాళ్లకు తీవ్రంగా గాయాలయ్యాయి. తలపై కూడా రక్త గాయం ఏర్పడిన రంగమ్మ అక్కడికక్కడే మరణించిందని సాక్షుల వాంగ్మూలం సేకరించిన పీడీహళ్లి సీఐ ఉమేష్ ఆ మేరకు కోర్టులో చార్జిషీట్ సమర్పించారు. కేసు మొత్తం విచారణ, సాక్షుల వాంగ్మూలం అనంతరం బళ్లారి రెండో జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వీపీ ప్రమోద్ నిందితుడికి యావజ్జీవ శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించలేని పక్షంలో రెండు నెలల పాటు అదనంగా శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున న్యాయవాది లక్ష్మీదేవి పాటిల్ ఈ కేసును వాదించారు.

తమిళనాడు పోలీసుల అదుపులో ఔషధ వ్యాపారి

హుబ్లీ: తమిళనాడులో నిషేధించిన ఓ ఔషధాన్ని విక్రయించాడన్న ఆరోపణలపై ధార్వాడలోని రాజస్థాన్ ఔషధాల అంగడి యజమానిని తమిళనాడు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. మెడికల్ షాపు యజమాని అనిల్ షాను తమిళనాడు కోయంబత్తూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ రాష్ట్రంలో నొప్పి నివారణ మాత్రను అక్కడి వ్యసనపరులు డ్రగ్స్‌గా మార్చుకొని వినియోగించుకుంటున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఈ ఔషధాన్ని నిషేధించారు. తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి ధార్వాడకు వచ్చి రాజస్థాన్ మెడికల్ షాపులో ఆ మాత్రలను కొనుగోలు చేసుకొని వెళుతూ తమిళనాడు పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిని విచారించగా ధార్వాడలోని రాజస్థాన్ మెడికల్ షాపులో కొనుగోలు చేసినట్లుగా చెప్పడంతో పోలీసులు సదరు షాపు యజమానిని అదుపులోకి తీసుకున్నారు. కాగా అనిల్ షాను తమిళనాడు పోలీసులు అదుపులోకి తీసుకోగా ఆయన కుటుంబ సభ్యులు ధార్వాడ టౌన్ పోలీసులకు కిడ్నాప్ చేశారని కేసు పెట్టడానికి వెళ్లగా ధార్వాడ పోలీసులు అసలు విషయాన్ని సదరు కుటుంబ సభ్యులకు వివరించారు.

ఘనంగా ప్రతిభా స్ఫూర్తి దినోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు



అలరించిన సాంస్కృతిక నృత్యప్రదర్శన

బళ్లారిఅర్బన్: ప్రతి ఒక్కరిలో అపారమైన ప్రతిభ పాటవాలు దాగి ఉంటాయని, వాటిని వెలికి తీయడం ఉపాధ్యాయుల గురుతర బాధ్యత అని, ఈ విషయంలో సెయింట్‌జోసెఫ్ పాఠశాల ఉపాధ్యాయుల కృషి అభినందనీయం అని ఫాదర్ ఆరోక్యనాథన్ తెలిపారు. సదరు హైస్కూల్‌లో బుధవారం జరిగిన ప్రతిభా స్ఫూర్తి కార్యక్రమంలో ఫాదర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తమ ప్రతిభ ద్వారా మరొకరికి స్ఫూర్తినివ్వడం చాలా ముఖ్యమన్నారు. ఈ విషయంలో విద్యార్థులు అవగాహన పెంచుకొని తమ బతుకులను బంగారుమయం చేసుకోవాలని ఫాదర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అహో అనిపించాయి. అలాగే క్విజ్, గాన పోటీలు, నృత్య ప్రదర్శనలతో పాటు వివిధ వేషాల్లో ఫ్యాషన్ షో ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల మేనేజర్ ఫాదర్ దానప్ప మూలిమని, ఫాదర్ కెనడి ఫెర్నాండెస్, ప్రధానోపాధ్యాయిని విక్టోరియ, జోసెఫ్ తదితరులతో పాటు న్యాయనిర్ణేతలుగా ఇమానియేల్, రాఘవేంద్ర, వైష్ణవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు ముఖ్యఅతిథులు ట్రోఫీలను ప్రదానం చేశారు. శైలజా స్వాగతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఉపాధ్యాయిని సునీత, సీనియర్ విద్యార్థుల వ్యాఖ్యానంతో ముగిసింది.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ.. ఒకరు మృతి



ఘటనా స్థలంలో ప్రమాద దృశ్యం

సాక్షి, బళ్లారి: విజయపుర జిల్లాలో కేఎస్ఆర్‌టీసీ బస్సు, జీపు ఢీకొని ఒకరు మృతి చెందారు. బుధవారం సాయంత్రం విజయపుర- హుబ్లీ జాతీయ రహదారి- 52లో కేఎస్ఆర్‌టీసీ బస్సు బొలెరో వాహనం ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే డ్రైవర్ మృతి చెందారు. మహారాష్ట్రకు చెందిన ఎర్టిగా వాహనం బస్సును ఢీకొనడంతో ఒకరు మృతి చెందడంతో పాటు ముగ్గురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటనలో ఎర్టిగా వాహనం నుజ్జునుజ్జయింది. అక్కడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లవ్ జిహాద్ నిందితుడు అరెస్ట్

హుబ్లీ: జిల్లాలోని కలఘటిగి పట్టణంలో జైన్ మతానికి చెందిన మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి వేధించిన వ్యక్తిని కలఘటిగి పోలీసులు అరెస్ట్ చేశారు. ముజాహిద్‌ఖాన్ అనే వ్యక్తి మతాంతరం పేరుతో తనను వేధించాడని సదరు బాధిత మహిళ అశ్విని పద్మరాజ జైన్ కలఘటిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఐ శ్రీశైల కౌజలిగి, ఎస్ఐ బసవరాజ యల్లదగుడ్డ ఆధ్వర్యంలో నిందితుడిని అరెస్ట్ చేశారు.

కలుషిత నీరు తాగి 30 మంది ఆస్పత్రి పాలు



చికిత్స పొందుతున్న గ్రామస్తులు

రాయచూరు రూరల్: కలుషిత నీరు తాగి 30 మంది ఆస్పత్రి పాలైన ఘటన మంగళవారం రాత్రి రాయచూరు జిల్లా లింగసూగూరు తాలూకా హాలు బావి తాండలో చోటు చేసుకుంది. వేసవిలో గ్రామంలోని బోరుబావులు చెడిపోయాయి. తాగు నీటి ట్యాంకులో బ్లీచింగ్, క్లోరిన్ పౌడర్లు వేయనందున శుద్ధీకరించిన మంచినీటిని సరఫరా చేపట్టకపోవడంతో కలుషిత నీటిని తాగి వాంతులు, విరోచనాలు అధికం కావడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. యోగీశ్వరి(8), దిలీప్(4), సునీత(21), చంద్రమ్మ(44), జుమ్మాబాయి(28), గోజిబాయి(72), కమలాబాయి(28), సందీప్(14), ప్రవీణ్ కుమార్(5), శివప్ప(29), విఠల్(30), రవి(20)లు చికిత్స పొందుతున్నారు.


వాల్మీకి మండలి అధ్యక్షుడి రాజీనామాకు డిమాండ్



వినతిపత్రం సమర్పిస్తున్న విరుపాక్షి

రాయచూరు రూరల్: మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.187 కోట్ల అవినీతి జరిగినట్లు రుజువు కావడంతో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, అభివృద్ధి మండలి అధ్యక్షుడు, గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ రాజీనామా చేయాలని జేడీఎస్ జిల్లాధ్యక్షుడు విరుపాక్షి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి మాట్లాడారు. వాల్మీకి అభివృద్ధి మండలి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ మరణ వాంగ్మూలంలో పేర్కొన్నట్లు మంత్రి నాగేంద్ర మౌఖిక ఆదేశాల మేరకు ఎండీ, అధికారులు కలిసి నిధుల స్వాహాకు తనపై ఒత్తిడి తేవడంతో అవమానంతో ఆత్మహత్య చేసుకున్నారన్నారు. వాల్మీకి మండలి నిధులను కర్ణాటక సర్కార్ లోక్‌సభ ఎన్నికలకు వినియోగించుకుందన్నారు. 14 మంది అనామధేయుల ఖాతాలకు వర్చువల్‌గా నిధులను మళ్లించారన్నారు. 2024 మార్చి 5 నుంచి 23 వరకు బెంగళూరు వసంత్ నగర్ యూనియన్ బ్యాంక్ నుంచి ఎంజీ రోడ్డు బ్యాంక్‌లో కొత్త ఖాతాను ప్రారంభించి నిధులు డ్రా చేసుకున్నారన్నారు. వివిధ ఖాతాల నుంచి రూ.94.73 కోట్లు బదిలీ అయ్యాయన్నారు. యూనియన్ బ్యాంక్ సీఈఓతో పాటు ఆరుగురు మండలి అధికారులపై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారి ద్వారా రాష్ట్ర గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక్, శివశంకర్, నరసింహ నాయక్, రామకృష్ణ, తిమ్మారెడ్డి, జంబునాథ, నాగరాజ, రవి, హంపయ్య, అమిత్, ఆదిరాజులున్నారు.

హుండీ ఆదాయం రూ.64 లక్షలు



కానుకల లెక్కింపు జరుపుతున్న దృశ్యం

మాలూరు: ప్రసిద్ధ చిక్కతిరుపతి ప్రసన్న వేంకటేశ్వర ఆలయంలోని మూడు హుండీలను బుధవారం తహసీల్దార్ రమేష్, ఈఓ సెల్వమణి, దేవదాయ శాఖ అధికారిణి పద్మావతి సమక్షంలో లెక్కించారు. నాలుగు నెలల కాలంలో రూ. 64,48,825 నగదు, 50 గ్రాముల బంగారు, 545 గ్రాముల వెండి ఆభరణాలు భక్తులు సమర్పించినట్లు లెక్కింపులో తేలిందని ఆలయ పాలక మండలి తెలిపింది.